# తెలుగు వాఙ్మయ చరిత్ర

## ఎం.ఏ. తెలుగు, మొదటి సంవత్సరం - మూడవ పేపరు


**రచయితలు**

**ఆచార్య కె. కుసుమాబాయి**
తెలుగు శాఖ
ఉస్మానియా విశ్వవిద్యాలయము
హైదరాబాద్ - 7

**డా॥ వి. సిమ్మన్న**
తెలుగు శాఖ,
దూరవిద్యా కేంద్రం, ఆంధ్ర విశ్వవిద్యాలయం
విశాఖపట్నం

**డా॥ కె. సుదర్శన రాజు**
తెలుగు శాఖ,
ఆంధ్ర విశ్వవిద్యాలయం
విశాఖపట్నం

**డా॥ ఎమ్. స్వర్ణలతా దేవి**
రీడర్,తెలుగుశాఖ,
టి.జె.పి.యస్. కళాశాల, గుంటూరు.

**డా॥ జి.జ్యోతి స్వరూప రాణి**
రీడర్,తెలుగుశాఖ
జె.యం.జె. మహిళా కళాశాల, తెనాలి

సంపాదకులు
**ఆచార్య .జి.కృపాచారి యం.ఏ.,పి.హెచ్.డి.,**
తెలుగు శాఖ,,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

సమన్వయ కర్త
**ఆచార్య జి.వై. ప్రభావతి దేవి యం.ఏ.,పి.హెచ్.డి.,**
తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

డైరెక్టర్
**ఆచార్య. డి.కృష్ణారావు, ఎం.యస్.సి., పి.హెచ్.డి.**

దూరవిద్యా కేంద్రము
**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం .నాగార్జున సాగర్-522 510**
Ph :0863-2293299 , (08645) 211023 ,211024, Cell :9848285518
E-mail : info@anucde.ac.in
Website: www.anucde.ac.in

M.A., Telugu , First Year, Paper - III : Outlines of Telugu Literature

First Edition : 2003

Second Edition : 2005

Third Edition : 2006

Fourth Edition : 2008

First Edition : 2011

Sixth Edition : 2012
No. of Copies : 5000

Seventh Edition : 2013
No. of Copies : 4000

(C) Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of M.A., Telugu, Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is meant for limited circulation only.

Published by : M.V. Ramkumar Ratnam
**Prof. D. Krishna Rao,**
*Director,*
Centre for Distance Education,
Acharya Nagarjuna University

Dr. P.P.S. Paul Kumar.
**Prof. M.V. Ramkumar Ratnam,**
*Deputy Director,*
Centre for Distance Education,
Acharya Nagarjuna University

*Printed at :*
**Don Bosco Technical School Press**
Ring Road, Guntur-7, Ph : 2350832

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ, 2003 వ సంవత్సరంలో NAAC చే B++ (80-85) గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి ఎంతో సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలలోని సుమారు 300 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనతో పాటు పరిశోధన డిగ్రీలను కూడా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అందిస్తోంది.

ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. దీని ద్వారా పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్య నభ్యసించలేనివారికి, ఎంతో వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికవున్న గృహిణులకు ఈ దూర విద్యావకాశం ఎంతో దోహదపడుతుంది. ఇట్టి వారందరికి తమ ముంగిట్లో విద్యను అందించే ఉద్దేశ్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, 2003-04 విద్యా సంవత్సరంలో డిగ్రీస్థాయిలో బి.ఏ., బి.కాం.; పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి.. ఎం.బి.ఏ, ఎల్ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించడం జరిగింది.

ఈ దూర విద్యా పద్ధతి ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసికొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో విశేష అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించటం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ విద్యార్థులు, ఈ పాఠ్యాంశాల బోధనలో నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి మున్ముందు చేసే ప్రచురణలలో మరింత నిర్దిష్టంగా, మరింత సులువుగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పునర్ముద్రణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం డిగ్రీ స్థాయిలో వారాంతపు తరగతులు, పి.జి. స్థాయిలో కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేసి, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని వాటి ద్వారా దేశ పురోగతికి దోహదపడాలని నా ఆశయం. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికి అందుబాటులోకి రావాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ మా ప్రయత్నానికి సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు నా అభినందనలు.

**ఆచార్య .కె.వియన్నా రావు**
**కులపతి**
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

పాఠం - 1

# తెలుగు సాహిత్య చరిత్ర

## పాఠ్యాంశ నిర్మాణ క్రమం


1.1 వాఙ్మయం
1.2 సారస్వతం
1.3 సాహిత్యం
1.4 అధ్యయన విధానం
  1.4.1 కాలానుగుణం
  1.4.2 చారిత్రకం
  1.4.3 తులనాత్మకం
1.5 యుగ విభజన
  1.5.1 కవులపరంగా
  1.5.2 కవితాపోషకుల పరంగా
  1.5.3 కావ్యప్రక్రియ పరంగా
1.6 మాదిరి ప్రశ్నలు
1.7 ఆధార గ్రంథాలు


**1.1** తెలుగు సాహిత్య సంపద అనంతంగా ఉంది. అది తరగని గని. సాహిత్యాన్నే వాఙ్మయం, సారస్వతం అని కూడా అంటారు. స్థూలంగా ఒకటే అనిపించినా సూక్ష్మంగా కొంత భేదం ఉంది.

**వాఙ్మయం:** వాక్ శబ్దానికి మయట్ - ప్రత్యయం చేరితే వాఙ్మయం అవుతుంది. మయట్ అనే సంస్కృత ప్రత్యయానికి వికారము అని అర్థం. అంటే ప్రకారము అని అర్థం. అమ్మ అనే మాట నేర్పిన నాటి నుంచి మాట - పాట - రాత - కూత(రాగం) అంతా వాఙ్మయమే. మనం మాట్లాడే ప్రతి మాట - సంభాషణ - ప్రతి రాత - ప్రతి రాగం అంతా వాఙ్మయమే. ఇది రెండు రకాలు

1. శాస్త్ర వాఙ్మయము
2. కావ్య వాఙ్మయము

**1. శాస్త్ర వాఙ్మయం:** శాస్త్ర వాఙ్మయమంటే సకల శాస్త్రాలు ఈ కోవలోకి వస్తాయి. వైద్య, విజ్ఞాన శాస్త్రాలు ఒక భాగం. సాహిత్య విద్యార్థికి వ్యాకరణ, మీమాంస, తర్క, అలంకార మొదలయిన శాస్త్ర చర్చలన్నీ ఈ పరిధిలోకి వస్తాయి. ఐతే అతి కొద్ది మందికి మాత్రమే ఈ శాస్త్ర విషయావగాహన ఉంటుంది. అందువల్ల ఒక పరిధికి లోబడి ఈ అధ్యయనం జరుగుతుంది.

**2. కావ్య వాఙ్మయం:** కావ్యం సర్వకాలాలకు చెందినది. అది సార్వజనీనము. ఇది హృదయానందం కలిగిస్తుంది. భావ జగతి, ఊహాలోక ప్రవృత్తి కొంత దోహదకారి. అలంకారికులు కావ్యాన్ని చక్కగా నిర్వచనం చేశారు.

- ఇష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళి కావ్యమ్ - దండి (కావ్యాదర్శనము)
- వాక్యం రసాత్మకం కావ్యమ్ - విశ్వనాధుడు (సాహిత్యదర్పణము)

- రమణీయార్థ ప్రతిపాదకః శబ్దః కావ్యమ్ - జగన్నాథుడు (రస గంగాధరము)
- శబ్దార్థౌ సహితౌ కావ్యం - భామహుడు (కావ్యాలంకారము)

అందంగా అక్షరాలు రచించినంతమాత్రాన వాఙ్మయం కాదు. మత విషయాలు - చారిత్రక గ్రంథాలు వాఙ్మయంలోకి వస్తాయా అంటే వాటికి కొంత రసము - అలంకారిక విధానం కావాలి. అది అంతా సాధారణ వాఙ్మయం. రామాయణం ఒక రాజ కుటుంబ చరిత్ర, భారతం ఒక రాజ వంశ చరిత్ర అందువల్ల కావ్య వాఙ్మయంలోకి వస్తాయి. తెలుగు సాహిత్యంలో శివకవుల గాథలు, ప్రబంధ కవుల కావ్యాలు, జానపద సాహిత్య గ్రంథస్థమైనదంతా కావ్య వాఙ్మయంలోకే వస్తాయి. అందువల్ల కావ్య సముదాయమంతా వాఙ్మయంలోకి వస్తుంది.

## 1.2 సారస్వతం:

వాఙ్మయ శబ్దం లాగా సారస్వతమనే పదం విస్తృతం కాదు. ఇది సామాన్యవాచి. సరస్వతీ సంబంధమైనది సారస్వతం.

- "బ్రహ్మీతు భారతీ భాషా గీర్వాగ్వాణీ సరస్వతీ" - అమరము.
- దేవీం వాచ ముపాసహితేహి బహువః సారంతు సారస్వతామ్ - చాటు శ్లోకం అలంకారకౌస్తుభము కువలయానందము
- సారస్వత ప్రక్రియాః కావ్య నాటకాది వాఙ్మయ విశేషాః - రత్నాపణము - కుమార సోమపీధి

ప్రాచీన సాహిత్యంలో కావ్య నాటకాదులన్నీ సారస్వతాలుగానే స్వీకరించారు. వాఙ్మయం - సారస్వత పదాలు ఒకే అర్థంలో వినిమయం చేశారు. తెలుగు భారతములో కూడ ఎఱ్ఱనార్యుడు

ఎఱ్ఱనార్యుండు సకలలోకైక విదితు
డయిన నన్నయ భట్ట మహా కవీంద్రు
సరస సారస్వతాంశ ప్రశస్తి దన్ను
జెందుటయు సాధుజన హర్ష సిద్ధిగోరి -------

అని ఎఱ్ఱన అరణ్యపర్వంలో తెలిపాడు. 'సరస సారస్వతాంశ ప్రశస్తి' అని కావ్యపరంగా వివరించాడు. దీనిని బట్టి సారస్వత శబ్దం వాఙ్మయానికి పర్యాయపదంగా వాడినట్టే చెప్పవచ్చు.

## 1.3 సాహిత్యం:

సాహిత్య శబ్దము కావ్య గ్రంథాలన్నింటికి వర్తిస్తుంది. వేదపురాణ శాస్త్రాల కన్నా కావ్యం ఉత్తమమైనది. అందుకే తెలుగు కావ్యాల చరిత్రే సాహిత్య చరిత్ర అంటారు.

' హితేస సహితం సాహిత్యం ' అంటే హితముకూర్చేది, మేలు కలిగించేది.

శబ్దార్థయో ర్యథావత్ సహభావేన విద్యా సాహిత్య విద్యా - రాజశేఖరుడు - కావ్యమీమాంస శబ్దార్థముల సహభావమే సాహిత్యం " సహితం రస సంయుక్తం తదేవ సాహిత్యం " - రసముతో కూడినదే సాహిత్యము. " సహితయ్యోరావస్య సాహిత్యాం"। హితము కోరేది సాహిత్యము " సంగీత మపి సాహిత్యం - సరస్వత్యాః స్తనద్వయమ్ ఏకమా పాత మధుర మన్యదా లోచనామృతమ్ "

అని ప్రసిద్ధ చాటు శ్లోకం తెలియజేస్తుంది.

ఒక నాడు వ్యాకరణం, తర్కం, తదితర శాస్త్రాలన్నీ సాహిత్యపరంగానే ప్రయోగించినా కాలక్రమంలో కరపత్రం మొదలు వార్తా పత్రిక వరకూ, రామాయణం, భారతం భాగవతం, బైబిలు, ఖురాను తదితర సాహిత్యంతో పాటు కావ్యలన్నీ సాహిత్యంగానే పరిగణించవచ్చు. ఎందుకంటే అన్నీ ప్రజాహితమైనవి గనుక. విశ్వ శ్రేయస్సును కోరే హితమైన ప్రతి వాక్కూ సాహిత్యమే.

వాఙ్మయ - సారస్వత - సాహిత్యాలన్నీ కలిపి కావ్య సామాన్య వాచిగా పేర్కొంటే దీన్నే ఇంగ్లీషులో 'లిటరేచర్' అంటున్నాం. ఇది

అనుభూతి, ఆవేశం, ఆలోచన, జీవితవిధానం అభివ్యక్తీకరించేదని సాధారణ ప్రయోగం. సమాజానికి ప్రతిబింబం సాహిత్యం. మానవ జీవితం స్పష్టం చేసి అద్దంలో చూపుతుంది. ఒక కావ్యం చదివినపుడు మనలోని మంచి చెడ్డలు తెలుపుతుంది. కనుక చెడు వదలి సన్మార్గ వర్తనానికి దారి తెలుసుకోగలిగితే వాఙ్మయ సిద్ధి కలిగినట్టే.

## 1.4 అధ్యయన విధానం:

సాహిత్యమంతా అధ్యయనం చేయడానికి ఒక క్రమం ఏర్పాటయితే పాఠకునికి సమయం కలిసి వస్తుంది. ఒక మార్గం కలుగుతుంది. అందులో క్లిష్టత తొలగుతుంది. దీని కోసం ఈ అధ్యయనంలో మూడు విభాగాలున్నాయి.

1. కాలానుగుణం
2. చారిత్రకం
3. తులనాత్మకం

**1.4.1 కాలానుగుణం:** 'కవనీయం కావ్యం' - వర్ణింపదగినది కావ్యం. కవుల జీవిత కాలానుగుణంగా అధ్యయనం చేయడం ఒక పద్ధతి. ఆయా కవుల కాలానుగుణంగా ఒక క్రమంలో చదవడం. ఒకే కాలంలో రచన చేసిన కవులలో ఉత్తమ శ్రేణి కవులను ఒక క్రమం చేయవచ్చు. ఒకే కవి కావ్యాలు రచనానుక్రమంలో పఠించడం ఒక పద్ధతి. ఒక కవి తొలి కావ్యం కన్నా మలి కావ్యం రసవత్కావ్యం కావచ్చు. తొలి కవి కన్నా మలి కవిలో అద్భుత కావ్య రచనా సౌందర్యము కన్పించవచ్చు. కాలానుగుణంగా చదివినట్లయితే ఆయా కాలాల్లోని సామాజిక జీవన స్థితి, అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన పరిస్థితి తెలుస్తుంది.

**1.4.2 చారిత్రకం:** చరిత్ర అనే శబ్దం ప్రాచీనమైనది. చరిత్ర వాస్తవానికి దర్పణం. చరిత్రకు శాసనాలు, నాణాలు, పురావస్తు సంపద మొదలయినవి ఆధారాలు. ఐతే సాహిత్యంలో ప్రతి జాతి చరిత్ర, జీవనస్థితి, ఆచారాలు, సంప్రదాయాలు, ఆర్థిక రాజకీయ సంబంధాలు అన్నీ శాసనాల ద్వారా తెలుసుకోవచ్చు. కావ్యాల్లో ఉన్న అవతారికలు, ఆశ్వాసాంత గద్యలు కవుల చరిత్రకు ఆధారాలు. కావ్యాల్లోని భాషా పదాల ద్వారా అన్యదేశ భాషల సంసర్గం వల్ల ఆనాటి సామాజిక చరిత్ర అవగాహన కలుగుతుంది. అంటే కవి ఆ కాలంలోని భాషా పదాలను ఉపయోగించుకున్న తీరు చారిత్రక అధ్యయనానికి దోహదకారి అవుతుంది.

**1.4.3 తులనాత్మకం:** తుల అంటే త్రాసు - పోలిక. ఒక దానితో మరొకటి పోల్చి చూసేదే తులనాత్మక అధ్యయనం అవుతుంది. ఇది ఒకే కాలంలోని కవుల రచనలు, ఆయా కాలాల్లోని కవుల రచనలు - మూలము - అనువాదంలోని భేద సాదృశ్యాలు గల కావ్యాలు ఈ కోవలోకి వస్తాయి. అదే విధంగా భారతీయ సాహిత్యం ఇతర సోదర భాషా సాహిత్యంతోను, ఇతర దేశ భాషలతోనూ తులనాత్మక అధ్యయనం చేసినపుడు ఆయా కాలాల్లోనూ, ఇతర కాలాల్లోనూ దేశ దేశాల్లోని సాహిత్య సాంస్కృతిక కళా సంపదను బేరీజు వేయవచ్చు. దీని వల్ల విశ్వ వ్యాప్తమైన సాహిత్య సంపదను ఒక పద్ధతి ప్రకారం అవగాహన చేసుకోవచ్చు.

## 1.5 యుగ విభజన:

యుగమంటే కొన్ని విశిష్ట సమాన ధర్మాలున్న ఒక కాలపరిమితి. ఆయా కాలాల్లో సమాజంలోని మార్పుల మూలంగా యుగ విభజన ఏర్పడుతుంది. సాహిత్య చరిత్ర అధ్యయనంలో యుగ విభజనను మూడు విధాలుగా వర్గీకరించవచ్చు.

1. కవుల పరంగా
2. కవితా పోషకుల పరంగా
3. కావ్య ప్రక్రియల పరంగా

**1.5.1 కవుల పరంగా:** కవుల జీవిత క్రమానుగుణంగా ఈ అధ్యయనం చేయవచ్చు. కందుకూరి వీరేశలింగం 'ఆంధ్ర కవుల చరిత్రలో' ఈ క్రింది విధంగా యుగ విభజన చేశారు.

ప్రాచీన యుగ కవులు క్రీ.శ. 1100 - 1500

మధ్యయుగ కవులు క్రీ.శ. 1500 - 1650

ఆధునిక కవులు క్రీ.శ. 1650 - 1900

ఇది కేవలం కాలానుగుణంగా చేసిన విభజన.

**1.5.2 కవితా పోషకుల పరంగా::** సాహిత్య పోషణ సామాన్యుడు చేయలేడు. అది రాజుల పరంగానో, సాహిత్యాభిమానులయిన స్థితిమంతుల ద్వారానో జరగాలి. ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో చేసిన విభజన 14 యుగాలుగా ఉంది.

1. ఆదిమ చాళుక్య యుగం - క్రీ.శ. 12వ శతాబ్ది వరకు
2. కాకతీయ యుగం - క్రీ.శ. 1200 - 1290
3. పద్మనాయక యుగం - క్రీ.శ. 1300 - 1375
4. రెడ్డిరాజుల యుగం - క్రీ.శ. 1375 - 1450
5. గజపతుల యుగం - పై కాలానికి అనుబంధం
6. తొలి రాయల యుగం - క్రీ.శ. 1450 - 1500
7. మలి రాయల యుగం - క్రీ.శ. 1500 - 1550
8. నవాబుల యుగం - క్రీ.శ. 1550 - 1600
9. అరవీటి రాజుల యుగం - 16వ శతాబ్ది నాల్గవ పాదం
10. నాయక రాజుల యుగం - క్రీ.స. 1600 - 1670
11. కడపటి రాజుల యుగం - క్రీ.శ. 1670 - 1750
12. కుంఫిణీ యుగం - క్రీ.శ. 1750 - 1850
13. జమిందారీ యుగం - క్రీ.శ. 1850 - 1900
14. ఆధునిక యుగం - క్రీ.శ. 1900 నుండి

ఈ యుగ విభజనలో కవులను పోషించిన రాజులు, మంత్రులు, జమిందారులు, ఆయా వంశాలు కాల గర్భంలో కలిసిపోయినా కవులను పోషించిన వారు మాత్రం గ్రంథ రూపంలో సజీవంగా ఉన్నారు. ఐతే ఈ విభజనలో క్లిష్టత ఉంది. కవికన్నా రాజ వంశం గొప్పతనమే కన్పిస్తుంది. అందువల్ల కవి పరమైన విభజన ఉత్తమమైనది.

**1.5.3 కావ్య ప్రక్రియాపరంగా:** కావ్యాలు కాలానుగుణంగా వివిధ ప్రక్రియల రూపాలు సంతరించుకున్నాయి. ఆయా కావ్య భేదాలు కూడా కావ్య ప్రక్రియ పరంగానే కన్పిస్తాయి. దివాకర్ల వెంకటావధాని ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో చేసిన విభజన ఈ క్రింది విధంగా ఉంది.

1. ప్రాఙ్నన్నయ యుగము లేక అజ్ఞాత యుగము
2. పురాణ యుగము లేక భాషాంతరీకరణ యుగము
3. కావ్య యుగము
4. ప్రబంధ యుగము
5. గద్య గేయ, యక్షగాన, దక్షిణాంధ్ర యుగము
6. ఖండ కావ్య, భావ కవితా, ఆధునిక యుగము

ఈ విభజన వల్ల కవులు, కావ్యాలు చాల వరకు మరుగున పడిపోవచ్చు. అందువల్ల అనంతరం పింగళి లక్ష్మీ కాంతము ఆంధ్ర వాఙ్మయ చరిత్రను విభజించిన పద్ధతే నేటికీ కొనసాగుతుంది.

| | | |
|---|---|---|
| 1. ప్రాఙ్నన్నయ యుగము | - | క్రీ.పూ. 200 - క్రీ.శ. 1000 |
| 2. నన్నయ యుగము | - | 11వ శతాబ్ది |
| 3. శివ కవి యుగము | - | 12వ సతాబ్ది |
| 4. తిక్కన యుగము | - | 13వ శతాబ్ది |
| 5. ఎఱ్ఱన యుగము | - | 1300 - 1350 |
| 6. శ్రీనాధుని యుగము | - | 1350 - 1500 |
| 7. శ్రీ కృష్ణదేవరాయల యుగము | - | 1500 - 1600 |
| 8. దక్షిణాంధ్ర యుగము | - | 1600 - 1775 |
| 9. క్షీణ యుగము | - | 1775 - 1875 |
| 10. ఆధునిక యుగము | - | 1975 నుండి నేటి వరకు |

ఈ యుగ విభాగమే సరియైనది. ఐతే ఆధునిక యుగంలో ఎన్నో మార్పులు వచ్చిన కారణంగా కవితా ప్రక్రియల పరంగా విభజన జరిగింది. అది భావ కవిత, అభ్యుదయ కవిత, దిగంబర, విప్లవ, దళిత, స్త్రీ, మైనారిటీ వాదాలుగా కొనసాగుతుంది.

తెలుగు సాహిత్య చరిత్ర అధ్యయనం చేసే విద్యార్థికి ఈ విషయాలు ఉపోద్ఘాతంలా ఉంటాయి. అందువల్ల రేఖా మాత్రంగా తెలుసుకోవలసిన అవసరం ఉంది.

## 1.6 మాదిరి ప్రశ్నలు:

1. వాఙ్మయం - సారస్వతం - సాహిత్యం అనే పదాలను వివరించండి.
2. తెలుగు సాహిత్య చరిత్రను విభజించి కాలానుగుణంగా వివరించండి.

## 1.7 ఆధార గ్రంధాలు:

| | | |
|---|---|---|
| తెలుగు సాహిత్య సమీక్ష | - | డాక్టర్. జి. నాగయ్య, ప్రథమ భాగము |
| తెలుగు సాహిత్య చరిత్ర | - | ఆచార్య కొర్లపాటి శ్రీరామ మూర్తి, ప్రథమ భాగము |

**డా॥ బండారు జ్యోతి స్వరూపరాణి**

# పాఠం - 2 ప్రాఙ్నన్నయ యుగం - సాహిత్యం - కవిత్వం

**విషయసూచిక**


2.1 తొలి తెలుగు శాసనం
2.2 పద్యరూపకమైన దేశి కవిత
2.3 ప్రాచీనాంధ్ర శాసనంలో కవిత
2.4 ప్రాచీనాంధ్ర శాసనాల్లో భాష
2.5 మాదిరి ప్రశ్నలు
2.6 ఆధార గ్రంథాలు


## తొలి తెలుగు శాసనం:

కాలం క్రీ.శ. 575 - 60, స్థలం - ఎర్రగుడిపాడు, కమలాపురం తాలూక, కడప జిల్లా.

## శాసన ప్రధాన పాఠం:

స్వస్తి శ్రీ ఎంక / ల్ ముత్తు రాజుల్ల / కుణ్టికాళ్ళ' [ని] వబుకా / ను ఇచ్చిన పన్నస / దుజయ రాజుల / ముత్తు రాజులు నవ / ప్రియ ముత్తు రాజులు / వల్ల వదుక రాజులు సక్షి / కాను ఇచ్చి [న] పన్నస్స కొట్టంబున పా / ఱకు కుణ్టి కాళ్లు / ళ ఇచ్చి న పన్నస / ఇరవది మాది నా / ల్కు మఱున్తుఙ్లు నేల.

## అర్థం:

ఎరికల్ ముత్తు రాజు అనే రాజు సన్యాసుల (బౌద్ధ) కోసం ఇరవై నాలుగు మరున్తుర్లు (భూప్రమాణం) నేలను దానం చేశాడు. దీనికి సాక్షులుగా దుజయరాజు, ముత్తురాజు, వల్లవదక రాజు, నవ ప్రియ ముత్తు రాజులు అనే వారున్నారు.

## సామాజికాంశాలు:

ఈ శాసనం తొలి తెలుగు శాసనంగా భావింపబడుతుంది. శాసన ప్రారంభం శ్రీకారంతో (స్వస్తిశ్రీ) ప్రారంభమయింది. మన కావ్యాలు శ్రీ తోనే ప్రారంభం కావడానికి పూర్వం నుంచే ఈ సంప్రదాయం ఉందని తెలుస్తుంది. భూదానం చేయడం అనే ఆచారం ఒకటి సన్యాసులకు ఈ దానం చేయడం వల్ల రాజులు మతాలను, సన్యాసులను ఆదరించే వారని స్పష్టం చేయవచ్చు. దానానికి కర్త ఉన్నటే సాక్షులు కూడా పేర్కోవడం విశేషం. తెలుగు వారి ఆచారాలు, సంప్రదాయాలు, శాసనాల ద్వారా తెలుసుకోవచ్చనే దానికి పై ఆధారాలు కొన్ని. ఈ విధంగా ప్రతి శాసనంలోనూ ఆనాటి సామాజిక జీవితం తెలుసుకోవచ్చు.

## ఉద్దేశం - ప్రవేశిక:

నన్నయకు పూర్వం ఉన్న కాలాన్ని పాఙ్నన్నయ యుగం అంటారు. ప్రాక్ అంటే పూర్వం అని అర్థం. క్రీస్తుకు పూర్వం నుంచే తెలుగు వారి ఉనికి ఉందనడానికి సాక్ష్యాలున్నాయి. లభించిన ఆధారాలను బట్టి ప్రాకృతం తొలిగా వాడిన భాష. అనంతరం

సంస్కృతం వచ్చింది. క్రీ.శ. 1వ శతాబ్దికే గుణాఢ్యుని బృహత్కథ (అలభ్యము) లోను హల చక్రవర్తి (క్రీ.శ. 1వ శతాబ్ది) గాధా సప్త శతి అను ప్రాకృత సంకలన గ్రంథంలోను తెలుగు వారి ఉనికి, ఆచారాలు, సంప్రదాయాలు, అలవాట్లు చాలా వరకు కన్పిస్తాయి. ఉదాహరణం అరటి ఆకులో భోజనం చేయడం, మామిడి తోరణాలు కట్టడం, ఆడపిల్ల రజస్వల అయినప్పుడు చిమ్మిలి పెట్టడం, మహిళలు ముఖానికి, కాళ్ళకు పసుపు రాసుకోవడం లాంటివి ఎన్నో కన్పిస్తాయి.

క్రీస్తు శకం మొదటి శతాబ్దికే చెందిన పగిలిన ఒక శిలా ఫలక శకలం గుంటూరు జిల్లా అమరావతిలో లభిస్తుంది. ఇందులో 'నాగబు' అనే పేరుందని జయంతి రామయ్య వివరించారు. నాగబు అంటే వ్యక్తి నామం అనీ నాగ శబ్దం నాగజాతి వాచకమనీ అన్నారు. తెలుగు వారు నాగజాతికి చెందిన వారనీ, నాగుపామును పూజించే జాతి అనే వివరణ యిచ్చారు.

రెండవ శతాబ్దికి చెందిన వాసిష్ఠీపుత్రపులుమావి జంగిలి గుండు శాసనంలో "కుమార దతస గామే వేపురకే వధవేన ........... తళుకమ్ ఖానితమ్" అని ప్రాకృతంలో ఉంది. కుమారదత్తుని వేపురక గ్రామంలో తటాకము తవ్వబడిందని అర్థం. ఇక్కడ వేపురక అంటే వేపూరు అనే గ్రామం తెలుగు పదమని అభిప్రాయం.

మూడవ శతాబ్దం నుంచి ఆరవ శతాబ్దం వరకూ లభించిన ప్రాకృత సంస్కృత శాసనాల్లో విఱిపర, కుడూర, చిల్లరెక, కొండుక అనే గ్రామ నామాలు, గోల, కొట్ట, అతుక, కొట్టి అనే మనుష్యుల పేర్లు కన్పిస్తాయి.

ఐతే తొలి తెలుగు శాసనమని భావింపబడుతున్న ఎర్రగుడిపాడు శాసనం క్రీ.శ. 575 - 600 ప్రాంతానికి చెందినదని చారిత్రకుల అభిప్రాయం. ఇది గద్య రూపంలోనే ఉంది.

## శాసనాల్లో తెలుగు కవిత:

క్రీ.శ. 6, 7, 8 శతాబ్దాల్లో వచ్చిన శాసనాలన్నీ గద్య శాసనాలే. క్రీ.శ. 600 - 625లో లభించిన మాలెపాడు శాసనంలో వచనం కన్పించినా 'అణపోతులు రేవణకాలు పుద్దణకాలు ఇచ్చిన పన్నస పెన్ పాఱ ఇశె ఱేనికిన్' అని రెండు పాదాలలో వున్న శాసనాలలో 'ద్విరగతి రగడ' లక్షణం కొంత కన్పిస్తుంది. పూర్తి లక్షణం అయిన ఛందో బద్ధ శాసనాల్లో తూర్పు చాళుక్య రాజు గుణ విజయాదిత్యుని కాలంనుండే కన్పిస్తాయి. పండరంగని అద్దంకి శాసనం మొదటి పద్య శాసనం. ఇందులో ఒక తరువోజ పద్యం నాలుగు పంక్తుల వచనం ఉంది.

'పట్టంబు గట్టిన ప్రథమమ్ము నేణ్టు బలగవ్వ్ఁంబొప్పగ బై వేచి సేన పట్టంబు గట్టిఞ్చి ప్రభుం బణ్డ రంగు బణ్చి న సామ త్త పదువతో బోయకొట్టంబుల్ వణ్డెణ్టుం గొణి వేంగి నాణ్టిం గొఱిల్చియ త్రిభువ నాంకుశ బాణ నిల్పి కట్టెపు దుగ్గ్ఁంబు గడు బయల్సేసి గకణ్టుకు బెజ్ఁజవాడ గావిఞ్చె మెచ్చి

ఈ పద్యంలో ప్రాచీన లేఖన పద్ధతి లేఖన దోషాలు ఉన్నాయి. ఇది గద్య పద్యాత్మకమైన శాసనం. అంటే చంపువు అని అర్థం. నన్నయ రచన అయిన చంపూ పద్ధతికి ఈ శాసనం నాంది. అందువల్ల ఈ శాసనాన్ని బట్టి గుణగ విజయాదిత్యుడే ఆంధ్ర భాషా సాహిత్యానికి చంపూ పద్ధతికి ఆద్యుడని చెప్పవచ్చు.

తరువాత కన్పించేది కందుకూరు శాసనం. ఇది క్రీ.శ. 848లో కూడా గుణగ విజయాదిత్యుని ప్రశంస ఉంది. ఇది సీస పద్యమున్నదని తొలుత కొమఱ్ఱాజు లక్ష్మణరావు గుర్తించారు.

"శ్రీ నిరవద్యుణ్డు సిత్తజాత సముణ్డు శివ పద వర భక్త సేవితుణ్డు
ఖిలుణ్డ నుతరిపుబలు గ్రా హవరా ధరణ్డా యోగ్య సిఘసను ణ్డ గణిత
దానా సనుణ్డు గజ ................ లయణ్డు ................. హసణ్డ న పండ రంగు
వ్వి ............... అణియు గాన్చి కొలది లేని కొట్టంబుల్ వొదిడిచి
............. "

ఈ పద్యంలో చాలా వరకు భ్రష్టమైపోయింది. ఇది సీస పద్య శాసనం. ఇందులో తత్సమ పదాలు ఎక్కువ ఎత్తుగీతి, ఆట వెలది యుద్ధమల్లుని బెజవాడ శాసనం క్రీ.శ. **898 - 943** కాలానికి చెందినది. ఇవి రెండు శాసనాలు. మొదటిది తాత రెండవది మనుమడు వేయించిన శాసనాలు. ఇద్దరి పేర్లూ యుద్ధమల్లుడు. మొదటి యుద్ధ మల్లుడు గుణగ విజయాదిత్యుని తమ్ముడు. మొదటి శాసనంలో నాలుగు మధ్యక్కరలు తరువాత ఫల శ్రుతితో ఏడు పంక్తుల వచనం, రెండవ శాసనంలో ఒక మధ్యక్కర ఉన్నాయి.

" స్వస్తి నృపాంకు శాత్యన్త వత్సల సత్య త్రిణేత్ర
విస్తర శ్రీ యుద్ధమల్లుణ్డన వద్య విఖ్యాత కీర్త్తి
ప్రస్తు రాజా శ్రయుణ్డు ద్రి భువనా భరణ్డు సకల
వస్తు సమేతుండు రాజ సల్కి భూ వల్ల భుణ్డత్తి "

అనంతరం పదవ శతాబ్ది గంగాధర శాసనంలో మూడు కంద పద్యాలున్నాయి.

' జిన భవనంబు లెత్తించుట
జిన పూజలు సేయు చున్కిజినమునులకు న
త్తిన యన్న దానం బీవుటం
జిన వల్లభు బోలం గలరె జినధర్మ పరుల్ '

ఇది కన్నడ కవి - ఆదికవి పంప మహాకవి సోదరుడు జిన వల్లభుడు. పంపని కాలము పదవ శతాబ్ది మధ్య భాగం. ఈ శాసనం కన్నడ ప్రభావం గురించి తెలియజేయడానికి ఉదాహరింపబడింది. ఈ విధంగా ప్రాచీనాంధ్ర శాసనాల్లో పద్యాలు, దేశీయ ఛందమైనవి కన్పిస్తాయి.

నన్నయకు పూర్వం ప్రజల్లో ఉన్న దేశికవిత ప్రాథమిక స్థాయిలో మౌఖికంగా ఉందన్న మాట వాస్తవం. వీరి పాటలు, పదములు, వేలల్లో ఉన్నాయి. వీటిని 'నాగీ గీతము' లని నన్నయ పేర్కొన్నాడు. నన్నెచోడుడు కుమార సంభవములో ఊయల పాటలను - గౌడు గీతములను అంక మాలికలను రాగ యుక్తంగా పాడేవారని అన్నాడు. పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్రములో తుమ్మెద పదములు, నివాళి పదములు, వాలేశు పదములు, గొబ్బి పదములు, వెన్నెల పదములు, సంజవర్ణన మఱి వర్ణన పదములు పాడుతు వెలనాటి చోడుని సభకరిగిరని వివరించాడు. ఈ గ్రంథంలోనే ఆనంద గీతములు, శంకర గీతములను పాడినట్టు వివరించాడు. దీనిని బట్టి ఈ పాటలు ఆ కాలానికే కాక తత్పూర్వం నుంచే ఉన్నాయని ఊహించవచ్చు.

## జైన - బౌద్ధ మత గ్రంథాలు:

నన్నయకు పూర్వం తెలుగు పద్య, గద్య సాహిత్యం శాసన రూపంలో ఉందన్నది వాస్తవం. ఐతే అంతకు ముందే జైన, బౌద్ధ మత గ్రంథాలున్నాయని తెలుస్తుంది. జినుడు బోధించింది జైనము. బుద్ధుని బోధల వల్ల ఏర్పడినది బౌద్ధము. ఈ రెండూ క్రీ.పూ. ఆరవ శతాబ్దిలో ప్రారంభమయినాయి. అశోకుని వల్ల ఆంధ్ర దేశంలో బౌద్ధం క్రీ.పూ. మూడవ శతాబ్ది నుంచి ప్రారంభమయింది. మౌర్యులు బౌద్ధమత వ్యాపకులు. శుంగులు, కాణ్వులు, శాతవాహనులు బ్రహ్మణ మత స్థాపకులు. బౌద్ధ మత గ్రంథాలు ప్రాకృత భాషలో ఉన్నాయి హాలుని గాథా సప్త శతి మహారాష్ట్రీ ప్రాకృతములో ఉంది. గుణాఢ్యుని బృహత్కథ పైశాచీ ప్రాకృతములో ఉంది. ఆనాటికి తమిళ కన్నడాలలో బౌద్ధ కావ్యాలు లేవు.

తూర్పు చాళుక్యులు జైన మతము ఆదరించారు. కుబ్జ మిష వర్ధనుడు **(624 - 641)** పట్ట మహిషి అయణ దేవి బెజవాడలో నడుంబి వసతి అనే జైన మందిరం కట్టించి ముసిణి కుండ అనే గ్రామం దాన మిచ్చింది. విమలాదిత్యుడు అవసాన దశలో జైన మతం అవలంబించినట్టు ఒక అభిప్రాయం. కన్నడము లోని పంప కవి ఆంధ్రుడు. ఆయన 'నిండోజ పంప' అనే కావ్యం రచించాడు. ఆయన సోదరుడు జిన వల్లభుడు కవే అయినా తెలుగు గ్రంథాలు రాసిన దాఖలాలు లేవు. ఈ కాలంలో వచ్చిన జైన, బౌద్ధ గ్రంథాల్లో ఆంధ్రాల

ప్రసక్తి, ఆచారాలు, సంప్రదాయాలు ఉన్నాయన్నది వాస్తవం.

## ప్రాఙ్నన్నయ యుగం నాటి భాష:

**ధ్వనులు:** శాసనాంధ్ర భాషలో నేటి భాషా ధ్వనులు కన్నా విలక్షణమైనవి కొన్ని కన్పిస్తున్నాయి. నేటి "న" బదులుగా 'ణ', 'ల' బదులుగా 'ళ' ఎక్కువగా వున్నాయి. దంత్య నకారంతో కూడిన 'న్ఠ' అను సంయుక్తాక్షరాలు ఆ నాటి శాసన భాషలో కన్పిస్తున్నాయి.

ఆణతి - ఆనతి

సక్షి - సాక్షి

'ఠి' అను వింత అక్షరం ఆనాటి తెలుగు భాషలో ఎక్కువగా వాడుకలో వుంది. తరువాత 'ఠి' అనునది 'డ, ళ' గ మారిపోయినది.

తోఠి - తోడ

చోఠి మహారాజు - చోళమహారాజు

**వలపల గిలక:** రేఫ 'ర' 'ఱ' కారానికి బదులుగా 'గా'ణ అను గుర్తు శాసనాలలో కన్పిస్తుంది. దీనిని 'వలపల గిలక' అనే వారు.

ఉదా: తక ్ఠి - తర్క

వమ్ఠి - వర్మ

**అనునాసికాక్షరము:** నన్నయకు పూర్వం పూర్ణానుస్వారం "ం" వాడుకలో చాలా తక్కువ 'ం'కు బదులుగా వర్గ పంచమాక్షరం అయిన అనునాసికాలను వాడేవారు.

ఉదా: కట్టించె < కట్టిఞ్చె

పురంబు < పురమ్బు

శకట రేఫమే కాక దంత్య నకారంతో కూడిన 'న్ఠ' అను సంయుక్తాక్షర మొకటి తెలుగు భాషలో వాడుకలో ఉండేది.

ఉదా: తాన్ఠికొన్ఠ, ఊగొన్ఠమ్, పాతకొన్ఠు.

ఈ 'న్ఠు' తరువాతి కాలంలో 'ండు' గా మారింది.

ఉదా: అవన్ఠు - అవణ్డు - వాండు - వాడు

ప్రాచీన భాషలోని 'ళ' కారం ఇంకను తరువాత భాషలో వలే 'ల' కారముగా మార్పు చెందక 'ళ' కారం గానే ఉంది.

**గసడదవా దేశం:** నన్నయకు పూర్వం నుండి శాసనాలలో గ, స, డ, ద, వా దేశం ఎక్కువగా వుంది.

అనగా ప్రథమా విభక్తి మీది పరుషాలు గ, స, డ, ద, వ లుగా మారుట.

ఉదా: పట్టంబు గట్టిన

**వచనం:** 'కాలు' అన్నది శాసనాలలో గౌరవ వాచకంగా కూడా వాడారు.

ఉదా: రేవణ కాలు, వుద్దణకాలు

కొన్ని చోట్ల బహువచనంగా, గౌరవ వాచకంగా కూడా వాడారు.

ఉదా: మహారాజుర్లు.

మాలెపాడు శాసనంలోను, మరికొన్ని శాసనాలల్లో ప్రాకృత పదాలు అనేకం కన్పిస్తున్నాయి.

ఉదా: అచ్చెరువు.

అణపోయలు

దానంబు, ఇశరేనియ మొదలైనవి.

జయ సింహ వల్లభుని 'విప్పర్తి' శాసనంలో తెలుగు, సంస్కృత పదాలు కలసిన రీతిగా వాక్య నిర్మాణం కన్పిస్తుంది.

" స్వస్తి శ్రీమాణ్ సకల లోకాశ్రయ జన సంఘ
వల్లభ మహారాజులకున్ ప్రవర్ధ మాన విజయరాజ్య
సంవత్సరంబుళ్ ఎణుంబొది అన్నాణ్ణి అవున్ పుణ్ణి ..........." అని వుంది.

**విభక్తులు:** ఇప్పటి ఏడు విభక్తులు ఆనాటి శాసనాలలో ఉన్నాయి.

ప్రథమ - జయసింహ వల్లభుడు

ఒక విభక్తికి బదులు మరొక విభక్తి కన్పిస్తుంది.

ఉదా: నాకు బణి చేసిన

నేల ఇచ్చిరి.

**సంఖ్యా వాచకాలు:** శాసన భాషలో డిణ్ణు, రెణ్ణు, మూణ్ణు సంఖ్యా వాచక సమాసాలందు మధ్య సంస్కృత పదం అయిన 'ఆది' చేరుతుంది.

ఉదా: ఇరువది ఆది నాల్కు

**క్రియలు:** తద్ధర్మర్థక రూపాలు ఎక్కువ వాడుకలో ఉన్నాయి.

ఉదా: అగున్, ఏళేవారు, కుడుచువారు.

**వాక్య రచనా రీతి:** శాసనాలలో వాక్యం చాలా వరకు క్రియా పద రహితమై కన్పిస్తుంది.

ఉదా: "ఇన్దోఱు దీనికి సక్షి"

**తాలవ్యీకరణము:** మూల ద్రావిడంలోని 'క' కారం తెలుగున 'చ' కారంగా మారింది.

ఉదా: కేయి - చేయి

కిరు - చిరు

కెవి - చెవి

**వ్యక్తుల పేర్లు, ఊరి పేర్లు:** దాణ శర్మ, రేవ శర్మ, విప్పఱ్ఱు, మామిడి పుణ్ణి, చెఱణ్ణలూరు.

ఈ విధంగా నన్నయ పూర్వం నాటి తెలుగు శాసనాలలోని తెలుగు భాషను పరిశీలింపగా, క్రీ.శ. ఒకటవ శతాబ్ది నుండి తెలుగు భాష వాడుకలో ఉందని తెలుస్తుంది.

## ముగింపు:

నన్నయకు పూర్వం ఉన్న శాసనాల్లో కన్పించే సాంఘిక, సామాజిక, సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఆనాటి భాష కూడా తెలుస్తుంది. ఐతే సంస్కృతీ సంప్రదాయాల్లో ఆనాటి సంస్కృతి నేటికీ మిగిలి ఉంది. భాష ఎప్పుడూ మారుతుంది. అదే ఈనాటికీ కన్పిస్తుంది. ఆ నాటి శాసనాల్లో కన్పించే కవితలో కొంత సృజనాత్మకత ఉంది. అదే కవితా పరమైన పద్ధతి. ఈ సంస్కృతీ సంప్రదాయం అనంతర కాలంలోని నన్నయ కవిత్వంలో పరిణతి చెందిన విధానం చూడవచ్చు.

## మాదిరి ప్రశ్నలు:

1. ప్రాఙ్నన్నయ యుగం నాటి శాసన కవితను తెలియ జేయండి.
2. నన్నయకు పూర్వం తెలుగు కవిత ఉందా? వివరించండి.

## ఆధార గ్రంథాలు:

తెలుగు సాహిత్య సమీక్ష - డా॥ జి. నాగయ్య
తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి
ప్రాచీనాంధ్ర శాసనాలు - డా॥ బూదరాజు రాధాకృష్ణ
సమగ్ర ఆంధ్ర సాహిత్యము - ఆరుద్ర

**డా॥ బండారు జ్యోతి స్వరూప రాణి**

# పాఠం - 3 నన్నయ భట్టు

## పాఠ్యాంశ నిర్మాణ క్రమం


3.1 నన్నయ యుగము - చారిత్రక నేపథ్యం
3.2 నన్నయకవిత్వము - భారతాంధ్రీకరణ
3.2.1 ప్రసన్న కథా కవితార్థ యుక్తి
3.2.2 అర్థయుక్తి
3.2.3 అక్షరరమ్యత
3.2.4 నన్నయ చేసిన నాగస్తుతి
3.2.5 సముద్ర వర్ణన
3.2.6 రస పోషణ
3.2.7 ఉభయ వాక్ ప్రౌఢి
3.2.8 శైలి
3.2.9 నానారు చిరార్థ సూక్తి నిధిత్వం
3.2.10 లౌకిక నీతి - ప్రభోదకాలు
3.2.11 రాజనీతి ప్రభోదకాలు
3.2.12 లోకజ్ఞత
3.3 నన్నయ ఇతర కావ్యాలు
3.3.1 ఆంధ్ర శబ్ద చింతామణి
3.3.2 చాముండికా విలాసం
3.4 నన్నయ సమకాలికులు
3.4.1 నారాయణ భట్టు
3.4.2 మల్లియరేచన
3.4.3 వేములవాడ భీమకవి
3.4.4 పావులూరి మల్లన
3.4.5 అథర్వణాచార్యుడు
3.5 మాదిరి ప్రశ్నలు
3.6 ఆధార గ్రంథాలు


## 3.0 నన్నయ యుగం యొక్క చారిత్రక నేపథ్యం:

నన్నయ యుగం యొక్క చారిత్రక నేపథ్యాన్ని నన్నయ యొక్క భారతాంధ్రీకరణ విధానమును వివరించడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 3.1 నన్నయ యుగము - చారిత్రక నేపథ్యం:

భాషా వాఙ్మయము సంఘ సంబంధాలు వాటి పరిణామము కూడా దేశ, కాల, రాజకీయ, మత, సాంఘిక పరిస్థితులను అనుసరించి ఉంటాయి. తూర్పుచాళుక్య రాజులు క్రీ.శ. 7వశతాబ్దిలో వేంగి దేశాన్ని పరిపాలించారు. విమాలాదిత్యుని కుమారుడు రాజరాజ నరేంద్రుడు తన మేనమామ గంగై కొండ రాజేంద్ర చోళుని కుమార్తె అమ్మంగ దేవిని వివాహమాడాడు. రాజ రాజ నరేంద్రుడు క్రీ.శ. 1061 వరకు రాజ్యపాలన చేసినట్లు చారిత్రక ఆధారం వుంది. చోళుల సహాయంతో రాజ రాజు వేంగిని స్వాధీనం చేసుకొని ఆ కాలాన్నే భారత రచనకు వినియోగించాడు. చాళుక్యులకు పశ్చిమ చాళుక్యుల వలన వత్తిడి ఎక్కువగా ఉండటం వల్ల రాజ రాజు తన రాజధానిని రాజమహేంద్రవరానికి మార్చాడు. నన్నయ రాయబారిగ సమకాలిక కవి అయిన నారాయణ భట్టు సహాయంతో రాజ రాజుకు పశ్చిమ చాళుక్యులతో రాయబారం కుదిర్చాడు. దీన్ని బట్టి నన్నయ 11వ శతాబ్దివాడని తెలుస్తుంది.

ఆంధ్ర కవితా పోషకులయిన మహారాజులలో ప్రథముడు రాజ రాజ నరేంద్రుడు. ఇతడు చంద్ర వంశస్థుడు. పాండవులు చంద్రవంశజులే. కనుకనే ఆయనకు భారతం ఇష్టం. వైదిక ధర్మాన్ని ఉద్ధరించాలనే కోరిక నన్నయ ద్వారా కల్గింది. తూర్పు చాళుక్యులు మొదటి నుండి బ్రాహ్మణ భక్తులుగా వున్నారు. రాజ రాజుకు భారత శ్రవణాభిలాష ఎక్కువ. "నా హృదయంబున అనవరతము శ్రీ మహాభారతము నందలి అభిప్రాయంబు విన'' అను కోర్కెతో భారత రచనకు సంసిద్ధుడయ్యాడు. అందుకు సమర్థుడైన తన కుల బ్రాహ్మణుడు, నిత్య సత్యవచనుడు, ఆపస్తంభ సూత్రుడు, సంహితాభ్యానుడు, సంస్కృంతాంధ్ర రచనా కావ్య శోభితుడు, విపుల శబ్ద శాసనుడు, లోకజ్ఞుడు అయిన నన్నయార్యునికి 'కృష్ణ ద్వైపాయన ముని వృషభాభిహిత మహాభారత బద్ధ నిరూపితార్థ మేర్పడ తెనుగున రచియింపు మధిక ధీయుక్తిమెయిన్' అని ఆనతిచ్చాడు. రాజ రాజుకు నన్నయచే భారతాంధ్రీకరణ చేయించడానికి మరికొన్ని కారణాలు వున్నాయి. అవి

1. బ్రాహ్మణ మతాభిమానం
2. వర్ణాశ్రమోద్ధరణ
3. భారత శ్రవణా శక్తి
4. వంశ కర్తల మహిమాతిశయం
5. అన్య భాషలలో భారతానువాదం

రాజ రాజు మనసులోపలి అభిమతాన్ని గ్రహించిన నన్నయ 'బుద్ధి బహు విక్రమమున దుర్గమార్థజల గౌరవ భారత భారతీ సముద్రము తఱియంగన దీదను విధాతృనకైననూ నేరబోలు నే' అని తన సందేహం ముందుగా ప్రకటించి "దేవ! నీ అనుమతంబున విద్వజ్జనుల అనుగ్రహంబునన్ జేసి నా నేర్చు విధంబునన్ నిక్కావ్యంబు రచించెదన్'' అని తన ఆమోదాన్ని తెలిపి ధర్మ సంస్థాపనార్థమై భారతాన్ని ప్రచారం చేయాలనే భావంతో "శ్రీ వాణీ గిరిజాశ్చిరాయ వధతో వక్షో ముఖాం గేషు'' అంటూ శ్రీకారం చుట్టి వేద వ్యాసుని గ్రంథాన్ని

| | | |
|---|---|---|
| గ్రంథాన్ని | ధర్మతత్వజ్ఞులకు | - ధర్మశాస్త్రం గాను |
| | ఆధ్యాత్మ విధులకు | - వేదాంతం గాను |
| | నీతి విచక్షణులు | - నీతిశాస్త్రం గాను |
| | కవి వృషభులు | - మహాకావ్యం గాను |
| | లాక్షణికులు | - సర్వ లక్షణ సంగ్రహం గాను |
| | ఇతిహాసకులు | - ఇతిహాసం గాను |
| | పరమ పౌరాణికులు | - బహుపురాణ సముచ్చయం గాను |

విశ్వజనీనమైన ఇన్ని ఉత్తమ లక్షణాలు గల దానిగా తీర్చిదిద్దాడు. సంస్కృతంలో వ్యాసుడు రచించిన మహాభారతం 18 పర్వాలు. దానిని పూర్తిగా అనువదించాలి అని తన ప్రణాళికను సిద్ధం చేసుకొని ఆది, సభా పర్వాలను అరణ్యపర్వంలో నాల్గవ అశ్వాసంలో శరత్కాల వర్ణనలోని "శారద రాత్రులుజ్జ్వల'' అనే పద్యం వరకు మాత్రమే వ్రాశాడు. సంస్కృత భారతం 12,000

శ్లోకాలు. దానిని కేవలం 4,000 గద్య పద్యాలలో మాత్రమే నన్నయ రచించాడు.

## 3.2 నన్నయ - కవిత్వము - నన్నయ భారతాంధ్రీకరణ:

మహాకవి నన్నయ రాజ రాజ నరేంద్రుని కుల బ్రాహ్మణుడు. నన్నయ యుగకర్త. ప్రథమ ఆంధ్ర కావ్యకర్త. సంస్కృత సాహిత్యంలో వాల్మీకి ఆదికవి. అలాగే నన్నయ ఆంధ్ర సాహిత్యం నందు ఆదికవి. అవిరళ జపహోమ తత్పరుడు. విపుల శబ్ద శాసనుడు. సంహితాభ్యాసుడు. బ్రహ్మాండాది నానా రణణ విజ్ఞాన నిరతుడు. లోకజ్ఞుడు. ఉభయ భాషా కావ్య రచనా శోభితుడు. నిత్య సత్యవచనుడు. తెలుగు కవితకు మార్గదర్శకుడై మార్గదర్శీ మహర్షి అను సూక్తిని సార్థకము చేసిన కవి. నన్నయకు పూర్వమే కన్నడ భాషలో 'విక్రమార్జున విజయం' 'గదాయుద్ధ' అను పేర్లు గల కావ్యాలు మహాభారత కథను అనుసరించి వచ్చాయి. నన్నయ రచించిన భారత భాగంలో ఎక్కువగా అభ్యాయక శైలి కన్పిస్తుంది. అక్కడక్కడ నాటకీయ శైలి, వర్ణనాత్మక శైలి కనబడుతుంది. రాజ రాజ నరేంద్రుని కోరికతో మహాభారతాన్ని అనువాదం చేయడానికి పూనుకొని యథాతథంగా చేయలేదు. మూల గ్రంథములోని అరసములు, అనుచితములు అయిన ఘట్టాలను తగ్గించి, పరిహరించి రసవంతమయిన ఘట్టాలలో స్వతంత్రమైన కల్పనలు చేసి, వర్ణనలు పెంచి భారతాన్ని తెలుగులో అనువదించారు.

ఒక భాష నుండి ఒక గ్రంథాన్ని అనువదించాలంటే మూడు ముఖ్యమైన పద్ధతులున్నాయి. మూల గ్రంథం నుండి కథను మాత్రం తీసుకొని రసభావ పోషకంగా స్వతంత్ర రచన చేయడం ఒక పద్ధతి. ఇది "కథానువాద పద్ధతి''. రెండవది "భాషానువాద పద్ధతి'' ఇది స్వతంత్రం అది విధేయం కాని మధ్యస్థమైంది. ఇక మూడవది 'పదానువాద పద్ధతి' ఇది మూలాన్ని అనుసరించి చేయాల్సిందే గాని కర్తకు ఎలాంటి స్వాతంత్ర్యము ఉండదు. ఈ మూడు పద్ధతులలో కథానువాద పద్ధతి మేలయినది. దీనిని తెలుగులో నన్నయ పాటించి తరువాతి కవులకు మార్గదర్శకుడు అయ్యాడు.

'విద్యజ్జనంబుల యను గ్రహంబున జేసి నానేర్చు విధంబున నిక్కావ్యంబు రచియించెద' అని నన్నయ నిగర్వంగా చెప్పాడు. తన కవితా గుణాలను తానే క్రింది పద్యం ద్వారా వివరించాడు.

"సారమతిం గవీంద్రులు ప్రసన్నా కథా కవితార్ధయుక్తిలో
నారసి మేలు నానితరులక్షర రమ్యత నాదరింప
నానారుచిరార్ధ సూక్తి నిధి నన్నయ భట్టు తెనుంగునన్ మహా
భారత సంహితా రచనా బంధురుడయ్యె జగద్దితంబుగన్''

ఇందు నన్నయ చెప్పిన కవితా గుణాలలో మొదటిది ప్రసన్న కథా కవితార్థ యుక్తి. ఇది కావ్యం యొక్క అంతస్స్వరూపం. రెండవది అక్షర రమ్యత. ఇది కావ్య స్వరూపం. కవీంద్రులు కాని వారు కూడ ఆదరించునట్టిది. మూడవది నానారుచిరార్థ సూక్తి నిధిత్వం.

**3.2.1 ప్రసన్న కథా కవితార్థ యుక్తి:** సంస్కృత భారతం 12,000 శ్లోకాలు ఉండగా నన్నయ 4000 గద్య పద్యాలలో రచించాడు. తన కథా కథన చాతుర్యంతో సంభాషణలలో రస పోషణ చేశాడు. సందర్భాన్ని బట్టి రసపోషణ చేసి పాఠకుల హృదయాలను రసానందంతో నింపాడు.

ప్రసన్న కథా కవిత - ప్రసన్నమైన కథతో కూడిన అర్థయుక్తి చమత్కారంతో నిండిన మాటలు కలిగి ఉండటమే ప్రసన్న కథా కవితార్థ యుక్తికి అర్థం.

ప్రసన్న అంటే చదవగానే సులభంగా వెంటనే అర్థం అయ్యేది అని అర్థం. కథ వినగానే మానసిక ఆనందం కలిగి కనుల ముందు ప్రత్యక్షమగునట్లు అనుభూతి చెందే విధంగా రచించడం కథలో కూడుకొనిన ఒక విశేషమైన అర్థాన్ని ప్రకాశించుట అని చెప్పవచ్చు. నన్నయ ఉత్తమ కథకుడు. కథాకథన శిల్పం నందు పండితుడు. సంస్కృత భారతంలోని కథలలో అక్కడక్కడ చిన్న

చిన్న మార్పులను చేసి వాటికి ప్రసన్నత చేకూర్చాడు. కథల అన్యోన్య సంబంధం నన్నయ కథన దక్షతలో ఒకటి.

బ్రహ్మ లోకంలో సభ జరుగుతుంది. సభలో మునులు, దేవతలు అందరూ ఉన్నారు. గంగాదేవి స్త్రీ రూపంలో సభకు వెళ్ళింది. ఆ సమయంలో గంగ పై ఎద గాలికి తొలగిపోయింది. సభలో వున్న మహాభిషుడు అనే యువకుడు గంగను చూస్తూ ఉండగా అది గమనించిన బ్రహ్మ కోపించి మహాబిషుని భూలోకంలో జన్మించమని శాపం ఇచ్చాడు. ఈ కథను సంస్కృత మూలం నుండి అనువాదం చేసేప్పుడు నన్నయ చాలా చక్కగా కథను చెప్పి మహాబిషుని శాపం ఇవ్వడం అనేది సరియైన కారణంగా చూపాడు. స్త్రీ రూపంలో బ్రహ్మ సభకు వెళ్ళిన గంగ పై ఎద గాలిచే తొలగినని మూలంలో వుంది.

"ఊరు మూల మేర్పడగ నయ్యువిద వలువ దొలగె ననిలంబు చేత విధూత మగుచు'' అని నన్నయ అనువాదం చేశాడు. దీని వల్ల కథకు పుష్టి చేకూరుతుంది. 'ఊరు మూల మేర్పడగా'చూచెనని చెప్పుటచే శాపానికి తగిన అపరాధమయింది. 'దృష్టివాన్' అని సామాన్యంగా ఉండగా తెలుగులో మహాభిషుడు (ఇతడు శంతనుడుగా పుట్టాడు) దాని సాభిలాషుడై చూచాడని నన్నయ తెలిపాడు. మూలముని వలె ప్రమాదవశాన చూడటం కాదు. కావాలని చూచుట. అందుకు దోషము. ఇది నన్నయ కథాకథన దక్షతకు నిదర్శనం. కథకు ఆయువు పట్టు అయిన విషయాన్ని ఎక్కడ చెప్పాలో నన్నయకు బాగా తెలుసు. మూలంలో కథా ప్రారంభం లోను. సుందీప సుందుల ఏకీభవాన్ని గురించి

" ఏక రాజ్యానేక గృహానేక శయ్యా సనాశనే' అని

.......................................................................

అన్యోన్యస్య ప్రియకణ వన్యోన్యస్య ప్రియంవందౌ

..................................................... భవచ్చయౌ''

అని వుంది. నన్నయ ఈ విషయాన్ని ముందుగా చెప్పలేదు. సుందీప సుందులు ఇద్దరూ అన్నదమ్ములు. రాక్షసులు పుట్టిన నాటి నుండి అన్ని విషయాలల్లోను అంటే స్నానం, భోజనం, శయనం అన్ని కలిసే చేసేవారు. ఇద్దరూ కలిసే ఒకే సింహాసనంలో కూర్చొని రాజ్య పాలన చేశారు. వారి అన్యోన్యతను చెడగొట్టి సంహరించవలసిందిగా దేవతల ఆజ్ఞతో 'తిలోత్తమ' అను దేవ కాంత వారి మధ్యకు వస్తుంది. ఆమె అంద చందాలకు ఇద్దరూ మురిసి ఒకేసారి ఆమెను కోరుకుంటారు. అందుకు తిలోత్తమ ఇద్దరిలో ఎవరు వీరులో వారినే వివాహమాడతాను అని చెబుతుంది. అప్పటి వరకు కలిసున్న అనదమ్ములు ఒక స్త్రీ కోసం కలహమాడుకుంటారు. ఈ సంగతిని నన్నయ ఒకే పద్యంలో ఇద్దరి అన్యోన్యతను గురించి, కలహాన్ని గురించి చమత్కారంగా చెప్పారు.

"ఘనులయ్యిరువురు నేకా, సనభోజన యాన నిలయ శయన క్రియలం
దనరెడు వారేక స్త్రీ, వినిహిత కాములయిరపుడు విధి నియమమునన్''

అని చెప్పాడు. ఈ విషయం ఇక్కడ చెప్పటం వల్ల కథకు అందం వచ్చింది. పూర్వస్థితి, ప్రస్తుత స్థితి ఒక్కచోట చెప్పటం వల్ల పూర్వం ఎలా వున్నారో చివరకు వారు ఏ విధంగా అయ్యారో ఈ విషయం పాఠకులకు అర్థం అవుతుంది. ఆసన, భజన, శయనాదుల యందు ఏకత్వమును భజించిన వారు స్త్రీ విషయాన కూడ ఏకత్వాన్ని ఇష్టపడ్డారు. అనే చమత్కారం కూడా అక్కడ సిద్ధించింది.

ఇట్లు కథాకథనాన అత్యల్ప విషయములందు కూడ నన్నయ జాగరూకత వహించి అనువదించాడు. కథలో ఏ అంశం ఎక్కడ చెబితే రక్తి కడుతుందో ఏ అంశం విడిచిన రస పాత్రిన్మలన జరుగుతుందో బాగుగా పరిశీలించి తెనిగించి ఉండటంచే నన్నయ కథాకథన దక్షత అడుగడుగున మనకు వ్యక్తమవుతుంది.

**3.2.2 అర్థయుక్తి:** మూలమున కథా మాత్రంగా అతి సామాన్యంగా ఉన్న విషయానికి ఏదో ఒక విశేషమునో, చమత్కారమునో, అలంకారమునో చేర్చి ఏదో ఒక అర్థాన్ని నిక్షేపించి సొగసుగా చెప్పి తన్మూలమున రస పాత్రోన్మీలనం కాలించుట. దీనిని అర్థయుక్తి అంటారు.

కచ దేవయాని కథ అర్థయుక్తికి మంచి ఉదాహరణ. రాక్షసుల గురువు శుక్రాచార్యుడు. ఆయనకు మృత సంజీవని విద్య తెలుసు. దేవతలకు ఆ విద్య రాదు. ఎలాగైనా ఆవిద్యను నేర్చుకొని రమ్మని దేవతలు కచుని శుక్రుని దగ్గరకు పంపుతారు. కచుడు శుక్రునికి అన్ని సేవలూ చేస్తూ ప్రియమైన శిష్యుడు అవుతాడు. శుక్రుని కూతురు దేవయాని. ఆమె కచుని ఇష్టపడుతుంది. శుక్రుని శిష్యులు శుక్రుడు కచుని పై ఎక్కువ ప్రేమ చూపడంతో అసూయజెంది కచుని చంపి కాల్చి బూడిద చేసి సురాపానంలో కలిపి శుక్రుని చేత తాగిస్తారు. కచుని రాకకై ఎదురు చూసిన దేవయాని శుక్రునితో చెప్పగా శుక్రుడు దివ్య దృష్టితో తన ఉదరమందున్నాడని తెలుసుకొని, సంజీవని విద్యచే బ్రతికించి తన పొట్ట చీల్చుకొని బయటకు వచ్చి తనను బ్రతికించమని కోరతాడు. కచుడు ఆవిధంగా పొట్ట చీల్చుకొని బయటకు వచ్చిన కచుని వర్ణించు సందర్భంలో నన్నయ భారతాన "అతని చేత సంజీవితుండై వెలింగి, దనుజ మంత్రి యుచ్చారణ దక్షుచేత. నఖిహితంబగు శబ్దంబు నట్లపోలె" అని చెప్పాడు. ఇందు మనోహరమైన ఉపమాలంకారం ఉంది. మూలంలో ఇది లేదు. ఇది నన్నయ కవితా పాటవమునకు వైదికాభినివైశానికి చక్కని నిదర్శనం.

పాండవులు అయిదుగురు ద్రౌపది యందు మన్మథ ప్రీతి పొందారని చెప్పునపుడు నన్నయ ఇలా రచించాడు.

అర్జునుడు మత్స్యయంత్రాన్ని ఛేదించిన తర్వాత పాండవులు ద్రౌపదితో కలిసి కుంతి దగ్గరకు వచ్చి భిక్ష తెచ్చామని అనగా కుంతి ఆ భిక్షను అయిదుగురిని పంచుకోమని చెబుతుంది. అప్పుడు పాండవులు అయిదుగురు మన్మథ బారి పడ్డారని నన్నయ

" ఆ లలితాంగి యందు హృదయంబులు దృష్టులు నిల్పి పాండు
భూపాల తనూజ పంచకము పంచ శరాహతి బొందె"

పాండవులు అయిదుగురు కావున వారు మన్మధాహతి పొందారు మన్మథునకు "పంచశర" శబ్దాన్ని ప్రయోగించుట ఎంతో సముచితంగా వుంది. గాంధారీ వివాహ విషయం చెప్పునపుడు "సుబలుడు తలిచిన పని చేయగలడు గాంధారీ తండ్రి ఇష్ట ప్రకారం నడచునది" అను రెండును గుప్తంగా ఉన్న విషయాలు. సుబలుడు ఏ పనైనా తలంచుకుంటే తప్పక నెరవేర్చుతాడు. అందుకు భీష్ముడు సుబలుని (మంత్రి) గాంధారీ తండ్రి దగ్గరకు వివాహం విషయమై పంపుతాడు. సుబలుడు గాంధారీ తండ్రిని, గాంధారిని ధృతరాష్ట్రునికిచ్చి వివాహం చేయడానికి ఒప్పించి వస్తాడు. గాంధారికి ధృతరాష్ట్రుడంటే అంగీకారమైన తండ్రి ఇష్టం కొరకై వేచి చూసింది. నన్నయ ఈ విషయాలను గుప్త పరచి "ఆరాజునకు గాంధారీ నిచ్చి" అని చెప్పడంలో ఎంతో అర్థ యుక్తిని చూపించాడు.

ఋషుల కథలు చెప్పునపుడు ఋషుల త్రికాల పరిజ్ఞానాన్ని బట్టి నన్నయ అర్థ యుక్తిని తెల్పాడు. వైదిక కథలలో ఖగోళశాస్త్ర విషయాలను శబ్ధశాస్త్ర విషయాలను, యాజ్ఞిక కర్మ విషయాలను నిగూఢంగా చొప్పించి నన్నయ అర్థ యుక్తిని కలిగించాడు.

**3.2.3 అక్షర రమ్యత:** ఈ గుణము శబ్దానికి సంబంధించింది. శ్రవణేంద్రియము ద్వారా గ్రహించేది. నన్నయ రచనలో ఎక్కడా తడబాటు గాని, తొందర పాటు గాని లేకుండా సమాస విక్షేపాలతో సాగిపోతూ వుంటుంది. ప్రసన్న కథా కవితార్థ యుక్తిలో అర్థసిద్ధిని, అక్షర రమ్యతలో శబ్దసిద్ధిని సాధించాడు. శబ్దాలంకారాలు నిండుగా ఉండే కవిత్వం అక్షరాల వల్ల పుట్టిన రమ్యత అక్షర రమ్యత. ఈ గుణం వల్ల నన్నయ కవిత్వం వినడానికి, చదవడానికి మధురంగా ఉండటమే కాక పద్యాలు ధారాళమైన నడవడికతో నడిచాయి. ఇవి పండితులనే కాక పామరులను కూడా అలరించాయి.

**3.2.4 నన్నయ చేసిన నాగస్తుతి:** ఉదంకుడు గురుపత్నికి పేష్య మహారాజు భార్య యొక్క కుండలాలను తెచ్చుటకై ప్రయత్నం చేయు సమయాన నాగ లోకం వెళ్ళవలసి వస్తుంది. నాగ లోకంలో ఉదంకుడు చేసిన ఈ నాగస్తుతిలో

" బహువన పాద పాబ్ధికుల పర్వత పూర్ణ సరస్సరస్వతీ
సహిత మహా మహీభర మజస్ర సహస్ర ఫణాళిదాల్చి దు
స్సహతర మూర్తికిన్ జలధి శాయికిఁబాయక శయ్య మైనయ
య్యహిపతి దుష్కృతాంతకుడు నంతుఁడు మాకు బ్రసన్నుఁడయ్యెడున్"

"సరస్సరస్వతీ సహిత - దుస్సహతర అని 'స' వర్ణమును పలుమార్లు ఆవృత్తి చేయడం వల్ల పాముల బుస్సుయను ధ్వని వినిపిస్తుంది." "పాయక శయ్యయైన యయ్యహిపతి" అనడంలో 'య' కార సకృదావత్తి వలన అనంత శయ్యా మార్ధవం సూచింపబడింది.

**3.2.5 సముద్ర వర్ణన:** ఎత్తైన కెరటాలలో ఉవ్వెత్తున చరించు సముద్రాన్ని

" వివిధోత్తుంగ తరంగ ఘట్టిత చలిద్వేలా వనైలావలీ
లవలీలుంగ లవంగ సంగత లతా లాస్యంబు వీక్షించు చున్"

అని వర్ణించాడు. కెరటం మిక్కిలి ఎత్తుగా లేచి మెల్లగ నించుక సాగి ఒడ్డుకు కొట్టుకొని జల జల మని ధ్వనిని చేస్తుంది. ఇది అంతా ఒకే సమాసంలో నిక్షిప్తం చేయబడింది. 'వివిధోత్తుంగ' అనడంలో కెరటం యొక్క ఔన్నత్యం 'తరంగ' అనుటలో కొద్దిగ సాగుట, 'ఘట్టన' అనుటచే ఒడ్డునకు కొట్టుకోవడం, 'చలద్వేలా........వీక్షించుచున్' అను పాదంలో 'ల' కార వుండటం వల్ల దాని జల జల ధ్వని చక్కగా సూచింపబడింది.

"కురు వృద్ధుల్ గురు వృద్ధ బాంధవులనే కుల్ సూచు చుండన్ మదో
ద్ధరుడై ద్రౌపది నిట్లు సేసిన ఖలున్ దుశ్శాసనునన్‌లోక భీ
కర వీలన్ వధియించి తద్విపుల వక్ష శ్శైల రక్తౌఘుని
ర్ఝర ముర్వీపతి సూచు చుండ నని నాస్వాదించు నుగ్రా కృతిన్"

ఇందున్న ద్విత్వధకారముచే భావి కాలంలో జరుగబోవు యుద్ధంలో భీముడు దుశ్శాసనుని ఏ విధంగా వధించి అతని వక్షాన్ని చీల్చి రక్తాన్ని ఎట్లా ఆస్వాదిస్తాడో ఇందు నన్నయ వర్ణించాడు. ఇందు అపారమైన పాండిత్యం వుంది. సునిశితమైన పరిశీలన శృతి, లయ, జ్ఞానం కల నన్నయకు అక్షర రమ్యత అనే గుణం అలవోకగా అలవడింది.

**3.2.6 రస పోషణ:** నన్నయ భారతంలో రసములన్ని అంగ రూపంలోను, అంగిరూపంలోను పోషింపబడ్డాయి. భారతం బహుళ కథాభూష్టం. ఏ భావాన్ని ఎక్కువ లేక తక్కువ చేసి చెప్పక రసాన్ని పోషిస్తూ సాగిపోవాలి. నన్నయ రసపరిపోషణమున శబ్ద ప్రయోగ సామర్థ్యంలో రసమును పోషించుట అను ఒక క్రొత్త మార్గాన్ని అవలంబించాడు.

పాండురాజు మాద్రిల శృంగార సమయంలో వసంత ఋతువును చక్కగా వర్ణించాడు.

పాండురాజు భార్యతో కలిసిన మరణిస్తాడు అని ఒక ముని శాపం వుంది. ఆ భయంతోను పాండు రాజు తన భార్యలైన కుంతి, మాద్రిలతో కలిసి బ్రహ్మచర్య జీవితాన్ని గడుపుతుంటాడు. అయినా ఒకసారి పాండురాజు వసంత ఋతువులో మాద్రి అందాన్ని చూసి శృంగార భావనకు గురి అవుతాడు. ఈ విషయాన్ని నన్నయ రసస్ఫోరకంగా వర్ణించాడు.

'కమ్మని లతాంతములకు మ్మొనసివచ్చు మధుపమ్ముల సుగీత వినిదమ్ము'
చారు సువర్ణహాసి నవచంపక భూషము సింధువార - ముక్తారమణీయయున్
వకుళా దామవతం సయునై న, మాద్రిని అపూర్వ శృంగార విలాసవీల యొసగం

పాండురాజు ముందుంచాడు. ఇవి నన్నయ శృంగార రస నిర్వహణ సామర్థ్యానికి నిదర్శనం.

అలాగే నలోపాఖ్యానంలో నలి దమయంతుల కథ చెప్పునపుడు నలుడు జూదంలో సర్వం కోల్పోయి అడవుల పాలవుతాడు. వాసుకి అనే పాము కాటు వల్ల తన రూపాన్ని కోల్పోయి అంద వికారంగా వుంటాడు. అడవిలో దమయంతిని వదిలి దూరంగా వెళ్ళి మరొక రాజు కొలువులో బాహుకుడు అనే పేరుతో వంటల వాడిగా చేరతాడు. అప్పుడు దమయంతిని తలంచుకొని దుఃఖిస్తాడు. ఆ సందర్భంలో 'ఇభరాజగమన' 'అద్బురు కుచ భార' అను సంబోధనలచే శృంగారాన్ని నన్నయ ధ్వనింప చేశాడు.

రసం వలనే రసాభాసం కూడా కావ్యంలో వర్ణనీయమే. కచదేవ యానుల శృంగారం. ఊర్వశీ - అర్జునుల శృంగారం శృంగార రసాభాసానికి ఉదాహరణలు. నన్నయ ఈ రసాభాస ఘట్టాలను కూడా రమణీయంగా వర్ణించాడు.

**3.2.7 ఉభయ వాక్ ప్రౌఢి:** "భాషించు నన్నయ భట్టు మార్గంబున ఉభయ వాక్ ప్రౌఢి ఒక్కొక్కమాటు" అని శ్రీనాధుడు కాశీఖండ పీఠికలో నన్నయ ఉభయ వాక్ ప్రౌఢిని ప్రశంసించాడు. రసానుగుణంగా ఉభయ వాక్కులను ప్రయోగించుట, లలిత సంస్కృత పద ప్రయోగం తెలుగు పద ప్రయోగాలను కలిపి ప్రయోగించడమే ఉభయ వాక్ ప్రౌఢి. నన్నయ శైలికి వచ్చిన గాంభీర్యమంతా బహుళ సంస్కృత పద ప్రయోగం చేయడం వలననే.

శకుంతలోపాఖ్యానంలో దుష్యందుడు కణ్యుని ఆశ్రమంలో వున్న శకుంతలను గాంధర్వ వివాహం చేసుకొని ఆమెను వదిలి తన రాజ్యానికి తిరిగి వెళతాడు. శకుంతల కుమారుని కని, కణ్యుని ఆ దేశంతో దుష్యంతుని కడకు రాగా దుష్యంతుడు ఆమె ఎవరో తెలియదని, కుమారుడు తన కొడుకు కాదని, ఎక్కడి నుండి వచ్చావో అక్కడకు వెళ్ళమని తిరస్కరిస్తాడు. అపుడు శకుంతల దుఃఖంతో తనలో తాను అనుకున్న సందర్భంలో నన్నయ

"తడయక పుట్టిన నాఁడ తల్లిదండ్రిచే విడువఁ
బడితి నిప్పుడు పతి చేతను విడువఁబడియెద నొక్క
నుడువులు వేయు నింకేల యిప్పాటి నోములు దొల్లి
కడఁగి నోఁచితిని గాకేమి యనచును గందె డెందమున"

అని వర్ణించాడు. ఇందు ఒక్క 'పతి' శబ్దము తప్ప తక్కిన వన్ని తెలుగు పదాలే. శకుంతల ఆవేదనను తెలుగు పదాలలో కరుణ రసాత్మకంగా దేశీయ ఛందస్సు అయిన మధ్యాక్కరలో రచించడం విశేషం.

**3.2.8 శైలి:** శైలి అనే శబ్దం సంస్కృతం 'స్టైల్' అనే ఆంగ్ల శబ్దానికి వికృతి అని ఒక అభిప్రాయం వుంది. కవుల శైలి పద్య రచనకు సంబంధించింది. నన్నయది ఆభ్యాన శైలి. కవితానై కథను చెప్పుట అభ్యాన పద్ధతి. పాత్రల సంభాషణము ద్వారా కథను విస్తరింపచేయుట నాటకీయ పద్ధతి. వినతా కద్రువలు కశ్యపుని భార్యలు. ఒకసారి సముద్ర తీరానికి విహారానికై వచ్చి దూరాన ఉన్న తెల్లని అశ్వాన్ని చూచి మాట్లాడుకుంటారు. ఆ సందర్భంలో

వినుత - అయ్యశ్వంబు డాసి చూతము రమ్ము (అనిన)
కద్రువ - ఇప్పుడు ప్రొద్దులేదు రేపకడు చూతము.

అలాగే శకుంతలోపాఖ్యానంలో దుష్యంతుడు కణ్వుని ఆశ్రమంలో శకుంతలను చూసి తనను వివాహం చేసుకొమ్మని అందునా గాంధర్వం క్షత్రియులకు తగినదని చెబుతాడు. అపుడు శకుంతల తన తండ్రి ఆజ్ఞతో వివాహం చేసుకొమ్మని చెబుతుంది, అప్పటి సంభాషణ నాటకీయ శైలిలో వుంది.

దుష్యంతుడు - ఈ ముని పల్లె యుండుట యేలి ............... గాంధర్వ విధి వివాహ మాడుట వినవే.
శకుంతల - జనకులు సనుదెంతురు వారు వచ్చి నీకిచ్చిరేని పాణి గ్రహణము సేయము నన్నున్

నన్నయది కర్ణ పేయమైన శైలి. పద్యము వినగాను పాఠకుని చెవికి ఇంపు నింపి హాయి కలిగిస్తుంది.

**3.2.9 నానారు చిరార్థ సూక్తి నిధిత్వం:** 'సూక్తి' అంటే రుచిరమైన చమత్కారముతో కూడిన కూర్పు. 'సూక్తి' అంటే మంచి మాట అని సామాన్యమైన అర్థం. ఈ చమత్కారం పదం, పదబంధం, సమాసం, కారకం, వాక్యాలలో బహు విధాలుగా వున్నాయి. సుభాషితాలు, సామెతలు, సమాసోక్తి, వ్యాఖోక్తి మొదలైనవి అలంకారాలన్ని కలిపి సూక్తులే. నన్నయ రచనలో (సు+ఉక్తి) మృదు మధురములైన అర్థ యుక్తు లెన్నో ఉన్నాయి. నన్నయ సూక్తులన్నింటికి ఒక ప్రత్యేకత ఉంది. కథలో ఒక నీతి గాని, ధర్మాన్ని కానీ బోధింప వలసి వచ్చినపుడు నన్నయ దానిని ఒక ప్రత్యేక పద్యంలో చెప్పేవాడు. శంకులోపాఖ్యానంలో ప్రసిద్ధమైన రత్నాల్లాంటి సూక్తులు ఎన్నో ఉన్నాయి.

కణ్వుడు శకుంతలతో వివాహిత స్త్రీల గురించి చెప్పిన సూక్తి

"పతుల కడన యునికి ధర్మువు" భర్తల దగ్గరే భార్యలకు స్థానం ధర్మం. మూర్ఖుని గురించి "ఎఱిగి ఎఱుగ నొల్లని కఱటిం దెలుపంగ కమల గర్భుని వశమె" తెలిసి తెలియని మూర్ఖులకు తెలియ చెప్పడం బ్రహ్మకు కూడా సాధ్యము కాదు.

సత్య వాక్యము మంచిది అని చెప్పు సందర్భంలో "సుత శతంబు కంటె నొక సూనృత వాక్యము మేలు" నూరుగురు కొడుకుల కంటె ఒక్క సత్య వాక్యం మేలు అని చెప్పాడు. "ఎల్ల ధర్మంబుల కెల్ల పెద్ద యండ్రు సద్యము" అన్ని ధర్మాల కంటె సత్యము పెద్దది, ముఖ్యమైనది.

**3.2.10 లౌకిక నీతి - ప్రభోదకాలు:** ఒక సారి పరీక్షిత్తు మహారాజు వేటకు వెళ్ళి అలసిపోయి శమీకుడను ముని ఆశ్రమానికి వచ్చి దాహానికి నీరు ఇమ్మని అడుగుతాడు. తపస్సులో వున్న శమీకుడు జవాబు ఇవ్వకపోవడంతో కోపించిన పరీక్షిత్తు చచ్చిన పామును శమీకుని మెడలో వేసి రాజ్యానికి వెళతాడు. కొంత సేపటికి శమీకుని కొడుకు శృంగి వచ్చి తన తండ్రి మెడలో వున్న చచ్చిన పామును చూచి కోపించి వేసిన వానికి వారం రోజుల లోపల పాము కాటుతో మరణిస్తాడు అని శాపం ఇస్తాడు. శమీకుడు దివ్య దృష్టితో జరిగినది తెలుసుకొని శృంగితో

" క్షమ లేని తపసి తనమును, బ్రమత్తు సంపదయు ధర్మ బాహ్య ప్రభు రాజ్య<br>
ము భిన్న కుంభమున తీ, యము లట్టుల యధ్రువంబులగునవి యెల్లన్"

క్రోధము వల్ల వచ్చే అనర్థాన్ని తెలియచెప్పునీతి ఇది. క్షమా గుణ రహితమైన తపసి తపము, ప్రమత్తుని సంపద, ధర్మబాహ్యుడైన రాజు రాజ్యము చిల్లు కుండలోని నీరు వలె నిలువదని దీని భావం.

'క్షమ లేని తపసి తనము' అన్నది ఒక్కటే కథకు సంబంధించింది. దానితోపాటు ప్రమత్త సంపద, అధర్మ ప్రభు రాజ్యం అను మరి రెండు కలిపి వానికి మూలంలో కాని ఒక ఉపమానం చూరించాడు నన్నయ. ఇది అన్ని కాలాల్లోను, అన్ని సమయాల్లోను ఉపయోగపడే లౌకికపరమైన ధర్మాన్ని బోధించు నీతి.

**3.2.11 రాజనీతి ప్రభోదకాలు:** రాజనీతి భోదకాలైన సూక్తులు భారతంలో ఎన్నో వున్నాయి. సౌబిలుని మంత్రియగు కణికుడను వాడు దుర్యోధనునకు రాజ నీతి ఉపదేశించిన సందర్భములో పద్యాలు మూలంలో లేవు.

"జనపాలుడు మృదు కర్మంబున నైనను గ్రూర కర్మము నైనను నే<br>
ర్పున నుద్ధరించునది ద న్ననపాయతఁబొంది చేయునది ధర్మంబుల్"

రాజు అయిన వాడు మృదువుగా నైన, కఠినముగా నైన, అవసరమైనపుడు తగిన విధంగా ప్రవర్తించి కార్యమును సాధించాలి అదే రాజ ధర్మం అని నీతిని తెలియచేశాడు.

**ఆధ్యాత్మిక ధర్మ ప్రభోదకాలు:** పాండురాజు మరణించినపుడు తల్లి అయిన సత్యవతితో వ్యాసుడు ఆమెను ఓదార్చుచూ ఏకాంతంలో పల్కిన పల్కులు

'మతి దలపగఁ సంసారం బతి చంచల మెండ మావు లట్టుల.'<br>
......................... గతకాలము మేలు వచ్చు కాలం కంటెన్'

సంసారము అతి చంచలమైనది. సంపదలు శాశ్వతములు కావు అని వేదాంత జ్ఞానాన్ని నన్నయ తెలియజేశారు. "గత కాలము మేలు వచ్చు కాలం కంటెన్" 'రాబోయే కాలం కంటె జరిగిపోయిన రోజులు మంచివి.' అనే భావన అందరూ నమ్ముతారు. ఇది కలికాలం ప్రజల నోళ్ళలో నిలిచిపోయిన సూక్తి.

**3.2.12 లోకజ్ఞత:** నన్నయ లోకజ్ఞుడు కావుననే లోకజ్ఞానం కలిగిన సూక్తులు ఎన్నో తెలియ చెప్పాడు.

దాశరాజు కూతురు సత్యవతి. గంగలో పడవను నడుపుతూ జీవనం సాగిస్తూ ఉంటుంది. ఒకనాడు పరాశరుడను ముని పడవలో ఎక్కి సత్యవతి అంద చందాలు చూచి కామ పరవశుడయ్యాడు ఆ సందర్భంలో

'ఎంత శాంతులయ్యు నెంత జితేంద్రియులయ్యుఁగడు వివక్తమయిన చోట
సతుల గీష్టిఁజిత్త చలన మొందుదు రెండు గాము శక్తి వోర్వఁగలరె జనులు'

అని వర్ణించగా ఎంతటి మహర్షులయిన ఏకాంతంలో స్త్రీ కనబడినపుడు మనసు గతి తప్పుతుంది. మన్మథుని శక్తిని ఓర్చుకొనుట జనులకు సాధ్యము కాదని ఇందలి భావం. ఈ సూక్తి మూల మందు లేదు. నన్నయ కల్పన.

యయాతి మహారాజు ముసలివాడైన తరువాత మరల యవ్వనం పొందాలి అనే కోర్కె కలిగింది. తన కుమారులకు తన ముసలితనం తీసుకొని వారి యవ్వనాన్ని ఇవ్వమని కోరాడు. అందుకు కుమారులు అంగీకరించలేదు.

" నరలు గల కామునైనను దరుణులు రాయుదురు
............. నభీష్ట భోగభాహ్యుడకాఁడే."

అని కొడుకులు నిరసించారు. ఎంతటి అందగాడైన తల నెరిసినచో వానిని ఏ స్త్రీ అంగీకరించదు. కుబేరుడయిన ముసలి తనమున్నచో భోగభాగ్యాలు ఎలా అనుభవించగలడు. మూలములో కొడుకులీ విధముగా అన్నట్లు లేదు.

యయాతి మహారాజు వృషపర్వుడు అనే రాక్షస రాజు కూతురు శర్మిష్ఠను, రాక్షస గురువగు శుక్రుని కూతురు దేవయానిని వివాహమాడాడు. శర్మిష్ఠకు శయన సుఖం కలిగించనని శుక్రునికి మాట ఇచ్చాడు. కాని శర్మిష్ఠ తనకోరిక తీర్చమని యయాతిని అడుగగా అతడు మాట తప్పునట్లు అవుతుందని భయపడ్డాడు. అప్పుడు శర్మిష్ఠ బొంకను తప్పులేని సమయాలను యయాతికి వివరించింది. అప్పుడు

"చను బొంకగ ఁబ్రాణాత్యయమున సర్వధనాపహరణమున వధ గావ
చ్చిన విప్రార్థమున వధూ జన సంగమమున వివాహ సమయమునందున్"

మూలంలో 'నర్మ యుక్తమని' ఉన్నచోట అనువాదంలో వధగా వచ్చిన విప్రార్థమున అని నన్నయ మార్చాడు. ఇది అతని బ్రాహ్మణ భక్తికి శాస్త్రి వైదుష్యానికి ఒక మచ్చు తునక.

కొన్ని చోట్ల మూలంలో బీజ ప్రాయంగా వున్న భాగాలను గ్రహించి నన్నయ సూక్తిగా పెంచాడు. నీతి ధర్మాలకు నిలయమైన సూక్తులను కథా సందర్భంలో కూడిన పద్యాలలో కాక ప్రత్యేక పద్యాలలో వ్రాశాడు. ఈ విధంగా రుచిరార్థ సూక్తులను ఎన్నింటినో నన్నయ తన భారతంలో ఉపయోగించాడు.

నన్నయ రచన శైలి 'అనువాద పద్ధతి' వర్ణనలు ఛందస్సులు తరువాతి కవులకు ఆదర్శం అయ్యాయి. అందుకు నన్నయకు పూర్వం కవిత ఉన్నా, కవిత్వం ఉన్నా అతడే తెలుగులో మహాకవిగా కీర్తిని సంపాదించుకున్నాడు. తెలుగు కవిత్వానికి అతడు ఆద్యుడయ్యాడు. మార్కండేయ పురాణ కర్త మారన నన్నయను ఆంధ్ర కవితా గురుడు అని స్తుతించాడు. రాజ రాజు భూషణుడు 'మణిమన్ వాగాను శాసనుడు సృజియింప' అని తెలుగు సాహిత్య ప్రపంచానికి సృష్టి కర్తగా కీర్తించాడు.

## 3.3 నన్నయ ఇతర కావ్యాలు:

**3.3.1 ఆంధ్ర శబ్ద చింతామణి:** ఇది తెలుగు భాషకు సంస్కృత శ్లోకాలలో వ్రాసిన వ్యాకరణం. దీనిని రచించటం వలన నన్నయకు 'విపుల శబ్ద శాసనుడు' అనే బిరుదు వచ్చింది. ఎలకూచి బాల సరస్వతి దీనికి తెలుగు వివరణ వ్రాశాడు. ఆహోబల పండితుడు దీనికి వ్యాఖ్యానం వ్రాశారు. తెనుగునకు వ్యాకరణం వ్రాసిన పూర్వ లాక్షణికులైన కేతన, విన్నకోట పెద్దన మొదలైన వారు దీనిని నన్నయ రచించినట్లు చెప్పలేదు. ఆంధ్ర శబ్ద చింతామణి రచింపక పోయినను నన్నయకు గల శబ్దాను శాసన బిరుదు సార్థకమవుతుంది.

**3.3.2 చాముండికా విలాసం:** చాముండికా విలాసమునకే 'చౌడేశ్వరి' విలాసమని నామాంతరం. ఇది మూడు అశ్వాసాల గ్రంథం. సుమారు 120 పద్యాలున్నాయి. మూడవ ఆశ్వాసము నందలి గద్యలు ఒకే రకంగా లేవు. మొదటి అశ్వాసంలో నంద వరీక

బ్రాహ్మణుల గురించి రెండు మూడు ఆశ్వాసాల్లో దేవాంగ కులంలోని ఒక శాఖను గురించి తెలుపు కథలు ఇందున్నాయి.

ఆంధ్ర శబ్ద చింతామణి, చాముండికా విలాసము, ఇంద్ర విజయము లక్షణ సారము మొదలైనవి నన్నయ కృతులు కావు. నందంపూడి శాసనం తప్ప భారతేతరమగు నన్నయ రచన ఏదీ లభింప లేదు.

## 3.4 నన్నయ సమకాలికులు:

1. నారాయణ భట్టు మల్లియ రేచన, వేముల వాడ భీమ కవి, అథర్వణా చార్యుడు, పావులూరి మల్లన

**3.4.1 నారాయణ భట్టు:** నారాయణ భట్టు వాఙ్మయ దురంధరుడు. నన్నయకు సమకాలికుడు. సంస్కృత, కర్ణాటక, ప్రాకృత, పైశాచిక ఆంధ్ర భాషలలో కవిశేఖరుడు. 'కవీఛ వజ్రాంకుడు' అను బిరుదు కలవాడు. రాజ రాజ నరేంద్రుడు 'కోరమిల్లి' అగ్రహారాన్ని నారాయణ భట్టుకు దానంగా ఇవ్వగా ఆ దాన శాసనాన్ని నన్నయ రచించాడు. నారాయణ భట్టు నన్నయకు భారతాను వాదంలో తోడ్పడుటచే "సాయక పాక శాసనునికి భారత ఘోర రణంబు నందు నారాయణు నట్లు" అని కృతజ్ఞతా పూర్వకంగా నన్నయనారాయణభట్టును శుతించాడు. నన్నయ నారాయణ భట్టు కలిసి జంట కవిత్వం చెప్పి వుంటారని అందుకే "తోడై నిర్వహింపన్" అని నన్నయ పేర్కొన్నాడని కొందరు భావించారు. కన్నడ మార్గ పద్ధతులను గురించి సూచనలు ఇచ్చుటలోను, సంస్కృత భారత ప్రతి నిర్ణయించడం, విద్వత్ సభలందు కలిగిన భాషా వివాదానికి పరిష్కారంసూచించడం మొదలైన విషయాలందు నారాయణ భట్టు నన్నయకు తోడ్పడి వుండవచ్చు. అంతే కాని నారాయణ భట్టు వ్రాశాడనుట మాత్రం సమంజసం కాదు. నారాయణ భట్టు చేసిన సహాయాన్ని స్మరించుట కేవలం నన్నయ విశాల హృదయాన్ని వ్యక్త పరుస్తున్నది.

**3.4.2 మల్లియరేచన:** తెలుగున మొట్ట మొదటి ఛందో లక్షణ గ్రంథము కవిజనాశ్రయము. దీనిని మల్లియరేచన రచించాడు. ఈయన వైశ్యుడు. జైనమతస్థుడు. 'కవిజనాశ్రయుడు', 'శ్రావకా భరణుడు' అనేవి ఇతని బిరుదాలు. కవిజనాశ్రయంలో ఛందశాస్త్రానికి చెందినవే కాక వ్యాకరణానికి కూడా చెందిన దోషాలు ఇందు కూర్చబడ్డాయి. ఇంకా " సంజ్ఞాధి కారం, వృత్తాధికారం, జాత్యాధి కారం, షట్ప్రత్యయాధికారం, దోషాధికారం అని అయిదు భాగాలున్నాయి. దషాది కారంలో వ్యాకరణానికి చెందిన దోషాలు కూర్చబడ్డాయి. కవిజనాశ్రయంలో చాల చోట్ల రేచన తన పేరు చెప్పుకోవడం వల్ల అతని పేరు మీదనే నేటికి నిలిచి వుంది.

**3.4.3 వేములవాడ భీమ కవి:** "వచియింతు వేముల వాడ భీమన భంగి నుద్దండ లీల ఒక్కొక్క మాటు" అని శ్రీనాథునిచే ప్రశంస పొందిన వేముల వాడ భీమ కవి నన్నయ కాలం నాటి వాడని పెక్కు మంది అభిప్రాయం. శ్రీనాథుడు కాశీ ఖండంలో నన్నయ, తిక్కన కంటె ప్రథమంగా పేర్కొని స్తుతించుటను బట్టి నన్నయ కంటె పూర్వీకుడని మరి కొందరు భావించారు. 'శత కంధర రామాయణం రాఘవ పాండవీయం నృసింహ పురాణం బసవ పురాణం, సుమతీ శతకం, హర విలాసం మొదలయిన గ్రంథాలను రచించినట్లు లోకంలో వాడుక. భీమ కవి చెప్పినవని ప్రచారం పొందిన చాటు పద్యాలు లోకంలో అనేకం వున్నాయి. భీమ కవి రాజా కళింగ గంగును సందర్శించినట్లు అతడు చెప్పిన చాటు పద్యాలను బట్టి తెలుస్తుంది. భీమ కవి చెప్పిన చాటు పద్యములోని చారిత్రక పురుషుల కాలాన్ని బట్టి అతడు క్రీ.శ. 11వ శతాబ్ది చివరి పాదమునో 12వ శతాబ్ది ప్రథమ పాదమునో జీవించి ఉండవచ్చని చెప్పవచ్చు. కవిజనాశ్రయము భీమన కృతమని కొందరు రచన అని మరి కొందరి అభిప్రాయం. భీమ కవి గ్రంథాలు లభ్యం కాకున్న చాటువులను శ్రీనాథ, సూరనల ప్రశంసలను బట్టి వేముల వాడ భీమ కవికి తెలుగు సాహిత్యం సుస్థిరమయిన యశస్సు కలిగింది.

**3.4.4 పావులూరి మల్లన:** పావులూరి మల్లన కమ్మనాటి లోని పావులూరికి కరణము. ఇతనికి రాజ రాజ నరేంద్రుడు 'నరఖండవాడ' అనే అగ్రహారాన్ని దానంగా ఇచ్చినట్లు వీరేశలింగం పంతులు గారు 'ఆంధ్ర కవుల చరిత్రలో' వ్రాశారు. సంస్కృతంలో మహా వీరాచార్యులు రచించిన సార సంగ్రహ గణితమును పావులూరి మల్లన తెలుగులోకి అనువదించాడు. దీనికి పావులూరి మల్లన గణితం అని పేరు. దశ విధ గణితాలలో మొదటిది అయిన భిన్న ప్రకీర్ణమును మాత్రమే మల్లన అనువాదం చేశాడు. శాస్త్రీయ

గ్రంథంలో దీనికి చాల ప్రచారం వుంది. సార సంగ్రహ గణితము మంగళాచరణమును శ్రీ.తో. ప్రారంభించుటయే గాక ద్వితీయాధ్యాయ ప్రారంభం కూడా సంస్కృత శ్లోకంలో రచించాడు. మల్లన గణిత శాస్త్రం ఆంధ్ర జైన వాఙ్మయానికి సంబంధించినదని నిడుదవోలు వెంకటరావు తెలుగు కవుల చరిత్రలో చెప్పారు. కానీ పావులూరి గణితానికి, జైన వాఙ్మయానికి ఎట్టి సంబంధం వున్నట్లు కనబడదు. ఈ గణితంలో ఆనాటి కొలమానం, నాణెపు విలువలు, కొన్ని సాంఘిక విషయాలు వుండటం వల్ల చరిత్ర విద్యార్థులకు పనికి వచ్చే మంచి పుస్తకం.

**3.4.5 అథర్వణా చార్యుడు:** నన్నయకు సమకాలికుడు అథర్వణాచార్యుడు. ఆది పర్వము నుండి కాక విరాట పర్వంనుండి భారతాన్ని రచించటం వల్ల నన్నయ తరువాత వాడని అంటారు. ఈయన పద్యాలు సంస్కృత భూయిష్ఠమైనవి, ప్రౌఢమయినవి. ఈయన కవి మాత్రమే కాదు. లాక్షణికుడు కూడా " కారికావళి అనెడి వికృత వివేకం'' త్రిలింగ శబ్దాను శాసనం, అథర్వణ ఛందస్సు అను మూడు లక్షణ గ్రంథాలు ఈయన పేరుతో వ్యాప్తిలో ఉన్నాయి. అథర్వణ ఛందస్సులోని మరొక పద్యాన్ని బట్టి 28 యతి భేదాలను పేర్కోన్నట్లు తెలుస్తుంది. ఈయన నన్నయ సమకాలికుడు కాదని కొన్ని వాదాలు ఉన్నవి. తిక్కనకు సమకాలికుడు కొంచెం పూర్వమో అయి వుంటాడు.

## 3.5 మాదిరి ప్రశ్నలు:

1. నన్నయ భారతాంధ్రీకరణ విధానాన్ని వివరించండి.
2. నన్నయ కవితా శైలిని తెలియ జేయండి.
3. నన్నయ సమకాలికులను తెలియ జేయండి.
4. నన్నయ ఇతర రచననలను వివరించండి.

## 3.6 ఆధార గ్రంథాలు:


తెలుగు సాహిత్య సమీక్ష - డా॥. జి. నాగయ్య
నన్నయ వ్యాస పరిష్కారము - డా॥. జొన్నలగడ్డ మృత్యుంజయ రావు
ఆంధ్ర సాహిత్య చరిత్ర - పింగళి లక్ష్మీ కాంతము
మహా భారతము మానవ స్వభావ చిత్రణము - అప్పజోడు వెంకట సుబ్బయ్య
సంస్కృతాంధ్ర భారత భాగవతములు సదృశ్య విషయ పరిష్కార వివేచన - పప్పువేణు గోపాల రావు
నన్నయ తీర్చిన శకుంతల - డా॥ బండారు జ్యోతి స్వరూప రాణి


**డా॥. బండారు జ్యోతి స్వరూప రాణి**

పాఠం - 4

# శివ కవి యుగం

## 4.0 ఉద్దేశ్యం:

శివ కవుల గురించి, వారి కవితా విశేషాల గురించి, శివ కవి యుగం లక్షణాల గురించి వివరించటం ఈ పాఠం ఉద్దేశ్యం.

## 4.1 పరిచయం:

తెలుగు సాహిత్య చరిత్రలో నన్నయ, తిక్కన మధ్యకాలాన్ని శివ కవి యుగమని చారిత్రకులు నిర్ధారించారు. నన్నయ వైదిక మత ధర్మాన్ని, ఆర్ష విజ్ఞానాన్ని ఆనాటికి పునరుద్ధరించే ప్రయత్నమే భారతాంధ్రీకరణ. జైన, బౌద్ధ మతాల వల్ల వైదిక మతం క్షీణించి పోయే దశలో నన్నయ భారతం చిరుదీపమయింది. అనంతరం శైవం విజృంభించింది. దీనికి కొంత చారిత్రక చరిత్ర ఉంది.

రాజరాజ నరేంద్రుని కుమారుడు రాజేంద్ర చోళుడు (1063 - 1112) కులోత్తుంగ చోళుడనే బిరుదు నామంతో వేంగీ చాళుక్య, చోళ రాజ్యాలకు అధిపతిగా ఉన్నాడు. రాజమహేంద్ర వరము నుండి రాజ్యాన్ని తన తల్లి పుట్టిల్లయిన తమిళ దేశానికి మార్చాడు. అందువల్ల రాజ ప్రతినిధులతో రాజ్యం పాలింపబడింది. అందువల్ల తమిళ ప్రాబల్యం పెరిగి తెలుగు సాహిత్యానికి కాస్త అవరోధం ఏర్పడింది. రాజ ప్రతినిధులతో కుమ్మక్కయిన ద్రావిడ బ్రాహ్మణులు వేంగీ దేశంలో ఉన్నతోద్యోగాలను, అగ్రహారాలను రాయించుకున్నారు. దీనికి తోడు వేంగిని పాలించిన విక్రమ చోళుని అశ్రద్ధ వల్ల ఆ ప్రాంతం పశ్చిమ చాళుక్యుల వశమయింది. పశ్చిమ చాళుక్యుల ప్రతినిధులు వెలనాటి చోళులు. వీరు గుంటూరు మండలం లోని చందవోలు (చందోలు) నుండి తెలుగు దేశాన్ని పరిపాలించారు. వీరి సామంతరాజుల పరస్పర అసూయా ద్వేషాం వల్ల తెలుగు దేశం వెలనాడు - పలనాడు - పాకనాడు - కమ్మనాడు మొదలయిన మండలాలుగా విభక్తమయింది. దీనికి తోడు అప్పటికి ఉన్న బ్రాహ్మణ పండితుల్లోని శైవ - వైష్ణవ భేదాలు పరస్పర వైషమ్యాలకు, విరుద్ధ సంఘటనలకు, కల్లోలాలకు దారి తీసింది. ఇది రాజకీయ సంక్షోభానికి నాంది అయింది. క్రీ.శ. 1181 - 1182 మధ్య కాలంలో జరిగిన పల్నాటి యుద్ధం మరింత కక్షలు కార్పణ్యాలకు వర్గ విభేదాలకు మార్గమయింది. అందువల్ల అదే కాలంలో మల్లికార్జున పండితుడు, పాల్కురికి సోమన తదితరులు శైవ మత ప్రాధాన్యమైన గ్రంథ రచనకు, మత విస్తృత ప్రచారానికి కృషి చేశారు.

శైవ మతం భక్తి ప్రధానం. శైవుల్లో గురువు, దైవం, తల్లి, తండ్రి సర్వం శివుడే. శివ దీక్షను ఏ గురువయినా ఈయవచ్చు. కుల, మత, వర్గ భేదం లేదు. గురువు హస్తం శిష్యుని మస్తకం తాకినట్లయితే ఆనాటి నుంచి శివ దీక్ష పొందిన శిష్యుడు శివ భక్తుడయి దీక్షా దక్షుడవుతాడు. శైవంలో పాశుపతులు, కాపాలికులు, కాలాముఖులు - గోరక్ష నాథులు, రాసేశ్వరులు మొదలయిన తెగలున్నాయి. శైవ సంప్రదాయాలలో కాలాముఖ - పాశుపత శైవం ముఖ్యమైనవి. దీనికి తోడు దక్షిణ భారత దేశమంతా నయనారులు శైవ మతాన్ని వ్యాప్తి చేశారు. వీరినే అరువత్తిమూవుర (63) నయనార్లు అంటారు. వీరి గాథలు, బోధలు జన సామాన్యం పై ప్రగాఢ ముద్ర వేసింది. ప్రజలకు మతం పై విశ్వాసం, అభిమానం పెరిగింది. అది వీర శైవానికి దారి తీసింది. అది ఆవేశ పూరితంగా మారింది. వీరిలో బసవ జంగమ సంప్రదాయం అతి సామాన్యుడి వరకూ అందుబాటయింది. వీర శైవ ఉధృతికి ఇతర మతాలన్ని వెలవెల బోయాయి. వీర శైవం కర్ణాటక దేశంలో బసవేశ్వరుడు పునరుద్ధరణ చేశాడు. శివ కవి యుగంలో ప్రధానంగా పేర్కొనదగిన కవులు ముగ్గురు. నన్నెచోడుడు - పాల్కురికి సోమన - మల్లికార్జున పండితారాధ్యుడు.

## 4.2 నన్నెచోడుడు:

నన్నెచోడుడనే కవి ఉన్నాడని తొలిగా సాహిత్య ప్రపంచానికి చాటి చెప్పిన వాడు మానవల్లి రామకృష్ణ కవి. నన్నెచోడుడు అనే కవి క్రీ.శ. 940 ప్రాంతంవాడని 'కుమార సంభవము' అనే ప్రబంధమును రచన చేశాడని 1909లో ప్రకటించాడు. ఐతే పండితులు మాత్రం

నన్నెచోడుడు 1120 ప్రాంతం వాడని నిర్ధారణ చేశారు. నన్నెచోడుడనే కవే లేడని కుమార సంభవము మానవల్లి రామకృష్ణ కవి కృతమనే వాదం కూడా ఒకటుంది.

తెలుగు సాహిత్యంలో ప్రబంధ శబ్దం నన్నెచోడుడే ప్రయోగించాడు. అందువల్ల కుమార సంభవమే తొలి తెలుగు ప్రబంధము. పన్నెండాశ్వాసాలు గల ఉద్గ్రంధము. కృత్యాదిలో మంగళా చారణము, సత్కవిస్తుతి, కుకవి నింద ఉన్నాయి. ఇంకా ఉత్తమ ధర్మబోధ, ఉత్తమ కామము, అర్థ వివేచనము, మోక్షోపాయము వర్ణితమయినాయి. నన్నెచోడుడే' నా చెప్పంబూనినదివ్యకథా సూత్రం బెట్టిదనిన' అనే అధ్యాయాల వివరణ చెప్పాడు. 1. సతిజన్మం 2. గణపతి జననం 3. దక్షయజ్ఞ ధ్వంసం 4. పార్వతి జన్మ 5. శివుని ఉగ్ర తపస్సు 6. దేవతల కల్లోలం 7. మన్మధ దహనం 8. పార్వతి తపస్సు 9. శివ పార్వతుల కళ్యాణం 10. వాళ్ళ రతి క్రీడలు 11. కుమార జననం 12. తారకాసుర సంహారం.

పన్నెండు ఆశ్వాసాల్లో కొన్ని తక్కువగా, మరికొన్ని విస్తారంగా వర్ణించాడు. ఐతే నవరసాలు, అష్టాదశ వర్ణనలూ, ముప్ఫై రెండు అలంకారాలు గాక చిత్ర కవిత్వాలు, బంధ కవిత్వం ఇమిడ్చాడు. మొత్తం 2005 గద్య పద్యాలు, సంస్కృత వృత్తాలు 454, 895 దేశిజాత్యుప జాతులు, అధిక భాగం కంద పద్యాలున్నాయి. ప్రతి ఆశ్వాసం కంద పద్యంతోనే ప్రారంభమవుతుంది. ఒక ఆశ్వాసం ఏ విభక్తితో అంతం చేస్తే తరువాతి ఆశ్వాసం అదే విభక్తితో ప్రారంభం చేయడం ఈయన ప్రత్యేకత. ఇందులో శివుడు నాయకుడు. దివ్యుడు, ధీరోదాత్తుడు. నాయిక పార్వతి. నాయికా నాయకుల పరస్పర అనురాగం, విప్రలంభ సంభోగం ఇందులో వర్ణింపబడినాయి. చివరి రెండాశ్వాసాల్లో నాయకా నాయకుల ప్రసక్తి లేకున్నా వారికి సంబంధించిన ఇతి వృత్తం ఉంది. శృంగారము అంగిరసము. వీరము తక్కినవి అంగములుగా యధోచితముగా పోషింపబడ్డాయి.

నన్నెచోడుడే తొలిసారిగా జాను తెనుగు, వస్తు కవిత అనే పద ప్రయోగం చేశాడు.

## 4.3 జాను తెనుగు - నిర్వచనాలు - వ్యాఖ్యానాలు:

జాను తెనుగు అంటే అచ్చమైన తెనుగు అని అర్థం. ఈ జాను తెనుగు అనే మాటను ఆయా పండితులు అనేక విధాలుగా వ్యాఖ్యానించారు.

**చిలుకూరి నారాయణ రావు:** జాను అనేది చదునుకు రూపాంతరం. ఇది చతుర శబ్ద భావము. సర్వజన సుబోధకమైన తెలుగు అని వ్యాఖ్యానించారు.

**శ్రీ పాద లక్ష్మీపతి శాస్త్రి:** జాను తెనుగు అంటే అచ్చ తెనుగు అనీ, దేశీయ పదాలయిన తెలుగు మాటలే జాను తెనుగు అని వ్యాక్యానించారు.

**నేలటూరి వేంకట రమణయ్య:** జాను అంటే జాణ - అందమైన అని అన్నారు. జాను తెనుగు విశిష్ట పండితులు వ్యవహరించే మేలి తెలుగు అని వ్యాఖ్యానించారు.

జాను అంటే అందమైన, సౌందర్యమైన, ఇంపైన, స్పష్టమైన తెలుగని దేశీయమైన తెలుగని పండితులు తేల్చి చెప్పిన మాట. సాహిత్య ప్రయోగాల్లో కూడా జాను తెనుగు అనే ప్రయోగం కన్పిస్తుంది. 'పాల్కురికి సోమన' జాను తెనుంగున విన్నవించెదన్ అని వృషాధిప శతకములో పేర్కొన్నాడు.

'ఉరుతర గద్య పద్యోక్తుల కంటె

సరసమై బరగిన జాను తెనుగు'

అని కూడా బసవ పురాణావతారికలో అన్నాడు. నన్నెచోడుడే 'సరళములు గాగ భావములు, జాను తెనుంగున నింపు పెంపుతో బిరిగొన వర్ణనల్, అని చెప్పాడు.

**వస్తు కవిత:** నన్నెచోడుడు వాడిన మరో ప్రయోగం వస్తు కవిత. వస్తు కవిత అంటే 'సంస్కృత చంపూ లక్షణము ననుసరించి వ్రాయబడిన గద్య పద్యాత్మక కావ్యము'. పండితులు ఆయా విధాలుగా వ్యాఖ్యానించారు.

**అమరేశం రాజేశ్వర శర్మ:** వస్తు శబ్దమునకు ప్రకృతి యని అర్థము. కాబట్టి వస్తు కవిత అనునది 'ప్రకృతిని గూర్చి వర్ణించు కవిత'

**ఖండవల్లి లక్ష్మీరంజనము:** 'వస్తు కవిత్వమనగా వర్ణనాత్మకమైన ఫణితియని ఈతని భావమై యుండును'. ఇదే విధంగా కోరాడ రామ కృష్ణయ్య, తిమ్మా వజల కోదండ రామయ్య కూడా తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

వస్తు కవిత అనే ప్రయోగం కన్నడంలో తొలిగా కన్పిస్తుంది. నృప తుంగుడు (814 - 817) వస్తు నిస్తర రచన, పంపకవి (941) విక్రమార్జున విజయము నందు వర్ణక - వస్తు విద్య, నాగవర్మ - (క్రీ.శ. 10వ శతాబ్ది) వస్తు కవి అని చెప్పుకున్నాడు. కన్నడములో వస్తుక - వర్ణక రెండు కావ్య భేదాలున్నాయి.

ఈ విధంగా నన్నెచోడుడు జాను తెనుగు - వస్తు కవిత అనే పద ప్రయోగాలు నూతనంగా చేశాడని పండితులు కుమార సంభవము ఆధారంగా చెప్పారు.

ఏది ఏమయినా కుమార సంభవము ఆద్యంతమూ ధర్మార్థ కామ మోక్షాలయిన చతుర్విధ పురుషార్థాలకు ప్రతీక. శివ మహిమ తెలియ జేసే గ్రంథం. ఈ కథకు మూలము శివ పురాణము. స్కంధ, వాయు, బ్రహ్మాండ పురాణాల్లోను భారత రామాయాణాల్లో సంగ్రహంగా ఉంది. సంస్కృత కాళిదాసు కుమార సంభవము రేఖా మాత్రంగా స్వీకరించినా భాషాంతరీకరణం కాదు. స్వతంత్ర కావ్యము. అయితే ప్రబంధాను కూలమైన మార్పులు ఉన్నాయని అంగీకరించక తప్పదు.

## 4.4 శివ కవుల ప్రత్యేకతలు:

1. శివుడు మినహా యితరుల యితి వృత్తాంతాలను ఏ కవీ కావ్య వస్తువులుగా గ్రహించరు.
2. మతానికి కవిత్వానికి సన్నిహిత సంబంధం కలిగించి శైవ మత ప్రచారానికి, శైవోద్ధరణకు కృషి చేశారు.
3. వారి జీవితాలతో పాటు కవిత్వాన్ని శివార్పితం చేసిన సమాజ కవులు వీరు.
4. శైవేతర కవుల్లో ఎంత సమర్థులున్నా వారిని స్మరించరు. అనుకరణ యోగ్యుడు కాకపోయినా, అల్పుడయినా శివ కవులనే అనుసరించి అనుకరిస్తారు. వీరి కవిత్వంలో పరమత నింద అధికం.
5. ఛందో వ్యాకరణాది నియమోల్లం ఘనకు వెనుదీయ లేదు.
6. జాను తెనుగు, వస్తు కవిత అనే సంప్రదాయాలను ప్రవేశ పెట్టారు. అదే పద్ధతిలో అచ్చ తెలుగు పదాలను, మారుమూలలనున్న తెలుగు పలుకుబడిని కావ్యాల్లో అక్షర బద్ధం చేశారు. శైవ వేదాంతాన్ని దేశీయ పరం చేశారు.
7. శైవ భక్తులు ఎంత అల్పులయినా వారి గాథలను, జీవితాలను అక్షర బద్ధం చేసారు. కుల గోత్రాలకు అతీతంగా అన్ని వర్గాలను ఆకర్షించారు. స్త్రీ పురుష భేదం రూపు మాపారు.
8. వీరి కావ్యాలు నిత్య పారాయణకు ఉపయోగపడే విధంగా రచనలు చేశారు.
9. వీరి రచనలు దాదాపు స్వతంత్ర కావ్యాలుగానే రచన చేశారే తప్ప అనువాద సాహిత్యం కాదు.

తెలుగు సాహిత్య చరిత్రలో శివ కవులది ప్రత్యేకమైన రచనగా కన్పిస్తుంది. వారి వ్యక్తిత్వం రచనా విధానం కూడా ప్రత్యేకతను సంతరించుకున్నందు వల్ల శైవులు కాని మార్గంలోకి వీరు రాలేదు. స్నేహ హస్తాన్ని అందించలేదు. అందుకే వీరిది ప్రత్యేకమైన వర్గమై సమాజంలో ఒక విచిత్ర వర్గమై నడిచింది.

## 4.5 పాల్కురికి సోమనాధుడు:

సాహిత్యం ద్వారా సమాజాన్ని, సామాజిక జీవితాన్ని సాహిత్యం ద్వారా చూపిన సమాజ కవి, శైవ కవి పాల్కురికి సోమనాధుడు. ఆయన సాహిత్యమంతా ప్రజల కోసమే. శైవ మత వ్యాప్తి కోసమే. అందునా ప్రజా వాణిని, ఆ బాణిని అందుకున్న వాడి గల కవి సోమనాధుడు.

ప్రజల్లో ఉన్న జాన పద సాహిత్య ప్రక్రియలోని తరువోజను మార్పు చేశాడు. ఆడవాళ్ళ వడ్లు దంచే చోట పాడే తరువోజ ఛందాన్ని రెండు భాగాలు చేసి దానికి ద్విపద అనే నామకరణం చేసి సాహిత్యాన్ని సమాజపరం చేశాడు.

ఉరుతర గద్య పద్యోక్తుల కంటె
సరసమై బరగిన జాను తెనుగు
చర్చింపగా సర్వ సామాన్యమగుట
కూర్చెద ద్విపదలు కోర్కెదైవార

అని బసవ పురాణములో పేర్కొన్నాడు.

కాకతీయ సామ్రాజ్యాన్ని గణపతి దేవ చక్రవర్తి ఓరుగల్లు రాజధానిగా పాలిస్తూ ఉండే రోజుల్లో రాజధానికి దాదాపు పన్నెండు క్రోసుల దూరంలో ఉన్న పాల్కురికి అనే గ్రామంలో దాదాపు క్రీ.శ. 1240 ప్రాంతాల్లో సోమనాధుడు జన్మించాడు. తండ్రి విష్ణు రామ దేవుడు, తల్లి శ్రియా దేవమ్మ. సంప్రదాయమైన కుటుంబంలో జన్మించి వేద వేదాంగాలు అధ్యయనం చేశాడు. కర స్థలం విశ్వనాధయ్య అనే గురువు దగ్గర కవితా రహస్యాలు తెలుసుకున్నాడు. ఉడుకు నెత్తురు ఉబికే వయస్సులో సామాజిక స్థితిని తెలుసుకున్నాడు కాబట్టి తన కవిత్వాన్ని, కావ్య రచనను సమాజ పరం చేయడానికి సిద్ధమయ్యాడు. అదే అతన్ని శైవ మత స్వీకారానికి దారి తీసింది. కుల మతాలు లేని శైవం, స్త్రీ, పురుష భేదం లేని శైవం ఆయన్ని ఆకర్షించింది. అందుకే గురు లింగార్యుడనే గురువు వద్ద శివ దీక్ష పొందాడు. దీక్షా కాలంలో గురు హస్తం శిష్యుని మస్తకాన్ని తాకుతుంది. వెటనే శిష్యుడు మరో జన్మ ఎత్తినట్టు లెక్క. ఈ జన్మలో గురు హస్తం నుంచి శిష్యుడు ఉద్భవిస్తాడు. గురుహస్తమే తల్లి, తండ్రి సర్వమూను. గురు గోత్రమే తన గోత్రం. అదే శైవం. తనదీక్షా సమయంలో గోడగి త్రిపురారి అనే భక్తుని పరిచయం జరిగింది. ఇద్దరూ పండితయ్యగారి శివ తత్త్వ సారాన్ని క్షుణ్ణంగా చదివారు. అందుకే ఒకటయ్యారు. అదే వారి స్నేహానికి గుర్తుగా సోమన తన తొలి గ్రంథమైన అనుభవ సారం గోడగి త్రిపురారికి వినిపించి ప్రథమ శ్రోతను చేశాడు. సోమన తెలుగు వారి కోసం తెలుగు ఛందాన్ని ఉపయోగించి ద్విపద ద్వారా లోకాన్ని మేలుకొలిపాడు.

"తొలి కోడి కను విచ్చి నిలిచిమై వెంచి
జలజలా రెక్కలు సడలించి నీల్గి
గ్రక్కున గాలార్చి కంఠంబు విచ్చి
ముక్కున నీకెలు చక్కొల్పి కడుపు
నిక్కించి, మెడసాచి నిక్కిమున్సాచి
కొక్కరో కుర్రని కూయకమున్న"

అంటూ తెలుగు తోట మొదటగా తెలుగు కంఠమెత్తిన వాడు పాల్కురికి సోమన. ఆయన రచనలు దాదాపు 30 ఉన్నాయి. తెలుగు, సంస్కృత, కన్నడ, తమిళ, మరాఠి, హిందుస్తాని భాషలు నేర్చినవాడు. తన రచనలు మాత్రం తెలుగు, సంస్కృతం, కన్నడ భాషల్లో రచించాడు.

పాల్కురికి సోమన కృతులను మొత్తం మూడు శాఖలుగా విభజించవచ్చు.

1. పద్య కృతులు
2. లఘు కృతులు

3. ద్విపద కావ్యాలు

**1. పద్యకృతులు:** పద్యకృతుల్లో అనుభవసారం, వృషాధిప శతకం, చతుర్వేద సారం, చెన్నమల్లు సీసములు.

**అనుభవసారము:** ఇది పాల్కురికి సోమన తొలి కృతి. ఇది గోడగి త్రిపురారి అనే స్నేహితునికి శ్రోతగా చేసుకున్నాడు. ఇది కథా రూపమైన కావ్యం కాదు. ఇందులో మొత్తం 243 పద్యాలున్నాయి. కంద పద్యాలు 162, సీస పద్యాలు 23, చంపకమాలలు 23, ఉత్పల మాలలు 16, మత్తేభములు 5, శార్దూలములు 5, తరువోజలు 2, తేటగీతి 1, మహాస్రగ్దర 1, త్రిభంగి 1, క్రౌంచ పదము 1, మాలిని 1, వనమయూరము 1.

ఇందులోని సీస పద్యాలన్నింటికీ ఎత్తుగీతి, ఆటవెలది పద్యాలున్నాయి. తేటగీతి మాత్రం ప్రత్యేకంగా ఒకటి మాత్రమే కన్పిస్తుంది. ఇక్కడ మరో కొత్త ఛందస్సు తెలుసుకోవచ్చు. త్రిభంగి అనే ఛందము ఇంత వరకు సోమన తప్ప మరెవరూ ప్రయోగించలేదు.

అనుభవసారము శ్రీ తో ప్రారంభమై శ్రీ తోనే ముగుస్తుంది. ఇందులో కథా రూపమైన ఇతి వృత్తం లేదు. గురుభక్తి మహిమ, శివ పూజా విధానం, లింగార్చన విధి, జంగమ సేవ, భావ క్రియార్చన విధి, షటీస్థల స్వరూపము మొదలయిన వీర శైవ విశేషములున్నాయి. అనుభవసారం బనగా

"మనసి జహరు శుద్ధ భక్తి మార్గము వేదో
క్త నిరూఢి బురాణ రహ
న్య నియుక్తిని వివరింతు నదియెట్లన్నన్ "

అని అంటాడు. ఇది శుద్ధ శివ భక్తి మార్గము. పైగా 'శివుని మహిమ తెల్పినట్టి మల్లికార్జున పండితయ్య గారి దలతు నను దినంబు' అని అంటాడు. ఇక్కడ బసవని వేరెక్కడా తలచుకోలేదు.

అనుభవ సారములోని సీస పద్యాలు ఏ పాదానికాపాదం విడివడి ప్రత్యేకంగా కన్పిస్తుంది. ఇది భవితలో శ్రీనాథునికి మార్గదర్శకమయిందనీ భావించవచ్చు.

"గురుమూర్తి యను కల్పతరువొప్పు
దత్తరు, మూలంబు కరుణాన్వితల దృష్టి
యాద్యశాఖోన్నతి యాజ్ఞ మహత్య మ
య్యుప శాఖ లాదితత్త్వోది తములు
పల్ల వంబులు శ్రాతుల్ ప్రసవముల్
మంత్రముల్, ఫలము లింగంబు తత్పరి మళంబు
జంగమ బోధల సారంబు నిత్య ప్ర
సాదాదిక నయనోత్సవము ముక్తి
యగుచు నాది కాది యనుచు నఖండితం
యగుచు సకల నిష్కళాంగ మగుచు
నభిమతార్థ దాయి యగుచు శిష్యా వళిం
దన్ను జేర్చు కొనుచు దాత యగుచు"

ఈ విధంగా సాగే సీస పద్య నడక భావితర కవులకు మార్గదర్శకమైనదని భావించవచ్చు. శైలి సంస్కృత పద సమ్మి శ్రమంగా ఉంది. తెలుగు నుడికారపు పెంపు కూడా కన్పిస్తుంది.

తన తొలి రచనలో సోమన వాడిన ఛందస్సుల్లో ద్విపద లేదు. ఐతే ద్విపదకు పూర్వ రూపమై తరువోజలు రెండు ఉన్నాయి. ఏ

ద్విపద ఐతే ఉత్తరోత్తరా చేపట్ట బోతున్నాడో దాని పూర్వ రూపమైన తరువోజతో ముగిస్తూ మంగళ మహా శ్రీ లు వాడాడు. ఆ తర్వాత అతను తరువోజల ప్రయోగించనూ లేదు.

**వృషాధిప శతకము:** బసవా! బసవా! వృషాధిపా అనే ఒకే మకుటముతో 108 చంపకోత్పల మాలలతో రచింపబడిన శతకమిది. మకుట నియమమును బట్టి సంఖ్యా నియమమును బట్టి లభించిన శతకాలలో ఇది మొదటిది. ఇది పూర్తిగా శివస్తుతికి సంబంధించింది. మొదటి 49 పద్యాలు శబ్దాలంకారాలతో అంత్య నియమ యుక్త పదగ్రస్తంగా ఉన్నాయి. 50 - 64 వరకూ సంస్కృతాంధ్ర, ద్రావిడ. కర్ణాట, మహారాష్ట్ర భాషల్లో శివుని స్తుతించాడు. దీని వల్ల ఈ కవి బహు భాషా జ్ఞానం కలవాడని తెలుస్తుంది. పైగా భగవంతుని ఏ భాషలో స్తుతించినా ఫల కృతి ఒకటేనంటాడు. ఈ బహు భాషా పద్యాలలో మరో వినూత్నమైన పద్ధతి ప్రవేశ పెట్టాడు. దీన్ని మణి ప్రవాళము అంటారు. 59వ పద్యంలో 'విన్ వరివస్క రోమ్య హమ్మనుచు మణి ప్రవాళమున నంకన సేయుదు' నని పేర్కొన్నాడు. ఇది సంస్కృతాంధ్ర భాషల్లో ప్రస్తుతించిన పద్యం. ప్రవాళము అంటే పగడం, చిగురు అనే అర్థాలు. ఎరుపు - తెలుపు కలిసి ఒక దానితో మరొకటి కలిసి మెలిసి ప్రత్యేక వర్ణంగా సముజ్జ్వలంగా భాసించడం ఇందులోని విశేషం. ఒక భాష మణి అయితే మరో భాష చిగురు వలె యిమిడి పోవడం. అదే విధంగా రెండు భాషలు కలిపి ఒకే బంధంలో యిమిడి పోవడం ప్రత్యేకత. సంస్కృతాంధ్రాలయితే సాధారణం అనుకోవచ్చు. కాని ద్రావిడాంధ్ర, సంస్కృత మిశ్రమంతో ఒక పద్యం, సంస్కృత ద్రావిడ కర్ణాటకాంధ్ర మహారాష్ట్ర భాషల్లో కలిపి ఒక పద్యం, కర్ణాటక సంస్కృత భాషల్లో మరో పద్యం రచించాడు. ప్రత్యేకించి మరో అచ్చ తెలుగు పద్యం కూడా ఉంది.

" బలుపోడ తోలు చీరయును పాపెసల్ గిలు పారు కన్నువె
న్నెల తల చేదు కుత్తుకయు నిండిన వేలుపు టేఱు వల్లుపూ
సలు కల టేని వెంకవని జాను తెనుంగున విన్నవించెదన్
బసవా! బసవా వృషాదిపా "

అనే పద్యంలో జాను తెనుగు అనే పద ప్రయోగంతో వాడాడు సోమన.

అనంతరం చివరిగా ముప్ఫై అయిదు పద్యాలు శివభక్తుల కథలున్నాయి. ప్రాసంగికంగా పేర్కొన్న ఈ కథలు బసవ పురాణం నుంచి, పండితారాధ్య చరిత్ర నుంచి స్వీకరించినవే. వృషాధిప శతకము భాష, భావం, భక్తి ప్రత్యేకతను సంతరించుకుంది. పైగా యమకాను ప్రాసాది శబ్దాలంకార వైచిత్రి, అష్ట భాషా ప్రావీణ్యము కన్పిస్తుంది.

**చతుర్వేద సారము:** వీర శైవము శృతి, స్మృతి, సమ్మతి అని నిరూపించడం కోసం చతుర్వేద సారమును పాల్కురికి సోమన రచించాడు. ఇది బసవ లింగ అనే మకుటముతో 357 సీస పద్యాల్లో చెప్పిన శతకం. దీన్నే బసవ లింగ శతకం అని కూడా అంటారు. ఇందులో బసవ శబ్ద విచారము బసవనామోచ్చారణ మహిమ, శివాధిక్యము, విభూతి రుద్రాక్ష లింగ ధారణ మహాత్మ్యం మొదలయిన శైవ మత సంబంధించిన విషయాలున్నాయి. నన్నయ భారతం లోని అవతారికలో 'ధర్మతత్త్వ జ్ఞులు ధర్మశాస్త్రంబని ' అనే పద్యానికి 'వైదికులిది శుద్ధ వైదికంబని ' అనే పద్యం అనుకృతిగా భావించవచ్చు.

**చెన్నమల్లు సీసములు:** సోమనాథుని ఇష్ట దైవం శ్రీ శైలంలోని మల్లికార్జునుడు. చెన్నమల్లుడు శ్రీ శైల మల్లికార్జునుడే. ఇందులో మొత్తం 32 సీస పద్యాలున్నాయి. రెండు కంద పద్యాలు ప్రక్షిప్తాలని అంటారు. సోమన శివైక్యము చెందేటప్పుడు 32 మెట్లు దిగుతూ జీవ సమాధిలోకి వెళ్ళేటప్పుడు 32 సీస పద్యాలు చెప్పాడనే గాథ ప్రచారంలో ఉంది. కాని ఈ పద్యాలు ఆయన నడిమి వయస్సులో చెప్పాడని బండారు తమ్మయ్య గారి అభిప్రాయం.

**లఘు కృతులు:** సోమన లఘు కృతుల్లో 13 లభిస్తున్నాయి. వాటిల్లో 5 గద్యలు, 1 రగడ, 2 ఉదాహరణలు, 1 పంచకము, 2 అష్టకములు, 2 స్తవములున్నాయి. అన్నీ బసవేశ్వరుని భక్తి తన్మయత్వంతో కీర్తించినవే. స్తుతికి అనుకూలంగా ఉండేందుకు రచించిన లఘు కృతులుగా చెప్పవచ్చు.

**గద్యలు:** పంచ ప్రకార గద్య, నమస్కార గద్య, అక్షరాంక గద్య, అష్టోత్తర శతనామ గద్య, శరణు బసవ గద్య అనేవి సంస్కృతంలో రచించాడు. ఆంధ్ర ఛందో లక్షణాల కన్నా వీటిల్లో కొంత విలక్షణత ఉంది. ఇవి ప్రాచీన కర్ణటాంధ్ర గీర్వాణ ఛందస్సంప్రదాయాల ననుసరించిన కృతులుగా పేర్కొంటారు.

**రగడలు:** రగడ అనేది ఒక సాహిత్య ప్రక్రియ. కన్నడంలో మందా నిలము, లలితము, ఉత్సవము అని మూడు రకాల రగడలున్నాయి. ఐతే తెలుగులో మాత్రంఒకే ఒక పద్ధతిలో సాగిన ఈ రగడలో 108 పాదాలున్నాయి. మొదటి 78 పాదాలు ద్విపాద్యాంత ప్రాస నియమం ఉంది. తరువాత 14 పాదాలు ద్విపద పంక్తులు లాగ ప్రాస నియతి ఉంది. తర్వాతి 8 పాదాల్లో ఈ నియమంలో కొంత విలక్షణ కన్పిస్తుంది. బసవ రగడ ప్రారంభంలో ఉత్సాహ వృత్తము, ప్రతి పాదాంతంలో శరణు బసవ అనే మకుటము ఉన్నాయి. ఆద్యంతాల్లో రెండు కన్నడ పద్యాలుండటం విశేషం.

సోమన రచించిన బసవ రగడ మాత్రమే ప్రస్తుతం లభిస్తుంది. ఐతే బసవాఢ్యరగడ, గంగోత్పత్తి రగడ, సద్గురు రగడలను రచన చేసినట్లు పెడుపర్తి సోమన చెప్పినా అవి అలభ్యం.

**ఉదాహరణ వాఙ్మయం:** తెలుగు సాహిత్యం నుండి సంస్కృతం లోనికి వెళ్ళిన సాహిత్య ప్రక్రియ ఉదాహరణ వాఙ్మయం. మాత్రా గణ బద్ధమైన పద రచన యిది.

ఈ ప్రక్రియలో ఎనిమిది విభక్తులతో ఎనిమిది వృత్తాలు, ఎనిమిది కళికలు, ఎనిమిది ఉత్కళికలు, చివర సార్వభక్తిక పద్యము కూర్చి రచింపబడి ఉంటుంది.

ఈ వాఙ్మయం కేవలం స్తుతి రూపకమైనది. పద్యాలు రాగ ప్రధానాలు. బసవేశ్వరుని మహిమ వర్ణించే ఈ ప్రక్రియకు సోమనాథుడే ఆధ్యుడని పండితుల నిర్ధారణ.

**అక్షరాక పద్యాలు:** తెలుగు అక్షర మాల అయిన అ నుండి క్ష వరకు ప్రతి పద్యం ప్రారంభంలో ఒకే అక్షరంతో రాసే ప్రక్రియ యిది.

ఈ పద్ధతి కూడా తెలుగులో ప్రత్యేకంగా ఉంది.

**పంచకం:** 5 మాలినీ వృత్తాలతో రాసిన బసవ స్తోత్రాలు పంచకముగా ఉన్నాయి.

**అష్టకములు:** ఎనిమిది పద్యాల స్తోత్రాన్ని అష్టకం అంటారు. సోమన సంస్కృతంలో ఎనిమిది వసంత తిలక వృత్తాల్లో వృషభాష్టకము, తెలుగులో ఎనిమిది మాలినీ వృత్త పద్యాల్లో బసవాష్టకము రచించాడు.

**స్తవములు:** సోమన రచనల్లో సోమనాథ స్తవము, భక్త స్తవములు సులభ శైలిలో రచించాడు. ఇవి ప్రార్థనకు అనుకూలమైనవని అంటారు.

**సోమన సంస్కృత కావ్యాలు:** సోమన సంస్కృత కృతుల్లో సోమనాథ భాష్యం, రుద్ర భాష్యం, బసవోదాహరణం, వృషభాష్టకం, త్రివిధ లింగాష్టకం మొదలయినవి లభిస్తున్నాయి.

**కన్నడ భాషా కృతులు:** సోమన రచించిన కన్నడ రచనల్లో సద్గురు రగడ, చెన్న బసవ రగడ, అక్షరాంక పద్యాలు, శరణు బసవ రగడ, బసవ లింగ నామావళి, శీల సంపాదనం, శివ గణ సహస్రమాల అనేవి ముఖ్యం.

**ద్విపద కావ్యాలు:** ద్విపద మాత్రా ఛందస్సుకు చెందిన రెండు పాదాలు గల రచన. ద్విపద దేశీ ఛందస్సు. ద్విపదలో ప్రాస లేకపోతే మంజరి అవుతుంది. అందులో రెండు పాదాలను ఒక దాని తర్వాత మరొకటి రాస్తే తరువోజ అవుతుంది.

పాల్కురికి సోమన రాసిన ద్విపద కావ్యాల్లో ప్రసిద్ధమైనవి రెండు. 1. బసవ పురాణము 2. పండితారాధ్య చరిత్రము.

ఈ రెండూ స్వతంత్ర రచనలు. ఐతే సోమన మల్లమ దేవి పురాణము కూడా రచించాడని అంటారు. ఇది అలభ్యం.

**బసవ పురాణము:** తొలి తెలుగు ద్విపద శైవ పురాణము బసవ పురాణము. ఇది ఏడు ఆశ్వాసాల రచన. బ్రౌను ప్రకారము మొత్తం 6288 ద్విపదలున్నాయి. మహా పురుషుడయిన బసవని చరిత్రమే ఇందలి ప్రధాన కథ. ఈ పురాణానికి కథా శ్రోత గొబ్బూరి సంగనా మాత్యుడు. ఈ పురాణం సంప్రదాయ సిద్ధమైన శ్రీ తోనే ప్రారంభం అయింది. బసవని పూర్వావతారములు, జననము, వ్యవహారదక్షత, మహాత్మ్యములు, వీర శైవ ధర్మ రక్షా ప్రచారము, జంగమ సేవ, లింగైక్యము మొదలయిన విషయాలతో పాటు 75 మంది భక్తుల కథలు కూడా ఉన్నాయి.

ప్రథమాశ్వాసం కైలాస వర్ణనతో ప్రారంభమవుతుంది. శివుడు నందిని భూలోకంలో జన్మించి శైవ మతోద్ధరణ చేయమంటాడు. బసవన్న జన్మిస్తాడు. ఉపనయనం అక్కర లేదని తలిదండ్రులతో వాదిస్తాడు. శివుడే ప్రత్యక్షమై బసవన్నకు శైవ ధర్మాలు ఉపదేశిస్తాడు. రెండవ ఆశ్వాసంలో బసవన్న శివాచారం, మంత్రి కావడం, వంగ కాయలను లింగ కాయలు చేయడం, జొన్నలను ముత్యాలు చేయడం మొదలయిన శివ భక్తుల కథలున్నాయి. మూడవ ఆశ్వాసంలో బసవన్న తన భార్య చీర విప్పించి జంగాల కిచ్చిన కథ, ఇతర మూర్ఖ భక్తుల కథలున్నాయి. నాలుగవ ఆశ్వాసంలో మడివాల మాచయ్య కథ. ఇతను రజకుడు. గొప్ప భక్తుడు. ఇతని మాటను బసవన్న మన్నించి ఆచరించడం కథలో ముఖ్య భాగం. ఐదవ ఆశ్వాసంలో కిన్నెర బ్రహ్మయ్య, కలకేత బ్రహ్మయ్య, మోళిగ మారయ్య, తెలుగు జొమ్మయ్య మొదలయిన భక్తుల కథలున్నాయి. ఆరవ ఆశ్వాసంలో కూడా భక్తుల కథలే ఎక్కువ. ఏడవ ఆశ్వాసంలో భక్తుల కథలతో పాటు బసవన్న విషమారగించి అరిగించుకోవడం, బిజ్జలునితో విరోధం, బసవన్న నిర్యాణం మొదలయినవి ఉన్నాయి.

వీర శైవ ప్రతిపాదితమైన ఈ పురాణాన్ని వేముల వాడ భీమకవి షట్పది వృత్తాల్లో కన్నడంలోకి అనువాదం చేసాడు. తెలుగు బసవ పురాణము శైలి సులభంగా, చరిత్ర ప్రౌఢంగా కన్పిస్తుంది. సందర్భాన్ని బట్టి సమాస భూయిష్ఠ రచన గావించాడు.

**పండితారాధ్య చరిత్ర:** ఇది పాల్కురికి సోమన చివరి కృతి. ముదిమి వయస్సులో ద్విపదల్లో రాసిన ప్రౌఢ పురాణమిది. ఇది స్వతంత్ర గ్రంథము. ఇది మొత్తం 11810 ద్విపదలతో కూర్చిన చిన్న సైజు విజ్ఞాన సర్వస్వము అని కొనియాడ బడింది. దీనికి 348 పుటల ఉపోద్ఘాతము రాసిన చిలుకూరి నారాయణ రావు, సోమన కున్న గుణాలు 25 అని వివరించారు.

పండితారాధ్య చరిత్రలో మొత్తం ఐదు ప్రకరణాలున్నాయి. 1. దీక్షాప్రకరణము, 2. పురాతన ప్రకరణము, 3. వాద ప్రకరణము, 4. మహిమ ప్రకరణము, 5. పర్వత ప్రకరణము.

దీక్షా ప్రకరణంలో ఋక్, యజు, స్సామ, అథర్వణ వేదాల నుండి, ఉపనిషత్తుల నుండి, సంహితల నుండి, శాస్త్రాల నుండి, పురాణాల నుండి గ్రహించినవిభూతి, రుద్రాక్ష లింగధారణ, లింగార్చన విశిష్టమైన శైవ దీక్ష సవైదికమని నిరూపించిన ప్రకరణమిది. ఇందులో అస్పృశ్యతను ప్రతిఘటించిన పోరండ్ల సూరసానమ్మ చరిత్ర ప్రత్యేకంగా ఉంది. పురాతన ప్రకరణంలో మల్లికార్జున పండితుని మహిమను సమర్థించే మాది రాజయ్య, కదిరి వేతుయ్య, చేటల వేమయ్య, పిళ్ళనయనారు, వెలమడు మొదలయిన పురాతన భక్తుల కథలున్నాయి. వెల్లగొండ మహా దేవయ్య అనే భక్తుని ఖండిత పాదాలు శివ లింగ సన్నిధిలో ప్రమిదలోని తైల మథించినందు వల్ల తిరిగి అతికిన కథ ఉంది.

వాద ప్రకరణంలో బౌద్ధ గురువున్న సభలో మల్లికార్జున పండితుడు వేద, కాల, వేదాంత, సాంఖ్య, యోగ, చార్వాక, బౌద్ధ, జైన వాదాలను సృతి, స్మృతి, పురాణేతిహాసాలతో ప్రామాణికంగా ఖండించి శివుని సర్వాధికృతను స్థాపించిన చరిత్ర ఉంది. మహిమ ప్రకరణంలో రేమయ్య దేవాయ అనే బౌద్ధ గురువును చంపి తానే శిక్షను విధించుకొని వెలనాటి చోడుని వల్ల అంధుడై చందోలు నుండి అమరావతి వెళ్ళి తిరిగి తన చూపు పొందడం ముఖ్యమైన గాథ. కళ్యాణ కటకములో నిడుగుడుమల గ్రామంలో బసవేశ్వరుడు పంపిన వీభూది వల్ల కన్నడంలో కవిత్వం చెప్పి ఆయా పూజలందుకున్న కథలున్నాయి. చివరి ప్రకరణమయిన పర్వత ప్రకరణంలో శ్రీ శైలము వచ్చి శిష్యుడయిన దోనయ్యతో మల్లికార్జున దర్శనము చేసుకొని, సమస్త శైవ ప్రదేశములను చూచి జన్మ ధన్యమైందని శివైక్యము

చెందడం ఇందలి గాథ. ఇంకా జంగముల, వృద్ధమునుల, శివ యోగుల, పుణ్యాంగనల, జోగుల, పిచ్చుక కుంటుల, చెంచుల, తదితరుల కథలున్నాయి.

కావ్యపరంగా చూస్తే రసములు 9, వర్ణనలు 18, అలంకారములు 36, అర్థ భావములు 72, పురుషార్థములు 4, అనుభవములు 18, సాత్విక భావములు 8, సంఖ్యా భావములు 39, స్థాయీ భావములు 9, మొత్త 72 కలసి ఉన్న ఈ గ్రంధం నవరస భరిత సమన్వయం.

ఈ విధంగా సోమనాధుడు తన సాహిత్యాన్ని శైవ మత పరంగా రచించి సాహిత్య, సామాజిక వృద్ధికి కృషి చేసాడు. ఇక్కడ ఒక విషయం గమనించాలి. సోమన రచనలన్నీ శైవ మత వృద్ధికి, నిత్య పారాయణానికి ఉద్దేశించినవి. పరమత ఖండనములో కొంత వ్యతిరేకత కన్పించినా, తన వీర శైవ ఆవేశాన్ని మాత్రం ఎక్కడా తగ్గించుకోలేదు. అన్నింటి కన్నా శైవ ధర్మాలను, స్త్రీ పురుష బేధాలను రూపుమాపి సమసమాజ స్థాపకుడుగా కన్పిస్తాడు, ఒక్క పరమత దూషణంలో తప్ప. అయితే పాల్కురికి సోమన లక్ష్య సాధకుడుగా కన్పిస్తాడు. తెలుగు భాషను, ప్రాచీన గ్రామీణ మాండలిక పదాలను యధోచితంగా అక్షర బద్ధం చేసి తెలుగు భాషకు గౌరవం కల్పించాడు. బహు భాషా పాండిత్య ప్రకర్ష గల కవుల్లో పాల్కురికి సోమన ఒకడు. తెలుగు కవుల్లో తన ప్రత్యేకతను తరతరాల వారికి సాహిత్యం ద్వారా ప్రజలకు అందించిన నిత్య శివ భక్తుడు. నిరంతర శైవ స్తుతి పారాయణాసక్తుడు. ఆదర్శ భక్తుడు పాల్కురికి సోమన.

**ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి**

## 4.5 మాదిరి ప్రశ్నలు:

1. తెలుగు సాహిత్యంలో శివ కవుల పాత్రను వివరించండి.
2. పాల్కురికి సోమన సాహిత్య వికాసాన్ని వివరించండి.
3. శివ కవుల ప్రత్యేకతను తెలియజేయండి.

## 4.6 ఆధార గ్రంథాలు:


ఆరుద్ర - సమగ్ర ఆంధ్ర సాహిత్యము

డా॥. జి. నాగయ్య - తెలుగు సాహిత్య సమీక్ష

శ్రీరామమూర్తి కొర్లపాటి - తెలుగు సాహిత్య చరిత్ర

ఆంధ్రప్రతికలోని వ్యాసాలు

జనవరి 14, 1990 - డా॥. జి. కృపాచారి., డా॥. బి. జ్యోతి స్వరూప రాణి

ఫిబ్రవరి 4, 1990

పాఠం - 5

# రంగనాథ రామాయణము

## 5.0 లక్ష్యం:

రంగనాథ రామాయణ విశిష్టత, అందులోని అవాల్మీక ఘట్టాలను వివరించటం ఈ పాఠం లక్ష్యం.

## 5.1 కవి పరిచయం:

తెలుగులో వచ్చిన రామాయణ కథల్లో మొదటిది రంగనాథ రామాయణము. ఇది ప్రజలకు అనుకూలమైన పాట రూపంలో ఉండే ద్విపద ఛందములో ఉంది. సాధారణంగా వచ్చిన రామాయణాలన్నీ ఆయా కవుల పేర వచ్చినవే. వాల్మీకి రామాయణము, మొల్ల రామాయణము, భాస్కర రామాయణము అని. ఐతే ఈ రామాయణ కర్త కోన బుద్ధరాజు. ఇది బుద్ధ రామాయణమని కాక రంగనాథ రామాయణమన్న పేర ప్రశస్తి చెంది వ్యాప్తి లోకి వచ్చింది.

చారిత్రకనే పద్యం గమనిస్తే క్రీ.శ. **1294** ప్రాంతంలో కదనప్రచండ, మీసర గండ, ఉభయ బలగండ బిరుదాంకితుడైన గోన గన్నయ రెడ్డి వర్ధమాన పురంలో రాజ్యం చేస్తుండేవాడు. ఒకనాడు ఆయన సభలో కొలువు తీరి ఉన్నపుడు బహు పురాణజ్ఞులు, శాస్త్ర విదులు, కావ్య నాటక ప్రౌఢ సమానులు, హితులు, ఆశ్రితులు, సుతులు, రాజులు ఉన్నారు. రామాయణాది రస గోష్టి చేస్తున్నపుడు విఠ్ఠల నాధుడు రామ కథా సుధాను రక్తుడై

" రమణమై దెనుగున రామాయణంబు<br>
క్రమమొప్పు జెప్పెడు ఘన కావ్య శక్తి<br>
గల కవులెవ్వరు ర్వి"

లోనని ప్రశ్నించాడు. అక్కడున్న విభుదులు, కవులు, ముక్త కంఠంతో

" నీత నూజన్ముండు నిపుణ మానసుడు<br>
ధూత కల్మషుడు బంధార నీతి ధనుడు<br>
సర్వదన ఘండు చతుర వర్తనుండు<br>
సర్వ పురాణ విచార తత్పరుడు<br>
కమనీయ బహు కళా గమ విచక్షణుడు<br>
----------------------------------<br>
పురుష చింతామణి బుద్ధ యాహ్వాయుడు<br>
నీకతి భక్తుండు నిఖిల శబ్దార్థ<br>
పాకజ్ఞడత్యంత పాండిత్య ఘనుడు<br>
మరియు రామాయణ మర్మమాతండు<br>
యెఱుగు నాతని బంపు మీ కథ జెప్ప<br>
ననిన మజ్జన కుడు దాత్త వర్తనుడు<br>
ననుడర్ధి బిలిపించి నను గారవించి

"భూమి గవీంద్రులు బుధులును మెచ్చ
రామాయణంబు పురాణ మార్గమున
దప్పకనాపేర దనాంధ్ర భాష
జెప్పి ప్రఖ్యాతంబు సేయింపు ముర్వి "

అని తండ్రి విట్ఠల నాథుడు అడిగినంతనే పుత్రుడు గోన బుద్ధా రెడ్డి ఆది కవి వాల్మీకి చెప్పిన పద్ధతిని రామాయణం మొదలు పెట్టాడు.

" భూలోక నిధి గోన బుద్ధ భూవిభుడు
తమ తండ్రివిట్ఠల ధరణీ శుపేర
గమనీయ గుణ ధైర్యకన కాంద్రిపేర
-------------------------------
రసికమై చెలువొందు రామాయణంబు "

అని విన్నవించుకొన్నాడు.

ఇంత స్పష్టముగా ఉంటే రంగనాద రామాయణము గోన బుద్ధా రెడ్డి కృతము కాదా అని పండిత లోకం చర్చించింది. ఎందుకంటే ఎక్కడా రంగనాధ రామాయణమన్న పేరు లేదు. పైగా మొదటి ఆరు కాండలు గోన బుద్ధా రెడ్డి రాస్తే ఉత్తర రామాయణము ఆయన పుత్రులయిన కాచరాజు, విట్ఠల రాజులు పూర్తి చేసినట్టు గ్రంథంలో స్పష్టంగా ఉంది.

ఈ రామాయణంలో కాండల వారీగా ఉన్న ద్విపదలు.

| | | |
|---|---|---|
| బాలకాండ | - | 2,493 |
| అయోధ్యకాండ | - | 1,834 |
| అరణ్య కాండ | - | 1,560 |
| కిష్కింధా కాండ | - | 1,343 |
| సుందర కాండ | - | 1, 177 |
| యుద్ధకాండ | - | 8,881 |
| మొత్తం | - | 17,290 ద్విపదలున్నాయి. |

రంగనాధ రామాయణంలో వాల్మీకి చెప్పని ఘట్టాలున్నాయి. వాటినే అవాల్మీకాంశాలు లేక అవాల్మీక ఘట్టాలు అంటారు. ఇవి లోకంలో ఎంత ప్రబలి పోయాయంటే నేటికీ తెలుగుదేశంలో ఈ కథలు తెలియని పామరుడే లేడంటే అతిశయోక్తి కాదు. ఆ కథల వరుస క్రమం యిది.

## 5.2 రంగనాద రామాయణము - అవాల్మీకాంశాలు:

ద్విపద వాఙ్మయానికి పాల్కురికి సోమన ప్రథముడయినా ఆయన రచనలకు రానంత ఖ్యాతి రంగనాధ రామాయణానికే వచ్చింది. దీనికి కొన్ని కారణాలూహించవచ్చు. సోమనకున్న వీరావేశము, పరమత నింద, స్వాభిమత నిష్ఠ కారాణాల వల్ల కొంత నష్టం వాటిల్లింది. అదే రంగనాధ రామాయణంలో దేశీయతా విధానమయిన కథలు, గాథలు, తన రామాయణంలో చొప్పించాడు. అవే స్థిరపడి సార్థకమయినాయి. వాల్మీకి రామాయణంలో లేని కథలను ఇతడు విపులంగా రాశాడు. అవి కొన్ని భాస్కర రామాయణంలోనూ చోటు చేసుకున్నాయి. పైగా రామ గాథ పై ప్రజల్లో ఉండే మక్కువ ఆది నుంచీ ఉంది. దీనికి తోడు ద్విపద అనుకూలమైన పాట రూపంలో ఉంది. 'పాఠ్యే గేయేచమ ధురం'. అందువల్ల రంగనాధ రామాయణ కథ ప్రాచుర్యం పొంది ఉండవచ్చు.

వివిధ కాలాల్లో జాన పదులు చెప్పుకున్న గాథల్లోని సారాంశమే రంగనాథ రామాయణంలోని అవాల్మీక ఘట్టాలు. ఈ కథలు గ్రంధస్థమయాక వాటికొచ్చిన ప్రాచుర్యం నేటికీ స్థిరంగా నిలిచి సంస్కృతిలో ఒక భాగమయినా యంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఆ కథలు కాండల ప్రకారం ఇలా ఉన్నాయి.

1. ఇంద్రుడు గౌతమముని ఆశ్రమంలో కోడిలా కూత వేసి గౌతముని అకాలంలో నదీ స్నానానికి వెళ్ళే విధంగా చేయడం - బాల కాండ
2. అహల్య భర్త శాపం కారణంగా రాయిలా పడి ఉండటం, రాముని పాదంసోకి స్త్రీగా మారడం - బాల కాండ
3. మంధరకు రాముని మీద కోపానికి గల కారణం మూలంలో 'పాపదర్శిని' అని మాత్రమే ఉండగా "రాముడు బాల్య మందు దన కాలు విఱిచిన తప్పు సాధింప నిది నాకు దఱి " అని రాముని మీద గల కోప కారణం వెల్లడించడం- అయోధ్య కాండ
4. కాకాసుర వధ (మూలంలో సుందర కాండ) - అయోధ్య కాండ
5. జంబు కుమారుని వృత్తాంతం - అరణ్య కాండ

రావణుని తోబుట్టువయిన శూర్పణఖ భర్త విద్యుజ్జిహ్వుడు. అతనికి లంకాపురం యిచ్చి రావణుడు దిగ్విజయ యాత్రకు వెళ్తాడు. ఐతే విద్యుజ్జిహ్వుడు రావణుని రానీకుండా లంకా పురాన్ని స్వాధీనం చేసుకోవడానికి పాతాళానికి వెళ్ళి తపస్సు చేస్తాడు. రావణుడు విషయం తెలిసి విద్యుజ్జిహ్వుని శిరసు ఖండిస్తాడు. అప్పటికే గర్భవతి అయిన శూర్పణఖకు జంబుకుమారుడు జన్మిస్తాడు. తండ్రి చావుకు కారణమైన వాని పై పగ తీర్చుకోవడానికి సూర్యుని తపస్సు చేసినందువల్ల సూర్యుడు వర ఖడ్గాన్నిస్తాడు. ఒకరోజు కంద మూలాదుల కోసం లక్ష్మణుడు అరణ్యంలో తిరిగే సమయంలో ఈ ఖడ్గం లభిస్తుది. దానిని తీసుకొని వెదురు పొదల్లో తపస్సు చేస్తున్న జంబుకుమారుడున్నాడని తెలియక ఆ పొదలను సంహరిస్తుంటే అందులోని జంబుకుమారుడు మరణిస్తాడు. ఈ కథ వాల్మీకి రామాయణంలో లేదు.

6. లక్ష్మణుడు సీతాదేవి ఎత్తి పొడుపులు భరించలేక రాముని కోసం పర్ణశాల విడిచి వెళ్ళు సందర్భంలో

"పర్ణశాల చుట్టూ బరులేడు వ్రాసి
వర్ణించి యాబరుల్ వడిదాటికమ్మ
ఎవ్వడేనీబరుల్ వెసదాటి వచ్చు
నవ్వీరవరు తలలలియ నాక్షణమె"

అని ఏడు గీతలు గీసిన కథ - అరణ్య కాండ

7. విభీషణుడిని రావణుడు సభలో తన్ని వెళ్ళగొట్టడం, బహిష్కరింపబడిన విభీషణుడు తల్లిని చూడడం - యుద్ధ కాండ
8. సేతు నిర్మాణ సమయంలో ఒక ఉడుత తన తోకతో ఇసుక రేణువులు రాల్చి యధా శక్తి రామ కార్యానికి తోడ్పటం - యుద్ధ కాండ
9. కైక నీతి బోధ - రాముని మహిమ రావణుడికి చెప్పడం, జల ప్రళయం గురిచి వివరించడం - యుద్ధ కాండ
10. నాగ పాశ బద్ధులైన రామ లక్ష్మణుల వద్దకు నారదుని రాక - యుద్ధ కాండ
11. రావణునితో మండోదరి రాముని బల పరాక్రమాలు చెప్పడం - యుద్ధ కాండ
12. సులోచన పతి భక్తి - యుద్ధ కాండ
13. కాలనేమి వృత్తాంతం
14. రావణుని సభలో హనుమంతుడు తన వాలమును (తోక) పెంచటం - యుద్ధ కాండ
15. శుక్రాచార్యోపదేశంతో రావణుడు పాతాళ హోమం చేయడం - యుద్ధ కాండ
16. రెండవ సారి సంజీవి కోసం వెళ్తున్న హనుమంతుణ్ణి భరతుడు చూడడం - యుద్ధ కాండ
17. సంజీవి తెస్తున్న హనుమంతుడితో మాల్యవంతుని యుద్ధం - యుద్ధ కాండ
18. శుక్రుని వద్ద రావణ విలాపం - ఆ పై రావణుడు పాతాళ హోమం.
19. అంగదుడు మండోదరిని ఈడ్చుకుని రావడం, మండోదరి రాముని మహిమను చెప్పడం - యుద్ధ కాండ

20. యుద్ధంలో రావణుడి శిరస్సులు మొలవడం - విభీషణుడు ఉపాయం చెప్పడం - యుద్ధ కాండ

ఈ విధంగా ఎన్నో జనంలోని కథలను జాతీయం చేశాడు బుద్ధ భూపతి.

## 5.3 మాదిరి ప్రశ్నలు:

1. రంగనాథ రామాయణంలోని అవాల్మీక ఘట్టాలను వివరించండి.
2. రంగనాథ రామాయణ కర్తృత్వాన్ని వివరించండి.

## 5.4 ఆధార గ్రంథాలు:

ఆరుద్ర - సమగ్ర ఆంధ్ర సాహిత్యము

డా॥. జి. నాగయ్య - తెలుగు సాహిత్య సమీక్ష

శ్రీరామమూర్తి కొర్లపాటి - తెలుగు సాహిత్య చరిత్ర పూర్వ గాథా లహరి

**ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి**

పాఠం -5.1

# ద్విపద వాఙ్మయ వికాసం

సాహిత్యం అక్షరబద్ధం కాని తొలినాళ్ళలో అది ప్రజల నోళ్ళలోనే ఉందన్నది అక్షరాక్షర సత్యం. మౌఖిక వాఙ్మయం తొలి రోజుల్లో పాట నుండి పద్యం కావడానికి ఎన్నో ఏళ్ళు గడిచిందన్నది జగమెరిగిన వాస్తవం. తెలుగు వారి ద్విపద జాతీయ ఛందస్సు. అది జీవితంలో అల్లుకున్న తేజస్సు. పల్లె పాటల్లో, పడవ పాటల్లో, విసురు రాతి పాటల్లో, దంపుడు పాటల్లో, జోల, పెండ్లి, తెలుగు వారి సమస్త పని పాటల్లో ద్విపద ఉంది. ఇది సర్వ సామాన్యమైన ఛందము. ఇది కవుల గుర్తింపుకు రావడమే ఒక అదృష్టం. అదీ పాల్కురికి సోమన ద్వారా దీనికి ఒక ఉన్నతి కలిగింది. అన్ని ఛందస్సుల్లో ద్విపద అప్రయత్నంగా వస్తుంది. తెలుగులో వచ్చిన ఈ తెలుగు ఛ్ఛందము తెలుగు భాషకు, పలుకుబడికి, సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు, శైలికి, శిల్పానికి వన్నె తెచ్చి తెలుగుదనాన్ని నిలిపింది.

## 5.1.0:

పల్లె ప్రజల సాహిత్యంగా విరాజిల్లుతూ వచ్చి, పాల్కురికి సోమన, శ్రీనాథుని వంటి మహా కవులచే వన్నె దిద్దబడిన ద్విపద వాఙ్మయ వికాసాన్ని వివరించటం ఈ పాఠం లక్ష్యం.

## 5.1.1 లక్షణం:

ద్విపద మాత్రా ఛందస్సుకు చెందిన కవితాశాఖ. రెండు పాదాల కవిత యిది. మూడింద్ర గణాల మీద ఒక సూర్య గణము చేర్చితే అది ఒక పాదమవుతుంది. పాదాల మీద మొదటి రెండు గణాల మీద యతి ఉంటుంది. ఏ పాదము యతి ఆ పాదముతో సరి. అటువంటి రెండు పాదాలను ప్రాసాక్షరము కలుపుతుంది. ప్రాస యతి కూడా కలిపే సంప్రదాయం ఉంది.

ద్విపదలో ప్రాస లేకుంటే మంజరి ద్విపద అవుతుంది. అవి రెండు పాదాలు ఒక దాని తర్వాత మరొకటి కలిపి నాలుగు పాదాలయితే తరువోజ అవుతుంది. అలాగే మధ్యక్కర, సీసము మొదలయిన దేశీయ ఛ్ఛందాలతో వెలువడిన తెలుగు ఛ్ఛందాలు ద్విపద రూపాంతరాలుగా చెప్పవచ్చు. నన్నయ కాలం నాటి సంప్రదాయంలో వచనము, పద్యము కలిపి చంపువు అన్నారు. పద్యాల్లో ఏ ఛ్ఛందమయినా ఉండవచ్చు. కాని ద్విపదలో అదే పద్య పాదాలు రెండు చొప్పున ఎన్నయినా వ్రాయవచ్చు. అంటే గ్రంథమంతా ఒకే ఛ్ఛందములో ఉంటుంది.

పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్రలో ద్విపద లక్షణాన్ని రేఖా మాత్రంగా చెప్పాడు.

ప్రాసమైనను యతి పై వడి యైన
దేసిగా నిలిపి యాది ప్రాసనియతి
దప్పకుండగ ద్విపదలు రచియింతు
నొప్పుదు ద్విపద గావ్యోక్తి నావలన

అని వివరించాడు. పైగా సరళత, ప్రసన్నత, శబ్దశుద్ధి, అర్థపుష్టి, రసపుష్టి, విశేష్య విశేషణ శ్లేష, సొంపు మాధుర్యము,మృదుత్వము, యమకము, గమకంబు తదితరమైన రీతిలో రచనచేయాలని వివరించాడు. ఈయన ప్రాస యతిని అంగీకరించాడు. ఐతే తాళ్ళపాక చిన్నన్న మాత్రం ప్రాస యతి కూడదన్నాడు. అష్ట మహిషీ కళ్యాణములో

యతులలో పల్రబాసయతి దక్కసకల
యతులు చెల్లును ప్రయోగాను సారమున

సోమనాధుడే ద్విపదకు తొలి నాధుడు. ఐతే ఆనాటి మత సంప్రదాయం వల్ల పండిత లోకంలో అంత ఆదరణ పొందలేదనే చెప్పాలి. ఐతే పండితారాధ్య చరిత్రను మాత్రము అందరూ ఆమోదించారు. ఈ కాలంలో వచ్చిన ద్విపద కావ్యాలు దాదాపు 250

వరకూ ఉండవచ్చని పండితుల తలంపు.

## 5.1.2 ద్విపద కవుల చరిత్ర:

ద్విపద సాహిత్యానికి ఆద్యుడు పాల్కురికి సోమన. ఈయన రచనల్లో బసవ పురాణము పండితారాధ్య చరిత్ర ముఖ్యమైన ద్విపదలు. ఇవి అనువాదాలు కావు. స్వతంత్ర రచనలు. కన్నడ, సంస్కృతాల్లోకి అనూదితమయినాయి. సోమన మల్లమ దేవి పురాణము, సోమనాథ స్తవము, భక్త స్తవము లభించలేదు.

సోమన తర్వాత కోనబుద్ధ రాజు (1240) రంగనాథ రామాయణము రచించాడు. ఈయన షట్కాండలను మాత్రమే పూరించగా ఈయన పుత్రులు కాచభూవిభుడు, విఠ్ఠల నాథులు ఉత్తర రామాయణము పూరించారు.

మడికి సింగన (1375 - 1435) భాగవత దశమ స్కంధము

గణప నారాధ్యుడు (1323 - 1345) స్వరశాస్త్రము (యోగ శాస్త్రము)

శ్రీనాథుడు (1380 - 1460) పల్నాటి వీర చరిత్ర (మంజరీ ద్విపద)

ఘనుడైన శ్రీనాథ కవి రాజ రాజు
చెన్నుని కృప చేత జిత్తముప్పొంగి
బాలుని విక్రమ ప్రౌఢి యంతయును
విరచించె జనులకు వదితంబుగాను.

కాసెసర్వప్ప (1400) సిద్దేశ్వర చరిత్ర

కొలని గణపతి దేవుడు (1400) - మనోబోధ

గౌరన (1345 - 1445) నవనాథ చరిత్ర, హరిశ్చంద్రోపాఖ్యానము

నాదెండ్ల ఉమాపతి (1460) మాయా చిదానంద మంజరి

పిడుపర్తి బసవన (1475 - 1500) పిళ్ళ నయనారు కథ, బ్రహ్మోత్తర ఖండము, దీక్షాబోధ

పిడుపర్తి సోమన - ప్రభులింగ లీల

పోలిశెట్టి లింగన - నవచోళ చరిత్ర, మలహణ చరిత్రము, శంకరదాస మయ్య చరిత్రము, వీర సంగయ్య దేవ చరిత్రము, శిష్య ప్రబోధము

ప్రోలుగంటి చెన్నశౌరి - నృశింహ పురాణము ద్వితీయ ఘట్టము (1500 - 1600)

## 5.1.3 వైష్ణవ ద్విపద రచనలు:

ద్విపద వాఙ్మయంలో ద్వితీయ ఘట్టం తాళ్ళపాక కవులతో ప్రారంభమని చెప్పవచ్చు. తాళ్ళపాక కవులు విష్ణు భక్తులు. శ్రీ వేంకటేశ్వర స్వామి పై చేసిన రచనలు కీర్తనలే అధికం. తాళ్ళపాక అన్నమాచార్యులు (1404 - 1507) రామాయణము ద్విపదలో రాశాడని ప్రతీతి. అది అలభ్యము. శృంగార మంజరి, మంజరీ ద్విపదలో ఉన్నది. అన్నమాచార్యుని ప్రథమ పత్ని, తొలి తెలుగు కవయిత్రి. తాళ్ళపాక తిమ్మక్క రచించిన సుభద్రా కళ్యాణము మంజరీ ద్విపదలో ఉంది. పెద తిరుమలయ్య చక్రవాళ మంజరి లఘుకృతి.

చిన్నన్న (1496 - 1561) - అష్ట మహిషీ కళ్యాణము, పరమయోగీ విలాసము, ఉషా కళ్యాణము, అన్నమాచార్య చరిత్ర.

నాదెండ్ల గోపన మంత్రి (1520) - కృష్ణార్జున సంవాదము.

దోనూరు కోనేరు నాథుడు (1547) - బాల భాగవతము.

ముకుంద యోగి (1560) - శ్రీ రంగ మహాత్మ్యము.

చదల వాఢ మల్లన (1580) - రుక్మాం గద చరిత్ర.

భద్ర కవి లింగని (1530 - 1542) - సానంద చరిత్ర, దేవాంగ పురాణము.

చల్ల గురవయ్య - యాజ్ఞ వల్క్య విజయము.

మొదలయిన వారు రామయాణాన్ని అనేక విధాల రచించిన వారున్నారు.

## 5.1.4 తృతీయ ఘట్టము:

క్రీ.శ. 1600 - 1875 మధ్యకాలంలో వచ్చిన ద్విపద కావ్యాల్లో మత దృష్టి కన్నా కావ్యదృష్టి అధికంగా కన్పిస్తుంది. దక్షిణాంధ్ర యుగంలో కన్పించే పచ్చ కప్పురపు తిరువేంగళ కవి (1531 - 1539) బొక్క నాథ చరిత్ర రచించాడు. ఈయన భట్రాజు కులానికి చెందినవాడు. తిప్పరాజు కొడుకు, తిమ్మరాజు మనుమడు. తిమ్మరాజు, అతని తమ్ముడయిన అయ్యలరాజు కన్నడ రాయడయిన ప్రౌఢ రాయలును మెప్పించి ఘనసార దానము పొంది 'పచ్చ కప్పురపు వారు' అనే బిరుదు గృహనామంగా పొందారు. బొక్క నాథ చరిత్ర ఎనిమిదాశ్వాల ద్విపద. మధురలో వెలసిన సుందరేశ్వర స్వామికే బొక్కనాథుడని పేరు.

రఘునాథ నాయకుడు(1614 - 1633) - అచ్యుతాభ్యుదయము, నల చరిత్ర
విజయ రాఘవనాయకుడు (1633 - 1673) - పాదుకాసహస్రము, మోహినీ విలాసము, మంజరీ ద్విపద, రఘునాథనాయికాభ్యుదయము

తంజావూరు నేలిన మహారాష్ట్రుల్లో ఒకడయిన భోసల ఏకోజి (1736 - 1737) రామాయాణాన్ని యథామాతృకు క్రమంగా రచించాడు. ఈ రామాయణం తన తండ్రి మళోజీకి అంకితం చేశాడు. అనంతరం

గణప వరపు వేంకట కవి (1670) - రామాయణము
దర్భా వేంకట కవి - రుక్మాంగద చరిత్ర
పరమానంద తీర్థ యోగి (1600) - శివ జ్ఞాన మంజరి - అనుభవ దర్పణములు

ముఖ్యంగా చెప్పవచ్చు.

భారత కవిత్రయం లాగే ద్విపద భారత కవిత్రయం కూడా ఉన్నారు. తిమ్మన ఆతుకూరి సోమన, బాలసరస్వతీశ్వరుడు.

**5.1.4.1 ఆతుకూరి తిమ్మన (1550 - 1600):** ఆతుకూరి తిమ్మన (1550 - 1600) మహాభారతంలోని ఆది, అరణ్య, విరాట, ఉద్యోగ, భీష్మ ద్రోణ పర్వాలను ద్విపదలో రచించాడు. ఈయనకు వర్ధమాన పురాదీశ్వరుడు, కర్ణాటతిలక అనే బిరుదులున్నాయి. ఇతను పంటరెడ్డి, దేవయమ్మల పుత్రుడు. ద్విపద భారత కవుల్లో ద్వితీయుడు ఆకునూరి సోమన. ఈయన తిమ్మన పుత్రుడు. కర్ణ పర్వము నుంచి భారతంలో తిక్కన అన్ని పర్వములు రచించాడు. ఈయన రచనలన్నీ వేంకటేశ్వరునికే అంకితం చేశాడు. తిమ్మన రచన చేయకుండా వదలిన సభా పర్వాన్ని బాల సరస్వతీశ్వరుడనే కవి పూర్తి చేశాడు. ద్విపద భారత కవిత్రయంలో తిమ్మయ రచన మేలయినది.

ద్విపద కవుల్లో కట్టా వరద రాజును ప్రత్యేకంగా పేర్కోవాలి. కావేరికి కట్ట కట్టించిన కరికాల చోళుని వంశంలోని కట్ట రంగరాజుకు హరిదాస రాజు పుత్రుడు. ఆయనకు రామరాజు, వరదరాజు, తాతరాజు అనే పుత్రులున్నారు. వారిలో రెండో వాడే వరదరాజు. ఈయన పరమ భాగవత చరిత్రము, రంగ మహాత్మ్యము రచించాడు. రంగ మహాత్మ్యము నూరధ్యాయాల గ్రంథము. ఈ రెండూ తిరు వేంగళ నాధునికి అంకితం చేశాడు.

ఈయన రామాయణంలో కావ్య దోషాలను గురించి వివరించాడు.

"జల్లి మాటలు, నప శబ్దముల్, జుజ్జు
టలికల్, ప్రావ, లందదుకు బల్కులును
పునరుక్తములు, వట్టి పూదెలు, కాకు

దెనుగు, లీచలును, సందిగ్ధముల్ ప్రాలు

మాలికలు - తదితరమైనవి ఉండకూడదని వివరించాడు.

కవిత ఎలా ఉండాలో కూడా తెలిపాడు.

లక్షణ సమ్మతముగ నందమై, సుకవులౌరాయన, జెవుల విందుగా, కపురంబు వెదచల్లినట్లు ధ్వనులు, వ్యంగ్యములు, వింతలు, మసనులును మినుకుల జిగి బిగి, మెరవడుల్, జాతి వార్తలు, నుపములు, వర్ణనాంశములు,........ తదితరమైన విధంగా ఉండాలని తెలియజేశాడు.

రత్నాకరము గోపాల కవి (1575 - 1650) - సౌగంధిక ప్రసవాపహరణము, భాగవత దశమ స్కంధము

తేకుమళ్ళ రంగశాయి(1790) - భాగవతము మొదటి నాలుగు స్కంధాలు (ఇది పోతన భాగవతానికి ద్విపదాను కృతి)

పోలుమంచి బసవన (1600) - మైరావణ చరిత్ర రేటూరి భావయామాత్యుడు, ఆదిలక్ష్మి విలాసము

ఈ కాలంలో శైవ మత సంబంధి అయిన ద్విపద కావ్యాల్లో పేర్కోదగినవి

మల్లికార్జున సిద్ధ యోగి (1700) గౌడ పురాణము

మరింగంటి వెంకటార్యుడు (1700) మల్లారి చరిత్ర

సిద్ధేంధ్ర యోగి (1750) యోగీశ్వర విలాసము

బచ్చు సిద్ధకవి - మఱి బసవ పురాణము

పోచిరాజు వీరన (1775 - 800) విభూతి రుద్రాక్ష మహాత్మ్యము

పులిగడ్డ నారన - సురాభాండేశ్వరము

బడగలపాటి నరస కవి (1740) నింబజా మహాత్మ్యము లేక ఏక వీరామాహాత్మ్యము

నల్లనగండ్ల నాగ నారాధ్యుడు (1750) బసవ విజయము

చిత్తారు గంగాధర (1823) కొలనిపాక మహాత్యము, సిరియాళ చరిత్ర, భల్లాణి చరిత్ర, గంగా వివాహము

మరింగంటి సింగరాచార్యుడు (1600) ధనాభిరామము, ప్రేమాభిరామము

అప్పకవి (1656) సాధ్వీజన ధర్మము

ముమ్మడి మల్లనాచార్యుడు(1650) తత్త్వ చంద్రోదయము

కర్పూరము కృష్ణామాచార్యులు (1650) భగవద్గీత

కూచిమంతి తిమ్మకవి (1684 - 1757) సారంగధర చరిత్ర

కూచిమంచి జగ్గకవి (1700) రాధాకృష్ణ చరిత్రము

గంగుల పినయల్లయ (17వ శతాబ్ది) కాటమరాజు కథ

పిల్లల మఱ్ఱి బంగారు రంగప్ప (1770) భేతాళ చరిత్ర

కొండయ కవి - విక్రమార్కుని కథలు

పురుషోత్తమ దాసు (1875) ధర్మాంగద చరిత్ర

మొదలయినవన్నీ 18, 19 శతాబ్దాల కాలంలో పేర్కొనదగిన ద్విపద రచనలు.

## 5.1.5 చతుర్ధ ఘట్టం:

ఆధునిక ద్విపద సాహిత్యం. కందుకూరి వీరేశ లింగం తర్వాత వచ్చిన కావ్యాలన్నీ ఆధునిక సాహిత్యం గానే పేర్కొనవచ్చు. ఆయన రచించిన వాటిల్లో స్త్రీ జనోద్ధరణకు సంబంధించిన మాతృపూజ, పితృ పూజ ముఖ్యంగా చెప్పవచ్చు.

వాలిల కొలను సుబ్బారావు (1863- 1938) భగవద్గీత

పూండ్ల వేంకట రమణయ్య(1900) మనుచరిత్ర
శేషమాంబ (1900) బ్రహ్మైక్యబోధ
తురగా పురుషోత్తమశర్మ (1900)కృష్ణ కథామృతము
గార్లదిన్నె సుబ్బారావు (1910) ఉత్తర హరిశ్చంద్రీయము
మామిడన సుభద్రమ్మ (1910) అధ్యాత్మ రామాయణము
వేంకట పార్వతీశ్వర కవులు - రత్నహారము
పల్లెపూర్ణ ప్రజాచార్యులు - మేఘదూతము
ఎల్లిమరాజు - నారాయణ భట్టు సేవాంజలిని
వాకాటి పెంచల రెడ్డి - ప్రహ్లాద చరిత్రను
కేశవ తీర్థ స్వామి - శ్రీరామ చరిత్ర మానసమును
పుట్టపర్తి నారాయణాచార్యులు - పండరీ భాగవతము

తదితరులు ద్విపద కావ్యాలు రచనచేశారు. ప్రస్తుతం కల్పించే గేయ కవితల్లో ద్విపద చ్ఛాయలు అధికంగా కన్పిస్తున్నాయి.

ద్విపద కేవలం తెలుగు ఛందము. ఇది అనంతర సాహిత్యచ్ఛందో కవితలకు మార్గదర్శకం.

## 5.1.6 మాదిరి ప్రశ్నలు:

1. ద్విపద సాహిత్య చరిత్ర ఆవిర్భావ వికాస విస్తరణను తెలియజేయండి.
2. ద్విపద సాహిత్య వికాసాన్ని వివరించండి.

## 5.1.7 ఆధార గ్రంథాలు:


జి. నాగయ్య - తెలుగు సాహిత్య చరిత్ర
తమ్మయ్య బండారు - పాల్కురికి సోమనాధుడు
సుశీల టి - ద్విపద సాహిత్య చరిత్ర
పాల్కురికి సోమన - పండితారాధ్య చరిత్ర పీఠిక


డా॥. యం. స్వర్ణలతా దేవి

# పాఠం - 6 తిక్కన

## పాఠ్యాంశ నిర్మాణ క్రమం


6.1 కవి పరిచయము
6.2 తిక్కన వ్యక్తిత్వము
6.3 తిక్కన కవితా వైశిష్ట్యము
6.4 రస చర్చ
6.5 నాటకీయ శైలి
6.6 వర్ణనా శిల్పం
6.7 ఔచిత్య పోషణ
6.8 యుద్ధతంత్ర వర్ణన
6.9 బ్రహ్మ విద్యోపదేశం
6.10 తిక్కన సమకాలికులు
6.10.1 మూలఘటిక కేతన
6.10.2 మారన
6.10.3 మంచన
6.10.4 బద్దెన
6.11 మాదిరి ప్రశ్నలు
6.12 ఆధార గ్రంథాలు


## 6.0 లక్ష్యం:

తిక్కన సోమయాజి వ్యక్తిత్వాన్ని, కవితా వైశిష్ట్యాన్ని, నాటకీయ శైలిని వివరించటమే ఈ పాఠం లక్ష్యం.

## 6.1 కవి పరిచయము:

క్రీ.శ. 12వ శతాబ్దం చివరి భాగంలో మహమ్మదీయులు భారతదేశాన్ని చాలా భాగం ఆక్రమించడంతో అనేక నూతన పరిస్థితులు ఏర్పడ్డాయి. దక్షిణ భారతదేశాన్ని చోళులు, చాళుక్యులు, కాకతీయులు తమ రాజ్యాలను ఏర్పాటు చేసుకొని పరిపాలన సాగించారు. తెలుగు చోళులైన తిక్కన భూపతి, మనుమసిద్ధి మొదలైన రాజులు కాకతీయులకు సామంతులు. 13వ శతాబ్ది ప్రారంభంలో మనుమసిద్ధి రాజ్యాధికారం చేపట్టినప్పుడు రాజ్యం ప్రశాంతంగా లేదు. మనుమసిద్ధి మిత్రుడు, మంత్రి అయిన తిక్కన కాకతి గణపతి దేవుని సహాయ మర్థించి మనుమసిద్ధికి శత్రువుల వల్ల పోయిన రాజ్యాన్ని సంపాదించి ఇచ్చాడు. తిక్కన రాజ్య తంత్రము, రణ తంత్రము బాగా నిర్వహించిన కుటుంబానికి చెందిన వాడు. తాత మంత్రి భాస్కరుడు, గుంటూరు విభుడు. తండ్రి కొమ్మన దండనాధుడు. మహా వీరుడైన ఖడ్గ తిక్కన సోదరుడు. ఈ విధంగా తిక్కన గొప్ప కుటుంబంలో పుట్టి, పెరిగిన ప్రజ్ఞాశాలి. ఒక సామంతరాజుకు మంత్రిగా వుండటం వల్ల రాజ్య పరిస్థితులు, ఆనాటి సమాజం దానిలోని గుణదోషాలు అన్ని తిక్కనకు బాగా తెలుసు. ఆ నాడు శివ కవుల ప్రభావం వల్ల శైవ మత ప్రచారం ఎక్కువగా ఉంది. వైష్ణవం కూడా ప్రబలంగా ఉండేది. శైవ వైష్ణవులు పరస్పరం కలహించుకుంటున్న

సమయం అది. అందుకే తిక్కన తన సమకాలీన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని భారతాంధ్రీకరణకు పూనుకున్నాడు. ఆనాటి సమాజంలో తిక్కన స్థానం మహోన్నతమైనది. మహాభారతాన్ని తెలుగు ప్రజల శ్రేయస్సు కొరకు, తెలుగు భాషను అభివృద్ధి చేయడం కొరకు తెలుగులోకి అనువదించాడు. తన జాతి, భాష వాటి అభివృద్ధి, తన ఎదుట వున్న సమాజంలో ఆవరించి ఉన్న చీకటిని తొలగించి వెలుగు చూపవలసిన బాధ్యత తన పై పడింది. ఈ కారణాల వల్ల మరొకరు ప్రారంభించి విడిచిన గ్రంథాన్ని తానేల పూర్తి చేయాలి అనే వేరొక ఆలోచన లేక "ఆంధ్రావళికి మోదము'' కలుగునట్లుగా తెలుగు భాషలో భారతాన్ని అనువదించాడు.

**ఉద్దేశం:** భారతాంధ్రీకరణ చేసిన కవులలో తిక్కన రెండవ వాడు. శైవ మత ప్రభావంతో నిండిన రచనల్లోను, ప్రజల్లోను మార్పు తీసుకురావటానికి భారతాన్ని ఆంధ్రీకరించాడు. హరిహరాద్వైత మతాన్ని స్థాపించి శివుడు, విష్ణువు ఒక్కరే అను విషయాన్ని చాటి చెప్పాడు. తిక్కన ఆంధ్రావళికి మోదము కలుగునట్లుగా వ్రాశాడని ఈ భాగము చదివి గ్రహిస్తారు. అవి:

1. తిక్కన యుగ చారిత్రక విశేషాలు
2. తిక్కన వ్యక్తిత్వం
3. తిక్కన కవితా రీతులు
4. తిక్కన సమకాలికులు

తిక్కన నెల్లూరును పరిపాలించిన చోళరాజు అయిన మనుమసిద్ధి ఆస్థానంలో మంత్రి. తిక్కన తనను గురించి ఎక్కువగా ఎక్కడా చెప్పుకోలేదు. భారత రచనా కాలము నాటికి మహాజ్ఞాని. ధర్మేతిహాసమైన వ్యాస భారతాన్ని "సంతోషంబు నిండారగ ఆంధ్రావళి మోదం బారయునట్లుగా'' మహా కవిత్వ దీక్షా విధినొంది తెలుగు భాషలో రసరమ్య కావ్యంగా తీర్చిదిద్దాడు. తిక్కన రచన నాటకీయమైనది. నన్నయ భారతాంధ్రీకరణము స్వతంత్రమైనది. ఇందు బాగా పరిశీలించిన మూడు ముఖ్య విషయాలు కనిపిస్తాయి. అవి (1) రాజనీతి, (2) యుద్ధ తంత్రం (3) బ్రహ్మ విద్యోపదేశం. పుట్టుక, నడవడి, విజ్ఞానము ఈ మూడు ధర్మాలను నిర్వహించి అనుభవ గోచరము చేసుకొనిన కవి తెలుగు నాట తిక్కన ఒక్కడే. మహోదార జీవితాన్ని గడిపిన తిక్కన భారత రచనకు ఉత్తమాధికారి.

## 6.2 తిక్కన వ్యక్తిత్వం:

తిక్కన తొలి రచన నిర్వచనోత్తర రామాయణము. తరువాత రచన విరాటపర్వం నుండి "15 పర్వాల'' భారతం. దశ కుమార చరిత్రలో తిక్కన వంశ వర్ణన విపులంగా ఉన్నది. తిక్కన గొప్ప పండితుడు. సమస్త వేదాలను అభ్యసించాడు. నానా వేదంగ తత్త్వజ్ఞాడు, సకలాగమ తత్త్వార్థ విచారోదారుడు, రాజకీయ చతురుడు, ఆశ్రిత జన పోషకుడు, బంధు జన పోషకుడు, నిర్వచనోత్తర రామాయణం, విరాట పర్వం, దశ కుమార చరిత్ర అవతారికలు తిక్కన కవితా ధర్మాలను, వాటి వలన వ్యక్తమయ్యే తిక్కన వ్యక్తిత్వాన్ని వివరించడానికి ముఖ్య ఆధారాలు. తిక్కన వైభవోపేతంగా జీవించాడు.

" మనుమసిద్ధి మహీవల్లభునకు కరుణ రస పాత్రం బైన వాడు ''

నిర్వచనోత్తర రామాయణమును రచించు నాటికి తిక్కన "మహేశ్వరాంఘ్రికమల ధ్యానైక శీలుడు'' అందుకే శివ వైష్ణవులను కొలిచాడు. "తొలినాడు శివుని కొలిచిన, మలినాడు విష్ణు రూపాయ నమః శివాయ'' అని అనగలిగిన మహోదారుడు.

" శ్రీయన గౌరినా బరుగు చెల్వకు చిత్తము పల్లవింప భ
ద్రాయత మూర్తియై హరి హరంబగు రూపము దాల్చి విష్ణు రూ
పాయ నమశ్శివాయ యని పల్కెడు భక్త జనంబు వైదిక
ధ్యాయిత కిచ్చ మెచ్చు పరతత్త్వము గొల్చెద నిష్ట సిద్ధికిన్''

నిర్వచనోత్తర రామాయణము కాలము నాటికి తిక్కన తన కావ్యాన్ని నరులకు అంకితం చేయడంలో ఉత్సాహం చూపాడు. తనను మామా అని పిలుచుచు ముద్దుగా కావ్య కన్యకను యిమ్మని అడిగిన మనమసిద్ధి మహారాజుకు, తిక్కన నిర్వచనోత్తర రామాయణమను కావ్య కన్యను కన్యాదానము చేశాడు. భారతాన్ని నరాంకితము చేయునని నిశ్చయించుకొని, ఆ కావ్యంలో తాను వహించిన గౌరవ

భావాన్ని కల్గించు పరమేశ్వరుడు తనను కొనియాడినట్లు తెలిపాడు.

" తెనుగు భాస వినిర్మింప దిరువుటరయు, భవ్య పురుషార్థ తరుపక్వ ఫలము గాదే
దీనికెడ నియ్యకొని వేడ్కపూని కృతి పతిత్వ మర్థించి వచ్చితి దికుశర్మ"

తిక్కన తాను కృతులను రచించి యితరులకు అంకిత మివ్వడమే కాక కేతనచే దశ కుమార చరిత్రను చెప్పించుకొని కృతి పతిగా నిలచాడు. "కవీంద్ర లోకాధారుడని, సారకవితా నిర్మాణ చాతుర్యుడని, కవితాధన్యుడని, కవి లోక చాతక వ్రజనవజల దస్తనిత భాషణ ప్రకరుడని". "వేదాది సమస్త విద్యాభ్యాస విభాసి" అని కేతన తిక్కనను గురించి పలు విధాలుగా పొగిడారు. ఇంతటి విద్వాంసుడు కనుకనే తిక్కన కవులకు మిత్రుడయ్యాడు. తిక్కన తాను ఉభయ కవి మిత్రుడనని భారత గద్యలో స్వయంగా వ్రాసుకున్నాడు. కవిత చెప్పి ఉభయ కవి మిత్రుని మెప్పించుట కొరకు కేతన దశ కుమార చరిత్రను చెప్పి అతనికి అంకిత మిచ్చాడు. అప్పటి కవులు కావ్యాలను వ్రాసి తిక్కన మెప్పును పొందుట వారికి గర్వ కారణంగా ఉండేది. నిర్వచనోత్తర రామాయణము నాటికి తిక్కన సోమయాజి కాలేదు. బుధారాధన విధేయుడు. "నానేర్చిన భంగి చెప్పి వరణీయుడు అయోధ్య భక్త కోటికిన్" అనుటచే వినయ సౌశీల్యంతో కూడిన హృదయ పరిపాకం తిక్కనలో స్పష్టంగా కనబడుతుంది. నిర్వచనోత్తర రామాయణం నాటికి తిక్కన మహా మంత్రి. బహు ముఖ ప్రజ్ఞావంతుడు. భారత రచనా కాలం నాటికిక మహాజ్ఞాని. ఆనాడు ఉభయ కవి మిత్రుడు, ఈనాడు కవిబ్రహ్మ. ఆనాడు ఆయనలో ఆత్మ ప్రత్యయం కన్పిస్తుంది. ఈనాడతడు వినయ భూషనుడు. కారణ జన్ముడైన పూర్ణ పురుషుడు.

## 6.3 తిక్కన కవితా వైశిష్ట్యము:

ధర్మేతి హాసమైన వ్యాస భారతాన్ని "బుధ సంతోషంబు నిండారగ ఆంధ్రావళి మోదము బరయునట్లుగా మహా కవిత్వ దీక్షా విధి నొంది" తెలుగు భాషలో రసమయ కావ్యంగా తీర్చిదిద్దిన మహాకవి తిక్కన సోమయాజి. అతడు ఉదాత్త మనిషి, శిల్ప పండితుడు. అతని రచన నాటకీయమైనది. కథాగత పాత్రలను వాటిస్వరూప స్వభావాలను సొంపైనపదముల పొందిక ద్వారా సన్నివేశ కల్పనల వలన, సంభాషణముల మూలమున, సహృదయ హృదయము నందు స్ఫురింపజేయుటయే కావ్య శిల్పము. దీనిని రసోన్ముఖంగా పయనించునట్లు చేయుట రస శిల్పము.

## 6.4 తిక్కన రస చర్చ:

భారతంలో ప్రధాన రసం శాంతము. తిక్కన భారతం వివిధ సన్నివేశాలకు, వివిధ సంఘటనలకు నెలవైనది. శాంత రస ప్రతికూలములైన రస భావములు ఆయా సన్నివేశము లందు సముచితంగా వర్ణింప వలసి ఉన్నది. అజ్ఞాత వాసము సమయంలో ద్రౌపది సైరంధ్రిగా విరాట రాజు భార్య సుదేష్ణకు దాసిగా వుంది. సుదేష్ణ తమ్ముడు కీచకుడు అతడు ద్రౌపది పై మనసు పడ్డాడు. తన భర్తలచే ద్రౌపది కీచకుని చంపించినది.

ఉదా - కీచక వధానంతరము సైరంధ్రి " అంతరంగమున నిండిన హాస్య రసంబు, మోము పై వెలి విరియంగ నీక " చనెనట.

రౌద్ర రస వినోధియగు అర్జునుడు శ్రీ కృష్ణుని విశ్వరూప ప్రదర్శనము గాంచి "సకల జనంబులు నయనంబుల మొగిడ్చి అద్భుత, భయానక రసంబులజొత్తిల్లు చిత్తంబుల తోడం కదలకుండిరి". ఈ ఉదాహరణను బట్టి రస శబ్దాన్ని ప్రపంచార్థమున స్వీకరించుట తిక్కన హృదయముగా తోస్తున్నది. విరాట పర్వాన ఉత్తర, అభిమన్యుల శృంగారం, ఉత్తర గోగ్రహణ యుద్ధ మందు వీర రౌద్ర భీభత్సాలను, ఉద్యోగ పర్వాన వీర రసాన్ని, ఉత్తర గోగ్రహణమునకు వెళ్ళు ఉత్తర కుమారుని ప్రగల్భ వాక్యాలందు హాస్యరసాన్ని, ద్రౌపది తన భంగపాటును చెప్పుకొను సందర్భమున అభిమన్యుని వధ, స్త్రీ పర్వాలందు కరుణ రసాన్ని, అనుశాసనిక పర్వాలందు శాంత రసాన్ని చక్కగా పోషించాడు. ఇట్లు సందర్భానుసారంగా, సమయ స్పూర్తిగా సముచిత రస రమణీయకంబుగా తిక్కన భారతాన్ని రచించుటచే అది "నానా రసాభ్యుదయోల్లాసి" అయింది.

## 6.5 నాటకీయ శైలి:

తిక్కన శ్రవ్య కావ్యమైన భారత ఇతిహాసాన్ని కావ్య లక్షణ శోభితమైన ప్రబంధముగా చేయుటయే కాక దానికి నాటకీయత కూడా సంతరించాడు. నాటకంలో వలె పాత్రలు మన ఎదుట నిలబడి వ్యవహరించేటట్లు రచించాడు. విరాట ఉద్యోగ పర్వాలందలి ఏ ఘట్టాన్ని పరిశీలించినా ఈ విషయం తెలుస్తుంది. పాత్రల సృష్టి నాటకీయతకు ప్రాణం. విరాట ఉద్యోగ పర్వాలందలి ఏ ఘట్టాన్ని పరిశీలించినా ఈ విషయం తెలుస్తుంది. పాత్రల సృష్టి నాటకీయతకు ప్రాణం వంటిది. తిక్కన భారతం చదువునపుడు కథ చదువుతున్నట్లు కాక నాటకాన్ని చూస్తున్న భావం కలుగుతుంది. భారతంలో విభిన్న మనస్తత్వాలు కల పాత్రలు చాలా ఉన్నాయి. విరాట నగరానికి వెళ్ళునప్పుడు మార్గాయానంలో అలసిన సుకుమారి అయిన ద్రౌపది ధర్మరాజుతో

" డప్పిజనించె, వ్రేళుల పుటుంబులు పొక్కు దొడంగె, గోళ్ళలోఁ
జిప్పిల జొచ్చె నెత్తురులు, చిత్తము నాకు గడున్................ "

మొదలగు వర్ణనల యందు ద్రౌపదికి కలిగిన ఆయాసం, దైన్యం కనబడుతుంది.

కౌరవ సైన్యాన్ని చూచి భీతి పొందిన ఉత్తరుని మూర్తిని తిక్కన ఇట్లు ప్రత్యక్షంగా కనబడునట్లు వర్ణించాడు.

"వెలవెల బాఱుచు వెగడొంద బెదవుల తడియాఱు - నెంతయు దల్లడిల్లు ........................"

తిక్కన పాత్ర చిత్రణ అద్వితీయం. కథలోని పాత్రల చేతను మరియొక పాత్రను ప్రశంసింప చేసి పాత్ర చిత్రీకరణ చేయుచుండుట తిక్కన విధానంలో చెప్పదగినది.

"ఎవ్వని వాకిట నిలుచు" అను పద్యంలో ధర్మరాజు ఔన్నత్యాన్ని ద్రౌపది కొనియాడుట ఒక ఉదాహరణ.

భారత కవులలో నన్నయది కథా కథన దృష్టి, ఎఱ్ఱనది వర్ణనాత్మక దృష్టి, తిక్కనది కథా కథనము, వర్ణనాత్మకము కలిపి మూస పోసిన నాటకీయ శిల్ప సృష్టి. కాబట్టి వ్యాస భారతంలో లేని శోభ గౌరవం ఇతనికి దక్కింది. తిక్కన రచనలో దృశ్య సాక్ష్యాత్కార పద్ధతి పలుచోట్ల కన్పిస్తుంది. విరాటుని ఆస్థానంలో కీచకుడు ద్రౌపదిని అవమానించునపుడు భీముని హృదయంలో రేగిన కోపాన్ని ఇట్లు వర్ణించాడు.

" కనుగొని కోప వేగమున గన్నుల నిప్పుల రాల నంగము
ల్గనలగ సాంద్ర ఘర్మ సలిలంబులు గ్రమ్మ నితాంత దంత పీ
డనరట దాస్య రంగ వికట భ్రుకుటీ చటుల ప్రవృత్తన
ర్తన ఘటనా ప్రకార భయద స్ఫురణా పరిణద్ధ మూర్తియై "

పండ్లు పటపట కొరుకుతూ, కనుబొమ్మలు ఎగర వేస్తూ చెమట ధారలు ప్రవహిస్తూ మహోగ్రంగా ఉన్న భీముని రూపము మన కళ్ళకు ప్రత్యక్షమవుతుంది. తిక్కన పాత్రల మనస్తత్వాలను చిత్రించడంలో గడుసరి. సంభాషణ చాతుర్యము, తెలుగు నుడికారాల సొంపు మొదలగున్నవి వుంటాయి. తిక్కన అనగానే నాటకీయత గుర్తుకు వస్తుంది. కథ సంవాద రూపంలో ఉంటే నాటకీయత అనిపించుకుంటుంది. పాత్రలు ఒకరినొకరు సంబోధించుకోవడం, ప్రశ్నార్థకాలు నాటకీయతకు బలాన్ని యిస్తాయి. కృష్ణుడు రాయబారిగా కౌరవ సభలోకి వెళ్ళు సమయంలో పాండవులు తమ అభిప్రాయాన్ని చెబుతారు. అప్పుడు ద్రౌపది కూడా తన వేదనను కృష్ణునితో చెప్పుకుంటుంది. ఆమె కృష్ణునితో పలికిన మాటలలో నాటకీయత కన్పిస్తుంది.

" వారు బ్రాహ్మణులే యేకీడైన సైరింపగన్"............... కౌరవులు బ్రాహ్మణులు కారు కద అన్ని సహించుకొని ఉండటానికి.

" బాండవుల్ పోటున కిచగింతురొకో పోదురో -
కానల నుండ సనచ్చుతా"

పాండవులు కౌరవులతో యుద్ధం చేస్తారా లేక మరలా అడవులకు పోతారా !

"కులాంగన నిట్లోనర్తురె" ........... రాజసూయ యాగమునందు సూచియైన నావేణి పట్టుకొని సభకు ఈడ్చి తెచ్చారు. కుల స్త్రీని యిలా చేస్తారా:

"మాధవా నిశ్చయింపుమా" - పాండవుల మాటలను బట్టి ఇప్పుడు ధృతరాష్ట్రునికి కోడలుగా రావాలా, లేక దాసీగా రావాలా! మాధవా నీవు నిశ్చయం చేయి అంటూ కృష్ణునితో పలికిన మాటలలో సంభాషణలతో కూడిన నాటకీయత కన్పిస్తుంది.

అలాగే ఉత్తర గోగ్రహణ ఘట్టంలో కౌరవులు విరాటుని గోవులను ముట్టడించి తీసుకొని పోవు సందర్భంలో ఉత్తరుడు కౌరవులతో యుద్ధం చేయుటకై వెళ్ళడానికి సరియైన సారథి లేడని అంటాడు. అప్పుడు సైరంధ్రి వేషంలో ఉన్న ద్రౌపది బృహన్నలకు సారథ్యం వచ్చునని చెబుతుంది. ఉత్తరుని చెల్లెలు ఉత్తర బృహన్నల దగ్గర నాట్యం నేర్చుకుంటుంది. ఆ చనువుతో ఉత్తర బృహన్నలను పిలవడానికి నర్తనశాలకు వచ్చినపుడు వారి మాటలలో నాటకీయ లక్షణాలు కన్పిస్తాయి.

"నీకందువ సైరంధ్రి చెప్పినం బ్రియం బంది నిన్ను దోడ్తేర నన్ను బనిచిన నేనును నీ పాల చనువు కలుగుటం చేసి యొల్ల విధంబులల దెత్తునని బూని వచ్చితి నీవును నా పలుకులు కుఱచ చేయక............."

అని ముద్దుసేసి....... ఆ మాటలకు నవ్విన బృహన్నల "జగదీశ్వర పుత్రీ నాకు సారద్యము నేర్పు గలదే"..........."భవదీయ ప్రార్థనచే ......... అడనగ నేల అంబుజ వదనా" అని మెల మెల్లగా బయలు దేరి ఉత్తర కుమారుని చెంతకు వెళతారు. యుద్ధానికి ఉత్తరుడు బృహన్నల వెళ్ళునపుడు కౌరవ సైన్యం చూచి ఉత్తరుడు భయంతో రధాన్ని వెనక్కు త్రిప్పమని, ప్రాణాల మీద ఎవరికి తీపి వుండదు అని ఉత్తరుడు అడుగు సందర్భంలో హాస్యంతో కూడిన నాటకీయత కన్పిస్తుంది.

" కౌరవ సేన జూచి వటకం దొడగెన్ మది తోన మేను నీ
పూరక పోవు చుక్కి యిది యొప్పనే యిప్పటి భంగి జూచిన
న్విరల నేను మూర్కొనమి నిశ్చయ మట్లగుటన్ రయంబునం
దేరు మరల్చు ప్రాణముల్ తీపనమున్ వినవే బృహన్నలా!"

సంజయ రాయభార ఘట్టము నాటకీయ శైలికి ఉదాహరణగా వుంది. ఈ విధంగా తిక్కన మనస్తత్వాన్ని చిత్రించడంలోనూ, సంభాషణా చాతుర్యం లోను నాటకీయ శైలిని పోషించాడు.

## 6.6 వర్ణనా శిల్పం:

తిక్కన వర్ణనలు రసాను గుణాలై దృశ్యములను పఠితలకు సాక్షాత్కరింప చేస్తాయి. తిక్కన స్త్రీలను కాక వారు నడిచేటప్పుడు, నవ్వేటప్పుడు, పలుకునప్పుడు కలిగే సౌందర్యాన్నే ఎక్కువగా వర్ణించాడు. ఉత్తర కొలువు కూటమునకు వచ్చిన తీరును "నలురు విలుతు పువుటమ్ము" అని వర్ణించాడు. స్త్రీ పర్వంలో

"చేతులు నడుదల నేర్చుటుత్కట శోకమాకారములు
దాల్చి నట్టులుండ.........గురుకుమార నారీ జనకోటి వచ్చె"

" కథను వేగంగా నడిపించటమే కానీ కథకు అడ్డుపడు వర్ణనలు సాధారణంగా చేయడు. ద్రౌపది దుఃఖానికి ప్రకృతి సహితం సానుభూతితో చూపి దుఃఖిస్తుంది అని వర్ణించాడు. "ద్రుపద నందన పరిభవ దుఃఖమునకు, నుల్లమున దుర పిల్చుచున్న సరసి", వేడి నిట్టూర్పులో యన వెడలి గ్రొత్త తావి మూతుల విచ్చు నెత్తమ్మి విరుల" - అట్లే తిక్కన చంద్రాస్తమయం, తారకలు ఉదయించుట మొదలగు ప్రకృతి వర్ణనలను కథకు అనుకూలంగా భావి సూచకంగా, అలంకార శోభితంగా కూర్చాడు. తిక్కన యుద్ధ పర్వాలందు యుద్ధ ఆరంభం విరామం సూచించడానికి దినాద్యంత సంధులనను వర్ణిస్తూ సూర్యుని ఉదయం అస్తమయాలతో పోల్చి ఆ వర్ణనలకు కథా సన్నివేశంలో సన్నిహితమైన సంబంధాన్ని కల్పించినాడు.

## 6.7 ఔచిత్య పోషణ:

తిక్కన రస పోషణ విధానం ప్రధానంగా ఔచిత్య పోషణ పై ఆధారపడి ఉంటుంది. ఈయన నిశితమైన లోక జ్ఞానం కలవాడు. కావున రస పోషణకై ఔచిత్యాన్ని పాటిస్తూ మూలాతిక్రమణం చేసి రచించినవి అనేకం భారతంలో వున్నాయి. ద్రౌపది విరాటుని సభలో ప్రవేశించి కీచకుని వలన తన భంగపాటును చెప్పుకొను సందర్భంలో సంస్కృత భారతం నందు ధర్మా ధర్మ స్వరూపాన్ని, తన భర్తల ప్రాభవాన్ని, తన తండ్రి శౌర్యాన్ని విపులంగా వర్ణించినట్లు కలదు. కానీ తిక్కన ఈ అనుచిత ప్రసంగాన్ని తొలగించి ధర్మజ ద్రౌపదుల సంభాషణలో నాటకీయతను ప్రదర్శించి వ్యంగ్య వైభవంలో రసపరిపోషణ గావించాడు.

" పలు పోకల బోవుచు విచ్చల విడి నాట్యంబు చూపు చాట్టున
-నిచటం
గులసతుల గఱువ చందము దొలగగ నిట్లనికి -
- దగునె తోయ జవదనా "

అని ధర్మజుడు మందలించినట్లు, అందుకు ద్రౌపది

" నాదు వల్లభుండు నటుడింత నిక్కంబు పెద్ద వారి యట్ల పిన్న వారు
గాన బతుల విధమ కాకయే శైలూషిగా ననంగ రాదు కంకభట్ట "

అంటూ సమాధానం మిచ్చింది. ద్రౌపది ప్రాగల్భ్యము ఇందు కనబడుతుంది.

**ఔచిత్యమును ఆదరించుట:** వ్యాసుడు వ్యక్తీకరించిన భావాలను తిక్కన స్వాయత్తము చేసుకొని పరమ విధేయతతో అనువదించిన భాగాలు కూడా అతని భారతంలో చాలా కనిపిస్తాయి. అజ్ఞాత వాసాంతాన ధర్మజుడు విరాటునికి కృతజ్ఞత వెల్లడించు సందర్భాను మూలంలో "గర్భవాస ఇవ ప్రజః " అను ఉపమానం వాడబడింది. దాని ఔచిత్యము గ్రహించి తిక్కన

" చాల దుస్తరమైన యజ్ఞాత వాస వత్సరంబు భవద్గర్భ వాస గుప్తి
వలన గడిపితి మతి సుఖావాప్త చిత్త, వృత్తి నేము - నిర్భయులమై విందులట్లు "

అని గర్భావాస పదాన్ని విడవక రమ్యంగా అనువదించాడు. సంజయుని పక్షపాత బుద్ధికి అలుక పొందిన ధర్మరాజు తమ యొక్క సామర్థ్యాన్ని చెప్పిన స్రగ్ధర పద్యంలో రౌద్ర రసం వ్యక్తీకరణ సమర్థవంతంగా ఉంది.

" గాండీవ జ్యారవం బుత్కటమయి పెనుచుం గ్రమ్మినన్ భీము బాహా
దండం బేపారి శుంభద్గద జడియుచు రౌద్రంబుగా దోచినన్ వే
దండ ద్వంద్వంబు మాడ్కిం దఱిమి కవలు మాద్యద్గతిం దాకినంజా
కుండం బోకుండ గౌరవ్యులకు వశమె బిట్టుల్కి మార్చిల్లకుండన్ "

సౌప్తిక పర్వంలో భీభత్స భావానికి అనుగుణంగా స్రగ్ధకా పద్యాన్ని ప్రయోగించారు. 14 స్రగ్ధరా పద్యాలను ఈ పర్వంలో చెప్పారు. స్త్రీ పర్వంలో అరుదైన 38 విశేష వృత్తాలను వాడుటయే గాక ఉత్పల మాలాది వృత్తాలను వాడలేదు. ఈ విధంగా తిక్కన వృత్తాలను ప్రయోగించుటలో కూడా ఔచిత్యాన్ని పాటించారు.

**రసోచిత పద గుంఫనము:** కవిబ్రహ్మ కవితా శిల్పానికి ప్రాణసమం రసోచిత పద గుంఫనము. ఇది కావ్య కళా మర్మజ్ఞతకు నికషోపలము. పాండవులు వనవాసానికి బయలుదేరు సందర్భంలో కుంతీదేవి తన కడగొట్టు కుమారుడు సహదేవుని గురించి ద్రౌపదితో చెప్పిన పద్యంలో తెలుగుతనం కలదు. " కడు పసి బిడ్డ వీడొకటి గాదవు నా నెఱుగండు " ఇచట కుంతి తన కుమారునికి కల్గిన దుస్థితిని తలచుకొని దుఃఖిస్తున్న తెలుగు తల్లిలా కన్పిస్తుంది. తిక్కన రౌద్ర భయానకాదులను వరిణించునపుడు తదానుకూలమైన దీర్ఘ సమాసాలను వాడాడు. శృంగార, కరుణ రసాలను వర్ణించునపుడు అలతి అలతి తెలుగు పదాలతో రమ్యంగా వర్ణించాడు.

అజ్ఞాత వాస సమయంలో ద్రౌపది గురించి " ఇది కడు ముద్దురాలు పనులేమియు చేయగనేరదు ఎంతయున్ " అని వర్ణించాడు. తిక్కన పదౌచిత్యానికి అనేక నిదర్శనాలను చూపవచ్చు. కీచకుడు సైరంధ్రి వేషంలో ఉన్న ద్రౌపది రాకకై ఎదురు చూచినాడట. అని మత్తెక్కించు మదిరాన్ని తెస్తున్న ద్రౌపదిని మత్తు కన్నులు అని వర్ణించాడు. కీచకుడు మదిరాసక్తుడు. ద్రౌపది (సైరంధ్రి) ప్రసన్న నేత్రాలు సైతం ఆ కామార్తునికి, మదిరాక్షులుగా కన్పించుట ఔచిత్యము. వ్యవహారాను గుణమైన వాక్య రచన తిక్కన కవిత్వంలో చాలా చోట్ల కన్పిస్తుంది.

**రస ధ్వని:** తిక్కన రస పోషణలో సిద్ద హస్తుడు. కావ్యానికి ధ్వని ఆత్మ. ధ్వని అంటే వ్యంగ్యం. తిక్కన ద్రౌపది పాత్రను ఉత్తమమైన తెలుగు వనితగా తీర్చిదిద్ది ఆమె మాట్లాడే ప్రతి మాటలో వ్యంగ్యాన్ని చొప్పించి చక్కని రస ధ్వనిని ప్రదర్శించాడు. అలంకార ప్రయోగం కూడా రస పోషణలో ఒక భాగము. కృష్ణుడు రాయభారానికి వెళ్ళే సందర్భములో ద్రౌపది తన ఆవేదన చెప్పు సందర్భములో తాను అనవలసినవి, చెప్పవలసినవీ చెప్పి, చివరకు కృష్ణునికి వివేకం కోల్పోయి నేను మాట్లాడుచున్నాను అని అనుమానాన్ని వ్యక్తం చేస్తుంది. " వీరడి యై మానసికి వెండి వివేకము కలుగ నేర్చునే " అన్న మాటలో అర్థాంతరన్యాసాలంకారమున్నది. కోపంలో వున్న వ్యక్తి వివేకాన్ని కోల్పోతాడు. అను తన మాటలను కోపంతో సమర్థించుకుంటున్న వైనాన్ని తిక్కన చక్కగా చెప్పాడు. అలాగే ద్రౌపది తన జుట్టు ముడి విప్పి పటులుకొన అది " నల్లని త్రాచు పాము " అన్నట్లున్నదని ఉత్ప్రేక్షాలంకారంలో వర్ణించాడు. అలంకారాలలో రౌద్ర రసం, కరుణ రసం ఒప్పించి చక్కని రస పోషణ చేశాడు తిక్కన.

తిక్కన భాషా ప్రయోగ వైభవం, పద బంధ విన్యాస ప్రభావము అపూర్వం, అనితర సాధ్యం తిక్కన ఉపమాలంకారాలను, జాతీయ పద బంధాలను వాడాడు.

'మడుగు చీర యందు మసి దాకినట్లు'
'పగయ కలిగెనేని పామున్న ఇంటిలో'
'పాలలో బడిన పిల్లి విధంబున .......'

భారతాంధ్రీకరణాన ఎంతో క్లిష్టమైన భావనైనను, తెలుగులోను శక్తివంతముగా చెప్పుట, సంస్కృత జాతీయాలను తెలుగు చేసి చూపుట, సామెతలను ప్రయోగించుట కొన్ని చోట్ల సంప్రదాయ సారమైన వాక్య నిర్మాణం తెలుగురాని వారికి కూడా సులభంగా అర్థమయ్యేటట్లు భావ ప్రధానంగా ఉండటం తిక్కన ప్రత్యేకతలు.

భారతాంధ్రీకరణలో ద్వితీయుడైనా అద్వితీయ స్థానం ఆక్రమించిన తిక్కన కవితా శిల్పము అనన్య సామాన్యము, అతని అమృత లేఖిని ఆంధ్రావళికి మోదం కలిగించింది.

**ఇతర పద్యాలు ఉత్తర గోగ్రహణము:** " కౌరవ సైన కాదు త్రి జగంబుల నొక్కటి నెత్తి వచ్చినం
దేరు బృహన్నలావశ గతిం జరియించిన గెల్వి వచ్చుద
ద్విర గుణంబు సొంపు పృధివీ వరనందన మున్నె ఋంగుందు
గారణ జన్మయై తను వికారము వచ్చిన బెంపు దప్పునే "
ఖాండవ మేర్చునపుడు తగన్ రథ చోదక వృత్తి సల్పియా
బాండవ సూతికిన్ జయము కల్గ నొనర్చిన యట్టి బుద్ధియున్
దండి తనంబు నీయెడన తక్కెనె నాదెస మైత్రి పెన్పు మిం
కొండొక మాట తక్కుము రణోత్సహనం బొనరింపు గ్రక్కునన్

కౌరవులు విరాటుని గోవులను తోలు కొని వెళ్ళు సందర్భమున వాళ్ళతో యుద్ధము చేయ తలచిన విరాటుని కొడుకు ఉత్తరునితో బృహన్నల (అర్జునుని) యొక్క గొప్పతనము ద్రౌపది వివరిస్తున్న సందర్భంలోనివి ఈ పద్యములు.

## పరీక్ష దృశ్య ప్రశ్నలు - జవాబులు:

**1. తిక్కన భారత రచనను ఉత్తమ అధికారి - వివరించండి.**

జ. తిక్కన నెల్లూరుని పాలించిన మనుమసిద్ధి మహారాజు ఆస్థాన మండలి మహా మంత్రి. బహుముఖ ప్రజ్ఞావంతుడు. భారత రచనా కాలం నాటికి మహాజ్ఞాని. కవిబ్రహ్మ. వినయ భుషణుడు, కారణ జన్ముడైన పూర్ణ పురుషుడు.

" అమలోదాత్త మనీష నేనుభయ కావ్య ప్రౌఢి పాటించు శిల్పమునన్ " అని తిక్కన తన నిర్వచనోత్తర రామాయణం అవతారికలో తనను గూర్చి చెప్పుకున్నాడు. 'ఉభయ కావ్య ప్రౌఢి' అనగా పద్య, గద్యము రెండింటిలోను ప్రౌఢి అని అర్థము. ఉభయ కావ్య ప్రౌఢి అను మాట వ్యర్థము. మరొక అర్థములో దృశ్య, శ్రవ్య ప్రౌఢి అని చెప్పవచ్చును. దృశ్య కావ్యంలోని కవి ప్రయోగం సూచనలు తప్ప కవికృత వివరణములు ఉండవు. పాత్ర ముఖ సంభాషణలు వుంటాయి. శ్రవ్య కావ్యము నందు కవి కృత వివరణలు, పాత్రముఖ సంభాషణలుగా ఉంటాయి. పాత్ర ముఖ సంభాషణలు కేవలం దృశ్య కావ్య లక్షణమే కాక శ్రవ్య కావ్య లక్షణం కూడా. తిక్కన శ్రవ్య కావ్యంలో దృశ్య కావ్య సంపత్తి కలిగే విధంగా రచించాడు. శ్రవ్య కావ్యంలో దృశ్య కావ్యాన్ని ఆపాదింప చేశాడు. అలాగే తాను సంస్కృతాంధ్ర రచనలందు చతురుడు. కావున సంస్కృత కావ్య రచనలోనూ, ఆంధ్ర కావ్య రచనలోనూ శిల్పమున పారగుడను అని నిరూపించుకున్నాడు. పంచమ వేదమైన భారతాన్ని సవిమర్శగా పరిశీలించినచో అందు మూడు ముఖ్య విషయాలు గోచరిస్తాయి. అవి 1. రాజనీతి 2. యుద్ధ తంత్రం 3. బ్రహ్మ విద్యోపదేశం. పుట్టుక, నడవడి, విజ్ఞానం ఈ ధర్మాలను ఆత్మ ధర్మాలుగా చేసుకొని అనుభవానికి తెచ్చుకొన్న కవి తెలుగు నాట తిక్కన ఒక్కడే. మహా ఉదాత్తమైన జీవితాన్ని గడిపిన తిక్కన భారత రచన చేయడానికి ఉత్తమాధికారి అయ్యాడు.

**తిక్కన రాజనీతిజ్ఞత:** తిక్కన రాజనీతి తెలిసిన వాడు కనుకనే అది అతని జీవితానికి, కావ్య రచన చేయడానికి ఉపకరించినది. స్వయంగా మనుమసిద్ధి తరపున గణపతి దేవునితో రాయభారము నడిపి విజయం సాధించిన లౌకికుడు. భారత రాయభార ఘట్టాలందు ఆయన ప్రదర్శించిన రాజనీతి పరిజ్ఞానం, వాక్చాతుర్యం, సంభాషణా ఔచిత్యం, మేధాశక్తి అసమానములు. భారతంలోని సంజయ, శ్రీకృష్ణ రాయబారాలను వర్ణించునపుడు మూలంలో లేని పెక్కు భావాలను కల్పించాడు. సంజయుడు ధృతరాష్ట్ర వర్గములోని వాడు. మేధావి. రాజకీయాలలో ఆరి తేరిన నీతిజ్ఞుడు. ముఖ ప్రీతితో మాట్లాడుటలో నేర్పరి. తిక్కన చిత్రించిన ధర్మరాజు లౌక్యాన్ని జీర్ణించుకున్న మెత్తని పులి. కృష్ణుని రాయబారిగా కౌరవుల దగ్గరకు పంపునపుడు ధర్మరాజు నీవే మాకు ఆప్తుడవు, ఆపదలు పోగొట్టి శుభం చేకూర్చ వాడవు, మాకు జన్మనిచ్చిన పాండురాజు నిన్ను మాకు చూపించినాడు. తండ్రి లేని మాకు నీవే దిక్కు అంటూ పల్కుతూ

" ఆపద గడవం బెట్టగ, నోపి శుభంబైన దాని నొడగూర్పను మా
కీ పుట్టువునకు బాండుక్ష్మాపాలుడు నిన్ను జూపి చనియెమహాత్మా "

ఎవరితోఎప్పుడు ఎట్లా భావ గర్భితంగా మాట్లాడాలో తిక్కనకు తెలుసు. ధర్మరాజు కృష్ణునితో పలుకు ఈ మాటలలో కార్యజ్ఞత, పలుకుల పొందిక కనబడుతుంది.

" మమ్మెఱుగు దెదిరినెఱుగుదు, నెమ్మి యెఱుగు దర్థ సిద్ధి నెఱి -
- యెఱుగుదువా
క్యమ్ముల పద్ధతి నెఱుగుదు పామెవ్వడ నేను నీకు బుద్ధు సెప్పన్ "

రాయభార ఘట్టంలో శ్రీ కృష్ణుడు ప్రదర్శించిన చాతుర్యము రాజకీయ రంగమున తిక్కన గడించిన అపారమైన అనుభవానికి చక్కని నిదర్శనం. కేవలం రాయభార ఘట్టాలందే కాక విదురుడు దృతరాష్ట్రునికి ధర్మోపదేశము చేయు సన్నివేశములందును తిక్కన సందర్భోచితంగా ఆయా పాత్రల చేత పలికించిన రాజనీతి సూత్రాలు దేశ కాల వివక్షత లేక ప్రభువులందరికి శిరోధార్యములైనవి.

" జనకుల నొడ బాటగు విధమున నడుచుచు లోక నింద్యముల
నడుగుచుమీ
దని యొకని కలిమి కులుకక, మనుజులతో బొంది పొసగగ

మనుటొప్పు నృపా ''

ఇలాంటి ధర్మ సూత్రాలు తిక్కన చాలా చెప్పాడు. ఈ విధంగా తిక్కన రాజనీతి యెరుగుటయే కాక స్వయంగా రాయబారం చేసి ఆచరణలో పెట్టిన నేర్పరి. కావున భారత రచనకు ఉత్తమ అధికారి అయ్యాడు.

## 6.8 తిక్కన యుద్ధ తంత్ర వర్ణన:

తిక్కన కార్య దక్షుడైన మహా మంత్రియే కాక, అవసరమైనచో కవచ ఖడ్గదారియై రణరంగాన వీర విహారం చేసిన సేనాపతి. తన నిర్వచనోత్తర రామాయణములో యుద్ధం చేయకపోయినా చాలా యుద్ధ తంత్రాలను ద్వంద్వ సంకులాది సమర భేదాలను, వ్యాస భారతంలో వాని బహువిధ వ్యూహ నిర్మాణ విధానాలను పరిష్కరించి తన భారతంలో విశదంగా వర్ణించాడు. తిక్కన యుద్ధ భూమిని చిత్ర విచిత్రంగా ఊహించాడు. వీర భీభత్స భయానక రస ప్రధానమైన యుద్ధ భూమి అతనికి సుందర దృశ్యముగా కన్పించుట విశేషము. కౌరవులు ఏర్పాటు చేసిన పద్మ వ్యూహంలో అభిమన్యుడు మరణించాడు. నెత్తుటి మధ్యలో నున్న అభిమన్యుడు చంద్రునిలా కన్పించాడు. అని వర్ణించాడు.

" నెత్తుటి దోగి నేల యఱ నింగి తెఱంగున నుండె, నక్కుమా
రోత్తముడందు జంద్రుక్రియ నొప్పె, సితాయుధ ఖండ భూషణో
దాత్తమణి వ్రతానములు తారల చందము నొంది యలదమై
యత్తఱి నుల్లసిల్లె, వసుధాధిప చూపఱపిండు చూడ్కికినే ''

అలాగే ధర్మరాజు శక్తిచే నేలకూలిన శల్యుని -

" భూమి మీద నిట్లు బోరగిలంబడి, మద్రనాథుడొప్పె మానవేంద్ర
లేమయురము నందె లీలమై వ్రాలిన ప్రాణనాథు బోల్ప బట్టుగాగ ''

అని వర్ణించాడు. ఒళ్ళు గగుర్పొడుచు దృశ్యాలను కూడా తిక్కన పరమ సుందరముగా వర్ణించాడు.

" సంగరాంగణము రమణీయమును భీషణంబు '' అని స్పష్టంగా పేర్కొన్నాడు.

**తిక్కన చిత్రించిన కుంతీ - ద్రౌపతులు:** మహాభారతంలో విభిన్న మనస్తత్వాలు గల పాత్రలెన్నో వున్నాయి. తిక్కన చిత్రించిన ద్రౌపది అభిమాన వంతురాలు. అవమానం భరించలేదు. అలా అవమానించిన వానిని అంతము చూడవలెనని కోరికతో భర్తలను పురి కొల్పుతుంది. అందుకు రాయభారానికి వెళుతున్న కృష్ణునితో తన మనసులోని ఆవేదన అంతా తెల్పుకుంటుంది. తనకు జరిగిన అవమానాన్ని ఒక్కసారి జ్ఞాపకానికి తెచ్చుకోమంటుంది. తన ముడి ఒక్కసారిగా ఊడదీసి, జుట్టు పట్టుకొని చూపిస్తూ ప్రతీకారంతో

" ద్రోవది బంధురంబుయిన క్రొమ్ముడి గ్రమ్మున విడ్చి వెంద్రుకల్
దావల చేతబూని యసి తచ్చవి బొల్చు మహాభుజంగమో
నా విల్లసిల్లి వ్రేలగ, మనంబున బొంగు విషాద దోషముల్
గానగ లేక భాష్పములు గ్రమ్మగ దిగ్గన లేచి యార్తయై ''

" ఇవి దుస్ససేన వ్రేళ్ళం దవిలి సగము ద్రెవ్విపోయి దక్కినయవి కౌరవుల కడు దీఱు మాటల, యవసరమున దలప వలయు నచ్యుత వినిన్ కట్టి విక్రయంబు కాల్పనే? యిట్లు బన్నములు పడిన ధర్మనందనుండు నేను రాజ రాజు పీనుంగు గన్నార గానబడయ మైతి మేని గృష్ణా '' అని పల్కుతుంది. దీనిలో ద్రౌపది హావ భావాలు చేష్టలను తిక్కన కనులకు కట్టినట్లు చిత్రించాడు. వీరపత్ని, వీరవనిత, యైన ద్రౌపది మాటలు రానున్న భారత యుద్ధానికి నాంది పలికాయి.

ఇక కుంతి పరుల పంచన పడియున్న పరాధీనురాలు. రాయభారమునకు వచ్చిన తన మేనల్లుడు కృష్ణుని చూసి అసహాయంగా ఎలా దుఃఖించిందో తిక్కన చక్కగా చిత్రించాడు.

" ఇట్టి క్రూరుల కిచ్చిన మనవారి నందు'' అని అచ్చంగా తెలుగు ఆడపడుచు దుఃఖించినట్లుగా మహారాణి కుంతీని సామాన్య స్త్రీ దుఃఖించినట్లుగా చిత్రించాడు. పాండవులకు తన మాటగా కృష్ణునితో "భుజ బలమున జీవించుట నిజ దర్మము. మెత్తబడుట నింద్యం'' పాండవులను మెత్తబడక యుద్ధానికి సిద్ధం కమ్మని చెప్పమంది, కౌరవులతో రాయభారము విఫలమైనపుడు మరలా కృష్ణుడు కుంతి దగ్గరకు పోగా పాండవులకు ఈ విధంబుగా ఉపదేశం పంపించింది.

" రాజుల కెందు నారయ బరాక్రమ జీవన వృత్తి దక్క నొం
డొంజ నిషిద్ధ మంద్రు మునులుత్తమ సత్వులు వంశ ధర్మముల్
పూజిత భంగి జేయుదురు బుద్ధి విహీనులు వాని దక్కిని
స్తేజపు గూటి కియ్యకొని దీనత బొందురు రంబు జోదరా ! ''

కుంతీ ద్రౌపదిలిద్దరూ పరాభవాన్ని సహింపరు, ప్రతీకారం తీర్చుకోవడమే వారి కోరిక. చివరకు వారు కోరినట్లే జరిగింది.

ఈ విధముగా మనస్తత్వ చిత్రీకరణ చేయవలెనన్న మనోవిజ్ఞాన వేత్తకు మాత్రమే సాధ్యమవుతుంది. అలాంటి విజ్ఞాన వేత్త తిక్కన కావున అతనికే భారతాన్ని వ్రాయగల అధికారం వుంది.

## 6.9 బ్రహ్మవిద్యోపదేశం:

లోక కళ్యాణానికై శైవ వైష్ణవ స్పర్థలను పోగొట్టడానికి తిక్కన చేసిన కృషి హరిహరాద్వైత స్థాపన. ఈ మత స్థాపనలో అధ్యాత్మిక జగత్తుకు కూడా నూతన మార్గన్ని చూపాడు. సకల దేవతా ద్వైతమును, సర్వ మానవ సౌభ్రాత్రమును ఆశించిన మహానుభావుడు తిక్కన. దాని స్థాపన వలన ప్రజలలో పాప భీతి, విశాల దృక్పథం, ధర్మ నిరతి మొదలగు గుణాలను పెంచుట ముఖ్య ఉద్దేశం. ధర్మాద్వైతం యోగం, తపం, యజ్ఞం మొదలగున్నవి తిక్కన అభిమాన విషయాలు వాటి విశిష్టతను భారతంలో చాలా చోట్ల వివరించాడు. నిర్మలమైన మనసుకు సాధ్యమగు బ్రహ్మజ్ఞానము అతని ధ్యేయం. శైలిని బట్టే కాక ఇతర యోగ్యతలను బట్టి మహా భారత రచనాధికారం తిక్కనకు తప్ప మరొక కవికి లేదు. తిక్కన రాజనీతిజ్ఞుడుగా కంటే అసమాన కవిగా లోక ప్రసిద్ధి చెందాడు.

**తిక్కన ఇతర కృతులు:**

**1. విజయసేనము:** విజయసేనము, విక్రమసేనము అను రెండు కావ్యాలు లభ్యం కాలేదు. కాని అందులోనివి ఒక 15 పద్యాలు మాత్రం లభించాయి. అందులో రెండు వినాయక ప్రార్థన, రెండు పద్యాలు పుర వర్ణన, రెడు పద్యాలు వైశ్యులు, వారి అమ్మకము వర్ణింపబడ్డాయి. కథా నాయకుడైన విజయ సేనుని వర్ణనకు సంబంధించిన పద్యం ఒకటి, రాజ నీతికి సంబంధించిన పద్యాలు మూడు ఉన్నాయి. దీనిని నిర్వచనోత్తర రామాయణానికి ముందే రచించాడు.

**2. ఆంధ్ర శబ్ద చింతామణి:** తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయంలో 36 పంక్తుల తాళ పత్ర గ్రంథంలో ఒక పద్యం తిక్కన రచించినట్లు తెలుస్తున్నది.

**3. కృష్ణ శతకము:** కృష్ణ శతకము రచించాడని కొందరంటున్నారు. కాని ఇది ఇంత వరకూ లభ్యము కాలేదు.

**4. సంస్కృత రచనలు:** తిక్కనకు ఉభయ కవి మిత్రుడు అను బిరుదు ఉంది. సంస్కృతాంధ్రాలలో ప్రావీణ్యం ఉన్నందు వల్ల అతనికి ఉభయ కవి మిత్రుడు అనే బిరుదు వచ్చిందని కేతన వర్ణించాడు. తిక్కన వ్రాసిన సంస్కృత శ్లోకములు రెండే మనకు లభిస్తున్నాయి. అందొకటి నిర్వచనోత్తర రామాయణ మందలి ఆరంభ మంగళ శ్లోకము.

" శ్రీ రాస్తాం మనుమ క్షితీశ్వర భుజాస్త మ్భే జగన్మణ్డల
ప్రాసాద స్థిర భారభాజి దధతీ సాలభఞ్జీ శ్రియం
శుణ్డా లోత్తమ గణ్డ భిత్తిషు మధ వ్యాసఙ్గ వశ్యాత్మనాం
యాముత్తేజ యతేతరాం యధులిహా మావద్ద సాన్ద్రా స్థితిః"

ఇక రెండవది విరాట పర్వారంభం నందలి హరిహరనాథ వర్ణన శ్లోకము

" కిమస్థిమాలాం కిము కౌస్తు భంవా, పరిష్క్రియాయాం
బహుమన్య సేత్యం
కింకాల కూటః కిమువా యశోదాస్తన్యం తవ స్వాదు
వద ప్రభేమే "

**నిర్వచనోత్తర రామాయణం:** తిక్కన నిర్వచనోత్తర రామాయణావతారికలో "అమలోదాత్త మనీష నేను భయ కావ్య ప్రౌఢి బాటించు శిల్పమునం బారగుడం గళా విదుడ " నని చెప్పుకొన్నాడు. అప్పుడే కొత్తగా రాజ్యానికి రత్నదీపమైన శ్రీరాముడి చరిత్రను రచించి మనుమసిద్ధికి కానుకగా ఇచ్చాడు. పూర్వ రామాయణం ఉండగా తిక్కన ఈ కథను ఎందుకు తీసుకున్నాడని అనుమానం కలుగుతోంది. అందుకు

" ఎత్తఱినైనను ధీరో
దాత్త నృపోత్తముడు రామధరణీ పతి స
ద్వృత్తమ సంభావ్య మగుట
నుత్తర రామాయణోక్తి యుక్తుడ నైతిన్ "

అని చెప్పుకున్నాడు. ధీరోదాత్తుడగు రాముని కథను ఎక్కడ నుండి అయినా చెప్పుకోవచ్చు అని అతని ఉద్దేశం.

శ్రీరాముడు అరణ్యావాసానంతరం అయోధ్యకు తిరిగి వచ్చి రాజ్యాభిషక్తుడగుటతో ఈ కావ్యము ప్రారంభమవుతుంది. ఉత్తర రామాయణం అను వాల్మీకి సప్తమ కాండం ఆధారంగా నిర్వచనంగా తిక్కన ఈ కావ్యాన్ని రచించాడనడంతో నిర్వచనోత్తర రామాయణం అని పేరు వచ్చింది. ఇది మొత్తం 10 ఆశ్వాసాల కావ్యము. రావణాదుల కథ వారి పూర్వుల చరిత్ర పరాక్రమాదులు మొదటి యేడాశ్వాసాలలో వర్ణించబడ్డాయి. తరువాత '3' ఆశ్వాసాలలో సీతా పరిత్యాగం, లవణాసురవధ, అశ్వమేధయాగం, నిర్వహాణం, రామ కుశలవుల సమాగమం, సీత భూదేవిని చేరుట మొదలగున్నవి వర్ణించబడ్డాయి.

నిర్వచనోత్తర రామాయణ మందలి వర్ణనలు భారత మందలి వర్ణనలకు ధీటైనవి.

షష్ఠాశ్వాసంలో రావణాసురుడు కైలాసాన్ని చేరి ఆ పరిసర ప్రాంతాలను చూచి ఆనందించిన విధానాన్ని తిక్కన నాలుగు పద్యాలలో వర్ణించాడు.

" సెలయేఱు వాఱ జెలువగు
శిల పై దజ్జలము దిగుచు సింధుర ఏలిచూ
డ్కుల కొప్పె బుండరీక
స్థలమున మకరందమాను షట్పదము క్రియన్ "

శిల పై నిలచిన సెలయేటి నీటిని తొండంతో పీలుస్తున్న ఏనుగు దెల్ల కలుపై నుండి మకరందాన్ని పీల్చే తుమ్మెదలా ఉందట. తిక్కన రచన నాటకీయంగా ఉంటుందని విమర్శకుల అభిప్రాయం. నిర్వచనోత్తర రామాయణంలో రావణుడు కుబేరుని దూతను సంహరించుట, వాలిని బంధింపబోయి భంగ పడుట, భర్త తనను జనాప వాదం వల్ల విడనాడాడని తెలిసిన వెంటనే సీత మూర్ఛిల్లి తరువాత విలపించడం మొదలైన సన్నివేశాలు కన్నులకు కట్టినట్లు వర్ణించాడు. ఈ కావ్యంతంలో రామ నిర్వాణమును పరిహరించి

నిర్వచనోత్తర రామాయణం స్వయం సంపూర్ణం మంగళాతం అయిన ఒక స్వతంత్ర కావ్యంగా సృష్టించాడు. ఈ రచన వల్ల తిక్కన కావ్య శిల్ప పారగుడైన మహాకవిగా పేరు పొందాడు.

## 6.10 తిక్కన సమకాలికులు:

**6.10.1 మూల ఘటిక కేతన:** తిక్కన సమకాలికులలో ఇతడు ముఖ్యుడు. తన సంస్కృత దశ కుమార చరిత్రను తిక్కనకు అంకిత మిచ్చాడు. ఇది చంపూ కావ్యం. దశ కుమార చరిత్ర, ఆంధ్ర భాషా భూషణం, విజ్ఞానేశ్వరీయం అనే మూడు గ్రంథాలు ఇతను రచించాడు. దశ కుమార చరిత్ర తెలుగులో తొలి కథా కావ్యము. కేతన కవిత్వంలో జటిల సమాసాలు కాని, అన్వయ కాఠిన్యం కాని ఉండవు. ఆంధ్ర భాషా భూషణం తెలుగులో తెలుగు భాషకు కేతన 196 పద్యాలలో చెప్పిన మొట్ట మొదటి స్వతంత్ర వ్యాకరణం. ఇందు కేతన తెలుగు, తెనుగు అను రెండు శబ్దాలను వాడాడు. విజ్ఞానీశ్వరీయం తెలుగు భాషలో మొట్ట మొదటి ధర్మ శాస్త్ర గ్రంథం. ఇందు మూడు ఆశ్వాసాలున్నాయి. 433 పద్యాలున్నాయి. దీని వలన ఆనాటి ఆచార వ్యవహారాలు చక్కగా తెలుస్తాయి.

**6.10.2 మారన:** ఇతడు తిక్కన శిష్యుడు. ఇతడు రచించిన మార్కండేయ పురాణం ప్రథమాంధ్ర పురాణము. తిక్కన అనుగ్రహం వలన తనకు కవితా శక్తి అబ్బిందని మార్కండేయ పురాణం ఆశ్వాసాంత గద్యలో చెప్పాడు. అష్టాదశ పురాణాలలో మార్కండేయ పురాణం ఏడవది. మహాభారతంలో సంపూర్ణములు కాక సంశయములో నున్న కథలను మార్కండేయ పురాణం వివరిస్తుంది. ఇది 8 ఆశ్వాసాలలో సుమారు 2547 గద్య పద్యాలతో వుంది. వర్ణాశ్రయ ధర్మాలు, శ్రద్ధ నియమాలు, పురాతన వంశావళి మొదలైనవి ఈ పురాణంలో చాలా ఎక్కువ. ఇందు మహిషాను మర్థినం, శుంభ నిశుంభల కథలను మారన ఉత్తేజకరంగా అనువదించాడు.

**6.10.3 మంచన:** ఇతడు రచించినది కేయూర బాహు చరిత్ర ఇది చంపువులో స్వతంత్ర కావ్యం. ఇందులో పంచతంత్ర హితోపదేశముల నుండి కొన్ని కథలను గ్రహించి తన కాలాన జన సామాన్యంలో వాడుకలో ఉన్న కొన్ని కథలను కల్పించి మొత్తం "22" కథలు "కేయూర బాహు చరిత్ర"లో చేర్చాడు. అతను సంగ్రహంగా కథలు చెప్పుట రచనలోని గొప్ప నేర్పు. ఈయన కవిత్వం సలక్షణం, సరసం అయింది. అతని పద భావ సంపద, రచనా ప్రౌఢిమ, ధారాశుద్ధి ఎన్నదగినవి. అతని శైలి సరళమైన కథాకథన పద్ధతికి చెందింది.

**6.10.4 బద్దెన:** ఇతడు చిన్న సామంత రాజు. నీతిశాస్త్ర ముక్తావళి అనే రాజనీతి గ్రంథాన్ని రచించాడు. 162 పద్యాలున్నాయి. రాజనీతి పద్ధతి, మంత్రి పద్ధతి, ఉపాయ పద్ధతి మొదలైన వాటి పై నీతి బోధకాలైన పద్యాలున్నాయి. ఇతని శైలి రమ్యమై మృదువుగా ఉంటుంది. అన్వయ కాఠిన్యం ఉండదు. చక్కని ఉపమానాలతో, లోకోక్తులతో రచన హృదయంగమంగా ఉంటుంది.

## 6.11 మాదిరి ప్రశ్నలు:

1. తిక్కన కవితా తత్త్వాన్ని వివరించండి.
2. తిక్కన తెలుగుదనాన్ని విశ్లేషించండి.
3. తిక్కన నాటకీయతను వివరించండి.

## 6.12 ఆధార గ్రంథాలు:


తెలుగు సాహిత్య చరిత్ర - డా॥. జి. నాగయ్య ॥సం॥
తెలుగు భాషా చరిత్ర - భద్రిరాజు కృష్ణమూర్తి ॥సం॥
సమగ్ర ఆంధ్ర సాహిత్యము - ఆరుద్ర
చైతన్యలహరి - యువభారతి
తెలుగు కవుల చరిత్ర - నిడదవోలు వేంకట రావు


డా॥ బండారు జ్యోతి స్వరూప రాణి

పాఠం - 7

# ఎఱ్ఱాప్రెగడ

## పాఠ్యాంశ నిర్మాణ క్రమం


7.0 లక్ష్యం
7.1 ఎఱ్ఱన వ్యక్తిత్వం - జీవితం
7.2 ఆంధ్రీకరణ పద్ధతి
7.3 ఇతర పద్యాలు
7.4 ప్రబంధ పరమేశ్వరుని సూక్తి వైచిత్రి
7.5 ఎఱ్ఱన ఇతర కావ్యాలు
7.6 ఎఱ్ఱన సమకాలికులు
7.6.1 నాచన సోమన
7.6.2 విన్నకోట పెద్దన
7.6.3 రావిపాటి త్రిపురాంతకుడు
7.6.4 గణప నారాధ్యుడు
7.6.5 దౌనయామాత్యుడు
7.6.6 కొరవి సత్యనారాయణ
7.7 మాదిరి ప్రశ్నలు
7.8 ఆధార గ్రంథాలు


## 7.0 లక్ష్యం:

ప్రబంధ పరమేశ్వరుని సూక్తి వైచిత్రి, మహాభారత ఆంధ్రీకరణ పద్ధతులను వివరించటం ఈ పాఠం లక్ష్యం.

**"ఎఱ్ఱన":**

భారతాంధ్రీకరణ చేసిన ముగ్గురు కవులలో మూడవ వాడు ఎఱ్ఱన. ఎఱ్ఱన నన్నయ వదిలిన అరణ్య పర్వ శేష భాగాన్ని పూరించాడు. ఈ పర్వంలో సావిత్రు పాఖ్యానం, దుర్యోధన గర్వ భంగం, ఘోష యాత్ర, మొదలైన ఘట్టాలు ముఖ్యమైనవి.

## 7.1 ఎఱ్ఱన వ్యక్తిత్వం- జీవితం:

ఎఱ్ఱన పాకనాడులోని గుడ్లూరు గ్రామంలో నివసించాడు. ఇది మన్నేరు ఒడ్డున వుంది. ఇతడు శివ భక్తుడు. అందుకే అతనికి 'శంభుదాసుడు', 'శివదాసుడు' అను బిరుదులున్నాయి. నిజానికి ఎఱ్ఱనకు శంకర స్వామి అనే గురువు ఉన్నాడు. ఆయన శివ భక్తుడు. గురువు తోడి భక్తి శిష్యునికి అబ్బింది. అందుకే ఎఱ్ఱన శంభుదాసుడయ్యాడు. రామాయాణాన్ని వ్రాసి ముందుగా ప్రోలయ వేమా రెడ్డికి అంకితమిచ్చాడు. ప్రోలయ వేముని కోరికను అనుసరించి 'హరి వంశాన్ని' వ్రాశాడు. ఎఱ్ఱన 'హరి వంశం'లో 'నన్నయ భట్టు, తిక్కన కవినాధులు చూపిన త్రోవ పావనం బెన్న' అని స్తుతించాడు. హరి వంశం తర్వాత అరణ్య పర్వ శేషాన్ని

రచించాడు. నన్నయ అరణ్య పర్వం నాల్గవ ఆశ్వాసములోని

" శారద రాత్రులుజ్జ్వల లసత్తర తారక హార పంక్తులం
జారు తరంబులయ్యె వికసన్నవ కైరవ గంధ బంధురో
దార సమీర సౌరభము దాల్చి సుధాంశు వికీర్యమణ క
ర్పూర పాండు రుచి పురములం బరి పూరితంబులై"

అను 142వ పద్యం వరకు వ్రాశాడు. ఎఱ్ఱన

"స్ఫుర దరుణాంశు రాగ రుచి బొంపిరి వోయి నీరస్త నీరదా
వరణములై దళత్కమల వైభవ జృంభణ ముల్ల సిల్లను
ద్దుర తరహంస సారస మధు వ్రతి నిస్వనముల్ సెలంగగా
గరము వెలింగె వాసర ముఖంబులు శారద వేళ జూడగన్"

అను పద్యం నుండి ఆరంభం చేసి అరణ్యా పర్వం పూర్తి చేశాడు.

ఎఱ్ఱన అరణ్యా పర్వ శేషాన్ని అనువాదం చేస్తూ నన్నయ శైలినే అనుకరించాడు. నన్నయ లాగానే రాజ రాజ నరేంద్రుని సంబోధిస్తూ వ్రాశాడు. ఎఱ్ఱన సహజంగా నిగర్వి. మృదు స్వభావుడు. నృసింహ పురాణ రచనా కాలము నాటికి అతడు వినయ సంపన్నుడు. దైవాంకితముగా వ్రాసిన ఎఱ్ఱన నృసింహ పురాణం అతని వార్ధక్యంలో రచించిన చివరి రచన. ఈ రచనా కాలము నాటికి ఎఱ్ఱనకు "ప్రబంధ పరమేశ్వరుడు" అనే బిరుదు వుంది. ఈ నృసింహ పురాణములో చక్కని కావ్య శైలిని ప్రయోగించాడు. సందర్భాను కూలంగా వర్ణనలు చేశాడు. శ్రీనాథుడు "ప్రబంధ పరమేశ్వరుని సూక్తి వైచిత్రిని" ప్రశంసించాడు.

## 7.2 ఎఱ్ఱన ఆంధ్రీకరణ పద్ధతి:

భారతమును అనువాదము చేసిన వారిలో తృతీయుడు ఎఱ్ఱన. ఇతడు నన్నయ వదిలి పెట్టిన అరణ్య పర్వ శేషాన్ని నన్నయ శైలిని అనుకరిస్తూ అనువదించాడు. అరణ్యా పర్వాన్ని పూరించాడని తెలుపు పద్యాలున్నాయి. కానీ అరణ్యా పర్వ శేషాన్ని ఎఱ్ఱన రచించినట్లు అవతారిక గాని, అశ్వాసాంత గద్యగాని అరణ్యా పర్వంలో లేదు. నన్నయ భట్టు ప్రణీతం బనియే ఉంది.

ఎఱ్ఱన వంశీయుడైన చదలవాడ మల్లన తన విప్రనారాయణ చరిత్రలో " ప్రతిభతో నారణ్యా పర్వ శేషము జెప్ప గవులకు జెవుల పండువలు గాగ" అని ఎఱ్ఱన అరణ్యా పర్వ శేషాన్ని రచించినట్లుగా చెప్పాడు. "స్ఫురదరుణాంశు" అను పద్యము ఎఱ్ఱన మొదటి పద్యము అని అప్పకవి చెప్పాడు.

నన్నయ భారతంలో మధ్యాక్కరలు ఎక్కువగా వాడాడు. ఎఱ్ఱన ఏ ఇతర రచనలలోనూ మధ్యాకరలను వాడలేదు. కానీ అరణ్యా పర్వ శేషము నందు మాత్రము ఈ మధ్యాక్కరలు వున్నాయి. మధ్యాక్కర లక్షణ విషయాలలో నన్నయకు ఎఱ్ఱనకు భేదం ఉంది. నన్నయ మధ్యాక్కరలో అయిదవ గణాధ్యక్షరము యతి. కాగా ఎఱ్ఱన మధ్యాక్కరలో నాల్గవ గణాధ్యక్షరం యతి. ఈ యతి స్థాన నిర్ణయమే ఈ భాగం ఎఱ్ఱన రచించినట్లు తెలుస్తుంది. అరణ్యా పర్వ శేషం మూలంలో 5 వేల శ్లోకాలు ఉండగా ఎఱ్ఱన 1599 గద్య పద్యాలలో అనువదించాడు.

కథా వస్తు నిర్వహణలో కూడా నన్నయ, ఎఱ్ఱనలకు భేదం ఉంది. కర్ణ జనన వృత్తాంతం ఆది పర్వంలో 17 గద్య పద్యాలలో ఉంటే అరణ్యా పర్వంలో 46 గద్య పద్యాలలో ఉంది. ఆది పర్వంలో కర్ణుడు సద్యోగర్భంలో జన్మించినట్లు అరణ్యా పర్వ శేషంలో కుంతి అతనిని "10 మాసాలు" మోసి ప్రసవించినట్లు చెప్పబడింది. ఈ భాగాన్ని కూడా నన్నయ రచించి ఉంటే తాను వ్రాసిన దానికి విరుద్ధంగా ఎందుకు వ్రాస్తాడు.....? కాబట్టి ఈ అరణ్యా పర్వ శేషం ఎఱ్ఱన కృతమే అని తెలుస్తుంది. స్వభావంలో ఎఱ్ఱనది వర్ణనాత్మకమైన కవిత్వం. కుంతి పుట్టింట ఉన్నపుడు దుర్వాస మహామునికి సేవలు చేయడం వలన దుర్వాసుడు మెచ్చి కుంతికి ఒక

వరాన్ని ఇచ్చాడు. ఆ వర ప్రభావంతో ఏ పురుషుని ప్రార్థించినా అతని వల్ల ఒక కుమారుడు కలుగుతాడు. ఆ వరాన్ని పరీక్షింపదలచి కుంతి సూర్యుని ఆహ్వానించి కుమారుని కావాలని అడుగుతుంది. సూర్యుడు కొడుకు నిచ్చి వెళతాడు. కన్యగా ఉన్నప్పుడే కొడుకు పుట్టినందు వల్ల లోకాపవాదులు కలుగుతాయని భయం ఒక వంక, పుత్ర వాత్సల్యం ఒక వంక. ఈ రెండింటికి నడుమ కుంతి అనుభవించిన మనోవ్యధను ఎఱ్ఱన అరణ్య పర్వ శేషంలో ఎంతో హృదయ విదారంగా వర్ణించాడు.

నన్నయ శైలికి అరణ్య పర్వ శేషములో శైలికి కొన్ని పోలికలున్నాయి. ఎఱ్ఱన బుద్ధి పూర్వకముగాను నన్నయ రచించినట్లు ఉండాలని అతనిని అనుకరించడం వల్ల కొంత పోలిక ఉండకపోదు. నన్నయ ఇతిహాస శైలిని, తిక్కన నాటకీయ శైలిని గ్రహించి ఎఱ్ఱనభారతారణ్య పర్వ శేష భాగమును పూర్తి చేశాడు. నన్నయ ప్రసన్న కథా కవితార్థ యుక్తి, భాషా ప్రయోగ సౌందర్యము మొదలైన కవితా లక్షణాలు, తిక్కన నాటకీయత, మనః ప్రవృత్తి నిరూపణ, పాత్ర చిత్రణాది కవితా శిల్పము కొంత వరకూ గ్రహించి 'తద్రిచనాయక' చేసిన స్వతంత్ర రచన. ఎఱ్ఱనకు గల ప్రబంధ పరమేశ్వరుడు అను బిరుదు అరణ్య పర్వ శేష రచన వల్లనే వచ్చింది.

## 7.3 ఇతర పద్యాలు:

భారతంలో అరణ్య పర్వంలో దుర్యోధనుడు ఘోష యాత్ర నెపంతో పాండవులను అవమాన పరచాలని వెళ్ళి వారి చేతిలో తానే భంగ పడుటచే ఇక తన బ్రతుకు వ్యర్థమని తలంచుకొని ప్రాయోపవేశం చేయు సందర్భములో దుర్యోధనుని పాతాళ లోకమునకు దానవులు తీసుకొనిపోయి, అతడు ఆపని చేయుట అసంభవ మని, అతని దేహము సామాన్యమైనది కాదని, వజ్ర శిలా సంపాదితమైనదని, పూవు వలె కోమలమైనదని వర్ణించు సందర్భములో ఈ పద్యం చెప్పబడింది.

" నీ దగు పూర్వ దేహము వినిర్మల వజ్ర శిలా విశేష సం
పాదిత మస్త్ర శస్త్ర పరిపాటన భేద్యము గాదు, నిత్య నిః
ఖేదము, పుష్ప కోమలము, ఖేచర భూచర కామినీ మనో
హ్లాదన, మిట్లుగా నభవుడర్థి నొనర్చె నుమాసమేతుడై"

దుర్యోధనుడు ప్రాయోపవేశమునకు నిశ్చయించి తమ్ముడైన దుశ్శాసనుని తన తదనంతరం రాజ్యాభిషిక్తుడై పాలించమనగా అపుడు దుశ్శానుడు అన్న పాదాలపై పడి దుఃఖించుచూ విన్న వించుకొను సందర్భంలో ఎఱ్ఱన దుశ్శాసనుని చిత్త ప్రవృత్తిని ఈ విధంగా వర్ణించాడు.

"అవని విదీర్ణమైనను, హిమాద్రి చలించుట గల్గినన్, మహా
ర్ణవ జల మింకినన్, దివసనాథుడు జంద్రుడు దేజ మేదినం
గువలయ నాథ నీకు నొకు కుత్సిత భావము గల్గ నేర్తునే
భవదుపయోగ్యమైన నృప భారము నాకు వహింప శఖ్యమే".

హరి వంశంలో శ్రీకృష్ణుని బాల్య క్రీడలను చాలా సహజంగా ఎఱ్ఱన వర్ణించాడు. కృష్ణుడు ఎంతో అందముగా ఉన్నాడని, ఎవరు చూచినా అతనిని ఎత్తుకొని ముద్దాడు చున్నారని కృష్ణుడు అందంగా కళ్ళు త్రిప్పుతూ, మువ్వలు గంటలు మ్రోగు చుండగా నాట్యం చేస్తూ ఉంటే అందరికీ చూడాలని ఉంటుందని సహజ సుందరముగా కృష్ణుని బాల్య చేష్టలు, నాట్యం చేస్తున్న కృష్ణుని రూపం కన్నులకు కట్టేలా వర్ణించాడు.

"ఎవ్వరు గన్న నెత్తికొని యొంతయు వేడుక ముద్దులాడగా
నెవ్వల బాఱిపాఱి తరళేక్షణ దీధితులొప్ప నొప్పుమై
మువ్వలు గంటలు న్మొరయ ముందటి కూకటి రావి రేకలతో
నవ్వన జాక్షుదాడు జెలువర్మిలి బెంచు జనంబు చూడ్కికిన్"

ఎఱ్ఱన రచనల్లో ఏ భాగమైనా వర్ణోత్కరంగా ఉంటుంది. ఆయన రచనా విధానమే వేరు. ప్రాబంధిక శైలికి ఆయన మారు

పేరు. అందుకే ప్రబంధ పరమేశ్వరుడన్న బిరుదు కూడా వచ్చింది. ఏ భాగాన్ని స్పృశించినా ఆయన వర్ణనలలో స్పష్టత ఉంది. క్లిష్టత లేని స్పష్టత ఆయన శైలి. రమణీయకమూ, రమ్యమైన ఆయన రచనా విధానం అనంతర కవులకు మార్గదర్శిక మైనదనడంలో సందేహం లేదు.

## 7.4 ప్రబంధ పరమేశ్వరుని సూక్తి వైచిత్రి:

"కమనీయం కావ్యమ్", " కవయతీతః కవిః", "తస్య కర్మ కావ్యమ్" మొదలయినవి లాక్షణికుల నిర్వచనాలు ప్రబంధాన్ని గూర్చి చెప్పబడ్డాయి. ప్రకృష్ణమైన బంధం గలది ప్రబంధం. ఈ బంధము శబ్దార్థములందు కనబడుతుంది. కావ్యము కవి వర్ణనా శక్తి వల్ల ప్రబంధ కవి సామర్థ్యం వల్ల రక్తి కడుతుంది.

తెలుగు ప్రబంధ రచనా విశేషములకు మూల పురుషుడు తిక్కన. తన భారతంలోని ప్రతి పర్వాన్ని ఒక ప్రబంధంగా తీర్చిదిద్దాడు. ఈ మార్గాన్ని ఎఱ్ఱన కూడా అవలంబించాడు.

'సుష్ఠుమ్ ఉక్తం సూక్తం' అంటే మనోజ్ఞంగా చెప్పుమాట. సూక్తి అంటే రమణీయకమైన 'కవితా ఉక్తి' అని అర్థం. ఈ సూక్తి వక్రోక్తి అన్నాడు. రసానుకూలమైన పద ప్రయోగం, రమణీయమైన పదాల కూర్పు, అర్థ వైచిత్రీ అన్నీ సూక్తుల లోని భాగాలు. అట్టి సూక్తి వైచిత్రికి ఎఱ్ఱన ప్రసిద్ధుడయ్యాడు.

అరణ్య పర్వంలోని సావిత్రోపాఖ్యానం 110 గద్య పద్యాలతో మనోజ్ఞంగా రచింపబడిన చిన్న ప్రబంధం. సావిత్రి మద్ర దేశ రాజు అయిన అశ్వపతి కుమార్తె. తెలిసిన నాటి నుండి సాళ్వ దేసపు రాజు ద్యుమత్సేనుడి కొడుకు అయిన సత్యవంతుణ్ణి ఆమె తన భర్తగా భావించుకుంటుంది. సత్యవంతుడు అల్పాయుష్కుడని నారదుడు చెప్పినా, కోరి అతనిని తన భర్తగా చేసుకొంటుంది. ద్యుమత్సేనుడు తన రాజ్యాన్ని, సంపదను పోగొట్టుకొని అరణ్య వాసం చేస్తుంటాడు. కళ్ళు కూడా పోగొట్టుకుంటాడు. సత్యవంతుడు ఒకనాడు అడవిలోకి కట్టెల కొరకై వెళ్ళి మరణిస్తాడు. స్వయంగా యముడు సత్యవంతుని ప్రాణాలు తీసుకొని పోవుచుండగా సావిత్రి యమునితో పాటు యమలోకం వెళ్ళి యమున్ని మెప్పించి తన భర్తను బ్రతికించుకుంటుంది. అలాగే తన తండ్రికి కుమారులు కలిగే వరాన్ని, మామకు తిరిగి దృష్టిని ప్రసాదించమని సావిత్రి యముని ప్రార్థిస్తుంది. సావిత్రి వరం పొందుటచే దృష్టి వచ్చి ద్యుమత్సేనుడు చుట్టూ చూడగా కొడుకు కన్పించడు. ఆ వృద్ధుని ఆవేదనను ఎఱ్ఱన సూక్తి వైచిత్రిలో ఎంతో చక్కగా వ్యక్తపరచాడు.

"కన్నులు వచ్చి యల్లెడలు గన్గొని వృద్ధ నరేంద్రు డాత్మకుం
గన్నులు బోలెనైన తన గాదిలి పుత్రుడు గాననంబులో
నెన్నడు లేని యంత తడ వేటికి జిక్కెనో? యంచు నార్తితో
గన్నులు లేని యట్లోకడు గానక యేడ్చె సతీసమేతుడై"

ఈ పద్య భావము మూలములో కన్పించదు. మూలమునకు మెరుగు పెట్టు ఔచిత్య పరిపోషకములు అరణ్య పర్వ శేషములో అక్కడక్కడా ఉండటం వల్ల పురాణ కవిత్వంలో వర్ణనాత్మక శైలిని ప్రవేశ పెట్టటం మూలాన ఎఱ్ఱనకు ప్రబంధ పరమేశ్వరుడు అనే బిరుదు ఏర్పడింది.

సులభమైన జాతీయ పదాలతో, నుడికారాలతో కూడిన మనోజ్ఞమైన తెలుగు వారి సంభాషణా ధోరణిని తెలియజేయు రచననే 'చతురోక్తి పదంబు' అని ఎఱ్ఱన వ్యవహరించాడు.

అరణ్య పర్వ శేషంలో "పరీక్షితుడను ఒక రాజు మృగయారతుండయి పోయి వనంబున ఒక్క పూబోడి గనియె" - చతురోక్తి పదాలతో కూడిన వారి సంభాషణను ఎఱ్ఱన ప్రదర్శించిన తీరు గమనిద్దాం.

" ఎవ్వరి దానవంబుజ దళేక్షణ! యేకత మిట్టులేలనీ
విప్పన భూమి యందు జరియించెద నాపుడు దండ్రి పంపునం

దివ్వన భూమి యందు జరియించెద సద్వరు గోరి కన్యనే
నెవ్వరి దాన గావలయు నేర్పడ జెప్పుమా రాజనందనా"

ఎవ్వరి దానవు? నీవు ఈ వనములో ఒంటరిగా తిరుగుచున్నావు. అన్న ప్రశ్నకు తండ్రి ఆజ్ఞతో ఈ వన భూమిలో తిరుగుతున్నాను. కన్యను, ఎవరి దానను కావాలో వివరణ జెప్పు రాజా! అని చమత్కారంగా పలుకుతుంది.

ఈ భావననే అల్లసాని పెద్దన తన మనుచరిత్రలో "ఎవ్వతె నీవు భీత హరిణేక్షణ యొంటి జరించె తోటలో….." అని రచించాడు.

భారతంలో కర్ణ జన్మ వృత్తాంతము నన్నయ ఆదిపర్వంలోను, ఎఱ్ఱన అరణ్య పర్వ శేషము లోను ఉంది. వీరిరువురికీ మూలం ఒక్కటే, అయినా ఇరువురూ కుంతీ పాత్రను తీర్చిదిద్దిన విధానం వేరు వేరుగా ఉంది. నన్నయ కుంతి కంటే ఎఱ్ఱన కుంతి భిన్నమైన ప్రకృతి స్వభావం గలది. ఈమె గడుసరి వ్యంగ్య ప్రధానముగా మనసులోని భావాలను వ్యక్త పరచగల జాణ.

దుర్వాసుడిచ్చిన దివ్య మంత్ర శక్తిని తెలుసుకోవాలనే కోరికతో నన్నయ కుంతి "నాకు నిమ్ము ప్రియమ్మున నీయట్టి కొడుకు" అని సూర్యుని కేలు మొగిచి మ్రొక్కినది. కాని సూర్యుని యొక్క రూపాన్ని విస్మయాన్ని చూచి భయపడుతున్న కుంతిని ఒడకుండుమని ప్రసన్నతతో " నీ కోరిన వరంబీయ వచ్చితి" అని అన్నాడు. అప్పుడు కుంతి "లజ్జావనత వదనయై"

" ఎఱుక లేమి జేసి యింత లెప్పుడునప, రాధయుతలు,
సాపరాధలయిన వారి గరుణ నెల్లవారు రక్షింతు"

అని తన తప్పును మన్నించ మని సూర్యునికి మ్రొక్కింది.

" నాకు గర్భమయిన నా తల్లి దండ్రులు
జుట్టములును నన్ను జూచి నగరె"

అని ధర్మానికి భయపడింది. కల్లా కపటము ఎరుగని అమాయకురాలుగా నన్నయ కుంతిని చిత్రించాడు. కాని ఎఱ్ఱన కుంతి గడుసరి

" నను నిచ్చుటకుం గర్తలు, జననియు, జనకుండు గాక చనునే నాకున్
వనితా ధర్మువు విడువగ, ననఘా యిట్లయిన ధర్మ హానియు గాదె"

అని సూర్యుని వారించుచున్నట్లు కనబడినా అతని పై తనకు గల అనురాగాన్ని నిగూఢంగా ప్రకటించింది. ధర్మ హాని కాకున్న అతని కలయికకు ఎట్టి ఆటంకము, అభ్యంతరము లేదని నేర్పుగా సూచించింది.

"మంత్ర బల మెఱుంగ మది గోరి తప్పుసేసితి మహాత్మ !
దీని జెట్టగాగ
నవరింప కెట్టులైననూ బాల్యంబు గరుణసైప వలయు
గమల మిత్ర"

అని తన చిన్నతనపు పొరపాటును క్షమించి, తన కన్యత్వమును రక్షింపుమని రెండర్థాలలో నర్మ గర్భితంగా సూక్తి వైచిత్రితో మాట్లాడింది.

" జగముల యందు ధర్మువును సత్యము నీయది గాదె యందునే
తగవులు నీయెఱుంగని విధంబులె బుద్ధికిం యిట్టిది నీదు
దగవగునేని మార్పలకు దాననే యేనగు గాక నీకు నిం
పగు తెఱగా చరింపుమిట యావల నయ్యెడు నిందకొర్రెదన్"

అని అన్ని అర్థాలను ఎదుర్కోవడానికి ఎఱ్ఱన కుంతి సిద్ధ పడింది. ఇందుకు కుంతీ సూర్యుల సంవాదమును ఎఱ్ఱన సూక్తి వైచిత్రితో సహజంగా చిత్రీకరించాడు. పాత్రల సంభాషణా చాతుర్యములో కూడా ఎఱ్ఱన సూక్తి వైచిత్రిని ప్రదర్శించాడని ఇది యొక ముఖ్య తార్కాణము.

ఎఱ్ఱన కవిత్వంలో 'మధురోక్తి గుంభన' కూడా పేర్కొన దగ్గది. నృసింహ పురాణంలో హిరణ్యకశిపుని తపస్సు చెరిపి రమ్మని అప్సరలను పంపు సందర్భములో ఇంద్రుడు వారితో పల్కిన మాటలలోని మధురోక్తి.

"వ్రతములు గ్రొచ్చి శీలముల వ్రచ్చి జపంబుల గ్రాలి యుత్తమ
క్రతువుల దోలి యోగములుగాఁచి తపంబుల వేచి యెందున
ప్రతిహత లీలమై మదను బాణ చయంబు తోడు నీడలై
ధృతులు తలంచుచుండు సుదతీమద తీక్ష్ణ కటాక్ష కోణముల్"

ఉత్కృష్ట భావాలను ఊహించి చమత్కరించి రమణీయంగా, హృదయాంగమంగా ప్రకటించు నేర్పు మహాకవుల సొత్తు. ఆయా సందర్భాలకు తగినట్లు రసానుకూలముగా పదములను చమత్కార యుక్తంగా ప్రయోగించడంలో ఎఱ్ఱన మిక్కిలి నిపుణుడు.

హిరణ్యకశిపుడు దేవతలను పీడించు విధానాన్ని తెలిపే ఈ పద్యంలో పదగతమైన చమత్కారం ఉంది.

" అమరులనిన జంప నలుగు వాహ్యాహరు, లనిన నోరి కళ్ళ గొనగ దలచు
త్రిదివవాసులనిన నదుమంగ జూచు బాతాళమునకు దేవతల నతండు "

ఉన్నదున్నట్లుగా ఒక వస్తువుని వర్ణించితే కల్పనా శక్తికి ఆస్కారముండదు. దానికి ఊహ వైచిత్ర్యము, అపూర్వ భావ చిత్రములు, సందర్భాను గుణమగు సన్నివేశాలు నిబిడీకృతం చేయాలి. తాండవ నృత్య సమయ మందలి హరునితో పోలిక చెప్పి ఎఱ్ఱన కల్లోల భరితమగు సముద్ర గాంభీర్యమును మన కన్నుల ఎదుట ఎంత గొప్పగా నిలిపాడో చూడండి.

" కడలు చేతులూర్చుచు ఫేన ఘన తరాట్ట
హసరుచితోఁ బ్రవాళ జటాలి విద్రిచి,
యౌర్వ శిఖి పాలలో చనంబనగ సింధు,
పమరు దాండవ మాడెడు హరుని బోలి "

జడ పదార్థమగు సముద్రమునకు ప్రాణి ధర్మం ఆరోపించి భావనాత్మకంగా ప్రౌఢోక్తి శిల్పంలో ఉపమాలంకార విశేషముతో రస లోకాన్ని రమణీయంగా సాక్షాత్కరింప చేశాడు.

ఊహా చిత్రములందే కాక వాస్తవిక సన్నివేశాలందు ఎఱ్ఱన స్వాభావికతను సూక్తి వైచిత్రిని ప్రదర్శించాడు. వేసవి వర్ణనలు

" పగళు లెల తోట నీడల బ్రాతియయ్యె
బగళులను రేలుదను గాలి బ్రాతియయ్యె
రేలు వెన్నెల బయళులు ప్రియములయ్యె
రేలు బగళుల నిద్రలు ప్రియములయ్యె "

ఈ పద్యం చదవగానే లోక ప్రసిద్ధమగు అనుభవం లలితమైన భావాలు హృదయానికి హత్తుకుంటాయి.

ఎఱ్ఱన నన్నయ ధారా శుద్ధిని, తిక్కన పదాల విరుపులను పాటించి తనదైన కూర్పుతో కవిత్వానికొక విశిష్ట వ్యక్తిత్వాన్ని సాధించాడు. ఆ నేర్పే అతని ప్రబంధ పరమేశ్వరుణ్ణి చేసింది.

ఇట్లు ప్రబంధ పరమేశ్వరుని సూక్తి వైచిత్రి వైవిధ్యముగా కొనసాగుతూ కవితలోని విశిష్ట భావ స్ఫూర్తిని ఉదాత్తతను వ్యక్తం చేస్తుంది. ఎఱ్ఱన కవితలో నానా విధములుగా వ్యక్తమగు ఈ విశిష్ట గుణాన్ని గమనించి శ్రీనాధుడు " పరిఢ వింతు బ్రబంధ

పరమేశ్వరుని లేవ సూక్తి వైచిత్రి ఒక్కొక్కమారు" అని కీర్తించాడు.

## 7.5 ఎఱ్ఱన ఇతర కావ్యాలు:

**7.5.1 రామాయణం:** ఈ గ్రంథము ఇప్పుడు లభ్యం కావడము లేదు. కూచియంచి తిమ్మ కవి తన " సర్వ లక్షణ సార సంగ్రహము"లో ఎఱ్ఱన రామాయణంలోనివని '9' పద్యాలు ఉదాహరించాడు. ఎఱ్ఱన బాల కాండము నుండి యుద్ధ కాండము వరకూ రచించాడు. చదలవాడ మల్లన "ఎఱ్ఱన రామాయణము యధా వాల్మీకము" అని చెప్పాడు. హరి వంశ పీఠికలో ప్రోలయ వేముడు రామకథమున్ జెప్పించి యత్యుత్తమ ఖ్యాతి బొందితి" అని ఎఱ్ఱనతో అన్నట్లు ఉండుట చేత రామాయణం కూడా ప్రోలయ వేమారెడ్డికి అంకితమిచ్చి ఉంటాడు. కానీ ఎఱ్ఱన రామాయణం లోకంలో అంతగా ప్రసిద్ధి పొందలేదు.

**7.5.2 హరి వంశము:** హరివంశమున ఎఱ్ఱన ప్రోలయ వేమారెడ్డికి అంకితిచ్చాడు. ఇందు రెండు భాగాలున్నాయి. పూర్వ భాగం '9' అశ్వాసాలలో 2044 గద్య పద్యాలు, ఉత్తర భాగంలో 10 ఆశ్వాసాలలో 2660 గద్య పద్యాలున్నాయి. మూలములోని ప్రభావతీ ప్రద్యుమ్నోపాఖ్యానము, హంస డిభకోపాఖ్యానము అనువదించ లేదు. ఇది అనువాదమైనా ఎన్నో స్వతంత్ర వర్ణనలతో సాగింది. శ్రీకృష్ణుని బాల్య క్రీడలు, గోపకులు రేపల్లె విడిచి పెట్టి బృందావనానికి పోయే ఘట్టం మొదలైన వాటిని ఎఱ్ఱన సహజ మధురంగా, జానపద జీవితం ప్రతిబింబించేటట్లుగా వ్రాశాడు. ఎఱ్ఱన శ్రీకృష్ణ బాల్య క్రీడాది వర్ణనలను తరువాత పోతన అనుకరించాడు.

**7.5.3 నృసింహ పురాణము:** ఎఱ్ఱన నృసింహ పురాణానికి "లక్ష్మీ నరసింహావతారం" అని పేరు పెట్టాడు. కానీ నృసింహ పురాణమనే పేరే వాడుకలో ఉన్నది. ఆంధ్ర దేశంలో అహోబల క్షేత్రంలో లక్ష్మీ నరసింహుడు వెలిశాడు. ఎఱ్ఱన కావ్యం చివర ఆ క్షేత్ర మహత్యాన్ని కొంత చెప్పాడు. బ్రహ్మాండ పురాణములోని నరసింహావతార కథను ఈ కావ్యము యొక్క ఇతి వృత్తముగా తీసుకున్నాడు. దీనిని అహోబల నరసింహ స్వామికి తన తాత కోరికననుసరించి అంకితమిచ్చాడు. ఇందు చక్కని కావ్య శైలిని ప్రయోగించాడు. పురాణము లోని ఒక్క ప్రహ్లాద కథను మాత్రమే తీసుకొని మొదటి నుంచి చివర వరకు ఆ కథను నడుపుతూ వస్త్వైక్యతను సాధించాడు. కావ్యానికి పురాణమని పేరున్న అది పురాణం కాదు. కవిత్వం ప్రౌఢంగా అలంకార శోభతో కూడి ఉంది. ఈ రచన వల్లనే ఎఱ్ఱనకు ప్రబంధ పరమేశ్వరుడు అనే బిరుదు సార్థకమవుతుంది.

## 7.6 ఎఱ్ఱన సమకాలిన కవులు:

**7.6.1 నాచన సోముడు:** ఎఱ్ఱన సమకాలికుడు నాచన సోమనాథుడు. హరి వంశ ఉత్తర భాగము నందలి శ్రీ కృష్ణునికి సంబంధించిన రసవంతములైన కథలను తీసుకొని " ఉత్తర హరి వంశం " అను పేరుతో "ఆరు" ఆశ్వాసాల గ్రంథం రచించాడు. ఇందు ప్రధానమైన కథలు నరకాసుర వధ, శ్రీకృష్ణుడు మృతుడైన ఒక బాలుని బ్రతికించి తీసుకురావడం, శ్రీకృష్ణుడు సంతానార్థియై కైలాసమునకు వెళ్ళి శివుని వల్ల వరం పొందడం, పౌండ్రక వాసుదేవుని సంహారం, ఉషా పరిణయం మొదలైనవి. నాచన సోమన తనకు "సకల భాషా భూషణ" "సాహిత్య రస పోషణ" బిరుదులున్నట్లు చెప్పుకున్నాడు. పాత్ర చిత్రణలో పాత్రోచిత సంభాషణలు, అలంకార శోభ ఇవి సోమన లోని కవితా గుణాలు. సోమన తిక్కనతో సాటి రాగల కవియని కొందరి విమర్శకుల అభిప్రాయం. సోమన దేశీ పదాలను, సామెతలను చాలా ప్రయోగించాడు. ఈయన వాడిన సామెతలు మరొక కవి వాడలేదు.

**7.6.2 విన్నకోట పెద్దన:** ఈ కవి 14వ శతాబ్దం ప్రారంభంలో ఉన్నాడు. "కావ్యాలంకార చూడామణి" అను అలంకార శాస్త్రీయ గ్రంథాన్ని వ్రాశాడు. చాలా చిన్న గ్రంథం. ఇది తెలుగులో మొదటి అలంకార శాస్త్ర గ్రంథము.

**7.6.3 రావిపాటి త్రిపురాంతకుడు:** తిప్పన్న అను పేరుతో ఇతనిని వ్యవహరిస్తారు. త్రిపురాంత కోదాహరణము, మదన విజయము, అంబికా శతకము, చంద్ర తారావళి అను గ్రంథములను, ప్రేమాభిరామం అను సంస్కృత గ్రంథాన్ని రచించాడు. ఈయన శివ భక్తి పరాయణుడు. శృంగార రస ప్రియుడు.

**7.6.4 గణప నారాధ్యుడు:** సర్వ శాస్త్రము అను ద్విపద కృతిని రచించాడు. ఇది వేదాంత గ్రంథము. ఇందు యోగ శాస్త్రములు వివరింపబడ్డాయి. ఈయన యోగ శాస్త్రవేత్త.

**7.6.5 దోనయామాత్యుడు:** ఈయన "సస్యానందము" అను వర్ష శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. ఇందులో 4 అశ్వాసాలతో '228' పద్యాలున్నవి. శాస్త్రీయ దృష్టితోనే కాక భాషా వాఙ్మయ విషయ దృష్టితో ఈ గ్రంథమును పరిశీలించాలి.

**7.6.6 కొరవి సత్యనారాయణ:** "ఆంధ్ర కవితా పితామహుడు" అను బిరుదు గల పూర్వాంధ్ర కవులలో ఈయన ఒకడు. ఈయనకు భీమన అను పేరు ఉంది. ఈయన రచించిన రామాయణము ఇపుడు లభించుట లేదు. ఇంకా శ్రీ గిరికవి, వెన్నెల కంటి జన్న మంత్రి, పశుపతి నాగనాధ కవి, పెద్దయామాత్యుడు, శరభాంకుడు, చిమ్మపూరి అమరేశ్వరుడు మొదలగు కవులు ఎఱ్ఱన యుగంలో ఉన్నారు.

## 7.7 మాదిరి ప్రశ్నలు:

1. ఎఱ్ఱన ప్రబంధ పరమేశ్వరుడా - చర్చించండి.
2. ఎఱ్ఱన సూక్తి వైచిత్రిని వివరించండి.
3. ఎఱ్ఱన కవితా వైదుష్యాన్ని ప్రదర్శించండి.

## 7.8 ఆధార గ్రంథాలు:

1. తెలుగు సాహిత్య సమీక్ష - డా॥. జి. నాగయ్య
2. ఆంధ్రాల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి
3. మహతి - యువభారతి ప్రచురణ
4. ఆంధ్రకవుల చరిత్ర - కందుకూరి వీరేశలింగం
5. తెలుగు కవుల చరిత్ర - నిడదవోలు వేంకటరావు

**డా॥. బండారు జ్యోతి స్వరూప రాణి**

# పాఠం - 14 స్త్రీవాద, దళితవాద సాహిత్యం

## పాఠ్యాంశ నిర్మాణ క్రమం


14.1 స్త్రీవాదం - నిర్వచనాలు

14.2 స్త్రీవాద నేపథ్యం

14.3 స్త్రీ వాదం - రకాలు

14.4 స్త్రీ వాద సాహిత్యం - కవిత్వం

14.5 స్త్రీ వాద సాహిత్యం - నవల

14.6 స్త్రీ వాద సాహిత్యం - కథ

14.7 దళిత వాద ఉద్యమం - ఆవిర్భావం

14.8 దళిత సాహిత్యం - తాత్వికనేపథ్యం

14.9 దళిత సాహిత్యం - అంబేద్కర్ ప్రభావం

14.10 దళిత సాహిత్యం - కవిత్వం

14.11 దళిత సాహిత్యం - నవల

14.12 దళిత సాహిత్యం - కథ

14.13 దళిత సాహిత్యం - నాటకం

14.14 మాదిరి ప్రశ్నలు

14.15 ఆధార గ్రంథాలు


స్త్రీ, దళిత సమస్యలు అతి ప్రాచీన కాలం నుండే వున్నాయి. మనుధర్మశాస్త్ర కాలం నాటికి ఇవి తీవ్ర రూపం దాల్చాయి. ఈ రెండు సమస్యలకు అనేక దగ్గరి పోలికలు వున్నాయి. దళితుల్ని చదువుకి, సంఘానికి, స్వేచ్ఛకు దూరం చేస్తే, స్త్రీని ఇంట్లో వుంచే చదువుకి, స్వేచ్ఛకి దూరం చేశారు. భారతదేశంలో ఏ యుగంలోనూ, ఏ కాలంలోనూ స్త్రీ పురుషులతో సమానమైన గౌరవాన్ని పొందలేక పోయింది. తరతరాలుగా, యుగయుగాలుగా ఈ రెండు వర్గాలు వివక్షతకు గురి అవుతూ వచ్చారు. పారిశ్రామిక విప్లవం వచ్చినా, ప్రగతి శీల భావజాలం వచ్చినా ఈ వర్గాల వారి స్థితిగతుల్లో పెద్ద మార్పులు లేవు. వీరి అణచివేతను వ్యతిరేకిస్తూ, విముక్తి కోసం, సమానత్వం కోసం వారే ఉద్యమిస్తున్నారు. వామపక్ష ఉద్యమాలు, విప్లవ సాహిత్య ఉద్యమాలు వీరి సమస్యల్ని అర్థం చేసుకోవడంలో ఆమోదించడంలో ఎక్కడైతే విఫలమయ్యారో అక్కడ నుంచి దళిత, స్త్రీ వాద ఉద్యమాలు పుట్టుకొచ్చాయి. దళితవాద పరిధి ఇండియాకే పరిమితమైతే స్త్రీవాద పరిధి ప్రపంచానికి వర్తించేది. ఈ ఉద్యమాల స్వరూపం ఆవిర్భావం, నేపథ్యం పరిశీలిస్తే వాటి భవితవ్యం, భవిష్యత్తు అర్థమవుతుంది.

ఇంగ్లీషులో 'Feminism' అనే పదానికి సమానార్థకంగా తెలుగులో స్త్రీ వాదం అంటున్నాం. ఇటీవల కాలంలో స్త్రీవాద స్వరూప స్వభావాల్ని గూర్చి, స్త్రీ సమస్యలను గూర్చి, స్త్రీ హక్కులను గూర్చి ఎక్కువగా చర్చ జరుగుతుంది. అన్ని రంగాల్లో జెండర్ వివక్ష తగ్గి స్త్రీలు అణచి వేత నుండి బయట పడాలని వాదించే, ప్రచారం చేసే రకరకాల ఆలోచనల్ని, వాదాల్ని Feminism అంటున్నారు.

## 14.1 స్త్రీ వాదం - నిర్వచనాలు:

"Feminism was intended to develop as universal theory to show women the nature of our appression and as an international political practise to achieve our Liberation" - Corowline Ramazanogle

"స్త్రీలు తమ సెక్స్ వల్ల వివక్షతతో చూపబడుతున్నారనీ, స్త్రీలుగా వాళ్ళకున్న ప్రత్యేక అవసరాలు తిరస్కరింపబడుతున్నాయని, తీరడం లేదని, ఆ ప్రత్యేక అవసరాలు తీరాలంటే ఇప్పుడున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ విధానాలలో మౌలిక మార్పులు రావాలని కోరుకునేది స్త్రీవాదం". - వసంతా కన్నభిరాన్

## 14.2 స్త్రీవాద నేపథ్యం:

1789లో ఫ్రెంచ్ విప్లవం తరువాత స్వేచ్ఛా, సమానత్వ భావాలు ప్రచారంలోకి వచ్చాయి. మానవులంతా సమానంగా, స్వేచ్ఛగా హక్కుల్ని అనుభవించాలన్నప్పుడు, అలాగే మానవజాతిలో సగభాగమైన స్త్రీలు కూడా ఆ హక్కుల్ని, అనుభవించాల్సిన అవసరం ఉందని గుర్తించిన స్త్రీలు చైతన్యవంతులయ్యారు.

ఆ చైతన్యమే 1792లో 'మేరి వోల్‌స్టోన్ క్రాఫ్ట్' రాసిన "ది విండికేషన్ ఆఫ్ ది రైట్స్" అనే పుస్తకంలో ప్రతిఫలించింది.

"స్త్రీని ఆదర్శమూర్తిగా నిరూపించే కుటుంబ సంస్కృతిని, స్త్రీల కొక రకంగా, పురుషులకొక రకంగా అనువర్తించే ద్వంద్వనీతులను ఆమె విశ్లేషించింది. స్త్రీల స్వాతంత్ర్యానికి ఆర్థిక స్వేచ్ఛ మొదటి షరతు అని అందుకోసం స్త్రీకి విద్య అవసరమని ఆ పుస్తకం స్పష్టం చేసింది.

తర్వాత మహిళల హక్కులను గురించి పోరాడిన ఫ్రెంచి "సఫ్రగెట్" (ఓటు హక్కు లేదా సఫ్రేజి సాధించేవారిని 'సఫ్రగేట్స్' అంటారు). ఒలింప్-డి-గూజే (1948 - 1793) ఈమె స్త్రీల సంపూర్ణ రాజకీయార్థిక స్వేచ్ఛ కోసం కృషి చేసింది. స్త్రీలకు పూర్తి సమానత్వం ఉండాలనడం విశ్వవ్యాపిత మానవ హక్కుల పర్యావసానం అని ఒలింప్-డి-గూజే అభిప్రాయం. "మహిళల, మహిళా పౌరహక్కుల ప్రకటన" అనే పుస్తకాన్ని రచించారు. ఈమె రాసిన ప్రసిద్ధ వాక్యాలు -

"స్త్రీకి గిలెటిన్ (ఫ్రాన్స్‌లో నిందితుల తలలు నరికే పదునైన యంత్రం) ఎక్కే హక్కు ఉన్నప్పుడు ఆమెకి వేదికలెక్కే హక్కు కూడా ఉండాలి".

ఇండియాకు చెందిన పండితరమాబాయి (1858 - 1922) హిందూ ఛాందస భావజాలాన్ని వ్యతిరేకించింది. తనకు తానుగా స్వతంత్ర జీవనం గడిపింది. ఈమె అంతగా ప్రసిద్ధి చెందక పోయినప్పటికి భారతదేశంలో స్త్రీల హక్కులను గురించి పోరాడిన తొలి తరం స్త్రీలలో ఈమె కూడా ఒకరు.

ఇండోనేషియాకు చెందిన 'కార్తిని' (1879 -1904). స్త్రీ విద్య కోసం కృషి చేశారు. అక్కడి సంప్రదాయాలకు వ్యతిరేకంగా బాలికల పాఠశాల ప్రారంభించి, స్త్రీ విముక్తి ఉద్యమాలకు దారి చూపారు.

ఇరాన్‌లో "ఖ్రాత్ ఉల్ అయూన్"(1815-1851) బాబి మతస్థులకు చెందిన మహిళ, ఈమె గృహనిర్బంధాన్ని ధిక్కరించి "పరదా"ను, కుటుంబాన్ని వదిలేసి అనేక ముస్లిం ఛాందసుల ఆగ్రహానికి గురయ్యింది.

చైనా దేశానికి చెందిన 'జియూజిన్' (1875-1907) చదువు నిమిత్తం టోక్యోకి వెళ్ళి అక్కడ స్త్రీ విముక్తి పోరాటాల్లోనూ, విప్లవ రాజకీయాలలోనూ పాల్గొంది. వాటి వల్ల అరెస్ట్ అయి ఉరితీయబడింది.

తూర్పు దేశాల్లో పురుషులు కూడా చాలా మంది స్త్రీ స్వేచ్ఛ కోసం పోరాడారు. చైనాకి చెందిన "కాంగ్ యూవిమ్" చైనాలో స్త్రీల పాదాలు కట్టేసే పద్ధతి ( Foot Binding ) కి వ్యతిరేకంగా పోరాడాడు.

"నాకిప్పుడో ముఖ్యమయిన కర్తవ్యం ఉంది. గత కాలపు అసంఖ్యాక స్త్రీల యొక్క బాధల్ని ఎలుగెత్తి చాటాలని, నాకిప్పుడో గొప్ప కోరిక ఉంది. నా కాలానికి చెందిన ఎనభై కోట్ల మంది స్త్రీలను దుఃఖ సముద్రంలో మునిగిపోకుండా రక్షించాలని, నాకిప్పుడో గొప్ప కాంక్ష ఉంది. అనూహ్యమైన, అసంఖ్యాకమయిన రాబోయే తరాల స్త్రీలకు సమానత, స్వతంత్రతల సంతోషాన్ని తేవాలని" అంటారాయన.

ఈజిప్టుకి చెందిన "అహమ్మద్ ఫారెన్ ఎల్ సిద్యక్" స్త్రీ విముక్తిని బలపరుస్తూ ఒక పుస్తకం రాశారు. 'one leg crossed over the other' అనేది దాని పేరు. అదే కాలానికి చెందినవారు "కానిమ్ అమీన్" ఇతను రాసిన "The New Women" అనే పుస్తకం సంచలనం సృష్టించింది.

ఇరాన్‌లో చాలామంది పురుష మేధావులు పరదాకి, బహు భార్యాత్వానికి, స్త్రీ ల గృహ నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడారు. భారతదేశంలో సతీసహగమన దురాచారాలకి, స్త్రీ బానిసత్వానికి వ్యతిరేకంగా రాజారామ్మోహనరాయ్, రవీంద్రనాథ్ ఠాగూర్, రామకృష్ణ పరమహంస, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, గాంధీ, నెహ్రూ మొదలగు వారు పోరాడారు.

ప్రముఖ ప్రఖ్యాత రచయిత్రి అయిన "మేరీ బల్లువ్ క్రాఫ్ట్" కన్నా ముందే 18వ శతాబ్దంలో చైనా విద్యావేత్త అయిన "చెన్‌హంగ్‌మో" స్త్రీ లకు విద్య అవసరమని చెప్పారు.

"ప్రపంచంలో విద్యావంతులు కావడానికి అర్హత లేని వాళ్ళెవరూ లేరు. విద్యావంతులు కాకుండా మనమెవరినీ నిరోధించలేము. ఈ విషయంలో ఆడపిల్లలని మాత్రం ఎందుకు నిర్లక్ష్యం చేయాలి. బాల్యం దాటగానే వాళ్ళని స్త్రీ లకే పరిమితమైన గదులలో భద్రంగా పెంచుతున్నారు. మగపిల్లల్లాగా వాళ్ళు బయటి కెళ్ళి గురువు వద్ద చేరి మిత్రులు, గురువులు ఇచ్చే ప్రోత్సాహంతో ప్రయోజనకంగా విద్యాభ్యాసం చేయటంలేదు. ఆడపిల్లలు కాస్త పెద్దవగానే కుట్లు అల్లికలు లాంటివి నేర్పడం, వాళ్ళు కట్నకానుకలకు సన్నాహాలు చేయడంతో సరిపోతుంది" అని రాశారు.

1942లో సైమన్-డి-బోరా రాసిన 'The Second Sex' అనే పుస్తకం స్త్రీ స్వేచ్ఛకు సంబంధించిన మౌలికమయిన విషయాలను బయటపెట్టింది. వివాహం, కుటుంబ వ్యవస్థలు స్త్రీల అణిచివేతకు ఎలా కారణమయ్యాయో ఈ పుస్తకంలో వివరించారు. దీనిని ఆధారం చేసుకొని ఆధునిక స్త్రీ వాదం అభివృద్ధి చెందింది.

"బెట్టీ ఫ్రైడన్" రాసిన "ఫెమినైన్ మిస్టేక్", "ది సెకండ్ ఫేజ్", "కేచ్ మిల్లెట్", "సెక్సువల్ పాలిటిక్స్", "జానెట్ సేయర్స్" రాసిన 'బయాలాజికల్ పాలిటిక్స్", "షటామిత్ ఫైరోస్టోన్" రాసిన "ది డైలక్టిక్స్ ఆఫ్ సెక్స్" మొదలైన పుస్తకాలు స్త్రీ వాదానికి సిద్ధాంత నిర్దుష్టతను చేకూర్చాయి.

## 14.3 స్త్రీవాదం - రకాలు :

ఆయా దేశాల్లో స్త్రీ విముక్తి కోసం పుట్టిన ఉద్యమాలు ఒకే రూపంలో లేవు. అందుకనే స్త్రీ వాదం ఒక సిద్ధాంతం మీద ఆధారపడలేదు. అందుకే స్త్రీ వాదంలో విభిన్న ధోరణులు కనిపిస్తాయి. వాటిలో ఉదారవాద బూర్జువా స్త్రీవాదం, కమ్యూనిస్టు స్త్రీ వాదం, ర్యాడికల్ స్త్రీ వాదం, సాంస్కృతిక స్త్రీవాదం లేదా లెస్బియనిజమ్, సామ్యవాద స్త్రీవాదం, భౌతిక వాద స్త్రీ వాదం, విప్లవాత్మక స్త్రీవాదం, పర్యావరణ పరిరక్షణ స్త్రీవాదం, నిర్మాణానంతర స్త్రీవాదం, రాజకీయ స్త్రీవాదం, విభిన్న ధోరణుల స్త్రీవాదం, ఏర్పాటు వాద స్త్రీవాదం, సమన్వయ స్త్రీ వాదం మొదలైనవి అనేక ధృక్కోణాల్లో ఈ ఉద్యమాలు స్వల్ప తారతమ్యంతో ఆయా దేశాల్లో కనిపిస్తాయి.

20 వ శతాబ్దంలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ అంశాల్లో మౌలికమైన మార్పులు వచ్చాయి. అందుకే ఈ యుగాన్ని ఉద్యమాల యుగం అని అంటారు. భారతదేశంలో ఇంగ్లీషు విద్య, పాశ్చాత్య నాగరికత, ప్రబలడం వలన సాంఘిక, మత, సంస్కరణోద్యమాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా స్త్రీలకు సంబంధించిన అనేక అంశాలపై ఉద్యమాలు వెలిశాయి. సతీసహగమనం,

బాల్యవివాహాలు, వితంతు వివాహాలు, స్త్రీ విద్య మొదలైన విషయాలనే కాకుండా స్త్రీ అణచివేతపై, పురుషాధిపత్యం పై ఉద్యమాలు చెలరేగాయి. ఈ ఉద్యమాలేవి సమాజంలో విప్లవాత్మకమైన మార్పుల్ని తీసుకురాలేక పోయాయి.

ఆంగ్లేయుల పాలన మూలంగా దేశంలో జాతీయ భావం పెంపొంది స్వతంత్ర కాంక్ష వెల్లివిరిసింది. బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించడం ప్రతిఘటించడం, జాతీయోద్యమంలో ప్రధాన అంశం. ఆ ఉద్యమాల్లో చైతన్యం పొంది చురుగ్గా పాల్గొన్న స్త్రీలు తమ హక్కుల సాధన కోసం కూడా ఉద్యమించడం మొదలు పెట్టారు. స్త్రీ సమస్యల కోసం కందుకూరి, గురజాడ రచనలు చేశారు. ఆ తర్వాత చలం, కొడవటిగంటి రంగనాయకమ్మ, లత, మల్లాది సుబ్బమ్మ, ఓల్గా, జయప్రభ, కొండేపూడి నిర్మల, విమల, గంటశాల నిర్మల మొదలైన వారెందరో స్త్రీ వాద దృక్పథాన్ని ఆయా సాహితీ ప్రక్రియల్లో ప్రస్ఫుటం చేశారు. దీనిని స్త్రీవాద యుగంగా పేర్కొంటున్నారు.

**స్త్రీవాద సాహిత్యం - భిన్న ప్రక్రియలు:** పురుషాధిక్య సామాజిక భవనాన్ని పునాదులతో సహా పడగొట్టాలనే ప్రయత్నం స్త్రీ వాదులు చేస్తున్నారు. సంప్రదాయం, ఆచారాలు, కట్టుబాట్లు, నమ్మకాలు, మొదలైన వాటితో పెనవేసుకుపోయిన కరుడుకట్టిన భావజాల పునాదుల్ని కూకటి వేళ్ళతో పెకలించడం అంతసులువైన పనేమి కాదు. అందుకే స్త్రీ చైతన్యానికి, భావ విప్లవానికి, ఉపకరించే సాహిత్యాన్ని ప్రధాన ఆయుధంగా తీసుకున్నారు. ఆ సాహిత్యంలోనూ ఒకే ప్రక్రియకు పరిమితం కాకుండా సాహితీరంగంలో వున్న అన్ని ప్రక్రియల్లోనూ తమ కలాన్ని వాడిగా దాడిగా వాడుతున్నారు. ప్రధానంగా స్త్రీ వాద సాహిత్యం, కవిత్వ, నవల, కథ ప్రక్రియల్లో వచ్చింది.

## 14.4 స్త్రీవాద సాహిత్యం - కవిత్వం:

ధృక్పథ ప్రాధాన్యం గల అన్ని ఉద్యమాలు మొదట కవిత్వ ప్రక్రియలో వచ్చి, ఆ తరువాత ఇతర ప్రక్రియలకు వ్యాప్తి చెందుతాయి. అలాగే స్త్రీవాద సాహిత్యం కూడా తొలుత కవిత్వంలోనే ఎక్కువగా వచ్చింది. 1975-85 కాలాన్ని ఐక్యరాజ్యసమితి 'అంతర్జాతీయ మహిళా దశాబ్దం'గా ప్రకటించింది. అంతకుముందు చలం, లత, రంగనాయకమ్మ, మల్లాది సుబ్బమ్మ మొదలైనవారి రచనలు స్త్రీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం విముక్తి కోసం ఎంతగానో ఉపకరించాయి. అలాగే "సెకండ్ సెక్స్", "ఎరూమ్ ఆఫ్ ఒన్స్ ఒన్", "సెక్సువల్ పాలిటిక్స్", వంటి ఆంగ్లరచనలు స్త్రీ సాహిత్య ఉద్యమానికి హేతువులైనాయి. అందుకే 1980 నుంచి స్త్రీ వాద సాహిత్యం ఉధృతంగా, ఉద్యమంగా వచ్చిందని చెప్పవచ్చు.

1990సం॥లో త్రిపురనేని శ్రీనివాస్ "గురిచూసి పాడే పాట" అనే కవితా సంకలనం ప్రచురించి దానికి స్త్రీవాద కవితలు అని పేరుపెట్టారు. అప్పటి నుంచి స్త్రీవాద కవిత్వం బలం పుంజుకొని వాడిగా, వేగంగా వ్యాపించింది. స్త్రీలు వ్రాస్తేనే స్త్రీవాద కవిత్వం అవుతుందని కవయిత్రులు మాత్రమే శక్తివంతంగా చెప్పగలరని పేర్కొన్నారు. 1990 సం॥లో "అస్మిత" వారు "నీలిమేఘాలు" అనే పెద్ద స్త్రీవాద కవితాసంకలనం రూపొందించారు. ఈ సంకలనానికి ముందు రాసిన పీఠికా వ్యాసాలు స్త్రీవాద దృక్పథాల్ని, ఆ సిద్ధాంత స్వరూప స్వభావాన్ని చర్చించాయి.

"నీలిమేఘాలు" కవితా సంకలనంలోని కవితా రచనా కాలాన్ని పరిశీలిస్తే "ప్రతీ స్త్రీ ఒక నిర్మల కావాలి" అనే ఓల్గా, 1972 సం॥లో రాసిన కవిత మొదటి స్త్రీవాద కవితగా విమర్శకులు భావిస్తున్నారు. పంచాది నిర్మల పురుష అహంకారానికి ఘోరంగా బలికావడానికి తీవ్రంగా ప్రతిస్పందించిన ఓల్గా -

"నేను పతివ్రతామ తల్లిని కాను
ప్రబంధ కన్యను గాను
పంచదార చిలకనుగాను
ఫ్యాషన్ పెరేడ్ బొమ్మను కాను

పసిపాపల్ని చంపే పాపినికాను
పంచాది నిర్మల వారసురాలిని"

అని అంటూ స్త్రీజాతిలో భావవిప్లవం తీసుకురావడానికి ప్రయత్నిస్తుంది. అలాగే 1984వ సం॥లో "బందిపోట్లు" అనే కవిత రాసి గొప్ప సంచలనాన్ని, చైతన్యాన్ని తీసుకొచ్చిన కవయిత్రి సావిత్రి. ఈమె పెళ్ళిని మొగుడ్ని గూర్చి నూత్న రీతిలో కవితా భావన చేశారు.

"పాఠం ఒప్పచెప్పకపోతే పెళ్ళి చేస్తా"నని
పంతులుగారన్నప్పుడే భయమేసింది
ఆఫీసులో నా మొగుడున్నాడు
అవసరమొచ్చినా సెలవివ్వడ"ని
అన్నయ్య అన్నప్పుడే అనుమానం వేసింది
వాడికేం ? మగమహారాజు"ని
ఆడా మగా వాగినప్పుడే అర్థమై పోయింది.
పెళ్ళంటే పెద్ద శిక్షని" అని
మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడని
మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే
మమ్మల్ని విభజించి పాలిస్తోందని" అని సావిత్రి

పురుష అహంకారాన్ని, లింగవివక్షతను నిరసిస్తుంది. ఇలాగే పితృస్వామ్య వ్యవస్థ మీద నూతన తరహాలో వచ్చి ప్రాచుర్యం పొందిన కవిత జయప్రభ "పైటను తగలెయ్యాలి". -

" పై కొంగును చూస్తే
నాకెందుకో
పాతివ్రత్యం గుర్తుకొస్తుంది
భూజాల నించి కిందికి వేలాడే
గుదిబండలా
అదెప్పుడు నా స్వేచ్ఛను హరిస్తూనే ఉంటుంది
నన్ను నిటారుగా నిలవనివ్వక
పైట నా గుండెలపై తన అంచుల చేతులాన్చి
నన్ను వంగదీయాలని చూస్తోంది
నాకు అలవాటు లేని సిగ్గుని మప్పుతుంది
-----------------------------------------
నా వ్యక్తిత్వాన్ని శవంగా చేసి
దాని పైన కప్పిన తెల్లదుప్పటి పైట
నేను నడిచే శవాన్ని కాకుండా వుండాలంటే
ముందుగా పైటని తగలెయ్యాలి"

అంటూ ముగిసే ఈ కవిత అనంతర స్త్రీ వాద కవయిత్రులపై అమితమైన ప్రభావాన్ని చూపింది.

వర్గ శత్రువు కంటే లింగ శత్రువే ఎక్కువ ప్రమాదకరం అని మొక్కపాటి సుమతి పేర్కొన్నారు. "మిత్ర వైరుధ్యమా?" అనే కవితలో...

" వర్గ శత్రువు నా శ్రమనే దోచుకుంటాడు
ఈ దుష్ట శత్రువు నా బ్రతుకే దోచుకుంటాడు
వాడు నాకు కలనైనా కల్పిస్తాడు
వీడు నా కలలన్నీ చెరిపేస్తాడు
వాడికి నేను మరను తిప్పే మనిషిని
వీడిని నేను మనిషి రూపంలోని మరను
ఎవడూ అన్నది ? ఇది మిత్ర వైరుధ్యమని ?
పెళ్ళి నాడు పురోహితుడి చూపే అరుంధతి నక్షత్రంలా
ఆకాశంలో సగాన్ని చూపి
మోసం చేస్తున్నాడు వాడు" --- అని జండర్ వివక్షే అన్ని వివక్షల కన్నా, దోపిడీల కన్నా ప్రధానమైందని పేర్కొన్నారు.

స్త్రీ పిల్లల్ని కనడం ప్రకృతి సహజం. కాని దాన్ని పురుషాధిక్యానికి అవకాశంగా తీసుకోవడం జరిగిందంటూ కొండేపూడి నిర్మల "లేబర్ రూమ్" అనే కవితలో --

" కాళ్ళనలా ఎడం చేసి దీనంగా హీనంగా నీచాతినీచంగా
ఒక హింసాతల పరాకాష్టకోసం ఎదురు చూడ్డమంటే
రైలు పట్టాల మీద నాణెం విస్తరించిన బాధ
కలపను చెక్కుతున్న రంపం కింద పొట్టులా
ఉండ చుట్టుకున్న బాధ
అప్పుడే ఏమయింది ఉధృతి కొద్దీ విముక్తి
ముల్లుకు గుచ్చి నిప్పులో కాలుస్తున్న చేప యిలాగే ఏడుస్తుందా"

అని ఆయా సంధర్భాల్లో స్త్రీ అనుభవించే బాధల్ని వ్యక్తీకరించారు. అలాగే పురుషాధిక్య ప్రభావంతోనే స్త్రీని వంట ఇంటికి పరిమితం చేసి, ఆమె శ్రమ శక్తిని దోచుకుంటున్నారని విమల "వంటిల్లి" అనే కవితలో --

" రకరకాల శవాలు నిండిన శ్మశానంలో వంటిల్లు
భయం భయంగా నిశ్శబ్దంగా, నిరాశగా
మా అమ్మొక ప్రేతంలా తేలుతూ వుంటుందిక్కడ
అసలు మా అమ్మే నడుస్తున్న వంటగదిలా వుంటుంది
ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి
అయినా చివరకు వంటింటి గిన్నెలన్నిటి పైనా మా నాన్న పేరే
------------------------------------------------
వంటింటి సంస్కృతి వంటింటి ముచ్చట్లు - వంటలక్కలమైన మనం
మనం ఏమైనా మన అంతిమ కర్తవ్యం
" గరిట తిప్పటంగా చేసిన ఈ వంటిళ్ళను ధ్వంసం చేద్దాం రండి"

--అని వంటింటికి స్త్రీకి వుండే సంబంధాన్ని చక్కగా వర్ణించారు. అలాగే ఇంటి పనికి సరైన గుర్తింపు గౌరవం వుండాలని స్త్రీవాదులు అనేక మంది కోరుతున్నారు. తమ శ్రమలో పురుషుడు భాగస్వామ్యం కూడా వుండాలనీ కోరుతున్నారు. పాటిబండ్ల రజని "ఉద్యోగిని ఆదివారం" అనే కవితలో

“ అన్ని బాధ్యతల్నీ సమానంగా పంచుకునే మనం
మన బరువు దించేందుకు చేయందించరేమని నిలదీయాలి
మన పిల్ల నుంచైనా
ఇంటి పనంటే ఇంతులది కాదని నేర్పాలి
అమ్మాయితో పాటు అబ్బాయికీ
అంట్లు తోమటం అలవాటు చేయాలి ”

-- అంటూ ఆడ, మగ, అనే భేదం లేకుండా పనులు చేసుకోవలసిన అవసరాన్ని ప్రబోధించారు.

స్త్రీలు ఎక్కువగా లైంగిక హింసకు గురి అవుతున్నారని, దీన్ని కుటుంబ అంతర్గత అంశంగా కాకుండా సామాజిక సమస్యగా గుర్తించాలని అనేక మంది తమ కవిత్వంలో వ్యక్తీకరిస్తున్నారు. వసంత కన్నాభిరాన్ “శరీరం” అనే కవితలో--

“ ఇక ఈ గర్భ కుహరమా
దాని సంగతే నేను మరచాను
అదొక టుందని కూడా గుర్తులేదు
నీ అసహజ హింసాలోభవాంఛలకు
ఆధారాలుగా అహ్వానాలుగా
నీవు మలుచుకున్న ఈ పాలిండ్లు
వాటి అర్థాన్నే కోల్పోయి శూన్యమయ్యాయి”

--- అంటూ లైంగిక హింస వికృత రూపంలో ఉండడాన్ని నిశితంగా విమర్శించారు. చి. పద్మావతి “గుక్కపట్టిన బాల్యం” అనే కవితలో అమ్మకు ఎటువంటి స్థితిరావాలో ఆకాంక్షించారు. వర్తమానంలో అమ్మనుభవించే హింస, అవమానాలకు భిన్నంగా తల్లి వుండాలంటూ...

“ నవ్వే నక్షత్రంలా అమ్మకావాలి
ఆలించే జీవనది అమ్మ కావాలి
అమ్మ ఆకాశపు గుండె మీద ఊయ్యాలలూగాలి
అమ్మ కావాలి - నాన్న చేత తన్నులు తినని అమ్మకావాలి
సుడిగుండంలా అమ్మ ఏడుపు ముంచెత్తని సుఖనిద్ర రాత్రి కావాలి”

---అని తల్లుల సుఖనిద్ర కోసం తపనపడ్డారు.

ఈ విధంగా అనేక మంది స్త్రీవాద దృక్పథంతో కవిత్వాన్ని రాస్తున్నారు. ఇంకా అనేక సంపుటాలుగా, సంకలనాలుగా స్త్రీవాద కవిత్వం వస్తూ వుంది.

## 14.5 స్త్రీ వాద సాహిత్యం - నవల:

నవలా ప్రక్రియ ప్రారంభమై దాదాపు నూట ముప్పైయేళ్ళు గడిచినా స్త్రీ సమస్యల్ని, ఆ సమస్యలకు సరి అయిన కారణాలను అన్వేషిస్తూ సహేతుకంగా రాయబడిన నవలలు చాలా తక్కువ. ఇంతవరకు స్త్రీ సమస్యలు ప్రతిబింబించగా స్త్రీవాద నేపథ్యంతో రాసిన నవలలు మృగ్యం.

**చలం :** స్త్రీని మనిషిగా పురుషునితో సమానంగా గుర్తించాలని తపన పడి రచనా వ్యాసాంగాన్ని కొనసాగించిన వారు చలం. స్త్రీకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అవసరమని, ఆమెకు మనసు ఉంటుందని దానికి ప్రాముఖ్యత నివ్వాలని మొదట చెప్పినవాడు చలం. పెళ్ళి

వ్యభిచారం గానో, వేశ్యత్వం గానో మారిందని చలం అభిప్రాయం. అందుకే దాని పట్ల చలానికి అయిష్టత. ప్రస్తుత వివాహ వ్యవస్థలో ఎన్నో లోపాలున్నాయి. మొదట నుంచి వివాహ వ్యవస్థ మారుతూ వచ్చింది గానీ పితృస్వామిక వ్యవస్థలో ఈ మార్పు అనుకున్నంతగా లేదు. ఇలాంటి సమాజానికి చలం సాహిత్యంలో అనేక సంస్కరణలు ప్రతిపాదించారు. చలం ఉద్యమాలు నిర్వహించలేకపోయినా సమాజ వ్యతిరేకత తీవ్రంగా వున్న రోజుల్లో ఈ తరహా రచనల్ని చేయగలిగాడు. వివాహ వ్యవస్థలోని లోపాలనే చలం ద్వేషించాడు. కాని ఆ వ్యవస్థను కాదు.

చలం నవల్లో ముఖ్యమైన అంశం స్త్రీ పురుష సంబంధాల చిత్రణ. ముఖ్యంగా స్త్రీల సమస్యల్ని దృష్టిలో పెట్టుకొని రాశారు. కాబట్టి ఆయననవల్లో కథానాయకులు ఇష్టం లేని భర్తలని వదిలి వేయడమో మనసుకు నచ్చిన వారితో గడపడము ఉంటుంది. స్త్రీలకి ఆర్థిక స్వేచ్ఛ ఉండాలని చలం చెప్పాడు. కానీ ఆయా నవల్లో ఎక్కడా స్త్రీలు ఆర్థిక సమస్యలకి గురయినట్లు లేరు. అలాగే పిల్లలకు సంబంధించిన బాధ్యతలు ఎవరు పంచుకోవాలో తెలియదు. ఎందుకంటే చలం స్త్రీ పాత్రలకి పిల్లలు పుట్టినట్లు ఎక్కడా ఉండదు. చలం సాంఘిక బాధ్యత నుండి తప్పించుకుంటున్నారనే విమర్శ సాహిత్యలోకంలో వుంది. ఏది ఏమైనా స్త్రీ లైంగిక భావ విప్లవం నుండి అన్ని రంగాల్లో సముచిత స్థానాన్ని సంపాదించడానికి ఆయన రచనలు ఉపకరిస్తాయనడంలో సందేహం లేదు.

**గోపీచంద్ :** వివాహ వ్యవస్థని నిశితంగా పరిశీలించాడు గోపీచంద్. సమాజం పటిష్టంగా వుండాలంటే వివాహ వ్యవస్థ విచ్ఛిన్నం కాకూడదని ఆశించాడు. పెళ్ళిళ్ళు విఫలం కావడానికి మానసిక కారణాలు ముఖ్యమయినవని అంటాడు. స్త్రీ పురుషుల మధ్య మానసిక అనుబంధం పటిష్టంగా లేకపోవడమే ఈ వైఫల్యానికి కారణమని అంటాడు.

చలం దృష్టిలోని స్త్రీ, పురుష సంబంధాన్ని వ్యతిరేకించిన వివాహ వ్యవస్థనీ ఒక కథలో గోపీచంద్ హేళన చేస్తాడు.

" అతని అన్ని పాత్రలూ ఒకే రకంగా
ఉన్నాయి. అదే నునుపు అదే వంపు...
ఎపుడూ డబ్బు సంగతి ఆలోచించలేదు
అసలు ఆ ఆలోచనలకు తీరిక వుందా ?
ఆ వెన్నెల్లో, ఆ మైదానంలో, ఆ
గులాబీ తోటల్లో . . . . . . . . . . . . . . ."

- అని మొదలి నాగభూషణ శర్మగారు వివరించారు.

**బుచ్చిబాబు :** చలం తరువాత స్త్రీ పురుష సంబంధాన్ని తాత్వికంగా చూసినవాడు బుచ్చిబాబు. "చివరికి మిగిలేది" నవలలో కోమలి, దయానిధిల మధ్య వున్నతమైన మానసిక బంధాన్ని ప్రతిపాదించాడు.

**కొడవటి గంటి కుటుంబరావు :** కొడవటిగంటి నవలల్లో స్త్రీ చైతన్య వాదం వుంది. స్త్రీ ని అన్ని కోణాల్నుంచీ పరిశీలించాడు. కానీ ఆయన నవలకి అదే ప్రధాన ఇతివృత్తం కాదు. మానవతా వాదం, సామ్యవాదం, ప్రజాస్వామ్యాలని జీర్ణించుకొని చిత్తశుద్ధితో రాసిన నవలలు కొడవటిగంటివి. అందులో భాగంగా మధ్య తరగతి వర్గంలో వున్న స్త్రీల సమస్యలను కూడా చిత్రించారు.

తర్వాత మార్కిస్ట్ భావజాలంతో, స్త్రీ సమస్యలని కలిపి రంగనాయకమ్మ నవలలు రాశారు.

ఎనభయ్యో దశాబ్దం నుండి స్త్రీవాద భావాలు సాహిత్యంలో తమ ఉనికిని స్థిరపరచుకోసాగాయి. కవితల్లో, కథల్లో, నవలల్లో స్త్రీ సమస్యలు ప్రధాన వస్తువులయ్యాయి. వీటికి సిద్ధాంత నిబద్ధత ఏర్పడింది. ఇంతవరకూ రాసిన రచయితలందరి కన్నా భిన్నంగా, కేవలం స్త్రీ సమస్యలే నేపథ్యంగా అన్ని కోణాల్నుంచీ సమస్యల్ని పరిశీలించి పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

స్త్రీలు చదువుకొని ఉద్యోగాలు చేస్తున్నా మగవాళ్ళతో సమానంగా సంపాదిస్తున్నా వారికి స్వేచ్ఛ లేదు. సాంఘిక హోదా లేదు. వరకట్నం చావులు, మానభంగాలు తప్పడం లేదు. స్త్రీల కష్టాల్ని కరుణరసాత్మకంగా వర్ణించి కన్నీరు తెప్పించే ఇతివృత్తాల కన్నా

చారిత్రక నేపధ్యంలో వివక్షతకు మూల కారణాల్ని అన్వేషిస్తూ ఆలోచనలు రేకెత్తించగల ఇతివృత్తాలు ఇపుడు అవసరం.

**రంగనాయకమ్మ:** సాంఘికంగా, నైతికంగా వివాహానికి వున్న ప్రాధాన్యాన్ని తన నవల్లో పరిశీలించారు. ఏ కారణం చేతైనా వివాహ బంధం విఫలమైతే వివాహ వ్యవస్థనే సాధించకూడదని ఆమె అభిప్రాయం. ఈమె సంప్రదాయానికి భిన్నంగా ఇతివృత్తాన్ని తీసుకొని స్త్రీ ఎదుర్కొనే సమస్యల్ని చిత్రించారు.

**ఓల్గా:** వర్తమాన స్త్రీవాద సాహిత్యంలో ఓల్గా ప్రముఖ పాత్ర వహించారు. సహజ, స్వేచ్ఛ, కన్నీటి కెరటాల వెన్నెల, మానవీ, ఆకాశంలో సగం, గులాబీలు మొదలైన నవలల్నే కాక కవిత్వాన్ని కూడా రాసి స్త్రీవాద సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. జండర్ వివక్ష గురించి, కుటుంబ వివాహ వ్యవస్థలు స్త్రీని అణచివేయడం గురించి ఆయా వ్యవస్థలను స్త్రీల దృష్టి నుంచి విశ్లేషించటం మూలంగా ఈమె దృక్పథం స్పష్టంగా స్త్రీ వాదమని అర్థమౌతుంది. వీరు రాసిన అన్ని నవలలు స్త్రీ సమస్యల్ని ఆయా దృక్కోణాల్లో నిశిత పరిశీలన గావిస్తూ స్త్రీ చైతన్యానికి పాటుపడ్డారు.

స్త్రీ వాదంలో ఉన్న అనేక రకాల్లో ఒకటైన "సోషలిస్టు ఫెమినిస్టుని" అని ఓల్గా గారే తన దృక్పధాన్ని చెప్పుకున్నారు. అయితే ఆమె నవలల్ని పరిశీలించడం వల్ల ఆమె సామ్యవాద స్త్రీవాది అని చెప్పడానికి ఆస్కారం వుంది.

ఈ విధంగా అనేక మంది నవలా ప్రక్రియను తీసుకొని స్త్రీ వాద ఉద్యమాన్ని పరిపుష్టం చేయడానికి తెలుగు సాహిత్యంలో కొంత కృషి జరుగుతూ వస్తుంది.

## 14.6 స్త్రీవాద సాహిత్యం - కథ:

1910 సం॥ గురజాడ "దిద్దుబాటు" కథతో రూపుదిద్దుకున్న కథా ప్రక్రియ ఆయా కాలాల్లో, ఎన్నో దృక్పధాలతో విస్తరించి విరసిల్లుతూ వచ్చింది. దిద్దుబాటు కథలో వేశ్యల ఆకర్షణలో పడ్డ భర్తను నేర్పుగా తనవైపు తిప్పుకున్న ఇల్లాలు కన్పిస్తుంది. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, ముద్దు-కృష్ణ, టేకుమళ్ళ కామేశ్వరరావు, కరుణకుమార్, చలం, స్త్రీ సమస్యలకు సంబంధించిన కథల్ని రాశారు. శ్రీపాద రాసిన "కీలెరిగి వాత" కథ స్త్రీలకు చదువు వల్ల కలిగే ఆత్మస్థయిర్యాన్ని ప్రధానంగా తీసుకొని రాయబడింది. స్త్రీ తన కాళ్ళమీద తాను నిలబడటానికి విద్య అవసరమని అది లేకుంటే పురుషుల చేతుల్లో బానిసకాక తప్పదని హెచ్చరించే కథ "అన్నంత పనీ జరిగింది", "కొత్త చూపు" మొదలైన శ్రీపాద కథల్లోనూ, టేకుమళ్ళ కామేశ్వరరావు గారి "మొగుడు పెళ్ళాం కబుర్లు", "విద్య వింత పశుత్వం" తదితర కథల్లో ఇతివృత్తం స్త్రీ విద్య అవసరమనే ప్రబోధమే. అలాగే ముద్దు కృష్ణ రాసిన "కాలం కల్పించే మార్పు", "తెలివి" మొదలైన కథలు స్త్రీ సమస్యల్ని లోతుగా సహేతుకంగా చర్చించాయి.

స్త్రీ పురుష సంబంధాల పట్ల, కుటుంబ జీవనం పట్ల కొన్ని నిర్దుష్ట అభిప్రాయాలు వున్న చలం ఈ దేశంలో స్త్రీకి జరుగుతున్న అన్యాయాల్ని సమర్ధవంతంగా ఎత్తి చూపారు. స్వంత అభిరుచులు, ఆకాంక్షలు వ్యక్తం చేసుకోవడానికి, శరీర వాంఛ తీర్చుకోవడానికి సమాజంలో స్త్రీకి వున్న అవరోధాల్ని ఆయన ఎదిరించాడు. స్త్రీ వ్యక్తిత్వం కోసం, వ్యక్తిత్వ వికాసం కోసం చేసే ప్రయత్నాలన్నింటినీ సమర్ధించాడు. "స్త్రీ", "బిడ్డల శిక్షణ" లాంటి రచనలు స్త్రీల కోసం ప్రత్యేక శ్రద్ధతో రాశారు. శేషమ్మ, వాణి ఎ స్టడీ, అనసూయ మొదలైన కథల్లో చలం స్వేచ్ఛా భావాలు మరింత స్పష్టంగా దర్శనమిస్తాయి. వీటిలో ప్రేమ, వివాహ వ్యవస్థను గూర్చిన వివరణ ప్రధాన ఇతివృత్తంగా కన్పిస్తుంది.

భర్తల చాటు భార్యత్వం నుండి బయట పడాలనుకునే స్త్రీల మనస్తత్వాల్ని, బిడ్డల బాధ్యత పట్ల తపనని కొమ్మూరి పద్మావతి, ఇల్లిందల సరస్వతీదేవి మొదలైన వారు కథలుగా మలచారు. రంగ నాయకమ్మ గారి కథల్లో స్త్రీవాద ధోరణి స్పష్టంగా కన్పిస్తుంది. జీవితం పట్ల స్పష్టమైన అవగాహన, సమాజం మీద తిరుగుబాటు చేసే ధోరణి, సంప్రదాయాల్ని, మూఢనమ్మకాల్ని ఎదిరించే గుండె ధైర్యం గల స్త్రీ పాత్రలు రంగనాయకమ్మ కథల నిండా కన్పిస్తాయి. "ఆర్తనాదం", "మనిద్దరమే ఉందాం", "విజయ" వంటి కథలు రంగనాయకమ్మ ఆలోచనా తీరుకు అద్దం పడతాయి.

వాసిరెడ్డి సీతాదేవి కథలు ఊహాలోకంలో విహరించేవి కాకుండా, వాస్తవ జీవితంలో స్త్రీ సాధించాల్సిన ఔన్నత్యాన్ని, స్వేచ్ఛని ప్రబోధించేవిగా వుంటాయి. ఆధునిక స్త్రీ సమస్యలకు పెళ్ళి, పెళ్ళి పట్ల సమాజానికున్న సాంప్రదాయక ఆలోచనలేనని పరిమళాసోమేశ్వర్ విశ్వాసం. అందుకే వీరి "క్రోటనీ మొక్కలు'' కథ ఈ భావాల్ని వ్యక్తీకరిస్తూ మంచి ప్రాచూర్యం పొందింది. అలాగే వాచస్పతి గారి "రంగుటద్దాలు'' కథ కట్నం ఇచ్చుకోలేని ఆర్థిక స్థితిలో ఆడపిల్లలు వచ్చిన సంబంధాల్ని ఏదో ఒక కారణంగా కాదనడం, చేతులారా జీవితాల్ని జారవిడుచుకోవడం కన్పిస్తుంది.

సామాజిక స్త్రీ జనోద్దరణ కోసం కలం పట్టానని ధైర్యంగా చెప్పుకొని రచనలు చేసిన చలం శిష్యురాలు తెన్నేటి హేమలత. స్త్రీ సెక్స్ జీవితానికి సంఘం విధించిన కట్టుబాట్లను నిర్భయంగా ఎదిరించి రచనలు చేశారు. అలాగే పి. సత్యవతి గారి "మాఘసూర్యకాంతి'', "ఇల్లు అలకగానే'', అనే కథలు ఈ దృక్పథంలో వచ్చినవే. జానకీరాణి "జగన్మాత'' కథలో అవివాహిత తల్లికావడం, వ్యక్తిత్వం కంటే మాతృత్వం గొప్పదని చెప్పటంతో అద్భుతంగా ముగుస్తుందీ కథ. గోపి భాగ్యలక్ష్మి "జంగుబాయి'' కథలో ఒక గొండు యువతి గూడెం ఆచారాల్ని, కట్టుబాట్లను ధైర్యంగా ఎదిరించి మారుమనువు చేసుకుంటుంది. ఆ కుల కట్టుబాట్లలో ఇలాంటి సంఘటన అరుదైన విషయం.

"పచ్చగడ్డిలో పల్లేరు కాయిలు'', "కంచికి వెళ్ళని కథ'' మొదలైన శీలా సుభద్రాదేవి కథల్లో గృహిణి, ఉద్యోగినిల వివరణ ఉంటుంది. "ఈ దారి ముందుకే'' అన్న కథలో ఒంటరిగా సమాజంలో ధైర్యంగా తమకిష్టమైన జీవితాన్ని ఎన్నుకునే స్త్రీలకు కొండంత ఆత్మవిశ్వాసాన్ని కల్గిస్తుంది.

స్త్రీవాద సాహిత్యంలో అన్ని ప్రక్రియల్ని చేపట్టిన ఓల్గా కథారంగంలోనూ, తన ప్రతిభను చాటుకున్నారు. స్త్రీ వ్యక్తిగత జీవితం రాజకీయమేనని స్త్రీవాద దృక్పథంతో " ఓల్గా రాజకీయ కథలు'' వెలుగు చూశాయి. ఇవి స్త్రీవాద ధోరణిని, సమస్యల్ని అనేక కోణాల్లో విశ్లేషించాయి. ఓల్గా రాసిన "భద్రత'' కథ మిక్కిలి ప్రాచూర్యం పొందింది. అనాకారి భార్య ఉన్నప్పుడే పరస్త్రీ వ్యామోహంలో పురుషుడు పడతాడనుకున్న సుజాత పెళ్ళయి ఇద్దరు పిల్లలున్న రాజారావును జీవితంలోకి ఆహ్వానిస్తుంది. సుజాత 35 సం॥ వయసు దాకా పెళ్ళి చేసుకోక ప్రేమ, వ్యాపకాలు, జ్ఞాపకాలతో కాలక్షేపం చేస్తూ ఉండేది. రాజారావు జీవితంలోకి ప్రవేశించాక అతని భార్య ధనలక్ష్మి సుజాతను మించిన అందగత్తె అని అర్థమౌతుంది. ఆశ్చర్య పడుతుంది. ఒక మగవాడికి రెండో స్త్రీ గా ఉండటంలోని క్షోభను అర్థం చేసుకొని ధనలక్ష్మితో చేయి కలిపి ఇద్దరూ ఆ భర్తను ఒంటరిగా వదిలేసి తమ జీవితాలకు తామే కర్తలం అని తెలుసుకోవడం వల్ల వచ్చిన భద్రతా భావంతో జీవితం గడపడం ఇతివృత్తం.

కొండేపూడి నిర్మల "శత్రుస్పర్శ'' అనే కథాసంపుటి స్త్రీవాద ధృక్పధానికి సంబంధించిందే. ఇందులో ఇరవై కథలున్నాయి. కుటుంబం, రాజ్యం, చట్టం, చరిత్ర ఎన్ని విధాలుగా స్త్రీల్ని ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసి అణిచివేస్తూ, అణచివేత ప్రయత్నాలే ఆత్మీయ సంబంధాలుగా భ్రమపెడుతున్నాయి అనే విషయాన్ని బద్దలు కొట్టడం తన విధి అనీ, ప్రేమతో కన్పించే "శత్రుస్పర్శ''లో లోపించిన మానవ సంబంధాల్ని ప్రశ్నించడం తన హక్కు అని అంటారు నిర్మల. "అబద్దం'' అనే కథ తండ్రి ఊసు తెలియకుండా కొడుకును పెంచడంలో ఎదుర్కొనే సమస్యల్ని వివరిస్తుంది. ట్యూషన్ మాస్టర్లు ఆడపిల్లల్ని లైంగిక వేధింపులకు గురిచేయడాన్ని చెప్పే కథ 'మొద్దురాచిప్ప'' మంచి పాటలు పాడే నేర్పరితనాన్ని పెళ్ళితో ఆ కళను మరచిపోయి, ఎటువంటి ఆత్మానందమూ లేకుండా అర్థరహితముగా జీవితాన్ని గడిపే స్త్రీ కథ "అతని భార్య''. మగవాళ్ళ స్త్రీ లోలత్వాన్ని చిత్రించిన కథ "పురుగు''. దాంపత్య సంబంధాల్లో డొల్లతనాన్ని చిత్రించిన కథ "ఎద్దుపుండు''. యజమాని బానిస సంబంధాల్లా భార్యాభర్తల సంబంధాల్లో మగ్గిపోతున్న శ్యామల జీవితం ఇందులోని కథావస్తువు.

యస్. జయ వెలువరించిన స్త్రీ వాద సంపుటి "రెక్కలున్న పిల్ల''. ఇందులో పద్నాల్గు కథలున్నాయి. "బ్రహ్మ నిర్వాకం'' అనే కథలో సత్యలోకం కథా స్థలం. వంటగ్యాసు లీకు అయి, కిరోసిన్ స్టౌ పేలి, సీలింగు ఫ్యానుకు ఉరివేసుకొని చావమని ఆడపిల్లల నుదుట బ్రహ్మరాస్తుంటాడు. బ్రహ్మధోరణిని స్త్రీలంతా వ్యతిరేకించినట్లు ఊహించి బ్రహ్మతలరాత మారక తప్పదని భావించడం

కన్పిస్తుంది. ఆడవాళ్ళపై వివిధ రూపాల్లో జరిగే అత్యాచారాల్ని వివరించే కథ. కట్నం ఇచ్చి పెళ్ళి చేసుకున్నా అత్తగారి ఇంట్లో చాకిరీ చేసినా గౌరవం లేకుండా అవమాన పరుస్తూ హింసిస్తున్నారని, తన శ్రమకు ఎందుకు విలువ కట్టకూడదని అత్తమామల్ని నిలదీస్తుంది లావణ్య. "లావణ్య" అనే కథలో.

ఇటీవల వచ్చిన "రెప్పచాట ఉప్పెన" అనే కథానం స్త్రీ వాద దృక్పధానికి సంబంధించిందే. ఇందులో పద్దెనిమిది కథలు ఉన్నాయి. "నేనొక్క దాన్నే" అనే కథలో మాతృత్వాన్ని స్త్రీ జీవితంపై బలవంతంగా రుద్దటాన్ని వివరించారు. ఆడ శరీరం మీద పేటెంట్ హక్కులు పొందే మగవాళ్ళు మధ్య నలిగిపోతూ తమని ఆదుకోమని అడిగే స్త్రీ జీవితం ఈ కథలో వస్తువు. "స్త్రీకి నైటీ తగిలిస్తే పడక గదిలో పెట్టొచ్చు శృంగారానికి పనికి వస్తుంది. వాయిల్ చీరగట్టి వంటింట్లో అమరిస్తే వంట వండేసి పనులు చక్కబెడుతుంది. ఇస్త్రీ చీరగట్టి రిక్షా ఎక్కిస్తే పద్ధతిగా ఆఫీసుకెళ్ళి డబ్బు తెస్తుంది". అంటూ స్త్రీ ఉపకరణం పనిముట్టుకాదు. స్వయం నిర్ణయం చేయగల వ్యక్తిత్వమున్న మనిషి అంటూ "త్రిఇన్‌వన్" కథ ముగుస్తుంది.

"ఒంటరిగా లేం మనం" అనే స్త్రీ వాద కథాసంకలనం 1999 సం॥లో మహిళామార్గ ప్రచురణగా వెలువడింది. ఇందులో పద్దెనిమిది (18) కథలున్నాయి. బి. అనూరాధ, విశాఖ, అరుణ, సీత, కరుణ, నవత, నల్లక్క, పద్మ, పి. శేషులత, సిరి, జీవని, బి. రేణుక, టి. శ్రీనివాస మూర్తి, జిమ్మిడి జగదీశ్వరరావు, యం. విష్ణుప్రియ మొదలైన వారి కథలు ఇందులో చోటు చేసుకున్నాయి.

కుప్పిలి పద్మ ఇంతవరకు స్త్రీవాద దృక్పధంతో ముప్పై (30) వరకు కథలు రాశారు. వీటిని రెండు సంపుటాలుగా వెలువరించారు. 1. "మనసుకోదాహం". ఇందులో ఇరవై ఒక్క కథలు వున్నాయి. 2. "ముక్త". ఇందులో పద్దెనిమిది కథలు ఉన్నాయి. పితృస్వామ్యం, స్త్రీ స్వేచ్ఛ, ఇంటి చాకిరి, జండర్ సమస్య మొదలైన విషయాలు ఇతివృత్తాలుగా తీసుకొని స్త్రీ పురుష సంబంధాలు స్నేహపూర్వకంగా, మానవత్వపు విలువలు పునాదిగా వుండాలని ఆకాంక్షించారు పద్మగారు.

"కోమలి గంగాధరం" కథా సంకలనం 2000 సం॥లో వెలువడింది. సి. మృణాళిని సంకలనం చేసిన ఈ పుస్తకంలో యాభై నాలుగు కథలున్నాయి. వ్యంగ్యం, హాస్యంతో కూడిన రచనలు ఇందులో చోటు చేసుకున్నాయి. భార్యాభర్తల ఆర్థిక సంబంధాలు, కుటుంబ బాధ్యత నిర్వహణలో వారి పాత్ర లాంటి విషయాలు ఆయా కథల్లో నిశితంగా చర్చించబడ్డాయి.

ఈ విధంగా అనేకమంది రచయిత్రులు స్త్రీవాద ధోరణిలో కథాసాహిత్యాన్ని సుసంపన్నం చేసి సాహితీలోకానికి అందించారు.

## 14.7 దళిత వాద ఉద్యమం - ఆవిర్భావం - నేపథ్యం:

ఇది దళితయుగం. ఇప్పుడు ఉధృతంగా, ఉద్యమంగా దళిత సాహిత్యం వస్తూ వుంది. ఈ దశలోనే ఏది దళిత సాహిత్యం? ఎవరు దళితులు ? దళిత సాహిత్య సిద్ధాంతాలేమిటి ? లాంటి అనేక విషయాలపై వాడిగా వేడిగా సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఇంకా జరుగుతూ వున్నాయి.

**ఎవరు దళితులు ?** ఈ అంశంపై వ్యక్తమైన అభిప్రాయాల్ని 5 రకాలుగా విభజించవచ్చు.

1. అస్పృశ్య కులాలు మాత్రమే దళితులు
2. హరిజన, గిరిజన వర్గాల వారే దళితులు
3. హరిజన, గిరిజన, వెనుకబడిన తరగతుల వారు దళితులు
4. హరిజన, గిరిజన, వెనుకబడిన తరగతులు మరియు మైనార్టీ వర్గమంతా దళితులే
5. యస్.సి, యస్.టి, బి.సి., మైనార్టీలతో పాటు స్త్రీలు కూడా దళితులే.

పై ఐదు రకాల అభిప్రాయాల్లో ఏది సరియైనదో, సముచితమైనదో నిశితంగా పరిశీలిస్తే అర్ధమౌతుంది.

గిరిజనులు అస్పృశ్యతా జాడ్యానికి లోనుకాకపోయినా, సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఇంకా అన్ని రంగాల్లో

అస్పృశ్యులకన్నా వెనుకబడి వున్నారు. కాబట్టి దళిత పద పరిధిలోకి గిరిజనులు రావడం మిక్కిలి సముచితం. అలాగే వెనుకబడిన తరగతులు కూడా అస్పృశ్యత పీడ లేక పోయినా తరతరాలుగా కులవృత్తులకు పరిమితమై దుర్భర జీవితాల్ని గడుపుతున్నారు. ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉండటమే కాకుండా సాంఘిక గౌరవాన్ని కూడా పొందలేకపోతున్నారు. ఇది హరిజన, గిరిజన వర్గం తరువాత దోపిడీకి గురి అవుతున్న వర్గం. ఎక్కువ జనాభా ఉండి ఏ అధికార పీఠం మీద కానరాని వారు వెనుకబడిన తరగతుల వారే. కాబట్టి వీరిని దళిత పద పరిధిలోనికి చేర్చడం అనుచితం కాదు.

భారతదేశంలో ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, సిక్కు మొదలుగా గల మైనారిటీ వర్గం హిందూ మత ఆధిపత్యం క్రింద, భయం నీడలో బ్రతుకుతూ ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణించబడుతున్నారు. పైగా హిందూమత వివక్షతకు లోనైన అస్పృశ్యులు అట్టడుగువర్గాల వారే ఆత్మగౌరవం కోసం కొత్తగా వచ్చిన మతాల్లోకి వలస వెళ్లారు. ఆ విధంగా మైనార్టీల్లోని ఎక్కువ మంది క్రింది వర్గాలవారే. కాబట్టి ముస్లిం, ఇతర మైనార్టీ వర్గాల్ని ఆదిదళితులు అనవచ్చు. ఈ విధంగా మైనార్టీ వర్గాల్ని దళిత పద పరిధిలోనికి తీసుకోవడం సహేతుకమే. ఇక అగ్ర వర్ణాల స్త్రీలతో సహా స్త్రీలంతా దళిత పద పరిధిలోనికి వస్తారనే వాదనకు అంతప్రాచూర్యం లభించలేదు.

సాంఘిక శాస్త్రవేత్తలు, సాహితీపరులు, విమర్శకులు, రాజకీయ ఉద్యమకారులు ఎక్కువ మంది అన్ని దృక్కోణాల్నుంచి ఆలోచించి దళిత పద పరిధిలోనికి హరిజన, గిరిజన, వెనుకబడిన తరగతులు, మైనార్టీ వర్గం వారు వస్తారని తేల్చి చెప్పారు. దీన్నే దళిత పద పరిధిగా స్వీకరించవచ్చు.

ఈ దళిత పరిధికి లోబడే ప్రముఖ దళిత సాహిత్య విమర్శకులు జి. లక్ష్మీనరసయ్యగారు తాను సంకలనం చేసిన "చిక్కనవుతున్న పాట", "పదునెక్కిన పాట"లలో కేవలం యస్.సి., యస్.టి., బి.సి., మైనారిటీ వాళ్ళు రాసిన కవితల్ని మాత్రమే ప్రచురించారు.

బొంబాయి విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా వున్న ప్రముఖ దళిత రచయిత దళిత పద పరిధిని, దళిత సాహిత్య లక్షణాల్ని గూర్చి చెప్తూ "దళితులంటే ఏదో ఒక కులానికి సంబంధించినవారు మాత్రమే కాదు. సామాజిక బహిష్కృతులు, దోపిడీకి గురవుతున్న వారందరూ దళితులే. దళితులంటే ఒక కులం కాదు. ఒక వర్గం. సామాజిక అంతరాల్ని సామాజిక స్థితిగతుల్ని ప్రతిబింబిస్తూ, గుర్తింపు కోసం, ప్రగతి కోసం అన్వేషించడమే దళిత సాహిత్య లక్ష్యం" అని అన్నారు.

అలాగే కత్తి పద్మారావు గారు దళితపద పరిధిని గూర్చి "భారతావనిలో సాంఘికంగా, ఆర్థికంగా అణగద్రొక్కబడిన వారంతా దళితులే. ప్రధానంగా యస్.సి.లు, యస్.టి.లు, బి.సి.లు, మైనార్టీలు ఈ కోవకు వస్తారు." అని అన్నారు.

"దళితుల ధర్మయుద్ధం" అనే కావ్యంలో "ఎవరు దళితులు" అనే విషయాన్ని గూర్చి "సవేర" గేయ రూపంలో. . .

"దళితులంటే ఎవరు ఎవరు
ధర్మ సందేహమ్ము వలదు
నేటి ఎనుబది ఐదుగా గల
యస్.సి., యస్.టి., బి.సి.,
మైనార్టీ స్త్రీలు - వీరే దళితులు" అని చెప్పారు.

**ఏది దళిత సాహిత్యం ?** ఏది దళిత సాహిత్యం అనే ప్రశ్న వచ్చినపుడు హరిజన, గిరిజన, మైనార్టీ వర్గాలకు సంబంధించిన జీవిత విధానానికి సంబంధించిన సాహిత్యం దళిత సాహిత్యమౌతుంది. దళిత వర్గాలు సృష్టించిందే దళిత సాహిత్యం అనే భావన సమంజసమైంది కాదు. దళిత వర్గాల అభ్యున్నతి కోసం అగ్రవర్ణాలవారు సృష్టించిన సాహిత్యం కూడా దళిత సాహిత్యమే అవుతుంది. అయితే దళితేతరులు సృష్టించిన సాహిత్యం కన్నా దళితులు సృష్టించిన సాహిత్యం వాస్తవ రూపానికి అద్దం పడుతుంది. ఆయా సమస్యల్ని అనుభవిస్తున్న దళితుడి అభివ్యక్తిలోనూ, ఆత్మాశ్రయ రీతిలోనూ గాఢత చోటుచేసుకుంటుంది. అందుకే దళిత సాహిత్యాల్ని దళితులే సృష్టించుకోవలసిన అవసరాన్ని గుర్తించాల్సి వుంది. అంత మాత్రాన దళితేతరులు దళిత స్పృహతో సృష్టించిన సాహిత్యం దళిత సాహిత్యం కాకుండా పోదు.

## 14.8 దళిత సాహిత్యం, తాత్విక నేపథ్యం :

భారతదేశంలో దళిత, సాంఘిక, సాహిత్య ఉద్యమాలకు తాత్విక పునాది బహుపురాతనమైంది. మిక్కిలి పుష్టికరమైంది. అది సుదీర్ఘమైన చరిత్ర కలిగి వుంది. హిందూ మతవాదతత్వం మీద దాన్ని అనుసరించి వచ్చిన సాంఘిక అసమానతల మీద దాడి చేయడం క్రీస్తు పూర్వం నుంచే ప్రారంభమైంది. ఈ తరహాలో దాడి చేసిన ప్రధాన ఉద్యమాలు బౌద్ధం, జైనం, చార్వాకం, వీరశైవం, భక్తిఉద్యమం, పోతులూరి వీరబ్రహ్మం, సిద్దప్పల తత్వాలు పేర్కొనతగ్గవి.

ఇక ఆధునిక కాలంలో జ్యోతిబాపూలే, నారాయణగురు, సాహుమహరాజ్, పెరియార్, ఇ.పి. రామస్వామి నాయకర్ ఆలోచనా విధానాలు, చేసిన పోరాటాలు దళిత ఉద్యమాలకు తాత్విక పునాదిగా నిలిచాయి. ఆ తర్వాత డా॥ అంబేద్కర్ క్రీస్తు పూర్వం నుండి తన వరకు బ్రాహ్మణిజానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్ని ఆకళింపు చేసుకున్నారు. అంతేకాకుండా ప్రపంచంలోని ఆయా జాతుల చరిత్రల్ని, పరిణామాల్ని లోతుగా పఠించారు. అందువలనే ఆయన దళిత ఉద్యమాలకు తాత్విక పునాదిగానే కాకుండా సహేతుకమైన ఉద్యమ వ్యూహరచనకు శ్రీకారం చుట్టారు.

**బౌద్ధం :** గౌతమ బుద్ధుని కాలం నాటికే వర్ణవ్యవస్థ సమాజంలో పాతుకుపోయింది. బానిస వ్యవస్థ ఉంది. బుద్ధుడు ఈ సాంఘిక అసమానతల్ని ఆకళింపు చేసుకొని వర్ణవ్యవస్థను ఘాటుగా ఖండించాడు. బానిసల్ని గౌరవించడమే కాకుండా వారిని విముక్తుల్ని చేయాలని స్పష్టం చేశాడు. బ్రాహ్మణ వ్యవస్థను, వైదిక కర్మకాండను, యజ్ఞయాగాదుల్ని బౌద్ధం వ్యతిరేకించింది. విద్యకు, దానానికి, గౌరవానికి కొన్ని వర్ణాలవారే అర్హులని మిగిలిన వారు అర్హులు కారనే దుష్టనీతిని వ్యతిరేకించింది. వ్యవసాయానికి, వృత్తులకున్న ప్రాముఖ్యాన్ని చాటిచెప్పింది. పండిత, పామర, రాజు, పేద భేదం లేకుండా ప్రజలందరికి ఒకే ధర్మాన్ని చెప్పింది. హింసాపూరితాలైన అగ్నిహోమం, అశ్వమేధం, రాజసూయం, నరమేధం లాంటి యాగాల పేరుతో మనుష్యుల్ని, మేకల్ని, గుర్రాల్ని వధించడం, ధన ధాన్యాల్ని వృధాగా చేయటం లాంటి అంశాల్ని వ్యతిరేకించింది.

బౌద్ధం ప్రత్యేకమైన జీవన విధానంతో దోపిడీని, దారిద్ర్యాన్ని పెంచి పోషించే హిందూ సంస్కృతిని పారదోలడానికి ప్రయత్నించింది. అందుకే ఇది అన్ని తరగతుల ప్రజల్ని ప్రత్యేకించి అట్టడుగు వర్గాల్ని బాగా ఆకట్టుకుంది. కాబట్టే ఈ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా సామాజిక శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అందుకే డాక్టర్ అంబేద్కర్ "బౌద్ధమతాభ్యుదయం ఫ్రెంచి విప్లవమంత భావగర్భితమైంది" అని, "బౌద్ధం కమ్యూనిజానికి ఏ మాత్రం తీసిపోదు" అని అన్నారు. హైందవ సంస్కృతికి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ సంస్కృతిని దళితులు నిర్మించుకోవాల్సిన అవసరాన్ని గుర్తించి, బౌద్ధంలోని సమతాభావాల్ని స్వీకరించారు. డాక్టర్ అంబేద్కర్. ఈ కారణంగానే ప్రపంచంలో మరెక్కడా కానరాని విధంగా ఒకేసారి ఏడు లక్షల మంది హిందూ మతాన్ని వీడనాడి డాక్టర్ అంబేద్కర్ నాయకత్వాన బౌద్ధంలోకి వెళ్ళారు. ఇన్ని రకాల ప్రత్యేకతలతో ప్రారంభ దశ నుండి బౌద్ధం దళితులకు దగ్గరైంది. అందుకే దళిత సాహిత్య ఉద్యమానికి బౌద్ధం తాత్విక పునాదిగా నిలుస్తుంది.

**జైనం :** జైనం, బౌద్ధం కంటే ప్రాచీనమైనది. జైనుల్లో గొప్ప తార్కికులున్నారు. కులతత్వాన్ని నిర్ద్వంద్వంగా వీరు ఖండించారు. జైనం కుల వ్యవస్థకు కారణమైన హైందవ మతాన్ని, మత నమ్మకాల్ని వ్యతిరేకించింది. పూజారి వ్యవస్థ భగవంతుడికి అంటగడుతున్న ఆధిపత్యాన్ని వీరు అంగీకరించలేదు. వైదిక కర్మకాండను, యజ్ఞయాగాదుల్ని, విగ్రహారాధనాన్ని తీవ్రంగా నిరసించింది. జైనంలో స్త్రీ సన్యాసికులు 30 వేల మంది వరకూ ఉండేవారట.

హైందవ సంప్రదాయాల్ని దాదాపు పూర్తిగా వ్యతిరేకించింది. కాబట్టి జైనుల్ని నాస్తికులుగా కొందరు అభివర్ణించారు. జైనులు హిందూ మత దేవుళ్ళ విగ్రహాలపై మల మూత్రాలు విసర్జించి నాటి సమాజంలో కొంత అపఖ్యాతి పాలైనా, అనేక సాంఘిక విషయాల పైన సహేతుక దృష్టిని సారించారు. హిందూమత భావాలపై తిరుగులేని పోరాటం చేసింది జైనం. అందుకే నేటి దళిత ఉద్యమాలకు జైనంలోని కొంత భావజాలం తాత్విక పునాదిగా ఉపకరిస్తుంది.

**చార్వాకం :** దీన్ని ఆదిభౌతిక వాదంగా పేర్కొనవచ్చు. ఇది కూడా కర్మల్ని పునర్జన్మల్ని, వర్ణాశ్రమ ధర్మాల్ని, యజ్ఞయాగాదుల్ని నిశితంగా విమర్శించింది. ఈ జన్మలో చేసుకున్న పాపపుణ్యాల ఫలితంగా మరో జన్మలో హీనవర్గంలోనో, ఉన్నత వర్గంలోనో జన్మిస్తామనే మోసపూరిత వాదాన్ని చార్వాకులు ఖండించారు. 'యజ్ఞంలో బలియిచ్చే పశువు నేరుగా స్వర్గానికి వెళుతుందని నమ్ముతున్నారు గదా, దానికి బదులుగా మీ తల్లిదండ్రుల్ని బలియిస్తే వారు స్వర్గం చేరుకుంటారు కదా!' అని ప్రశ్నించారు. మీ దేవుడు సర్వాంతర్యామి, సర్వశక్తిమంతుడు, దయామయుడు, నీతిపరుడు ఈ సృష్టికి మూలం అంటున్నారు కదా ! అలాంటప్పుడు ఈ లోకంలో దుఃఖాలు, రోగాలు, ఆకలి, అవినీతి ఎందుకు వున్నాయి? వీటిని సృష్టించినవాడు కూడా ఆ భగవంతుడే కావాలి కదా! అని అంటూ దైవభావాల్ని నమ్మేవారిని అపహాస్యం చేశారు.

భారతీయ మతవాదుల వాదాలకు రెండు కాళ్ళు, కళ్ళు అయిన కర్మసిద్ధాంతాన్ని, వర్ణాశ్రమ ధర్మాల్ని నడ్డి విరగ్గొట్టి మానవ మనసుల్ని విముక్తి చేయడానికి చార్వాకం ఎంతగానో ఉపయోగపడింది. ఇది అందరూ సమానులే అనే భావజాలాన్ని వ్యాప్తి చేయడంతో సామాన్యుల, అట్టడుగు వర్గాల ఆదరాభిమానాలకు నోచుకుంది. ఇంతటి భావ గంభీరం గల సిద్ధాంతం కాబట్టే, అనంతర కాలంలో వచ్చిన సిద్ధాంతాలపై వారి ప్రభావం వుంటూ వచ్చింది. అందుకే దళిత సాహిత్యకారులు చార్వాకాన్ని తమ వాదానికి తాత్విక నేపథ్యంగా తీసుకున్నారు.

**వీరశైవం :** శివుడి పట్ల అమితమైన భక్తి భావం కలిగి, సంఘ సంస్కరణాభిలాష మెండుగా వున్నవారు వీరశైవులు. వారి విధానాలు, భావాలు సామాన్యులకు కూడా అందుబాటులో వుండటానికి జైన, బౌద్ధుల్లాగా ప్రజల భాషను వాడారు. సంఘంలో మంచి సంస్కరణ భావాల్ని వ్యాప్తి చేయడానికి వీరు ప్రయత్నించారు. వీరు తెచ్చిన మార్పు అప్పటి వరకు నన్నయ దగ్గర నుండి వస్తున్న సంస్కృతీకరణకు పూర్తి భిన్నమైంది. కవిత్వంలో బ్రాహ్మణ, క్షత్రియులే నాయకులుగా వుండాలనే సంప్రదాయానికి విరుద్ధంగా వీరు సాహిత్య సృష్టి చేశారు.

బ్రాహ్మణులకే కాక, చాకలి, మంగలి, మాల, మాదిగ లాంటి కులాలకి సత్రభోజనాలు, వస్త్రదానాలు ఏర్పాటు చేశారు. తెలుగులో తొలి సాహిత్య ఉద్యమాన్ని ఉదృతంగా చేపట్టి బాగా ప్రచారం చేసిన బసవుడు 12వ శతాబ్దంలో ప్రభగా వెలుగొందాడు. నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు, శ్రీపతి పండితుని వంటివారు ఈ సాహిత్య ఉద్యమాన్ని కొనసాగించారు. బ్రాహ్మణవాదాన్ని వ్యతిరేకించి శూద్రులకు, ఛండాలురకుసముచిత స్థానం ఇవ్వడం కారణంగా వీరశైవం దళిత సాహిత్య ఉద్యమానికి తాత్విక నేపథ్యంగా నిలుస్తుంది.

**భక్తి ఉద్యమం :** 13వ శతాబ్దంలో ప్రారంభమైన భక్తి ఉద్యమం పై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఏకేశ్వరోపాసన, మోక్షసాధనకు మార్గమైన భక్తి, క్రైస్తవ మతం నుంచి హిందూ మతంలోకి ప్రవేశించాయని ఒక వాదం. ఇస్లాం మత ప్రభావంతో సోదర భావం సాంఘిక సమానత్వాలు శంకరాచార్యులు, రామానందుల ద్వారా భక్తిమార్గం పేరుతో హిందూ మతంలోకి ప్రవేశించాయని మరొకవాదం. సూఫి సిద్ధాంతం భక్తి ఉద్యమాన్ని ఉత్తేజపర్చిందని వేరొక అభిప్రాయం.

ఏది ఏమైనా హిందూ మతానికి భిన్నంగా ఇతర మతాల్లో ఉన్న ఏకేశ్వరోపాసన నిరాడంబర పూజావిధానం, సాంఘిక సమానత్వం హిందువుల్ని ఆలోచనాపరుల్ని చేశాయి. బహుదేవతారాధన, వర్ణవ్యత్యాసాలు, నిరర్ధక కర్మకాండలు, విగ్రహారాధన మొదలైనవని హిందూమత బలహీనతలని తెలుసుకున్నారు. ఆ బలహీనతల్ని సరిచేసుకొని భక్తి ఒక్కటే మోక్షమార్గమని ప్రచారం చేశారు. ఈ ఉద్యమాన్ని 14వ శతాబ్దివాడైన రామానందుడు అట్టడుగు వర్గాల్లో భక్తి ఉద్యమాన్ని బాగా వ్యాప్తి చేశాడు. అతని శిష్యుల్లో సాలె, మంగలి, చర్మకారులు, ముస్లింలు మొదలైనవారు అనేక మంది వున్నారు. అలాగే స్త్రీ పురుష సమానత్వాన్ని బోధించాడు రామానందుడు. భక్త మీరాబాయి, భక్త కబీరు ఈయన శిష్యులే. సిక్కు మత గురువైన గురునానక్ ఈ భక్తి ఉద్యమానికి సంబంధించినవాడే. భారతదేశమంతటా ఈ ఉద్యమానికి ఆదరణ లభించడానికి అందులో వున్న సమతాభావజాలమే కారణం.

క్షీణిస్తున్న హిందుమతాన్ని రక్షించుకోవాలన్న భావన ఈ ఉద్యమానికున్న, క్రింది వర్గాలకు ఇచ్చే ఆదరణ వల్ల దేశమంతటా వ్యాపించింది. బౌద్ధం తర్వాత భారతదేశం అంతటా ఇంతగా వ్యాపించిన మత ఉద్యమం వేరొకటి లేదని చెప్పవచ్చు. బ్రాహ్మణ వాదానికి భిన్నంగా ఆనాడు దళితులకు ఆదరణ నిచ్చిన భక్తి ఉద్యమం నేడు దళిత ఉద్యమానికి నేపథ్యంగా భాసిస్తుంది.

ఈ విధంగా దళితోద్యమానికి ఆయా సిద్ధాంతాల ప్రభావమే కాకుండా వ్యక్తుల ప్రభావం కూడా మిక్కుటంగా ఉంది. వారిలో పోతులూరి వీరబ్రహ్మం, జ్యోతిబాపూలే, నారాయణగురు, సాహుమహరాజ్, పెరియార్, ఇ.పి. రామస్వామి నాయకర్, డాక్టర్ అంబేద్కర్ మొదలైన వారి ఆలోచనా విధానం దళిత ఉద్యమానికి మిక్కిలి ఉపకరించాయి.

**పోతులూరి వీరబ్రహ్మం :** కుల వివక్షతల్ని, మత మౌఢ్యాల్ని వ్యంగ్యంతో నిశితంగా విమర్శించి, జాతిని జాగృతం చేయడానికి పూనుకున్న సంఘ సంస్కరణాభిలాషి వీరబ్రహ్మం. ఈయన 17వ శతాబ్దికి చెందినవాడు. విజయనగర సామ్రాజ్య పతనానంతరం మహ్మదీయ పాలన వచ్చిన తరుణంలో బ్రహ్మంగారి తత్వాలకు సంబంధించిన సాహిత్యం వచ్చింది. ఇది నూతన రీతిలో సులభశైలిలో వుండటం వల్ల సామాన్య ప్రజల్లో సైతం ప్రచారమై మిక్కిలి ప్రాచుర్యం పొందాయి. స్వచ్ఛత, సజీవత, సరళత తత్వాల్లో కన్పిస్తుంది. బ్రాహ్మణ వాద భావజాలానికి వ్యతిరేకంగా మానవుల్ని స్వతంత్రంగా ఆలోచింపజేసిందీ సాహిత్యం.

వెనుకబడిన వర్గాలకు చెందిన విశ్వబ్రాహ్మణకులంలో పోతులూరి వీరబ్రహ్మం జన్మించాడు. ముస్లింల్లో వెనుకబడిన వర్గానికి చెందిన సిద్దప్ప, పంచమ వర్గానికి చెందిన మాదిగ కక్కయ్య, పోతులూరికి ప్రియమైన శిష్యులుగా ప్రసిద్ధి చెందారు. బ్రహ్మంగారి ఉద్యమానికి బ్రాహ్మణులు హతాశులై ' నీ కుల రీత్యా నీకు బోధించే హక్కులేదు' అన్నారు. దానికి సమాధానంగా శిష్యుడైన సిద్దప్ప,

" ఏ కులమని నను వివరమడిగితే
ఏమని తెల్పుదు జనులారా! ఓ జనులారా!
అండపిండ బ్రహ్మాండమెల్లను
నిండియున్నది నా కులము" -- అని తత్వాన్ని చెప్పాడు.

కులమనేది బూటకమని, మానవులంతా ఒకటే అన్న విషయాన్ని ఎంతో తర్కంతో నిరూపించాడు.

ఆయన ఆలోచనా విధానాల్ని శిష్యులు ఉధృతంగా వ్యాప్తి చేయడం వల్ల సామాన్య ప్రజానీకంలో కూడా మానసిక వికాసం జరిగింది. ప్రత్యేకించి క్రింది కులాల్లో ప్రశ్నించే సామర్థ్యం పెరిగింది. ఈ ఉద్యమ ప్రభావం అనంతర కవులపై ఉంది.

పూలే నిమ్నజాతుల ఉద్ధరణ కోసం ఉద్యమించాడు. పూలే కులవ్యవస్థకు సంబంధించిన చారిత్రక భౌతిక వాద సిద్ధాంతాన్ని రూపొందించాడు. ఈయన "బానిసత్వం", "పూజారితత్వం బయటపడింది" అనే పుస్తకాల్ని రాశాడు. దళితుల పెళ్ళిళ్ళకు, బ్రాహ్మణ పౌరోహిత్యం అవసరం లేదని స్వకుల పౌరోహిత్యాన్ని ప్రతిపాదించాడు. దీనికి బ్రాహ్మణ పురోహిత వ్యవస్థ నుండి ఎదురైన ప్రతిఘటనకు రాజీలేని నిరంతర చట్టబద్ధమైన పోరాటాన్ని కొనసాగించాడు.

హిందూమతంలోని గుడ్డినమ్మకాల్ని ఖండిస్తూ అస్పృస్యుల అభ్యున్నతికి జీవితాంతం శ్రమించిన నిజమైన సంఘసంస్కర్త జ్యోతిబాపూలే. ఈయన భావాలు, సిద్ధాంతాలు అనంతర కాలంలో అనేక మందిని ప్రభావితం చేశాయి. అందులో డాక్టర్ అంబేద్కర్ అగ్రగణ్యుడు. డా॥అంబేద్కర్ సాంఘిక పోరాటానికి పూలే ఆలోచనలు మిక్కిలి ఉపకరించాయి.

వెనుకబడిన కులంలో జన్మించిన జ్యోతి బాపూలే తానుగా అస్పృశ్యతా జాఢ్యాన్ని అనుభవించకపోయినా, అస్పృశ్యతను రూపుమాపడానికి నిరంతరం శ్రమించాడు. అందుకే ఆయన నిజమైన మహాత్ముడు. అందుకే ఆయనను మహాత్మాపూలేగా పిల్చుకుంటారు. ఇటువంటి మహనీయుని ఆదర్శాలు దళిత ఉద్యమాలకు ఆయువుపట్టు. తాత్విక పునాది.

**డాక్టర్ అంబేద్కర్ :** బౌద్ధం, జైనం, చార్వకం, వీరశైవం, భక్తి ఉద్యమం లాంటి వాదాల్ని జ్యోతిబాపూలే, కబీరుల వంటి వ్యక్తుల భావాల్ని అవగాహన చేసుకున్న డాక్టర్ అంబేద్కర్ ఆలోచనలు దళితవాదానికి ఒక మేనిఫెస్టో. దళితుల సాంఘిక గౌరవం, ఆర్థిక

పురోగతి, దళితుల స్వయంకృషి, ఆత్మగౌరవం, సంపూర్ణ విద్య ప్రత్యామ్నాయ సంస్కృతి, రాజకీయాధికారం మొదలైన అనేక సమస్యల్ని పరిష్కరించడానికి ప్రణాళిక రూపొందించాడు. అంబేద్కర్, దళితులు ఏ ఉద్యమాన్ని ఏ విధంగా నడపాలో, దళితులకు, దళిత ఉద్యమాలకు ఇంటాబయటా శత్రువులు ఎలా ఎందుకు పుట్టుకు వస్తారో కూడా డాక్టర్ అంబేద్కర్ చెప్పాడు. ఈనాడు దళిత ఉద్యమంలోనైనా, దళిత సాహిత్య ఉద్యమంలోనైనా చోటుచేసుకునే అంశాలన్నీ అంబేద్కరిజంలోనివే. అంబేద్కర్ ఆలోచనలే దళిత సాహిత్య సిద్ధాంతాలుగా పేర్కొనవచ్చు. "విద్యావంతుల్ని చేయండి, సంఘటిత పర్చండి, ఆందోళన జరపండి" అన్న అంబేద్కర్ త్రిసూత్ర పథకం ఎంతో విప్లవ గర్భితమైంది. అన్ని సమస్యల్ని అధిగమించడానికి ఉపకరించేవి. అంబేద్కర్ తాత్వికతే దళిత ఉద్యమాల తాత్విక పునాది.

## 14.9 దళిత సాహిత్యం - అంబేద్కర్ ప్రభావం:

ప్రపంచంలో ఏ సాహిత్యమైనా, ఆయా పరిస్థితులను బట్టి అనేక ప్రభావాలకు లోనుకావల్సిందే. వివిధ కాలాల్లో వచ్చిన ప్రముఖ సాంఘిక సిద్ధాంతాలు, దృక్పథాలు, ఉద్యమాలు సాహిత్యంలో చోటుచేసుకోవడం సర్వసాధారణం. అదే విధంగా ఉద్యమకారులైన వ్యక్తుల ప్రభావం కూడా సాహిత్యంపై అమితంగా వుంటుందనేది అక్షర సత్యం.

ఆధునిక తెలుగు సాహిత్యంపై ఎక్కువ ప్రభావాన్ని చూపిన వ్యక్తులు ప్రముఖంగా ఇద్దరే కన్పిస్తారు. వారిలో ఒకరు మహాత్మాగాంధీ కాగా రెండవవారు డా॥ అంబేద్కర్. దాదాపు ఇదే స్థితి భారతీయ భాషా సాహిత్యాల్లోనూ కన్పిస్తుంది.

ఆధునిక సమాజంలో దళితుల సాంఘిక ఉద్యమాలు, సాంస్కృతిక ఉద్యమాలు, సాహిత్య ఉద్యమాలన్నీ డా॥ అంబేద్కర్ సిద్ధాంతాల ఆలంభనగానే వచ్చాయని చెప్పవచ్చు. డా॥ అంబేద్కర్‌పై వచ్చిన రచనల్ని విశ్లేషిస్తే దాదాపు అన్ని ప్రక్రియల్లోను ఆయన జీవితం, ఆయన సిద్ధాంతాలు ఆవిష్కరించబడ్డాయనేది తేటతెల్లమౌతుంది. కావ్యాలు, ఖండకావ్యాలు, ఖండికలు, శతకాలు, కవితలు, గీతాలు, పాటలు, బుర్రకథలు, హరికథలు, రూపకాలు, జీవిత చరిత్రలు, సిద్ధాంత గ్రంథాలు మొదలైన సాహితీ రూపాల్లో అంబేద్కరిజం రూపుకట్టి దళిత చైతన్యానికి దారులు వేసింది.

డా॥ అంబేద్కర్ ఉద్యమ జీవితానికి ప్రభావితులై, ఆయన చరిత్రను ఇతివృత్తంగా తీసుకొని అనేకమంది కావ్యసృష్టి చేశారు.

భారతదేశంలో ఆధునిక దళిత ఉద్యమాలకు, దళిత సాహిత్య ఉద్యమాలకు డా॥ అంబేద్కర్ శ్రీకారం చుట్టారు. ఏ రాష్ట్రంలో దళిత సాహిత్యం ఆవిర్భవించినా అది అంబేద్కర్ భావజాల పునాదిగానే వచ్చింది. గాంధీజీ ప్రభావం గాని, మార్క్సిస్టుల ప్రభావం గాని అంబేద్కర్ తరువాతే వచ్చింది. కారణం అంబేద్కర్ దళిత సమస్య పరిష్కారానికై సాంఘిక పోరాటాన్ని ఉధృతం చేశాకే గాంధీజీ హరిజనోద్ధరణ, అస్పృశ్యతా నివారణ అనే అంశాల్ని జాతీయోద్యమంలో భాగంగా చేపట్టారు. అలాగే మార్క్సిస్టులు కూడా -అంబేద్కర్ తర్వాతే కుల సహిత సాంఘిక సమస్యల్ని కొంతవరకైనా అర్థం చేసుకోగలిగారు.

డా॥ అంబేద్కర్ ప్రభావంతో అనేక మంది సాహితీసృష్టి చేశారు. పత్రికలు పెట్టి వాటి ద్వారా దళిత చైతన్యానికి మిక్కిలి శ్రమించారు. మొదటి తరంలో అంబేద్కర్ ప్రభావంతో రచనా వ్యాసాంగం చేసిన ప్రముఖులలో కుసుమ ధర్మన్న, పద్మశ్రీ బోయి భీమన్న, రావూరి ఏకాంబరం పేర్కొనదగినవారు. వీరు అంబేద్కర్ భావజాలన్ని పూర్తిగా ఆకళింపు చేసుకొని ఆయన దృక్పథాలకు సరితూగే భావ తీవ్రతతో సాహిత్యాన్ని సృష్టించారు.

## 14.10 దళిత సాహిత్యం - కవిత్వం:

కుసుమ ధర్మన్న అంబేద్కరిజాన్ని వ్యాప్తి చేయడానికై "జయభేరి" పత్రికను స్థాపించారు. వీరు రాసిన "మా కొద్దీ నల్లదొర తనము" అను సుదీర్ఘ గీతం పూర్తిగా అంబేద్కర్ భావజాలమే. కర్మ, పునర్జన్మ సిద్ధాంతాల్ని, బ్రాహ్మణవాదంలోని కుట్రని నిశితంగా విమర్శించడం అంబేద్కర్ ప్రభావంతోనే.

" శాస్త్రాలు వేదాలు చదివినట్టి
గొప్ప శాస్త్రులమని చెపుతారు
విద్యావంతులని పలుకుతారు
గొప్ప కవులమని చెపుతారు
శాస్త్ర ధర్మాలెన్నో చాటేరు
సర్వజనులన్న దమ్ములంటారు
మమ్ము మాలమాలనుమాట
మామూలు దప్పారు
మాకొద్దీ నల్లదొరతనము
మాకు పదిమందితోపాటు
పరువు గలుగకయున్న" -- అంటూ జ్ఞానవంతులుగా చెలామణి అవుతూ అజ్ఞానంగా ప్రవర్తించే వారిపై కవితా కొరడాలు ఝుళిపించారు. పద్మశ్రీ బోయి భీమన్న గారు కులవ్యవస్థని, దానికి కారణభూతమైన పురాణాల్ని, పురాణ పురుషుల్ని విమర్శించారు. దేవుడి పేర జరిగే దోపిడీకి కారణమైన బ్రాహ్మణ వ్యవస్థను దుమ్మెత్తిపోశారు. వీరి పాలేరు, కూలిరాజు, పడిపోతున్న అడ్డుగోడలు, ఆదికవివాల్మీకి, వేదవ్యాసుడు, ధర్మవ్యాసుడు, రాగవాశిష్టం, మొదలైన నాటకాలు, గుడిసెలు కాలిపోతున్నై కవితాసంపుటి పూర్తిగా అంబేద్కరిజానికి అద్దం పట్టేవే. అలాగే వీరు "అంబేద్కరిజం", "అంబేద్కర్ సుప్రభాతం" అనే రచనలు కూడా చేశారు.

" ఎంత కాలం గొర్రెగా వుంటావే జనతా
సింహమై తిరగపడి రాక్షసవధ చెయ్యి
నతులతో నినాదాలతో ఊరేగుతున్న
ఈ వేషగాళ్ళు వట్టి మహిషాసురులే కాదు
మేకతోలు కప్పుకొన్న వాతావులు కూడా"

అంటూ నీతులు చెపుతూ, వట్టి నినాదాలతో కాలం గడుపుకునే వాళ్ళు వేషధారులే తప్ప దమ్ము దప్పం ఉన్నవారు కాదని, గొర్రెల్లాగా బ్రతకకుండా సింహమై తిరగబడాల్సిన అవసరం వుందనే సందేశాన్నిస్తున్నారు భీమన్నగారు.

ఇక డాక్టర్ అంబేద్కర్ మార్గంలో ప్రతిబావంతమైన, ప్రభోదాత్మకమైన కవిత్వాన్ని రాసిన వారిలో ప్రథములు ప్రజాకవి రావూరి ఏకాంబరంగారు. డాక్టర్ అంబేద్కర్ **1942** సంవత్సరం ఆంధ్ర రాష్ట్ర పర్యటన చేసినపుడు గుడివాడలో సభ జరిగింది. ఆ సభలో డా॥ అంబేద్కర్ ఇంగ్లీషు ఉపన్యాసాన్ని తెలుగులోనికి అనువాదం చేసింది ఏకాంబరంగారే. వీరు అసలు సిసలైన పదహారణాల అంబేద్కరైటు.

వీరు రాసిన "అంబేద్కరో సమర సింహ" అనే కవితా సంపుటి భావతీవ్రతను, దృక్పథ ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఇది దళిత సాహిత్య ఉద్యమ రూపాన్ని సంతరించుకునే క్రమంలో వచ్చిన మొదటి మేలైన రచన. ఎక్కడా ఎటువంటి రాజీలేకుండా వ్యవస్థలోని లొసుగుల మీద, వ్యక్తుల బలహీనతల మీద విమర్శల వర్షం కురిపించి దళిత ఉద్యమ సాహిత్యానికి తొలిమెట్టు అయినారు. నేటి దళిత కవులకు ఆయన అన్ని దృక్కోణాల్నుంచి మార్గదర్శకుడవుతారు.

" దళిత మేధావులు కలమెత్తి గళమెత్తి
ధ్వజమెత్తవలె దేశ ప్రగతి కొరకు
దళిత మేధావులు దాసోహములు మాని
సిగబట్టి బక్కులకు నూకవలయు
దళిత మేధావులు రండకమ్ములుమాని

దళితుల గాథలు తవ్వవలయు
దళిత మేధావులు దాస్య భాష్యాల్మాని
సూటిగా సత్యముల్ చాటవలెను''

అంటూ దళితులకు కర్తవ్యాన్ని బోధించడమే కాకుండా, దళిత రచయితలకు మార్గదర్శక అంశాల్ని సూచించారు. అంబేద్కర్ ఆలోచనలకు అక్షర రూపం ఈ పద్యం.

తొలితరం దళిత కవుల్లో మిక్కిలి గుర్తింపు పొందినవారు కుసుమ ధర్మన్న కవి. వీరు కవి, ఉద్యమకారుడు, సంఘసంస్కర్త, అంబేద్కరైటు. ఆ తరం తెలుగు కవుల్లో డా॥ అంబేద్కర్ సాంఘిక విప్లవ పోరాటాన్ని ఆకళింపు చేసుకున్న వారిలో వీరు ప్రథములు. 1942 సంవత్సరములో అంబేద్కర్ ఆంధ్రరాష్ట్ర పర్యటన చేసినపుడు కుసుమ ధర్మన్న గారి చేత ప్రభావితమైన వర్గం ఆయనకు బ్రహ్మరథం పట్టింది. ధర్మన్న గారు 1933 సంవత్సరములో "హరిజన శతకమును'' రాశారు. ఆ తర్వాత "నల్లదొరతనము" అనే సుదీర్ఘమైన 56 చరణాలు కలిగిన పాటను రాశారు. దీనికి గరిమెళ్ళ సత్యనారాయణ గారి "మా కొద్దీ తెల్లదొరతనము''నకు వ్యతిరేకముగా రాసినదీ కవిత్వం.

"మా కొద్దీ తెల్లదొరతనము'' నకు ఎంతటి ఆదరణ, ప్రాధాన్యం లభించిందో "మాకొద్దీ నల్లదొరతనము'' నకు అంతే ఆదరణ, ప్రాధాన్యం ధర్మన్నకు దళితుల నుండి లభించింది. స్వాతంత్ర్యం వచ్చాక, "మాకొద్దీ తెల్లదొరతనము'' పాట ప్రయోజనం పూర్తి అయ్యింది. అందుకే ఆ పాట గొప్పదనాన్ని, కవి గొప్పదనాన్ని మాత్రమే ఇపుడు అవసరమైతే చెప్పుకుంటాం. కాని ధర్మన్న "మా కొద్దీ నల్లదొరతనము'' అనే ఉద్యమం నేటికీ అవసరమే. దళితులు దారుణ జీవన స్థితి నుంచి కోలుకునే వరకు వీరి భావజాలం దళితులకు శిరోధార్యం. ఆ పాట ఇంకా పాడటం, పాడించడంలోని ఆవశ్యకతను నేటి సామాజిక పరిస్థితి సైతం తేటతెల్లం చేస్తాయి. అందుకే "మా కొద్దీ నల్లదొరతనము'' పాటకు ఇంకా జీవం వుంది. జీవించాల్సి ఉంది. ఈ పాట ప్రాముఖ్యాన్ని బట్టే వీరికి "నల్లదొరకవి'' గా ప్రాచుర్యం లభించింది. వీరు "జయభేరి'' అనే వారపత్రికను స్థాపించి దళితుల స్థితిగతుల్ని, దళితుల కోర్కెల్ని దాని ద్వారా తెలియజేశారు. దళితుల్లో సాంఘిక చైతన్యాన్ని, రాజకీయ అవగాహనను తీసుకురావడానికి ఇది ఎంతగానో ఉపయోగపడింది. ఆనాడు అంబేద్కరిజానికి అద్దం పట్టిన పత్రిక "జయభేరి'', కొన్నాళ్ళు దీనికి సహాయ సంపాదకులుగా ప్రముఖ కవి పద్మశ్రీ బోయి భీమన్న గారు వ్యవహరించారు. "వాల్మీకి ఆశ్రయం'' అనే దాన్ని స్థాపించి దళిత కవులకు, నాయకులకు, ఉద్యమకారులకు కూడిన స్థానంగా వుంచారు. "నల్లదొరతనము'' పాటను అచ్చులో తీసుకువచ్చేటప్పుడు ధర్మన్నగారు --

'' బ్రాహ్మణః క్షత్రియో వైశ్యస్త్రయో వర్ణా ద్విజాతయః
చతుర్థ ఏక జాతిస్తు శుద్రో నాస్తితు పంచమః''

అనే శ్లోకాన్ని ఇచ్చారు అలానే

'' వినదగు నెవ్వరు చెప్పిన
వినినెంతనె వేగపడక వివరింపవెలన్
గని కల్ల నిజము తెలిసిన
మనుజుడెపో నీతిపరుడు మహిలోసుమతీ''

అనే సుమతీ శతక పద్యాన్ని కూడా ఇచ్చారు. తాను రాస్తున్న "నల్లదొరతనము'' అగ్రవర్ణాల వారికి ఏ మాత్రం రుచించదని తెలుసు. అందుకే వినదగు ఎవ్వరు చెప్పిన అనే మాటను ముందు చెప్పి, తన వాదాన్ని, దళితుల వేదనల్ని విపులంగా ఈ పాటలో వివరించారు.

ఈ పాటకు. . ..

పల్లవి. మా కొద్దీ నల్లదొరతనము - దేవ మాకొద్దీ నల్లదొరతనము
అను పల్లవి. మాకు పదిమందితో పాటు - పరువు గలుగక యున్న ॥మీకీ॥

స్వతంత్ర్యం కావాలని అడిగే అగ్రవర్ణాలవారు అస్పృశ్యతను పాటిస్తూ భారతీయులైన మమ్మల్ని స్వాతంత్ర్యాన్ని హరింపజేస్తున్నారని వాపోతూ....

" స్వతంత్ర్య పాలన జేసెద మంటారా
చెంతకు మమ్ము చేరనీరు
శర్మగారిని శరణన్న లేదు
గుప్తగారిని గురువన్న లేదు
కాపు కరణాలకు కరుణలేదు దేవ
వర్మాలకు మేము దుర్మార్గులమంట ॥మాకీ॥

అంటూ చాతుర్వార్ణ వ్యవస్థలో పై మూడు వర్గాల వారు మిక్కిలి నిర్థయంగా దళితుల పట్ల వ్యవహరించడం అన్యాయమని చెప్పారు.

భారతదేశానికి రాజ్యాంగాన్ని అమలులోకి తెచ్చే సందర్భంగా జరిగిన సమావేశంలో డా॥ అంబేద్కర్ మాట్లాడుతూ 'ఈ దేశానికి వేదం కావాల్సివచ్చినపుడు మా వాడైన వ్యాసుడు కావాల్సి వచ్చాడు. ఈ దేశానికి పురాణం కావాల్సి వచ్చినపుడు మా వాడైన వాల్మీకి కావాల్సి వచ్చాడు. ఈ దేశానికి రాజ్యాంగం కావాల్సి వచ్చినపుడు నేను దొరికాను' అని అంటారు. ఇదే భావాన్ని. . .

మా వంశంబున బట్టే
మహిమ గాంచినయట్టి మానవులను గానరేల
వేదవ్యాసుడు మా వాడు గాడ!
వాల్మీకి గోత్రము మాదిగాద ?
శుకుడు మా వంశమున బుట్టలేదా!
మా కులము తక్కువైతే గుణము లేదంటారా ॥మీకీ॥

అంటూ తన పూర్వీకుల గొప్పదనాన్ని ప్రస్తావిస్తారు కవి,

యెవరు మాదిక్కండి ॥మాకీ॥ అని అంటారు. హిందూ మతం వల్లే సాంఘిక వ్యవస్థ సర్వనాశనమైందని మేధావులు చెబుతుంటే, పండితులమని చెప్పుకునే వారికి ఏ మాత్రం ఇంగిత జ్ఞానం లేకుండా ఎందుకు పోయిందని బాధపడతారు ధర్మన్న.

"గుడిసెలు కాలిపోతున్నై" గద్య కవితల సంపుటి భీమన్న గారి అద్భుత రచనల్లో అగ్రగామిగా నిలుస్తుంది. వీరు దాదాపు తమ అన్ని రచనలకు స్వీయ పీఠికల్ని, గూర్చి డా॥ కొండపల్లి సుదర్శనరాజుగారు "శాస్త్రీయ దృక్పధానికి, సునిశిత పరిశీలనాశక్తికి, విషయవివేచనాపరిజ్ఞానానికి భీమన్న గారి బిగువైన పీఠికలు గీటురాళ్ళు. తాము పరిశీలించి, నిగ్గుతేల్చిన విషయాన్ని పీఠిక రూపంలో పగడ్బందీగా వ్యక్తం చేయడంలో వీరు ప్రత్యేకత కనపర్చారు" అని అన్నారు.

ఈ గద్య కవితల సంపుటికి భీమన్న "దండోరా" అనే స్వీయ పీఠికను రాసుకున్నారు. 1976 సంవత్సరములో ఈ సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు వచ్చింది. దీన్ని ప్రముఖ దళిత నాయకులు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల్లో అనేక సార్లు మంత్రిగా ఉండి గుడిసెలు వాసులకు బాసటగా ఉండిన జి. వెంకటస్వామి గారికి అంకితమిచ్చారు.

దండోరా పీఠికలో దేశంలోని అవినీతిని, లంచగొండితనాన్ని, దోపిడీ విధానాన్ని, మతమౌఢ్యాన్ని, కులజాడ్యాన్ని నిశితంగా విమర్శించారు. కవి సమాజానికి ఎన్ని చెప్పినా అవి పాలకులు పెడచెవిని పెడుతున్నారని, అవి అరణ్యారోదనగా మిగిలిపోతున్నవని చెప్పారు. రోజురోజుకు పెరిగిపోతున్న నిరుద్యోగ సమస్యని, కనీసం తిండికి లేక బిచ్చగాళ్ళుగా మారే స్థితిని చక్కబెట్టాలని చెప్పారు. మతం పేదలపై ప్రగాఢమైన ప్రభావం చూపుతుందని, ఆ కారణంగా వారు అన్నిటా వెనుకబడిపోతున్నారని చెప్పారు. దేవుడి పేర జరిగే దోపిడీ నుంచి దళితులు, వెనుకబడిన తరగతుల వాళ్ళు, స్త్రీలు విముక్తి పొందాల్సిన అవసరం వుందని చెప్పారు.

కుల వ్యవస్థ కూలనిదే భారత జాతికి విముక్తి లేదని తెలిపారు. కులం, మతం, రాజకీయ పార్టీల పేరుతో అనునిత్యం గొర్రెల్లా మోసగించబడుతుంది.

వీరి రచనల్లో పాలేరు, కూలిరాజు, రాగవాసిష్టం, ఆదికవి వాల్మీకి, మొదలైన నాటకాలు, బొమ్మ, దీపసభ, మధుబాల, అశోకవనిలో రాముడు మొదలైన కావ్యాలు, రాఖీలు, భీమన్న, ఉగాదులు మొదలైన కవితాసంపుటాలు, ధర్మం కోసం పోరాటాలు, జన్మాంతర వైరమ్, శవాలికలు, అంబేద్కరిజం, అంబేద్కరసుప్రభాతం మొదలైన సిద్ధాంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్న రచనలు, పిల్లిశతకం లాంటివి ప్రధానంగా పేర్కొనతగినవి. నలభైకి పైగా వీరి రచనలు ముద్రణకు నోచుకోవడం మిక్కిలి విశేషం. తక్కువ కాలంలో ఎక్కువ రచనలు చేసే వీరి తత్వాన్ని గూర్చి అభినందించారు. డా॥ సి. నారాయణరెడ్డిగారు.

## 14.11 దళిత సాహిత్యం - నవల:

తెలుగు నవలా సాహిత్యంలో వెలువడ్డ మొట్టమొదటి తెలుగు నవల నరహరి గోపాలకృష్ణమ్మ శెట్టిగారు రాసిన "శ్రీ రంగరాజ చరిత్ర" ఇది **1872** సంవత్సరములో రాయబడింది. అలాగే దళిత నవలా సాహిత్యంలో ప్రస్తుతం మొదటి నవలగా తల్లా ప్రగడ వారి "హేలావతి" కనిపిస్తుంది. ఇది **1913**లో రాయబడింది. తెలుగులో మొదటి నవల "శ్రీ రంగరాజు చరిత్ర"లో ఎలాగైతే పూర్తి నవలా లక్షణాలు కనిపించలేదో, దళిత నవలా సాహిత్యంలో కూడా మొదటిదిగా పేర్కొనబడుతున్న తల్లాప్రగడ వారి హేలావతి నవలలో దళిత జీవన చిత్రణ చిత్రింపబడింది. కాని దళిత చైతన్యం కనిపించలేదు. తెలుగు నవలా సాహిత్యంలో పూర్తి నవలా లక్షణాలతో శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారి రాజశేఖర చరిత్రము **(1878)** వచ్చినట్లే, తెలుగు దళిత నవలా సాహిత్యంలో దళితాభ్యున్నతి పరంగా మంచి చైతన్యం చిత్రించబడ్డ నవల "మాలపల్లి". ప్రస్తుతం తెలుగు దళిత నవలా సాహిత్యాన్ని, రచయితల్ని సంక్షిప్తంగా పరిచయం చేయడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

కీర్తిశేషులు తల్లా ప్రగడ సూర్యనారాయణ శాస్త్రి రాసిన నవల హేలావతి. సాంఘిక వ్యవస్థ, వర్ణ వ్యవస్థల గురించిన నిశితమైన విమర్శ ఈ నవల్లో కనిపిస్తుంది. హరిజనోద్ధరణ ప్రధానంగా కనిపించడమే కాకుండా, సంఘ దురన్యాయాల్ని పోగొట్టడానికి కావాల్సిన మార్గన్వేషణాంశాలు ఈ నవలలో చక్కగా చిత్రించారు.

జంట కవులైన బాలాంత్రపు వెంకటరావు, ఓలేటి పార్వతీశంలు రాసిన నవల "మాతృమందిరం", దుష్టులకు శిష్టగుణాలు అలవరచడం, అనాథలలో ఆత్మవిశ్వాసాన్ని కల్పించడం, వారిని భావి భారత పౌరులుగా దేశాభ్యుదయానికి సేవ చేసేవారుగా చేయడం ఈ నవల ప్రధానోద్దేశంగా కనిపిస్తోంది.

ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు రాసిన నవల "మాలపల్లి". ఇది గాంధీజీ జాతీయోద్యమ ప్రభావంతో, దళితుల్ని స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములు చేయడం కోసం రాయడమైంది. అంతేకాకుండా నాడు సంఘంలో అస్పృశ్యతా జాడ్యం ఎంత తీవ్రతరంగా వుందో దళితులు ఎటువంటి వివక్షితలకు, అన్యాయాలకు లోనవుతున్నారో అనే విషయాల్ని ఈ నవల తెలియజేస్తుంది.

"బద్దన్నసేనాని" నవల విశ్వనాథ సత్యనారాయణ గారిచే రచింపబడినది. ఈ నవల్లో నాయకుడైన బద్దన్న మాదిగ కులస్థుడు. గోశాల నివాసియైన ఇతడు వీరశైవుడు. ఇతడు కేవలం జ్ఞాని మాత్రమే కాకుండా వీరశైవ నియమాలకు కట్టుబడి వుండాలనే నియమనిబంధనల్ని చేసిన మంచి భక్తుడు. దళితుల్లో కూడా ధర్మాధర్మాల బుద్ధి విచక్షణా, నీతినియమాలు, దేశభక్తి, రాజవిధేయత మొదలైన లక్షణాలు ఇతనిలో కన్పిస్తాయి. ఈ నవల్లో ఆ నాటి సాంఘిక, రాజకీయ పరిస్థితులు అవగతమౌతాయి.

ఇల్లింద్ర రంగనాయకులు రాసిన "మల్లిక" నవలా రచయిత యొక్క మనోభావాలకు ప్రతీక. హరిజన దంపతులైన పార్వతి, శంభుదాసుల ఏకైక కుమార్తె మల్లిక. మల్లిక పూలు కోస్తూ వుందని ఆ తోట కాపరులు కొట్టే సమయంలో లక్ష్మీనాథశాస్త్రి వారిని వారించి ఆమెను కాపాడతాడు. లక్ష్మీనాథశాస్త్రి చేసిన మేలుకు మల్లిక తన ఇంటికి వచ్చి భోజనం చేసి వెళ్ళవలసిందని కోరుతుంది. అమ్మాయి హరిజన అని తెల్సిన లక్ష్మీనాథశాస్త్రి భోజనం చేయడమే కాకుండా తన ఆశ్రమంలో హరిజనులకి, పేదవారికి భోజనాలు

ఏర్పాటు చేస్తూ వుంటారు. దీనిని అనేక మంది సంప్రదాయ వాదులు ఎదుర్కొని వ్యతిరేకిస్తారు. చివర్లో అస్పృశ్యతను పాటించడం అమానుషమని తెలుసుకోవడంతో నవల పూర్తవుతుంది.

డా॥ అంతటి నరసింహం గారు "ఆదర్శ"మనే నవల్లో దళిత ప్రగతిని కాంక్షించారు. ఉపాధ్యాయులు, ఊరు పెద్దలు దళితులకు చదువు చెప్పటం, వారికి చదువు పట్ల ఆసక్తి కలగజేయటం ప్రధానాంశంగా ఈ నవల కనిపిస్తుంది.

నముకలకంటి జగన్నాథం గారు ఈ సమాజంలోని అస్పృశ్యత జాడ్యాన్ని రూపుమాపాలనే ధ్యేయంతో "అంటరాని జంట" అనే నవల్ని రాశారు. హరిజనుడైన రమేష్ హైస్కూలు హెడ్మాష్టర్‌గా ఉద్యోగం చేస్తుంటాడు. పద్మావతి వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో సేవికగా పనిచేస్తూ వుంటుంది. ఆమె బ్రాహ్మణ స్త్రీ. కులం తెలియనప్పుడు ప్రేమించి, హరిజనుడనే కారణంగా రజియా తిరస్కరిస్తుంది. పద్మావతి గతంలో మోసగించబడటం వల్ల రమేష్‌ని చేసుకోవడానికి సిద్దపడుతుంది. వీరి వర్ణాంతర వివాహం ద్వారా మనసు కన్న కులం ప్రధానం కాదనే విషయాన్ని నవలాకారుడు చెప్పిస్తాడు.

ముప్పాళ్ళ రంగనాయకమ్మ వర్ణాంతర వివాహాల్ని ప్రోత్సహించడం కోసం "బలిపీఠం" నవలను రాశారు. దళితనవలా సాహిత్యంలో తొలి నవలారచయిత్రిగా ఈ రచనతో స్థానం సంపాదించుకుంది. ఆంధ్రప్రభలో సీరియల్‌గా వచ్చిన ఈ నవలకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య-అకాడమీ అవార్డు లభించింది. అట్లాగే ఈ నవలని సినిమా తీయగా మంచి ప్రేక్షక ఆదరణ వచ్చింది. ఈ నవల్లో నాయకుడైన భాస్కర్ హరిజనుడు, బ్రాహ్మణ స్త్రీయైన అరుణ జీవితంలో చరమ క్షణాల్ని అనుభవిస్తున్నప్పుడు భాస్కర్ ఆమెను చూడటం తటస్థిస్తుంది. ఆమె సౌభాగ్యవతిగా చావాలనే కోరిక ప్రకారం తాళి కడతాడు. అయితే ప్రకృతి వైద్యశాల్లో బ్రతికి బాగుపడుతుంది. ఇక తప్పింది కాక తాళికి బద్దుడై బహిరంగ వివాహానికి సిద్ధపడుతుండగా ఇరువర్గాల వారు ప్రతిఘటిస్తారు. అనేక మలుపులు అనంతరం భాస్కర్ యొక్క పవిత్ర హృదయానికి అంజలి ఘటిస్తూ తన తప్పుకు, తొందరపాటు తనానికి పశ్చాత్తాపపడుతూ భర్త ఒడిలో కనుమూసింది.

ప్రముఖ నవలారచయిత్రి కళాప్రపూర్ణ లత రాసిన "మిసెస్ కోకిల" నవల దళితాభ్యుదయాన్ని, వర్ణాంతర వివాహాల్ని కాంక్షించేదిగా వుంది. ఉన్నత కుటుంబంలో పుట్టిన కోకిల అభ్యుదయ భావాలకు ఆకర్షితురాలై దళితుడైన జీవరత్నంను రిజిస్ట్రర్ వివాహం చేసుకుంటుంది. కాని ఆ తర్వాత వారి మధ్య కొన్ని బేధాభిప్రాయాలు చోటుచేసుకుంటాయి. కోకిల అతని నుండి విడాకులు కోరుతుంది. అవగాహన లేకుండా తొందరపడి ఆదర్శవివాహం చేసుకోవడం మంచిదికాదనే భావన ఈ నవల్లో కనిపిస్తుంది.

డా॥కేశవరెడ్డిగారు "ఇన్‌క్రేడిబుల్ గాడెస్" "స్మశానం దున్నేరు", "చివరి గుడిసె" మొదలైన నవలలు దళితాభ్యుదయం కోసం రాశారు. కూలీలు పడే శ్రమను, వారిని భూస్వాములు దోచుకునే తీరును, వాళ్ళు నిరంతరం అనుభవించే దుర్భర దారిద్ర్యాన్ని తెలియజేసే నవల "ఇన్‌క్రేడిబుల్ గాడెస్", అలాగే భూస్వాములు దళితుల పొలాల్ని, బంజరభూముల్ని ఆక్రమించుకోవడమే గాక హరిజనులకు చెందిన స్మశానాన్ని కూడా ఆక్రమించుకొని సాగుచేయడం "స్మశానం దున్నేరు" నవల్లోని ఇతివృత్తం, అస్పృశ్యుల్ని అవమానాలకు గురిచేస్తూ ఊరికి దూరంగా వుంచి, వారిని అనేక విధాలుగా దోచుకోవడాన్ని విశదీకరించే నవల "చివరిగుడిసె".

"తకథిం తకథిం తోలుబొమ్మ" అనే నవల్ని కప్పగంతుల మల్లికార్జునరావు రాశారు. ఈ నవల్లోని నాయకుడైన గాంధీ హరిజనుడు. "లా" చదివి న్యాయవాదిగా పేరు సంపాదించి భూస్వామి కూతురైన సరోజిని పెళ్ళిచేసుకుంటాడు. దళితాభ్యుదయానికి పాటుపడుతున్నట్లు, నటిస్తూ అక్రమార్జనకు పాలుపడతాడు. భవాని అనే పదోతరగతి అమ్మాయిని మభ్యపెట్టి లోబరుచుకోవడమే కాకుండా ఆ అమ్మాయిని ఒక ఆటబొమ్మగా ఉపయోగించుకుంటాడు. ఇది తెలిసిన భార్య చనిపోతుంది. దళితులే దళితాభ్యుదయాన్ని కోరుకోని సందర్భాలు అనేకం వున్నాయని ఈ నవల తెలియజేస్తుంది. ఈ పరిస్థితి మారాలని కాంక్షిస్తుంది.

దళితాభ్యుదయానికి అవరోధంగా ఉన్న అనేక విషయాల్ని ఎత్తి చూపుతూ వాటిని అధిగమించి దళిత ప్రగతిని సాధించడానికి రాసిన నవల "తపోబలం". దీని రచయిత్రి జె. రామలక్ష్మి.

"నవకళ్యాణం" నవల్ని డా॥ ముదిగొండ శివప్రసాదరావు గారు రాశారు. ఇది బసవేశ్వరుని ఆశయాలకు ప్రతిబింబమైన నవల. ఇందులో కులరహిత సమాజ స్థాపన ధ్యేయంగా వుంది. దళితుల్లో కూడా మంచి భక్తులు, సత్శీలురు వుంటారనే విషయాన్ని తెలియజేస్తుందీ నవల.

"సౌరాజ్యం" అనే నవలని అక్కినేని కుటుంబరావు రాశారు. భూస్వాముల శ్రమకు తగిన ఫలితాన్ని ఇవ్వకుండా తక్కువ కూలీని ఇస్తున్నారనే అంశం ప్రధానంగా చర్చించబడింది. బడుగు బలహీన శ్రామిక వర్గాలంతా కలిసి కూలిరెట్లు పెంచమని ఉద్యమించడం, భూస్వాములు ఆ ఉద్యమాన్ని వంచనతో అణచివేయడం, గత్యంతరం లేక కూలీలంతా పొట్టపోషణ కోసం ఇతర ప్రాంతాలకు వలసపోవడం ఈ నవలలో కన్పిస్తుంది.

"అసురగణం" అనే నవల్ని నరసింహప్రసాద్ రాశారు. భూస్వాములు పేదరికాన్ని ఆసరాగా తీసుకొని దళితుల్ని అవమానించడం, దళిత స్త్రీలపై అఘాయిత్యానికి పూనుకోవడం దాన్ని దళితులంతా సంఘటిత శక్తితో ఎదుర్కొని భూస్వామిని హతమార్చడం ఇందులో ఇతివృత్తం.

"రాకాసి కోడలు" అనే నవలను డా॥ ఆంజనేయులు నాయుడు రాశారు. దళితులు ఆత్మాభిమానం కోసం వాళ్ళకు జరిగే అన్యాయాల్ని వ్యతిరేకించడం కోసం ఉద్యమించాల్సిన అవసరాన్ని ఈ నవల ప్రబోధిస్తుంది. సంఘటన శక్తితో దళితులు వారిని హింసకు గురిచేయుచున్న భూస్వామిని భూస్థాపితం చేయడానికి దండెత్తిపోవడంతో కథ ముగుస్తుంది.

"అంతులేని అమావాస్య" అనే నవల్ని దడాల చంటబ్బాయి రాశారు. ఇందులో దళితులు పాలకవర్గాల చేత ఏవిధంగా వంచించబడుతున్నారో వివరించబడింది. దళితులు తమ హక్కుల సాధన కోసం న్యాయబద్ధంగా పోరాడటం, ఆ పోరాటంలో దళిత ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న యువకుడు మరణించడం ఉద్యమానికి పెద్ద దెబ్బ తగులుతుంది. దేశమంతా ముందుకు పోతుంటే హరిజనులు మాత్రం అంతులేని అమావాస్యలో కొట్టుమిట్టాడుతునే వున్నారనే భావాన్ని నవలాకారుడు ఆ నామకరణం చేశాడు.

'కులకన్య' అనే నవల్ని భూపతి రామారావు రాశారు. ఈ నవల ఒకరినొకరు అర్థం చేసుకొని వర్ణాంతర వివాహాలు చేసుకోవాలని ప్రబోధిస్తుంది. అలాగే దళితులు తమ ఆస్తిలో కొంత భాగాన్ని దళిత ప్రగతి కోసం జరిగే ఉద్యమాలకి దానం చేయాల్సిన అవసరాన్ని ఈ నవల తేటతెల్లం చేస్తుంది.

ఈ విధంగా ఎందరో రచయితలు నవలా ప్రక్రియలో దళితుల స్థితిగతుల్ని, వారి అవసరాల్ని, వారి కర్తవ్యాన్ని, ఇతరులు వారి పట్ల మెలగాల్సిన తీరుతెన్నులను వివరిస్తూ రచనా వ్యాసాంగాన్ని చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. దళిత సాహిత్య ఉద్యమంలో ఈ ప్రక్రియకు ప్రముఖ స్థానం వుంది.

## 14.12 దళిత సాహిత్యం - కథ:

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలో ఉద్భవించిన సాహిత్య ప్రక్రియ తెలుగు కథానిక, కాలానుగుణంగా అభివృద్ధి చెంది ఆధునికాంధ్ర సాహిత్యంలో విస్తృత పాత్రను సంతరించుకొని నేడు ఒక ఉన్నత స్థానాన్ని పొందింది. ప్రాచీన కాలంలో జానపద కథల రూపంలోనున్న కథావాఙ్మయం ఆధునిక కాలానికి కొత్తవైన లక్షణాలతో నూతన రూపు ధరించుకొని కథలా పిలువబడేదల్లా కథానికైనది.

భాష విషయంలో గానీ, భావ విషయంలోగానీ, తెలుగు సంపూర్ణ లక్షణాలను సంతరించుకున్న తొలి కథానిక గురజాడ అప్పారావు గారి 'దిద్దుబాటు' ఇది 1910లో ఆంధ్ర భారతి పత్రికలో ప్రచురించబడింది. తొలి రోజులలో ఆంధ్రభారతి, ఆభ్యాయిక, త్రిలింగ, సాహితి, భారతి, శారద, ప్రతిభ, ప్రబుద్ధాంధ్ర, గృహలక్ష్మి మొదలైన పత్రికలు ప్రచురణ విషయంలో రచయితలకు బాగా తోడ్పాటునందించాయి. దానివల్ల కథానిక రచన బాగా అభివృద్ధి చెందింది. కాలానుగుణంగా అనేక మార్పులకు, దృక్పథాలకు

లోనవుతూ, సమాజావసరానికి అనుగుణంగా రచన సాగడం మొదలై, శాఖోపశాఖలుగా ఈ ప్రక్రియ విస్తరించింది. ఈ ప్రక్రియ అభివృద్ధి చెందుతున్న కొలది సమాజంలోని సమస్యలను చిత్రించడంలో ఏకాగ్రత నిలిపింది. అందులో భాగంగానే అనేక విధాలుగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యల్ని, జీవన స్థితిగతులని కూడా చిత్రించడం మొదలుబెట్టింది. తరతరాలుగా హరిజనులు సమానతకు, సంపదకు దూరమై మర్యాదకు మన్ననకు కడుదూరమై, కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తూ, సవర్ణుల దౌర్జన్యాయానికి, దోపిడీకి బలవుతూ వాళ్ళకే ఊడిగం చేస్తూ, ఊరిబయట తలదాచుకునే స్థితికి నెట్టబడ్డారు. ఆంగ్లేయుల రాకవల్ల, అనేక సంఘ సంస్కర్తల ప్రభావం వల్ల హరిజనుల జీవితంలో చిరుదీపం వెలిగింది. స్వాతంత్ర్యోద్యమంలోనూ, సంఘసంస్కరణోద్యమంలోనూ ఈ అస్పృశ్యత భాగమైంది. తదనుగుణంగా హరిజన కథానిక సాహిత్యం వెలువడటం మొదలైంది ? ఇక్కడ స్వాతంత్ర్యోద్యమంలో, సంఘ సంస్కరణోద్యమంలో పాల్గొన్న సంఘ సంస్కర్తలే అస్పృశ్యతా నిర్మూలన గురించి పోరాటం సాగిస్తూ హరిజనులని చైతన్యవంతుల్ని చేయడం మొదలుబెట్టారు. ఇన్నేళ్ళుగా హరిజనులు పోగొట్టుకున్న హక్కులను గురించి వాళ్ళే ఆలోచించుకునే దశకు తీసుకురావడానికి ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో మొదట అగ్రవర్ణాల వాళ్ళే దళితుల గురించి, వాళ్ళ స్థితిగతుల్ని గురించి రచనలు చేయడం ప్రారంభించారు. ఈ రకమైన ఇతివృత్తంతో తెలుగు కథానిక సాహిత్యంలో వచ్చిన మొట్టమొదటి కథ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు రాసిన "పుల్లంరాజు-2" అనే కథ. ఈ కథ **1925**వ సంవత్సరం జూన్ మాసంలో "ప్రబుద్ధాంధ్ర" పత్రికలో ప్రచురితం అయింది. ఇందులో సువర్ణులకు అస్పృశ్యులుగా ఉన్న హరిజనులలోనే రెండు కులాల మధ్య అంతరాలున్నాయి. ఈ అంతరాలను పోగొట్టుకొని ఐక్యంగా అస్పృశ్యతను ఎదుర్కొనమని రచయిత సలహా ఇచ్చాడు. **1925** మొదలు ఆ తర్వాత చాలామంది రచయితలు హరిజన సమస్యపై దృష్టిని కేంద్రీకరించి ఎంతో కథాసాహిత్యాన్ని వెలువరించారు. ఇందులో భాగంగా హరిజనుల స్థితిగతులతో పాటు ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాలలో దోపిడీకి గురవడాన్ని పలువురు రచయితలు పలుమార్గాల్ని, పలు ధోరణుల్ని అన్వేషించారు, అవలంభించారు. ఇలాంటి వాళ్ళని స్థూలంగా రెండు వర్గాలుగా విభజించవచ్చు. ఒకటి హరిజనేతరులు, రెండు హరిజన రచయితలు.

ఈ విధమైన జీవన చిత్రణలో "తమ సమస్యలను తాము చిత్రించుకొనిన హరిజన కథారచయితల మార్గం సమస్యను చిత్రించిన హరిజనేతర కథారచయిత మార్గం కంటే కొంత వాస్తవంగానూ, చైతన్యవంతంగానూ, ఆలోచనాత్మకంగానూ ఉంటుంది." అది రానురాను అభివృద్ధి దశగా పరిణమించింది. ఈ నాటి దళిత రచయిత తన స్వీయానుభవాన్ని నిష్కర్షగా ప్రకటించడంతో ఆత్మకథను కూడా తెలుసుకొనగోరే వారికి తన ప్రజల ఆవేదనను అర్థం చేసుకొనగోరేవారికి మంచి అవకాశం కలుగుతుంది. ఆత్మకథలన్నీ స్త్రీ, పురుష సంబంధాలకు, కుటుంబ వ్యవస్థకు సంబంధించిన బూజుపడిన భావాలను, విలువలను సమూలంగా మార్చటానికి కంకణం కట్టుకున్నాయి. అంతేకాకుండా గ్రామీణ పట్టణ జీవితాల్లో దళితులు ఎదుర్కొంటున్న సమస్యల్ని ఆత్మకథ రూపంలో చర్చించాడు. "చిల్లరదేవుళ్ళు" ఆగడాలను ఎండగట్టారు. గ్రామసింహాల అభిజాత్యాన్ని చీల్చి చెండాడాడు. భూస్వామ్య నాగరికతను అభిలషించారు. రావణుడు, ఏకలవ్యుడు, శంభుకుడు, అభిమాన హీరోలయ్యారు. ఈనాడు దేశవ్యాప్తంగా పూజలందుకుంటున్న దేవుళ్ళు యొక్క లోటుపాట్లని కూడా చర్చించడానికి వెనుకాడటం లేదు.

హరిజనేతర రచయితల విషయానికొస్తూ హరిజన జీవితాల్ని ప్రతిబింబిస్తూ చాలామంది కథానిక రచన చేశారు. వీళ్ళ కథలు పరిశీలిస్తే సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా స్త్రీ దూరంగా హరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల చిత్రణే కాకుండా పరిష్కారంలో భాగంగా సంస్కరణాత్మక కథలు రచించడం కన్పిస్తుంది. అంతేకాకుండా సంస్కరణ దృష్టితోబాటు జాలీ, దయా మొదలైన విషయాలే కాకుండా అవసరం అయితే పోరాటం కూడా చేయాలన్న ఉద్దేశ్యం సూచించే కథానిక సాహిత్యం కూడా వెలువరించారు. హరిజన సమస్యలను గురించి హరిజనులకు తెలిసినంతగా హరిజనేతరులకు తెలియకపోయినప్పటికీ హరిజనేతరుల కథానికల్లో సవర్ణుల దానధర్మాలు, దయాగుణాలకు సంబంధించిన అంశాలు చోటు చేసుకోవడం కన్పిస్తుంది. అంటే దాని ఉద్దేశం హరిజన రచయితలు సృష్టించిన సాహిత్యంలో ఈ విషయాలకు చోటు లేదన్న అర్థం కాదు. హరిజనులను సవర్ణులు సంప్రదాయాలు, ఆచారాల పేరుతో దూరంగా ఉంచడం అన్యాయమని అలాంటి దుర్లక్షణాల్ని నిర్మూలించడానికి సంఘసంస్కర్తలు హరిజనులకు చేయూతనిచ్చి తమ వంతు కృషి చేయాలని ముందు సూచించినది కూడా హరిజనేతర రచయితతో అన్న విషయం ఇక్కడ కనిపిస్తుంది.

రెండు వేల సంవత్సరాల నాటికి తెలుగు కథానిక ప్రాయం తొంభై సంవత్సరాలైతే దళిత కథానిక ప్రాయం డెభైఐదేళ్ళు. ఈ డెభై ఐదు సంవత్సరాల్లో వచ్చిన దళిత కథాసాహిత్యాన్ని సృష్టించిన రచయితల్ని 3 వర్గాలుగా విభజించవచ్చు. ఒకటి తొలితరం వాళ్ళు, రెండు మలితరం వాళ్ళు, మూడు వర్తమాన రచయితలు. తొలితరంలో వెలుగు చూసిన దళిత కథాసాహిత్య సృష్టికర్తలంతా దాదాపు దళితేతరులవ్వడం గమనించదగింది. వాళ్ళలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, బందా కనకలింగేశ్వరరావు, వేలూరి శివరామశాస్త్రి, చలం, మా గోఖలే, అడవి బాపిరాజు, గోపిచంద్ మొదలగువారు పేర్కొనదగిన వాళ్ళు. మలితరం కథారచయితల్లో తొడగిరి పోతరాజు, జి. భాను, డాక్టర్ కొలకలూరి ఇనాక్, డాక్టర్ కేతు విశ్వనాథరెడ్డి, సి.యస్.రావు, కలువ కొలను సదానంద, చిలుకూరి దేవపుత్ర, మధురాంతకం రాజారాం, పులికంటి కృష్ణారెడ్డి మొదలైన వారిని పేర్కొనవచ్చు. వాళ్ళల్లో కొంతమంది దళిత రచయితలు ఉన్నారు. తర్వాత వర్తమాన దళిత కథారచయితలను గూర్చి పరిశీలిస్తే బోయి జంగయ్య, కాలువ మల్లయ్య, బి.యస్. రాములు, కోట దేవరాజ్, పినాకపాణి, నాగప్పగారి సుందరరాజు, సింగమనేని నారాయణ, మొదలైనవారు.

దళిత కథా సాహిత్య ప్రచురణ విషయానికొస్తే ఈ దళిత కథలు ఆయా వ్యక్తుల సంపుటాల్లో, సంకలనాల్లో కొన్ని మాత్రం ఉండిపోగా మిగిలినవి ఎక్కువ భాగమే ఆయా పత్రికల వరకే పరిమితమై పోయాయి. డాక్టర్ భారవీరావు, "ఇంకానా ఇకపై చెల్లదు" అనే పేరుతో వర్తమాన దళిత కథల్ని సంకలనంగా తీసుకొని వస్తే డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి మరియు కె. లక్ష్మీనారాయణ గార్లు, సంయుక్తంగా ప్రారంభదశ మొదలు నేటివరకు వచ్చిన కథల్ని "దళిత కథలు" అనే పేరుతో సంకలనంగా తీసుకువచ్చారు.

తెలుగులో వచ్చిన దళిత కథల్ని ఇతివృత్తాన్ని బట్టి, కథా కథనాన్ని బట్టి, వ్యక్తీకరణను బట్టి, ఫలశ్రుతిని బట్టి స్థూలంగా రెండు రకాలుగా విభజించవచ్చు. దళితుల స్థితిగతుల్ని వివరిస్తూ వారిపట్ల సానుభూతిని ప్రదర్శించేవి, సాంఘికంగా, మతపరంగా దళితులపట్ల వివక్షచూపే అహేతుకాంశాల్ని సంస్కరించాలనే ఉద్దేశ్యంతో వచ్చిన ఒకటవ విభాగంలో చేరతాయి. దళిత ప్రగతికి అడ్డుతగిలే నమ్మకాల్నైనా, వ్యక్తులనైనా, వ్యవస్థనైనా ప్రతిఘటించాలని చెప్పే కథలు మరియు ప్రతిఘటన కాకుండా అవసరం అయితే హింస విప్లవాన్ని కూడా అనుసరించాలని ప్రబోధించే కథలు రెండవ వర్గంలో చేరతాయి.

## 14.13 దళిత సాహిత్యం - నాటకం:

ఫలితాలు ఎలా వున్నా, చెడును వ్యతిరేకించడం, మంచిని ఆహ్వానించడం, ఏ కాలంలోనైనా, ఏ దేశంలోనైనా జరుగుతూ వచ్చిందే, అలాగే భారతదేశంలోని సాంఘిక రుగ్మతల్ని వ్యతిరేకిస్తూ అనేక మంది సంఘ సంస్కర్తలు ఉద్యమాల ద్వారా, ఉపన్యాసాల ద్వారానే కాక, సాహిత్యం ద్వారా కూడా ఎంతో కృషి చేస్తూ వచ్చారు. అందులో భాగంగా అస్పృశ్యతను వ్యతిరేకిస్తూ హరిజనులకు దేవాలయ ప్రవేశాన్ని కల్పించి, వారు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సమాజంలో సముచిత స్థానం హరిజనులకు రావాలని అనేకమంది సంఘసంస్కర్తలు, మానవతావాదులు, సహృదయ రచయితలు నిరంతరం కృషిచేస్తూ వచ్చారు.

తెలుగు సాహిత్యంలో దళితాభ్యుదయాన్ని కాంక్షించే రచనలు వివిధ ప్రక్రియల్లో అనేకం వచ్చాయి. తెలుగు రూపక కొద్దోగొప్పో ఈ దృక్పథంతో కొనసాగింది. పరిశీలించవచ్చు.

ఉన్నవ లక్ష్మీనారాయణ, మాగంటి పార్థసారధి ఆచార్యులు, యన్. జి. రంగా, పసుమర్తి యజ్ఞనారాయణ, ధర్మవరం గోపాలచార్యులు, నీలకంఠశాస్త్రి, బోయి భీమన్న, మునిమాణిక్యం, సుంకర, వెన్నెలకంటి, మల్లాది సత్యనారాయణ, రావి వెంకటాచలం, తాతా జగన్నాథరావు, తాండ్ర సుబ్రహ్మణ్యశాస్త్రి, దర్భా భాస్కరమ్మ లాంటి అనేక మంది హరిజనాభ్యుదయం కోసం రూపక రచన చేశారు.

అస్పృశ్యతను రూపుమాపడం, హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించడం, వర్ణాంతర వివాహాల్ని ప్రోత్సహించడం లాంటి అనేక అంశాల్ని ఇతివృత్తాలుగా తీసుకొని రూపక రచన చేశారు.

ఈ విధంగా వచ్చిన నాటికల్ని, నాటకాల్ని, ఏకాంకికల్ని రూపకాలుగా పేర్కొనవచ్చు. ఈ రూపకాన్ని ఇతివృత్తాన్ని బట్టి ప్రధానంగా మూడు రకాలుగా విభజింపవచ్చు.

1. వర్ణాంతర వివాహాల్ని ప్రోత్సహించేవి
2. హరిజనులకు దేవాలయ ప్రవేశాన్ని కోరుకునేవి
3. దళితుల సాంఘిక, ఆర్థిక స్థితిగతుల్ని తెలియజేసేవి

**1. వర్ణాంతర వివాహాల్ని ప్రోత్సహించేవి :** అస్పృశ్యత జాడ్యం పోవాలన్నా, సాంఘికంగా వచ్చిన కులపరమైన అసమానతలు అంతరించాలన్నా, వర్ణాంతర వివాహాలు అవసరమని అనేక మంది ఉద్బోధించారు. డా॥ బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగజ్జీవనరామ్ ఈ వర్ణాంతర వివాహాల ఆవశ్యకతలని పదేపదే ప్రస్తావించేవాళ్ళు. ఇద్దరూ వర్ణాంతర వివాహాన్ని చేసుకున్న వారే. ఇద్దరూ వివాహమాడింది బ్రాహ్మణ స్త్రీలు కావడం విశేషం. కులవ్యవస్థ కూలిపోవడం ద్వారా, అస్పృశ్యత అంతమొందడం ద్వారా సమాజ సహజీవనంలో మనిషికి, మనిషికీ మధ్య ఉన్న అడ్డుగోడలు పడిపోగలవన్న ఆశాభావాన్ని "పడిపోతున్న అడ్డుగోడలు" అనే ఏకాంకిక ద్వారా వ్యక్తీకరించారు బోయి భీమన్న గారు.

"హరిజనోద్ధరణము" అనే నాటకాన్ని మాగంటి పార్థసారధి ఆచార్యులు గారు హిందూమతం హరిజనులకు అన్యాయం చేసిందని, దాన్ని రూపుమాపడం కోసం సవర్ణ హిందువులు వారి పట్ల ఉదాసీన వైఖరిని వీడనాడి అన్ని రంగాల్లో వారి అభ్యుదయాన్ని కాంక్షించాలని ఉద్బోధించారు. అంతేకాకుండా అస్పృశ్యతా జాడ్యాన్ని రూపుమాపి, నిమ్నజాతుల వారిని సోదర భావంతో చూడాలని ఈ రూపకం ద్వారా చాటిచెప్పారు.

మల్లాది సత్యనారాయణ రాసిన "పేదపిల్ల" నాటకంలో మతాంతర వివాహం, వర్ణాంతర వివాహం యువతీయువకుల జీవితానికి ముడిపెట్టి కులనిర్మూలన చేయించాడు రచయిత. కాని సమాజం కులాన్ని బట్టి, అంతస్థును బట్టి వ్యక్తికి గౌరవాన్ని ఇస్తుంది. సంఘాన్ని అతిక్రమించి, బంధువులను వ్యతిరేకించి, వర్ణాంతర వివాహం ద్వారా కుల నిర్మూలన చేయాలనుకున్న యువతీయువకులకు అటు సంఘంలోనూ గౌరవంలేక, ఇటు ఆత్మబంధువులలోనూ ఆదరణ లేక నిరాదరించడం జరుగుతుంది. ఇటువంటి వివాహాలు చేసుకోబోతున్న యువతీయువకులు ఒక్కోసారి సంఘానికి కట్టుబడి, బంధువుల ఆంక్షలకు లొంగి విఫలమౌతుంటారు. ఒక్కొక్కసారి సంఘం ఏమనుకుంటే మాకేం, బంధువుల ఎటుపోతే మాకేం, మాకు ప్రేమే ముఖ్యం, కులాలు కాదని తమ ఆశయాలకు కట్టుబడి జీవితాన్ని సుఖమయం చేసుకుంటారు. ఈ నాటకంలో వర్ణాంతర వివాహం చేసుకోబోతున్న ప్రేమ జంటకు సంఘం, బంధువులు తెచ్చే అడ్డంకులు గురించి వివరించినట్లు తెలుస్తుంది.

బండారు మృత్యుంజయబాబు రచన "సమాజం మారాలి". ఇది సాంఘిక నాటకం. పల్లెలో ధనవంతులుగా, భూస్వాములుగా వున్న పెత్తందార్లు తమ అర్థబలంతోనూ, అధికార బలంతోనూ పేద ప్రజలను హింసించి, వాళ్ళపై దౌర్జన్యాలకు పాల్పడి, అనేక కష్టాలకు గురిచేసినట్లు ఇందులో కన్పిస్తుంది. ఇటువంటి స్వార్థపరుల కుట్రలకు, కుతంత్రాలకు మోసపోయిన హరిజనులు, తదితర పేద ప్రజలు ఘరానా నాయకుల మోసాలను బట్టబయలు చేసి వాళ్ళను శిక్షార్హులను చేసినట్లు కూడా తెలుస్తుంది. అంతేకాక విద్యావంతులు, అభ్యుదయ వాదులు వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించి కులనిర్మూలన చేయాలని చెప్పడం జరిగింది. ఈ నాటక రచయిత హరిజనుడు కావడం వల్ల హరిజన సమస్య పట్ల బాగా స్పందించి, హరిజనుడు విద్యావంతుడు కావాలని, తద్వారా ఉద్యోగం, దాని వల్ల ఆర్థిక స్వాతంత్ర్యం, వీటన్నిటి ద్వారా అధికారం, సాంఘిక స్థాయి సాధించవచ్చునని చెప్పడం కూడా కన్పిస్తుంది.

గువ్వా మురహరిరెడ్డి రచించిన సాంఘిక నాటకం "కల్యాణి"లో వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించడం ఇందులో ప్రధానమైన విషయం. కులనిర్మూలన మార్గాలలో వర్ణాంతర వివాహాలు ఒకటి. ఇవి సఫలీకృతం కావాలంటే ప్రేమ ముఖ్య సాధనం. అది ఉంటే వర్ణం అక్కరకు రాదు. కాబట్టి ప్రేమ ఉన్నచో వర్ణాంతర వివాహాలు సులభసాధ్యం, తద్వారా అంటరానితనం పోగొట్టవచ్చు. అని ఈ నాటకం నిరూపిస్తుంది. ఇంకా అనేక రూపకాలు వర్ణాంతర వివాహాల్ని ప్రోత్సహిస్తూ వచ్చాయి.

**2. హరిజనులకు దేవాలయ ప్రవేశాన్ని కోరుకునేవి :** దేవుడున్నాడో లేడో ! దేవుడు మనిషిని పుట్టించాడా ! మనిషే దేవుణ్ణి పుట్టించాడా ! అనే ప్రశ్నలు ఎలా వున్నా హిందూమతంలో ఉన్న హరిజనులకు కులం కారణంగా దేవాలయ ప్రవేశం నిషేధించబడింది. విద్య కలిగినవాడే శాస్త్రీయ దృక్పథం లేక మూఢుడైన ఈ సమాజంలో విద్యదూరమై దళితుడు అజ్ఞానాంధకారంలో మగ్గాడు. దేవుణ్ణి దూరం చేయడం సహించలేకపోయాడు. అందుకే దేవాలయ ప్రవేశ ఉద్యమం ఒక సంఘ సంస్కరణాంశమైంది. తెలుగులో ఈ అంశాన్ని తీసుకొని రూపక రచనలు చేశారు.

ఎ. నీలకంఠ శాస్త్రిచే రచింపబడిన నాటకం "హరిజనుడు" ఇందులో వస్తువు సాంఘికం. హరిజనులకు దేవాలయ ప్రవేశం లేదు అని సవర్ణులు చేసిన కట్టుబాటు ఇందులో కథావస్తువు. హిందూమతంలో అగ్రవర్ణులు హరిజనులకు విధించిన ఆంక్ష ఇది.

మానవ సృష్టి భగవంతుని సంకల్పితమని మతం చెబుతుంది. తనచే సృష్టించబడిన మానవులు ఆలయ ప్రవేశం చేసి తనను ధ్యానించి పూజించడం భగవంతునికి సంతోషమే. అందుకు అతడు ఎట్టి ఆటంకాలు విధించడు. కాని ఆంక్షలు విధించేది, ఆటంకపరిచేది మానవులలోని ఒక వర్గమే ఉన్నత వర్గమే. అది అగ్రవర్ణుల వర్గం. వీళ్ళే కులం, అంటరానితనం వంటి ఆచార వ్యవహారాలను పాటించేది. అంటరానివాడు ఆలయ ప్రవేశం చేస్తే దేవుడు మైలపడతాడని, వర్ణధర్మానికి భంగం కలుగుతుందని, తర్వాత అరిష్టాలు సంభవిస్తాయని సవర్ణుల ప్రగాఢమైన విశ్వాసం, అందుకే దేవుడు వరం ఇచ్చినా పూజారి వరం ఇవ్వడనే నానుడి పుట్టింది. ఈ నాటకంలో సవర్ణులు విధించిన ఈ సాంఘిక దురాచారానికి దేవుడు కూడా భయపడి, తన హరిజన భక్తుని వదులుకోలేక, పూజారి మాటను అతిక్రమించలేక రాత్రిపూట ఎవరూ చూడని వేళ హరిజనుణ్ణి దేవాలయంలోకి తీసుకుపోయినట్లు చిత్రించబడింది.

నందనారు చరిత్రను గురించి పలువురు నాటకాలు రాశారు. "నందనారు" నాటకాల్లో ప్రశస్తమైన నాటకం ఓరుగంటి కృష్ణకౌండిన్య వ్రాసిన "నందనారు చరితము". హరిజన బాలుడైన నందనారు దైవ భక్తిని నిరూపించిన నాటకం ఇది. ఏ కులంలో పుట్టినా, ఏ మతంలో పుట్టినా, భక్తులు, భగవంతునికి ప్రీతిపాత్రులు. అంటరాని కులంలో పుట్టి అధిక భక్తి సంపన్నుడై ముక్తిని పొందిన నందనారు ఈ నాటకంలో కథానాయకుడు. అంటరానివాడుగా పుట్టి, పాలేరుగా జీవితాన్ని సాగిస్తూ, యజమాని పెట్టే అనేక కష్టాలను ఓర్చుకుంటూ కూడా, తన ఏకైక లక్ష్యం అయిన భగవద్భక్తిని వీడకుండా అందులోనే ముక్తిని పొందటం ఈ నాటకం వల్ల తెలుస్తుంది.

పసుమర్తి యజ్ఞనారాయణచే రచింపబడిన నాటకం 'నందనారు' మాల కులంలో పుట్టి, మాల పాలేరుగా గుర్తించబడి, ఎదనిండా భక్తిని నింపుకొని, భక్త్యావేశంతో భగవంతుని సాన్నిధ్యం పొందిన ఒక మహా భక్తుని గాథే ఈ నందనారు నాటకం.

"దేవాలయ ప్రవేశం" అనే నాటకం శ్రీమతి దర్భా భాస్కరమ్మ కృతం. ఇది సాంఘిక నాటకం. కులాలు కూడదని, అస్పృశ్యతను అంతమొందించాలనే ఉద్దేశ్యంతో ఈ నాటకం రాయబడింది. అంతేకాకుండా హరిజనులను కులం పేరుతో తక్కువ వాళ్ళగా పరిగణిస్తూ, వాళ్ళకు దేవాలయ ప్రవేశాన్ని రద్దు చేయకూడదని, భగవంతుడు అందరికి ఒక్కడేనని, అతనికి హెచ్చు తగ్గులు లేవని నిరూపిస్తుంది. అంతటితో ఆగక, హరిజనులకు అన్ని రంగాల్లోను అవకాశం కల్పిస్తూ, వాళ్ళ అభ్యుదయానికి నడుము కట్టాలని కూడా ఈ నాటకం ప్రబోధిస్తుంది.

**3. దళితుల సాంఘిక, ఆర్థిక స్థితిగతులకు సంబంధించినవి :** హరిజనుల్ని కులం కారణంగా హింసించడం, వెలివేయడం వెట్టిచాకిరీ చేయించడం, బానిసలుగా చూడటం, హోటళ్ళలో, విద్యాలయాల్లో వివక్షను ప్రదర్శించడం, అవమానించడం, అత్యాచారాలు, మానభంగాలకు గురిచేయడం, కూడు, గూడు, గుడ్డ లేక దుర్భర జీవితాన్ని గడపడం లాంటి అనేక సమస్యల్ని ఇతివృత్తాలుగా తీసుకొని రూపకరచన చేసిన వారు అనేకమంది వున్నారు.

'మాలపల్లి' రచన ద్వారా తెలుగు సాహిత్యలోకంలో ప్రత్యేక గుర్తింపులో "శభాష్" అనిపించుకున్న కీ॥శే॥ ఉన్నవ లక్ష్మీనారాయణగారు "హరిజన నాటకం" అనే పేరుతో ఏకాంకికను రాశారు. హరిజనులు దేవాలయ ప్రవేశం చేయరాదనే ఛాందస మనస్తత్వ విమర్శ, హరిజనులు సంఘటిత శక్తి వల్ల, బలవంతంగా తమంతట తామే దేవాలయప్రవేశం చేయడం ఇందులోని ప్రధాన ఇతివృత్తం.

ధర్మవరం గోపాలచార్యులు "అస్పృశ్య విజయం'' అనే నాటకాన్ని రాశారు. అంటరాని తనం అతి క్రూరంగా రాజ్యమేలుతున్న రోజులవి. అన్ని రంగాల్లో దోపిడీకి గురి అవుతున్న హరిజనుడు ప్రతిఘటించడానికి పూనుకుంటే, అతనికి అతని మద్దతుదార్లకు ఎప్పటికైనా విజయం జరిగి తీరుతుందని ఈ నాటకం చెబుతుంది. ఒకే జాతిలోని వాడు అయిన హరిజనుణ్ణి కులం పేరుతో "అంటు' పేరుతో అవమానించ వద్దనీ, అతనికి కూడా అన్ని రంగాలలోనూ సమానమైన ప్రాతినిధ్యం ఇచ్చి మనిషిగా గుర్తించాలని ప్రబోధిస్తుంది ఈ నాటకం.

ఆచార్య ఎన్.జి. రంగా గారు "హరిజన నాయకుడు'' అనే నాటకాన్ని రాశారు. ఇందులో ఒక రైతు కుటుంబాన్ని, ఆ కుటుంబానికి కొన్ని తరాల నుండి పాలేరుతనం చేసి జీవించే హరిజన కుటుంబాన్ని నడుస్తున్న వ్యవస్థకు నమూనాగా తీసుకున్నారు రచయిత. వ్యవసాయ కూలీగా జీవనాన్ని గడిపే బసవలింగయ్య క్రైస్తవ మిషనరీల సహాయంతో ఇంగ్లీషు విద్యను అభ్యసించి న్యాయవాది అయి ప్రజల మెప్పుపొంది, అధికారానికి పాకులాడకుండా, రైతులతో తన పంచమ కులస్థుల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తాడు. బసవ లింగయ్య పాత్ర మిక్కిలి ఆదర్శవంతంగా తీర్చిదిద్దడం చేత ఈ రూపకానికి "హరిజన నాయకుడు'' అనే పేరు పెట్టడం జరిగింది. మునిమాణిక్యం నరసింహారావు రచించిన సాంఘిక నాటకం "తిరుగుబాటు''...... కులం కారణంగా హరిజనులపై సవర్ణులు చేసే అత్యాచారాలకు, అమానుష చర్యలకు, దౌర్జన్యాలకు రగిలిన హరిజనులు సవర్ణుల పై తిరగబడి ప్రతీకారాలను తీర్చుకొనటం ఇందులో ప్రసక్తమవుతుంది.

పసుమర్తి యజ్ఞనారాయణ గారు రచించిన నాటకం "గ్రామసేవ''. ఇందులో స్వతంత్ర భారతదేశంలో హరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల్ని, వారి స్థితిగతుల్ని ఎత్తిచూపుతూ వాటి పరిష్కారం కోసం కృషి చేయాల్సిన బాధ్యతను వ్యక్తీకరించి, అంటరాని, అహేతుక అంశాల్ని ప్రశ్నించి, మానవతా దృక్పథాన్ని ప్రబోధించింది.

నీలకంఠశాస్త్రి గారి "హరిజనుడు'' నాటకం దళితుల సమస్యలకి అద్దం పడుతూ, వాటి నిర్మూలనలో సవర్ణ హిందువుల బాధ్యతతో పాటు హరిజనుల బాధ్యతల్ని కూడా తెలియజేస్తుంది.

ధర్మవరం గోపాలచార్యులు గారి "అస్పృశ్య విజయం'' నాటకం తరతరాలుగా హరిజనులు సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో దోపిడీకి గురి అవుతున్నారని, దీన్ని ప్రతిఘటించడానికి హరిజనులకు, వారికి మద్దతునిచ్చే మానవతావాదులకు ఏ నాటికైనా న్యాయం చేకూరుతుందని తెలియజెప్పుతుంది.

వన్నెకంటి బాలసుందరం రచించిన సాంఘిక నాటకం "నవయుగం''. సంఘంలో ఉన్నత వ్యక్తులుగా, అగ్రవర్ణులుగా గుర్తించబడిన సవర్ణులు తక్కువ జాతి వాళ్ళుగా, నీచకులస్థులుగా, అస్పృశ్యులుగా ముద్రవేయబడిన హరిజనులను ఏ రంగంలో కూడా అభివృద్ధి చెందకుండా అదిమి పట్టినట్లు నిరూపించిన నాటకం ఇది.

తాంగ్ర సుబ్రహ్మణ్య శాస్త్రిచే రచింపబడిన కాల్పనిక నాటకం "పతితపావన''. అస్పృశ్యతను తరిమి కొట్టాలనేది ఈ నాటక వస్తువు. రాయసం వెంకటరమణయ్య గారి "దేవదాసు'' నాటకం హరిజనులను అస్పృశ్యత పేరుతో వాళ్ళ సాంఘిక స్థాయికి భంగం కలిగించి, వాళ్ళ హక్కులను ఖండించి, నానా కష్టాలకు గురిచేసి, ప్రతినిత్యం, అడుగడుగునా వేధించే సవర్ణుల గురించి, వాళ్ళ ఆధిపత్యాల్ని గురించి ఇందులో చెప్పబడింది. తాతా జగన్నాథరావు రాసిన నాటకం "జన్మహక్కు'' ఇందులో వస్తువు సాంఘికం. హరిజనులను అంటరాని వాళ్ళుగా, శుచి, శుభ్రత, పాటింపని వాళ్ళుగా, నీతి, నియమాలు లేని వాళ్ళుగా సమాజంలోని ఒక వర్గం భావించింది. హరిజనుల హక్కులను హరించింది. ఇది సబబు కాదు, మానవుడు పుట్టుకతో అంటరానివాడు, హరిజనుడు కాదు. ఆదిలో, కాలక్రమంలో మానవుల మధ్య ఏర్పడినవే ఈ తరతమ భేదాలు కాబట్టి ఈ భేదాభిప్రాయాలను విడిచిపెట్టి, అస్పృశ్యతా నివారణకు నడుంకట్టండని ఈ నాటకంలో చెప్పడం జరిగింది.

సుంక సత్యనారాయణ రాసిన నాటిక "జీతగాడు'' వేకువ జామునే లేచి యజమాని ఇంటి పనులు, పొలం పనులు చేస్తున్న పాలేర్లకు భూస్వాములు కడుపుకింత తిండిపెట్టరు. పైగా అసభ్యమైన మాటలు, అంతటితో ఊరకుండగా దెబ్బలు కూడా బానిస

జీవితాన్ని అనుభవిస్తున్న పాలేర్లు, తమ కష్ట తీవ్రతను తీర్చేవాళ్ళు లేక నానా బాధలు పడటం ఈ నాటికలోని ప్రధాన సమస్య.

ఇవే కాక దళితాభ్యుదయం కోసం వచ్చిన రూపకాలు తెలుగు సాహిత్యంలో అనేకం ఉన్నాయి.

## 14.14 మాదిరి ప్రశ్నలు:

1. స్త్రీ వాదాన్ని నిర్వచించి, విమర్శనాత్మక వ్యాసాన్ని రాయండి.
2. దళిత సాహిత్యాన్ని వివరించండి.
3. దళిత సాహిత్యంలోకవిత, నవల, కథలను వివరంగా చర్చించండి.

## 14.15 ఆధార గ్రంథాలు:


దళిత సాహిత్య వాదం - జాషువ, కత్తి పద్మారావు
హరిజనాభ్యుదయం - ఆధునికాంధ్ర కవిత్వం, కల్లూరి ఆనందరావు
హరిజనాభ్యుదయం - తెలుగు కథానిక, కె. లక్ష్మీనారాయణ
హరిజనుల సాహిత్యం - కొలకలూరి ఇనాక్
భారత మహిళ - జె. రామచంద్రా రెడ్డి
భారతీయ సంస్కృతిలో స్త్రీ - కత్తి పద్మారావు
భావ కవిత్వంలో స్త్రీ - ఎ. జయప్రభ
మహిళ - సాహిత్య అకాడమి
స్త్రీ విమోచన - మల్లాది సుబ్బయ్య
ప్రేమరాహిత్యంలో స్త్రీ - తెన్నేటి హేమలత

పాఠం - 15

# నవల, కథానిక

## విషయ క్రమం

15.1 నవల - నిర్వచనాలు
15.2 నవలా లక్షణాలు
15.3 తెలుగు నవల - ఆవిర్భావం
15.4 నవలా వికాసం
15.5 నవలా భేదాలు
15.6 కథానిక
15.7 కథానిక - నిర్వచనాలు
15.8 కథానిక - లక్షణాలు
15.9 కథానిక ఆవిర్భావ వికాసాలు
15.10 కథానిక - భేదాలు
15.11 సారాంశము
15.12 మాదిరి ప్రశ్నలు
15.13 ఆధార గ్రంథాలు

## నవల

ఆధునిక యుగంలో ఒక ప్రత్యేకమయిన ప్రతిపత్తి పొందిన వాఙ్మయ ప్రక్రియల్లో నవల ఒకటి. ఆధునికంగా ఈ నవలా ప్రక్రియ పాశ్చాత్యుల నుంచి సంక్రమించిన సారస్వత ప్రక్రియ అని చెప్పవచ్చును. ఆంగ్ల సాహిత్య ప్రభావము వల్ల తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు వచ్చాయి. కథ, నాటకం, నాటిక, వ్యాసం, సమీక్ష, పీఠిక, సంపాదకీయం, అనువాద సాహిత్యం, స్వీయచరిత్ర, జీవితచరిత్ర, నవల మొదలైన ప్రక్రియలు అన్నీ ఆంగ్ల ప్రభావంతో వచ్చినవే.

## 15.1 నవల - నిర్వచనాలు:

నవల అనే పదాన్ని పరిశీలిస్తే ఆంగ్లంలోని "Novel" అన్న పదానికి పర్యాయపదంగా తెలుగులోకి వచ్చింది. ఆంగ్లంలో Novel అనే పదం 'Novelle' అనే ఇటాలియన్ పదం నుండి వచ్చింది. ఆంగ్ల సాహిత్యంలోకి కూడా ఈ పదం లాటిన్ భాష నుంచి వచ్చిచేరినట్లుగా తెలుస్తుంది. ఆంగ్ల సాహిత్యంలో కాని, తెలుగు సాహిత్యంలో కాని చూస్తే కాల్పనిక సాహిత్యం అంతా ఈ ప్రక్రియగానే ఎంచబడుతుంది. ఈ ప్రక్రియ సంస్కృతంలో 'నవలా' అని, బెంగాలీ, పంజాబి, అస్సామీ, హిందీ, ఒరియా భాషలలో 'ఉపన్యాస్' అని, మరాఠి, కన్నడం, గుజరాతీ భాషల్లో కాదంబరి అని పిలువబడుతుంది.

నవల అన్న పదం Novel అనే ఆంగ్ల పదం యొక్క అర్థానికి దగ్గరగా ఉండటమే కాకుండా ఆంగ్లపదంలో ఉన్న కొత్తది, నూతనమయినది అనే అర్థాలు కూడా నవల అనే పదానికి చెప్పవచ్చు. నరహరి గోపాలక్రిష్ణమచెట్టి గారు "శ్రీరంగరాజ చరిత్ర"(1872)లో నవీన ప్రబంధమని, "రాజశేఖరచరిత్రను" (1878) వ్రాసిన కందుకూరి వీరేశలింగము గారు వచన ప్రబంధమని ఈ ప్రక్రియను

పిలిచారు. ఆ తరువాత 1897లో కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి గారు "రాజశేఖరచరిత్రము"కు పీఠిక వ్రాస్తూ నవల అనే పదాన్ని మొదటిసారిగా వాడారు. అప్పటి నుంచి ఆంగ్ల భాషలోని "Novel" పేరు తెలుగులో 'నవల'గా ప్రసిద్ధి కెక్కింది.

**15.1.1 పాశ్చాత్యులు:** నవలా ప్రక్రియ గురించి అనేక మంది పాశ్చాత్యులు నిర్వచనాలిచ్చారు. వారిలో మెపాసా, సోమర్‌సెట్‌మామ్, లారెన్స్, జే.బి. ప్రీస్ట్‌లీ, జోసఫ్ సిప్లే, ఇల్యా ఎట్రైన్ బర్గ్, హెచ్.జి. వేల్స్, మెరిడిత్, స్టార్జ్ రిచన్‌జ మొదలైన పాశ్యాత్య ప్రముఖులు నవలను నిర్వచించారు.

"నవలా రచయిత ధ్యేయం కథ చెప్పడం గానీ, మనల్ని ఆనంద పరవశుల్ని చేయడం కానీ కాదు. అజ్ఞాతంగా మనలో దాగున్న సంఘటనలకు ప్రాధాన్యతనిస్తూ మనం అర్థం చేసుకొని ఆలోచించేటట్లు చేయగలగాలి. అంటే అజ్ఞాతంగా దాగున్న సంఘటనలకు ప్రాధాన్యం ఇచ్చేది, పఠిత అర్థం చేసుకొని ఆలోచించేటట్లు చేయగలిగేదే నవల" - అని మెపాసా నవలను నిర్వచించారు.

"యదార్థ జీవనాన్ని యదార్థ దృష్టితో అధ్యయనం చేసి దానిని గద్యరూపంలో వ్యక్తం చేసేదే నవల" - అని Richard Cross తన " The Development of English Novel " అనే పుస్తకంలో నవల గురించి నిర్వచించారు.

"నవల అన్నది కేవలం గద్యాత్మకమయిన కాల్పనిక కథ కాదు. అది మానవుడి జీవితాన్ని గురించి, పరిపూర్ణ చేష్టలను గురించి గద్యరూపంలో చెప్పబడిన వ్యాఖ్యానం " -- అని Roll Fox తన "Novel and the people" అనే గ్రంథంలో నవలను గురించి చెప్పాడు.

"సామాజిక ప్రయోజనాత్మకమయిన నవల సమాజ ప్రగతికి దోహదం చేసే మంచి సాధనం - ఎన్నో గంభీర విషయాల్ని నవలలో వర్ణించడానికి వీలుంది. నవల చరిత్రకు ప్రత్యామ్నాయం" అని H.G. వేల్స్ నవలను నిర్వచించారు.

"జీవితం ఉన్నది ఉన్నట్లు చిత్రించటం నవల కాదు" అని సోమర్‌సెట్ మామ్ నవలను నిర్వచించారు.

**15.1.2 ప్రాచ్యుల నిర్వచనాలు:** నవలను గురించి పాశ్చాత్యులే కాకుండా అనేక మంది కవులు, రచయితలు, విమర్శకులు నిర్వచనాలిచ్చారు. మొదలి నాగభూషణ శర్మగారు, కొలకలూరి ఇనాక్, బొడ్డపాటి వేంకట కుటుంబరావు, ఆర్. యస్. సుదర్శనం, కె.వి.ఆర్. నరసింహం, కొడవటిగంటి కుటుంబరావు, పుల్లాబొట్ల వెంకటేశ్వర్లు, గాౖరెపాటి వెంకటసుబ్బయ్య, వేదం వెంకటరామశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ మొదలైన అనేకమంది ప్రముఖులు నవలను గురించి తమ అభిప్రాయాల్ని వ్యక్తం చేశారు. డా॥ మొదలి నాగభూషణశర్మగారు తెలుగు నవలా వికాసము అనే గ్రంథంలో నవలను "సాంఘిక జీవితానికి ప్రతిబింబంగా వ్యక్తుల జీవితగమనాన్ని చిత్రిస్తూ జనుల ఆచార వ్యవహారాలను వ్యక్తీకరించే గద్యప్రబంధం నవల" అని నిర్వచించారు.

"ఒక దశ నుండి మరియొక దశకు ఒక స్థితి నుంచి మరియొక స్థితికి మనుజులు, వ్యవస్థ, దేశము పొందుతున్న పరిణామం భవిష్యత్తు పై చిత్రింపగల ముద్ర, సాకల్యంగా చర్చించి రచింపగల సాహితీ ప్రక్రియ నవల" - అని ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు నవలను నిర్వచించారు.

"యదార్థ జీవితముల వాస్తవిక చిత్రణము గల గద్య రూపక కథా సాహిత్యము నవల" - అని పుల్లాబొట్ల వెంకటేశ్వర్లు తెలుగు నవలా సాహిత్య వికాసము అనే గ్రంథంలో నవలను నిర్వచించారు.

"ఒక వ్యక్తి యొక్క జీవిత చరిత్ర కావ్య దృష్టితో వ్రాస్తే నవల అవుతుంది". - అని విశ్వనాథ సత్యనారాయణ గారు నవలను నిర్వచించారు. ప్రాశ్చ, పాశ్చాత్యులు చెప్పిన నిర్వచనాలన్నింటినీ పరిశీలిస్తే ఏ నిర్వచనము కూడా సమగ్రమయినదిగా అన్పించదు. ఎందుకంటే ఆధునిక సాహిత్యంలో అన్ని రంగాల ప్రక్రియల్నీ తనలో ఇముడ్చుకోగల ఈ నవలా ప్రక్రియను నిర్వచించటం చాలా కష్టమైన పని అని పాశ్చాత్యులే అంగీకరించారు. అందువల్ల పాశ్చాత్యులు, మన ఆంధ్రులు ఇచ్చిన నిర్వచనాలు ఏవీ కూడా సమగ్రమయినవి అని అన్పించదు. తెలుగులో మనం ఆంగ్ల సాహిత్యాన్ని అధ్యయనం చేసిన తర్వాతే ఈ నవలా ప్రక్రియ అవగాహన

కలిగింది. నవలాకారుల నిర్వచనాల్ని పరిశీలిస్తే మరొక విశేషం ఈ ప్రక్రియను జీవితానికి వ్యాఖ్యానంగా, మనుష్యుల కథను రూపొందించె ప్రక్రియగా వారభిప్రాయపడ్డారు. అందుకే కొంతమంది నవలాకారులు ఈ ప్రక్రియను వాస్తవిక జీవితాన్ని చిత్రించే కాల్పనిక కథ అన్నారు. దాంతోపాటు మనోరంజకత ఈ నవలా ఉద్దేశమని మరికొంత మంది చెప్పినప్పటికీ మానవ జీవితంలో ఎదురయ్యే అనేక రకాల సమస్యలను గురించిన చర్చ ఈ నవలా ప్రక్రియ వల్ల తెలుస్తుంది.

మొత్తం మీద పై విషయాల్ని గమనిస్తే నవలా ప్రక్రియను విస్తృత సాహిత్య ప్రక్రియ అని చెప్పవచ్చు.

## 15.2 నవలా లక్షణాలు:

నవలా లక్షణాల్ని ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు ఈ క్రింది విధంగా పేర్కొన్నారు.

1. నవల గద్యకావ్యం (ఇది గ్రాంధికంలోనైనా, వ్యావహారికములోనైనా వుంటూ వచన రూపంలో వుండాలి)
2. యుగచిత్రణ నవల ప్రధాన ఉద్దేశ్యం. అంటే సమకాలీన సమాజజీవిత చిత్రణ నవల పరమ లక్ష్యం.
3. సహజమయిన, స్వాభావికమయిన శైలి నవలకు ప్రాణం.
4. సర్వజీవన విధానానికి వ్యాపకమయిన, విస్తృమయిన విధానం నవలలో ఉంటుంది.
5. నవల ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ, వ్యాఖ్యానం చేయడానికి రచయితకు అవకాశం ఇస్తుంది.
6. కాల్పనిక సాహిత్యానికి, సరళమైన స్వాభావికమైన రూపం నవల.
7. నవలా ప్రక్రియలో నాటకం, కావ్యం, అధిక్షేపకావ్యంలాంటి అన్ని ప్రక్రియల విధానాల్ని ఉపయుక్తం చేసే అవకాశం ఉంటుంది.
8. మనోరంజనంతో పాటు విజ్ఞాన సముపార్జన కూడా నవలలో సాధ్యం అవుతుంది.
9. యదార్ధ జీవితంలోని సత్యం కంటే నవలలోని సత్యం గాఢమైంది. యదార్ధ జీవితంలోని వన్నీ జరిగిన సత్యాలు, కానీ, నవలలో సంభవం కాగల సత్యాలకు కూడా స్థానం వుంటుంది.
10. వేదన, భావుకత ఈ రెండూ నవలలకు ప్రేరణ శక్తులు.
11. ఒక వ్యక్తి జీవితాన్ని గురించి కానీ, జీవితంలోని ఒక ముఖ్యభాగాన్ని గురించి గానీ నవల చిత్రించడానికి ప్రయత్నిస్తుంది.
12. రచయితే కథను నిరూపించవచ్చు. లేదా పాత్రల చేత కథను నడిపిస్తూ అక్కడక్కడ జీవిత వ్యాఖ్యానాలు చేస్తూ పాత్రలను ముందుకు తీసుకువెళ్ళవచ్చు. ఆ పాత్రల ద్వారా పాఠకులకు హితోపదేశం చేయడానికి అవకాశం ఉంటుంది.
13. విమర్శనాత్మకం, వ్యాఖ్యానాత్మకం నాటకీయం లాంటి శైలులలో ఏ ఒక్క శైలినిగానీ, అన్నింటినీ గాని నవలల్లో ప్రయత్నించే అవకాశం వుంది.
14. జాగ్రత్ సుషుప్తి - అవస్థలోని సర్వ విషయాల్ని, ఉద్వేగాల్ని వెలికితెచ్చి వర్ణించడానికి తగిన సాధనం నవల.
15. వాస్తవ సమాజాన్ని, సమకాలీన సమాజాన్ని ముందుంచగలిగినది నవల.
16. జీవిత వాస్తవాల్ని, విశదీకరించడానికి, లోతుగా చిత్రించడానికి అనువైంది నవల. చారిత్రక, రాజకీయ, ఆర్థిక, సామాజిక, నైతిక, తాత్విక విషయాలతో పాటు, మానవ మనస్తత్వాన్ని కూడా చిత్రించగలిగే విశిష్టతను సంతరించుకున్న ఆధునిక సాహిత్య ప్రక్రియ నవల.
17. ఇతర సాహిత్య ప్రక్రియల స్వరూప స్వభావాలు ఈ నవలా ప్రక్రియలో ఇమిడి పోయాయి.

## 15.3 తెలుగు నవల ఆవిర్భావం:

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో భారతీయ నవల పుట్టింది. తెలుగులో నవల పుట్టుకకు ఇంగ్లీషు విద్యా విధానం, ముద్రణా యంత్రం మొదలైనవి, అప్పటికే క్షీణించి పోయిన సాహిత్య రంగం, సమాజంలోని విలువలు పడిపోవటం మొదలైన వాటి వల్ల ఆవిర్భవించింది. తెలుగులో నవల ప్రారంభంలో ఆచార వ్యవహారాలను, మూఢ విశ్వాసాల్ని, దురాచారాల్ని హేతువాద దృష్టితో ఖండించేదిగా సంఘ సంస్కరణ ధ్యేయంగా తెలుగు నవల వెలువడింది.

తొలి తెలుగు నవల ఏది అనే విషయం పై భిన్నాభిప్రాయాలు చోటు చేసుకున్నాయి. దీనికి కారణం మూడు నవలలు వుండటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. 1867లో కొక్కొండ వెంకట రత్నం పంతులు గారు వ్రాసిన 'మహాశ్వేత' మొదటిది కాగా, 1872లో నరహరి గోపాలక్రిష్ణమ చెట్టి గారు రాసిన 'శ్రీ రంగరాజ చరిత్ర' రెండవది కాగా, 1878లో కందుకూరి వీరేశలింగం పంతులు గారు వ్రాసిన 'రాజశేఖర చరిత్ర' మూడవది. కానీ ఈ మూడింటినీ రచించిన రచయితలు తమ రచన, నవల అని పేర్కొనలేదు. కనీసం ప్రచురణ కర్తలు కూడా వీటిని నవలలుగా పేర్కోలేదు. మహాశ్వేత వచన రచనగా ఉన్నా ప్రక్రియ పేరు లేదు. గోపాల క్రిష్ణమ చెట్టి గారు తన గ్రంథాన్ని 'నవీన ప్రబంధం' అని చెప్పగా రాజశేఖర చరిత్రను వ్రాసిన కందుకూరి వారు దాన్ని 'వచన ప్రబంధం' అని చెప్పారు.

కొక్కొండ వెంకట రత్నం గారు రచించిన 'మహాశ్వేత' తెలుగులో మొదటి నవల అని నిడదవోలు వెంకట్రావు గారి యొక్క అభిప్రాయము. కానీ ఇది సంస్కృతంలో బాణుడు వ్రాసిన సంస్కృత 'కాదంబరి'కి స్వేచ్ఛానువాదము కాబట్టి దీన్ని తొలి తెలుగు నవలగా అంగీకరిచలేము. అంతేకాక ఈ గ్రంథం పూర్తిగా లభ్యం కాలేదు.

1872లో లార్డ్ మేయో బెంగాల్ గెజిట్‌లో చేసిన ప్రకటనను చూసి కర్నూలులో డిప్యూటీ కలెక్టరుగా ఉన్న నరహరి గోపాల క్రిష్ణమ చెట్టి గారు హిందువుల ఆచారమును తెలుపునట్టి నవీన ప్రబంధము రచించాలి అనుకొని శ్రీ రంగ రాజ చరిత్రను రచించారు. ఆంగ్ల నవలా ప్రక్రియననుసరించి మొట్ట మొదటిగా తెలుగులో వచ్చిన నవల ఇదే. ఈ నవీన ప్రబంధము మౌలిక రచనే కాకుండా సమకాలీన ఇతివృత్తం కలిగి వుండి ఆంగ్ల సాహిత్య ప్రభావాన్ని కొంత వరకూ కలిగి వుండటం వల్ల తొలి తెలుగు నవల అని కొంత మంది, తొలి తెలుగు నవలా ప్రయత్నమని మరి కొంత మంది విమర్శకులు ఈ రంగ రాజ చరిత్రమును గూర్చి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఆంగ్ల సాహిత్యంలోని ఆలివర్ గోల్డ్‌స్మిత్ వ్రాసిన 'దివికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్' అనే నవల్ని ఆధారంగా చేసుకొని వీరేశలింగం గారు రాజశేఖర చరిత్రము అనే వచన ప్రబంధాన్ని వ్రాశారు. తరువాత ఆయన తన జీవిత చరిత్రలో తెలుగులో మొదటి వచన ప్రబంధాన్ని 'నేనే చేసితిని' అని వ్రాసుకున్నారు. 1878లో 'వివేక వర్ధిని' అనే పత్రికలో ధారావాహికగా ప్రచురించబడిన ఈ నవలను ఇంగ్లీషు నవలకు అనుకరణ అయినప్పటికీ దీనిని ఒకరిద్దరు ఇంగ్లీషులోనికి అనువాదం చేశారు. అంతే కాకుండా ఆ తర్వాత వచ్చిన కొంత మంది తెలుగు రచయితలకు ఈ నవల మార్గదర్శకమయ్యింది. అంత మాత్రాన రంగ రాజ చరిత్రమును తొలి తెలుగు నవలగా నిర్ణయించకుండా ఉండలేమని మొదలి నాగభూషణ శర్మ గారు చెప్పారు. అంతే కాకుండా శ్రీ రంగ రాజ చరిత్రములోని కొన్ని సన్నివేశాల మీద, వర్ణనలకు పోలికలు రాజశేఖర చరిత్రలో కన్పిస్తున్నాయట.

మొత్తం మీద పై కారణాలను పరిశీలిస్తే శ్రీ రంగ రాజ చరిత్ర తొలి తెలుగు నవలగా చెప్పవచ్చు.

## 15.4 నవలా వికాసం:

1872లో ప్రారంభమయిన తెలుగు నవలను, దాని వికాసాన్ని స్థూలంగా 5 విధాలుగా వర్గీకరించవచ్చు.

1. ప్రారంభయుగం (1872 - 1900)
2. అనువాద యుగం (1900 - 1920)
3. వికాస యుగం (1920 - 1942)
4. మనో వైజ్ఞానిక యుగం (1942 - 1960)
5. సమకాలీన యుగం (1960 - నేటి వరకు)

**15.4.1. ప్రారంభ యుగం (1872 - 1900):** ప్రారంభ యుగాన్ని మన విమర్శకులు 'వీరేశలింగం యుగం'గా పిలుస్తారు. దీనికి

కారణము వీరేశలింగం గారు వ్రాసిన 'రాజశేఖర చరిత్ర' ప్రభావంతో అనేక నవలలు రావటం వల్ల విమర్శకులు ఈ యుగాన్ని 'వీరేశలింగం యుగంగా' పేర్కొన్నారు.

కందుకూరి వారి ప్రభావం చిలకమర్తి వారి పై పడటం వల్ల ఆ ప్రభావంతో "రామ చంద్ర విజయం" అనే నవలను వ్రాశారు. వీరేశలింగం గారు "రాజ శేఖర చరిత్ర"ను వ్రాయటమే కాక 'చింతామణి' అనే పత్రికలో నవలా పోటీని నిర్వహించగా ఆ పత్రిక పోటీల్లో ఖండవల్లి రామచంద్రుడు గారి 'ధర్మవతీ విలాసం' అనే నవలకు మొదటి బహుమతి రాగా, తల్లా ప్రగడ సూర్యనారాయణ గారి 'సంజీవరాయ చరిత్ర' నవలకు రెండవ బహుమతి వచ్చింది. చింతామణి పత్రిక పలు నవలా పోటీలు నిర్వహించటం ద్వారా నవలా వికాసానికి తోడ్పడింది. ఈ విధంగా కందుకూరి వారు నవలలు వ్రాయటమే కాక అనేక విధాలుగా కృషి చేశారు.

చిలకమర్తి వారు గణపతి, హేమలత, అహల్యాబాయి, కర్పూర మంజరి మొదలయిన నవలలు వ్రాశారు. హేమలత చారిత్రక నవల కాగా, రామచంద్ర విజయం సాంఘిక నవల. ప్రారంభంలో వచ్చిన నవలల్లో రాజకీయోద్యమం, జాతీయ జీవన చిత్రణం, సంఘ సంస్కరణలు చోటు చేసుకున్నాయి. అప్పటి నవలలను పరిశీలించి చూస్తే కొన్ని పాశ్చాత్య ప్రభావంతో వచ్చాయి. ఆ తర్వాత జాతీయోద్యమాన్ని ఆధారం చేసుకొని అనేక నవలలు వచ్చాయి.

**15.4.2. అనువాద యుగం (1900 - 1920):** ఈ యుగంలో ఎక్కువగా అనువాద నవలలు వచ్చాయి. అంతే కాకుండా ఈ యుగంలోనే చారిత్రక నవలలు రావడం వల్ల ఈ యుగాన్ని చారిత్రక యుగమని అంటారు. 1899లో G.V.S. దొరస్వామయ్య రచించిన 'కపాల కుండలం' తెలుగులో మొట్ట మొదటి అనువాద నవల. ఇది బెంగాలీ భాష నుంచి అనువదించబడింది. దొరస్వామి గారే 1907లో మరో బెంగాలీ నవలను 'ఆనందమఠం' అనే పేరుతో అనువదించారు.

ఈ యుగంలో వచ్చిన చారిత్రక అనువాద నవలను పరిశీలిస్తే కనకవల్లి భాస్కరరావు 'ప్రఫుల్ల ముఖి', తల్లా ప్రగడ సూర్యనారాయణ గారి 'శైవలినీ చంద్రశేఖరము', చాగంటి శేషయ్య గారి 'దుర్గేశ నందిని', 'నవాబు నందిని', రాధారాణి, వేంకట పార్వతీశ్వర కవుల వారి 'రాజసింహ', అక్కిరాజు ఉమాకాంతం గారి 'టిప్పుసుల్తాను', చిలకమర్తి వారి 'దాసీకన్య', తెన్నేటి సూరి గారి 'రెండు మహా నగరాలు' మొదలైనవి ప్రారంభంలో వచ్చిన నవలలు, అనువాద నవలలు.

ఈ యుగంలో అనువాదాలే కాక స్వతంత్ర, చారిత్రక నవలలు కూడా వచ్చాయి. ఖండవల్లి రామచంద్రుడు గారి ధర్మవతీ విలాసము, లక్ష్మీ సుందర విజయము, కేతనవరపు వేంకట శాస్త్రి గారి 'రాయచూరు ముట్టడి', చివుకుల పిచ్చయ్య శాస్త్రి గారి 'పద్మిని', టంగూరి సుబ్బారావు గారి 'ప్రభాతము', ధరణికోట మొదలైనవన్నీ స్వతంత్ర చారిత్రక నవలలే.

ఈ కాలంలోనే అపరాధ పరిశోధక నవలలు కూడా అనువదించబడ్డాయి. వీటిని రచించుటలో వేంకట పార్వతీశ్వర కవులు ప్రథములు. వీరు అనువాద నవల్నే కాక స్వతంత్ర నవలలు కూడా వ్రాశారు. ఈ యుగంలో అనేక మంది స్వతంత్ర నవలల్ని వ్రాయగా కొన్ని అనువాద నవలల్ని కూడా వ్రాశారు. అంతే కాకుండా ఈ యుగంలో లెక్కకు మించి అనేక చారిత్రక నవలలు రావడం వల్ల ఈ యుగాన్ని చారిత్రక నవలల యుగం అని విమర్శకులు అన్నారు.

**15.4.3. వికాస యుగం (1920 - 1942):** ఈ యుగంలో భాషలో, శైలిలో, శిల్పంలో, వస్తువులో వైవిధ్యంలో కాక, అన్ని రకాలుగా మార్పులు వచ్చాయి. వేంకట పార్వతీశ్వర కవులు వారి 'మాతృ మందిరము', ఉన్నవ లక్ష్మీ నారాయణ గారి 'మాలపల్లి' ఈ యుగంలో వచ్చిన నవలలు. చలం, విశ్వనాథ సత్యనారాయణ, అడవి బాపిరాజు మొదలైన వారు నవలా వికాసానికి ఎంతగానో తోడ్పడ్డారు. చలం తన నవలల్లో కాల్పనికోద్యమ లక్షణాన్ని ప్రవేశ పెట్టాడు. మైదానం, శశిరేఖ, దైవ మిచ్చిన భార్య, కన్నీటి కాలువ, మాఖర్మిట్లా కాలింది, బ్రాహ్మణీకం, జీవిత దర్శనం మొదలైన నవలల్ని వ్రాసారు. చలంకి స్త్రీకి సంపూర్ణమయిన స్వేచ్ఛ ఇచ్చాడనే అపకీర్తి కూడా వచ్చింది. విశ్వనాథ ఏకవీర, తెరచిరాజు, బద్దన్నసేనాని, కమిడి చెట్టు, వేయి పడగలు, చెలియలికట్ట, స్వర్గానికి నిచ్చెన, ధర్మచక్రం, జేబు దొంగలు, మాబాబు అనే నవలనే కాక వ్యంగ్యాత్మకమయిన నవలల్ని కూడా వ్రాశారు.

అడవి బాపిరాజు గారు చరిత్ర వ్రాయకపోయినా ఆంధ్రుల పట్ల, ఆంధ్ర చరిత్ర పట్ల, సంస్కృతి పట్ల గౌరవం ఉండటం వల్ల ఆంధ్రుల శౌర్యాన్ని, దీరత్వాన్ని తమ నవల్లో పొగిడారు. నారాయణరావు తుఫాను, కోనంగి, నరుడు, జాజిమల్లి వంటి అనేక సాంఘిక నవలల్నే కాక హిమబిందు, అడవి శాంతశ్రీ, గోనగన్నా రెడ్డి, మధుర వాణి, అంశుమత, శిలారథము, కైలాశేశ్వరుడు మొదలైన 7 చారిత్రక నవలలు వ్రాశారు. ఈ చారిత్రక నవలలు ఒక్కో యుగానికి సంబంధించినవి. ఈ యుగంలో మొక్కపాటి నరసింహ శాస్త్రి, ముని మాణిక్యం నరసింహారావు, శ్రీపాద సుబ్రమణ్య శాస్త్రి మొదలైన చెప్పుకోదగ్గ రచయితలు కూడా ఉన్నారు.

**15.4.4 మనో వైజ్ఞానిక యుగం (1942 - 1960):** మనస్తత్వ శాస్త్ర విధానాల్ని ఆధారంగా తీసుకొని పాత్రల చిత్రణలకు ప్రాధాన్యం ఇచ్చి నవలలను రాసిన ఈ యుగంలో గోపీచంద్, బుచ్చిబాబు, రాచకొండ విశ్వనాధ శాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు, జి.వి. కృష్ణారావు మొదలైన వారు ముఖ్యులు. కొడవటిగంటి వారు సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని మానవత్వాన్ని ఆధారంగా చేసుకొని కొన్ని నవలల్ని వ్రాశారు. "చదువు", "అనుభవం" మొదలైన నవలల్లో ఆర్థిక, మానసిక సంక్షోభాన్ని చిత్రించారు. గోపిచంద్ "అసమర్థుని జీవయాత్ర", బుచ్చిబాబు "చివరకు మిగిలేది", రావిశాస్త్రి "అల్పజీవి", జి.వి. కృష్ణారావు "కీలు బొమ్మలు" మొదలైన నవలలు మనో వైజ్ఞానిక నవలలు.

ఈ యుగంలో పైన పేర్కొన్న మనో వైజ్ఞానిక నవలలే కాక చెప్పుకోదగ్గ సాంఘిక, రాజకీయ నవలలు కూడా వచ్చాయి. భాస్కర భట్ల కృష్ణారావు గారి "యుగ సంధి", "వెల్లువలో పూచిక పుల్లలు", బలివాడ కాంతారావు గారి "గోడ మీద బొమ్మ", "సుగుణ" మొదలైనవి కూడా మనో వైజ్ఞానిక నవలలుగా మనం చెప్పవచ్చు.

**15.5.5 సమకాలీన యుగం (1960 - నేటి వరకు):** ఈ యుగంలోని నవలల్లో సమకాలీన జీవిత చిత్రం చిత్రింపబడటం వల్ల ఈ యుగాన్ని "సమకాలీన యుగం" అన్నారు. ఈ యుగంలో పురుషులే కాక స్త్రీ రచయిత్రులు కూడా మంచి నవలలు రాశారు. శ్రీదేవి, ముప్పాళ్ళ రంగ నాయకమ్మ, కోడూరి కౌసల్యాదేవి, లత, వాసిరెడ్డి సీతాదేవి, సులోచన, రామలక్ష్మి మొదలైన రచయిత్రులు అనేక సామాజిక నవలల్ని రాయడం ద్వారా జాతిని జాగృతం చేశారు.

ఈ యుగంలోని రచయితలుగా దాశరధి రంగాచార్య, అల్లం రాజయ్య, పోరంకి దక్షిణామూర్తి, నవీన్, పాలగుమ్మి పద్మరాజు, ఉప్పల లక్ష్మణ రావు, మంజు శ్రీ, ఇచ్చాపురపు జగన్నాథరావు, గొల్లపూడి మారుతీ రావు మొదలైన వారిని పేర్కొనవచ్చు.

ఆధునిక కాలంలో యండమూరి వీరేంద్రనాథ్, మల్లాది మొదలైన రచయితలు క్షుద్ర సాహిత్యాన్ని ప్రవేశ పెట్టారు.

ఈ విధంగా తెలుగు నవలా చరిత్రను పరిశీలిస్తే సాంఘిక, చారిత్రక, పౌరాణిక కథలకు సంబందించిన నవలలు వచ్చాయి. అంతే కాకుండా ఇప్పుడు మాండలిక నవలలు కూడా వస్తున్నాయి. ప్రస్తుతం వార పత్రికల్లోనూ, మాస పత్రికల్లోను నవలలు ఎక్కువగా కన్పిస్తున్నాయి.

## 15.5 నవలా భేదాలు:

నవలా రచయితలు తీసుకొనే కథా వస్తువును బట్టి నవలల్లో అనేక భేదాలున్నాయి.

| | |
|---|---|
| 1. సాంఘిక నవలలు | 7. డిటెక్టివ్ నవలలు |
| 2. చారిత్రక నవలలు | 8. మనో వైజ్ఞానిక నవలలు |
| 3. పౌరాణిక నవలలు | 9. పిల్లల నవలలు |
| 4. రాజకీయ నవలలు | 10. వైజ్ఞానిక భాస నవలలు |
| 5. హాస్య నవలలు | 11. వేశ్య నవలలు |
| 6. అనువాద నవలలు | 12. అశ్లీల నవలలు |

**15.5.1 సాంఘిక నవలలు:** తెలుగులో మొట్ట మొదటి నవల సాంఘిక ఇతి వృత్తంతో వచ్చింది. శ్రీరంగ రాజ చరిత్ర, రాజశేఖర చరిత్ర ఈ రెండు నవలలూ ఆ కాలం నాటి సాంఘిక వాతావరణాన్ని ప్రతిబింబించాయి. చిలకమర్తి లక్ష్మీ నరసింహం, విశ్వనాథ, చలం, అడవి బాపిరాజు, గోపీచంద్, బుచ్చిబాబు, బలివాడ కాంతారావు, రావిశాస్త్రి, శ్రీ పాద సుబ్రమణ్యా శాస్త్రి, రంగనాయకమ్మ, కొమ్మూరి, వాసిరెడ్డి సీతాదేవి మొదలైన వారు అనేక సాంఘిక నవలల్ని వ్రాశారు.

నవలా రచయితల్లో ప్రముఖంగా పేర్కొనదగిన వారు విశ్వనాథ సత్యనారాయణ గారు. వేయి పడగలు, తెఱచిరాజు, మాబాబు, జేబుదొంగ మొదలైన సాంఘిక నవలల్ని వీరు వ్రాశారు. ఈ నవలల్లో ఆధునికాంధ్ర సాంఘిక రాజకీయ, మత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. అడవి బాపిరాజు గారి నారాయణరావు, తుఫాను, కోనంగి, నరుడు, శ్రీపాద సుబ్రమణ్యా శాస్త్రి గారి ఆత్మబలి, గోపీచంద్ గారి అసమర్ధుని జీవయాత్ర, బుచ్చిబాబు గారి చివరకు మిగిలేది, బలివాడ కాంతారావు గారి గోడమీద బొమ్మ, జి.వి. కృష్ణారావు గారి కీలు బొమ్మలు, కూచి సాంబశివరావు గారి ఉదయ కిరణాలు మొదలైనవి ప్రముఖమైన సాంఘిక నవలలు.

సాంఘిక నవలలు వ్రాసిన రచయిత్రులు అనేక మంది ఉన్నారు. పులుగుర్తి లక్ష్మీ నరసమాంబ గారి 'సుభద్ర', యోగీశ్వరి, మాలతీ చందూర్ గారి 'చంపకలు', 'చెదలపురుగు', రంగ నాయకమ్మ గారి 'బలిపీఠం', పేక మేడలు, వసుంధర గారి 'దూరపు కొండలు' మొదలైనవి ప్రఖ్యాతమయిన సాంఘిక నవలలుగా చెప్పవచ్చు.

సాంఘిక నవలా వ్యాప్తికి వార పత్రికలు విశేషంగా కృషి చేశాయి. ఈ పత్రికలు నవలా వ్యాప్తికి ఉపకరించినంతగా మరేవీ ఉపకరించ లేదు.

**15.5.2 చారిత్రక నవలలు:** సాంఘిక నవలలు తరువాత ప్రముఖ స్థానాన్ని పొందినవి చారిత్రక నవలలు. అనేక మంది నవలా రచయితలు చారిత్రక ఇతి వృత్తంతో నవలలు వ్రాశారు. చారిత్రక నవల అనగానే సత్యానికి చోటుంటుంది తప్ప ఊహకి చోటుండదు. చరిత్రను ఆధారంగా చేసుకొని మాత్రమే నవలలు వ్రాయాలి.

చారిత్రక నవలల్లో చిలకమర్తి వారి 'అహల్యాభాయి', విశ్వనాథ వారి 'కడిమి చెట్టు', ఏకవీర, అడవి బాపిరాజు గారి గోనగన్నా రెడ్డి, హిమబిందు, అడవి శాంతశ్రీ, చిలుకూరి వీరభద్ర రావు గారి 'నాయకురాలు', ఆచార్య కాకర్ల నరసింహం రఘునాధ రాయలు, కనకాభిషేకం, నోరి నర్సింహ శాస్త్రి గారి నారాయణ భట్టు, రుద్రాంబ, మల్లారెడ్డి, ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి గారి 'చిత్రశాల', తెన్నేటి సూరి గారి చంఘీజ్ ఖాన్ మొదలైన వారే కాక ఇంకా కొంత మంది నవలా రచయితలు చారిత్రక నవలలు వ్రాశారు.

**15.5.3 పౌరాణిక నవలలు:** పౌరాణిక నవలలు అనగా పురాణాల్లో ఉన్న కథలను తీసుకొని నవలలుగా వ్రాయడం. అయితే ఇలా చేసిన వారి సంఖ్య చాలా తక్కువ. చిలకమర్తి వారి సౌందర్య తిలక, కొక్కండ వేంకటరత్నం గారి మహాశ్వేత, కేతవరపు వేంకటశాస్త్రి గారి 'మదాలస', జయంతి సూరమ్మ గారి 'సుదక్షిణా చరిత్రము' మొదలైన నవలలు పౌరాణిక ఇతి వృత్తంతో వ్రాసినవి.

**15.5.4 హాస్య నవలలు:** తెలుగు నవలా చరిత్రలో హాస్య నవలలు వ్రాసిన వారు చాలా తక్కువ. హాస్యానికి ప్రాధాన్యమిచ్చే నవలలు చాలా తక్కువగా వచ్చాయి. అవికూడా ఎక్కువగా సాంఘిక నవలలే. చిలకమర్తి వారి 'గణపతి', మొక్కపాటి నరసింహ శాస్త్రి గారి 'బారిష్టరు పార్వతీశం', మునిమాణిక్యం నరసింహ శాస్త్రి గారి 'తెరుమూళిగ' మొదలైనవి ప్రసిద్ధి చెందిన హాస్య నవలలుగా చెప్పవచ్చును. ఆధునిక రచయితలలో రావిశాస్త్రి, ముళ్ళపూడి వేంకట రమణ, ఎర్రం శెట్టి, బీనాదేవి మొదలైనవారు హాస్య నవలలు వ్రాశారు.

**15.5.5 రాజకీయ నవలలు:** జాతీయోద్యమాన్ని దృష్టిలో పెట్టుకొని వ్రాసిన రాజకీయ నవలలు అనేకం వచ్చాయి. అంతే కాకుండా గాంధీ సిద్ధాంతాల ప్రభావంతో కూడా అనేక నవలలు వచ్చాయి. ఉన్నవల లక్ష్మీ నారాయణ గారి 'మాలపల్లి' నవల ఆ నాటి పరిస్థితుల ప్రభావంతో వచ్చిన నవల. ఉప్పల లక్ష్మణరావు గారి 'అతడు - ఆమె', ఆళ్వారు స్వామి గారి 'ప్రజల మనిషి', 'గంగు',

మహీధర రామ్మోహనరావు గారి 'రథ చక్రాలు', ఓనమాలు, 'మృత్యువు నీడల్లో దావానలము' మొదలైన నవలలు సాంఘిక, రాజకీయ, సమస్యలతో కూడిన నవలలుగా చెప్పవచ్చు.

**15.5.6 అనువాద నవలలు:** తెలుగులో అనేక అనువాద నవలలు వచ్చాయి. ఇంగ్లీషులో గోల్డ్‌స్మిత్ వ్రాసిన 'వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్'కు అనువాదంగా వీరేశలింగం గారు 'రాజశేఖర చరిత్ర'ను వ్రాశారు. అలాగే రవీంద్రుని రచనలు కూడా తెలుగులో అనువాదాలుగా వచ్చాయి. టాల్‌స్టాయ్ రచనలకు అనువాదాలుగా 'సమరము - శాంతి', అనుమానము, నవ జీవనము మొదలైన వాటిని పేర్కొనవచ్చు. గోర్కి, రైనాల్డ్సు స్కాట్ మొదలైన వారు రచించిన నవలలు కూడా తెలుగు అనువాదాలుగా వచ్చాయి.

అనువాద సాహిత్య నవలల్లో శరత్‌కు మంచి పేరు వుంది. అందుకే శరత్ సాహిత్యానికి ఉన్న ప్రాచుర్యం మరెవరికీ లేదు. తల్లావఝ్ఝల శివ శంకర శాస్త్రి, వేంకట పార్వతీశ్వర కవులు, చాగంటి శేషయ్య, పులుగుర్తి లక్ష్మీ నరసమాంబ, జొన్నలగడ్డ సత్యనారాయణ మూర్తి మొదలైన వారు అనేక నవలల్ని ఆంధ్రీకరించారు.

**15.5.7 డిటెక్టివ్ నవలలు:** తెలుగులోకి మొట్ట మొదట డిటెక్టివ్ నవలలు బెంగాల్ నుండి అనువదిచబడ్డయి. 1920 - 35 మధ్య కాలంలో తెలుగులో డిటెక్టివ్ నవలలు వచ్చాయి. వీటినే అపరాధ పరిశోధన నవలలు అంటారు. ఆంగ్లేయుల డిటెక్టివ్ సాహిత్యం తెలుగు వారి పై ప్రభావం చూపింది. డిటెక్టివ్ నవలల్లో ఉత్కంఠతో కూడిన కథ ఏకబిగిన నవల చివర వరకూ వుండి పాఠకులను చదివిస్తాయి.

తాపీ ధర్మారావు, ఆరుద్ర, టెంపో రావు, అబ్బూరి, విశ్వ ప్రసాద్ మొదలైన వారు వ్రాసిన నవలలే కాక మద్దాల నారాయణ రావు గారి భయంకర లోయ, హత్యాన్వేషణము, సీరమసుబద్రాంబ గారి జాగిలము మొదలైన నవలలు అపరాధ పరిశోధక నవలలుగా పేరుపొందాయి. అలాగే వేంకట పార్వతీశ్వర కవులు 'మాయావి', మనోరమ, మాయావిని, దేవరాజు వేంకట కృష్ణారావు గారి 'వాడే వీడు', నేనే, మొసలికంటి సంజీవ రావు గారి 'మొగలాయి దర్బారు' మొదలైన నవలలు కూడా డిటెక్టివ్ నవలలుగా చెప్పవచ్చు.

**15.5.8 మనో వైజ్ఞానిక నవలలు:** తెలుగులో వచ్చిన నవలల్లో మనో వైజ్ఞానిక నవలలు కూడా ముఖ్యమయినవి. 1944 - 50 మధ్య కాలంలో మనో వైజ్ఞానిక సిద్ధాంతాన్ని ఆధారం చేసుకొని అనేక మంది నవలలు వ్రాసారు. బుచ్చిబాబు గారి చివరకు మిగిలేది, గోపీచంద్ అసమర్థుని జీవయాత్ర, రావిశాస్త్రి గారి అల్పజీవి, నవీన్ అంపశయ్య మొదలైన నవలల్ని మనో వైజ్ఞానిక నవలలుగా చెప్పవచ్చు.

**15.5.9 వైజ్ఞానికా భాషా నవలలు:** మనో వైజ్ఞానిక నవలలు తరువాత ఈ నవలలు వచ్చాయి. ఈ నవలలు సంచలనాన్ని, ఉత్కంఠను కల్గిస్తాయి. వీటిలో మంత్రాలు, తంత్రాలు, భూతాలు, దెయ్యాలు, చేతబడులు, భూగృహాలు మొదలైనవి ఉంటాయి. ఇలాంటి నవలలు వ్రాసిన వారిలో యండమూరి వీరేంద్రనాథ్‌ను ప్రముఖంగా చెప్పవచ్చు. ఈయన వ్రాసిన తులసీదళం, తులసి మొదలైన నవలలు ఈ కోవకు చెందినవిగా చెప్పవచ్చు.

**15.5.10 పిల్లల నవలలు:** తెలుగులో పిల్లల నవలలు కూడా చాలా వచ్చాయి. ముళ్ళపూడి వేంకటరమణ వ్రాసిన "బుడుగు - బుడుగు", చిచ్చుల పిడుగు, మొదలైనవి పిల్లల నవలలే. అలాగే ఇంగ్లీషులోని 'ఆలీస్ ఇన్ వండర్ లాండ్'' లాంటి పిల్లల నవల తెలుగులో 'అల్లీ బిల్లీ లోకంలో అమ్మాయి' అనే పేరుతో అనువదించబడింది.

**15.5.11 అశ్లీల నవలలు:** తెలుగులో కూడా కొన్ని అశ్లీల నవలలు వచ్చాయి. అశ్లీల సాహిత్యం గల నవలలు వ్రాసిన వారు చలం. వీరు కామానికి ప్రాధాన్యమిస్తూ వ్రాసిన నవలలు 'మైదానం' మొదలైనవి. చలంలాగే అశ్లీల నవలల్ని వ్రాసిన వారు తెన్నేటి హేమలత గారు నీటి బుడగలు, గాలిపడగలు మొదలైన నవలల్ని ఉదాహరణగా చెప్పవచ్చు.

**15.5.12 వేశ్య నవలలు:** ఈ నవలలు ఎక్కువగా వేశ్యా జీవనానికి సంబంధించినవి. ఇటువంటి ఇతివృత్తంతో రావి శాస్త్రి గారు వ్రాసిన 'రత్తాలు - రాంబాబు' నవలను పేర్కొనవచ్చు. నటరాజ్ అనే తమిళుడు 'శారద' అనే పేరుతో రెండు నవలల్ని వ్రాసాడు.

## 15.6 కథానిక:

**15.6.1 ఉపోద్ఘాతం:** ఆధునిక కల్పనా సాహిత్య ప్రక్రియలన్నింటిలోనూ 'కథానిక' ప్రముఖ స్థానాన్ని అలంకరించింది. కథానికనే 'చిన్నకథ' అనీ 'కథ' అని నేడు తెలుగులో వ్యవహారం. ఆంగ్లంలో దీనినే Short-Story అని అంటారు.

'కావ్యేషు నాటకం రమ్యం' అన్నారు సంస్కృతాలంకారికులు. కాని కాలాన్ని బట్టి రుచుల మారుతూ ఉంటాయి. ప్రస్తుత సమకాలీన సాహితి ప్రక్రియల్ని చూస్తే 'కావ్యేషు కథా రమ్యం' అని అనక తప్పదు. అసలు తెలుగు సాహిత్య జగత్తులో ఈ యుగాన్ని మనం కథానిక యుగమని పిలువవచ్చు. ఈ కథానిక పాశ్చాత్యుల సాంప్రదాయం. పాశ్చాత్య రచయితల ప్రభావం వల్ల ఇతర భాషల మాదిరిగానే భారతదేశంలోకి ప్రవేశించిన ఆధునిక వచన సాహిత్య ప్రక్రియల్లో 'కథానిక' ఒకటి.

ఆధునిక వచన రచన ప్రక్రియలో కథానిక ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది. తెలుగుదేశ సాహిత్య వనంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలుగొంది దిన దిన ప్రవర్థమానమవుతున్న సాహిత్య ప్రక్రియ 'కథానిక'. మన సాహిత్యంలో తెలుగు కథ, ఒక విశిష్టమైన స్థానాన్ని ఒక ప్రత్యేకమైన స్వరూపాన్ని సంతరించుకొంది.

**15.6.2 పద వివరణ:** ఆంగ్లంలో Short Story కి సమానార్థంగా మనం 'కథానిక' అనే పదాన్ని వ్యవహరిస్తున్నాం. Short అనే పదాన్ని మనవాళ్లు "చిన్న" అని అనువదించి Short Story ని "చిన్నకథ" అనే పేరుతో ప్రారంభంలో పిలిచేవారు. అయితే ఇంద్రగంటి హనుమత్ శాస్త్రి 1936లో ప్రతిభ అనే పత్రికలో వ్యాసం రాస్తూ 'Short Story' అనే దానిని 'చిన్నకథ' అని అనకుండా సంస్కృతంలో వున్న 'కథానిక' పదాన్ని ఉపయోగించడం అన్ని విధాల మంచిదని సూచించారు. శాస్త్రి గారు 'కథానిక' అనే పదాన్ని మన సాహిత్యంలో ఏనాడు సూచించారో అప్పటి నుంచి 'Short Story' ని 'కథానిక' అని పిలవడం పరిపాటి అయింది. అయితే 'కథానిక' అనే పదాన్ని మనం సాహిత్యంలో మాత్రమే వాడుతున్నాం. ఎక్కువ మంది మాత్రం నిత్య వ్యవహారంలో కథ, కథలు అని వాడుతుంటారు. మొత్తం మీద కథానికను 'కథ' అనీ, 'చిన్న కథ' అనీ వ్యవహరిస్తున్నారు.

**15.6.3 కథానిక - ఆంగ్ల ప్రభావం:** ఆంగ్ల సాహిత్య ప్రభావంతో భారతదేశంలో అనేక నూతన సాహిత్య ప్రక్రియలు వెలువడ్డాయి. అదే విధంగా ఆంధ్రదేశంలో కూడా ఆంగ్ల ప్రభావంతో అనేక నూతన సాహిత్య ప్రక్రియలు వెలువడ్డాయి. ఈ ప్రక్రియల్లో పేర్కోదగినవి కథానిక, నవల, నాటకం, విమర్శ, నాటకం, కవిత, వ్యాసం, సమీక్ష, పీఠికలు, జీవిత చరిత్ర, స్వీయ చరిత్ర, పత్రికా లేఖనం, సంపాదకీయం, అనువాద సాహిత్యం శాస్త్ర గ్రంథం, వ్యాఖ్యానం మొదలైనవి.

కథానిక రచన మొదటగా అమెరికాలో ప్రారంభమైంది. పాశ్చాత్య దేశాల్లో "చిన్నకథలు" వ్రాసి ప్రసిద్ధికెక్కిన వాళ్లు ఎడ్గార్ ఎలెన్‌పో, సోమర్ సెట్ మామ్, గయడ్ మొపాసా, ఆంటిన్ చెకోవ్, స్కీవెన్‌సన్, సారోయన్, జాక్ లండన్, జోలా, నదేనియల్ హాథోరన్, స్పెన్ బక్, హాబర్డ్, ఓ హెన్రీ, ముపాపో మొదలైన వారు.

**15.6.4 కథానిక ప్రాచీన సాహిత్యం:** భారతీయ సాహిత్యాల్లో ముఖ్యంగా తెలుగు సాహిత్యంలో అథానికలు లేవా? అనే ప్రశ్న ఉదయించవచ్చు. ప్రాచీనాంధ్ర సాహిత్యంలో కథలున్నట్లు స్పష్టంగా చెప్పలే. కథలు గ్రంథస్తం కాకపోయిన వాగ్వ్యాపంలో వుండి వుండవచ్చు. రాను రాను తెలుగు సాహిత్యంలో కథలు కావ్యాల్లోనూ ద్విపదల్లోనూ కన్పిస్తున్నాయి. అయితే కేవలం వచన రచనలో కథలున్నట్లు కన్పించవు.

ప్రాచీనాంధ్ర వాఙ్మయంలో కథా సాహిత్యంలో కేతన (క్రీ.శ. 1255) 'దశ కుమార చరిత్ర', ప్రథమ గద్య పద్యాత్మకమైన కథారచన అనంతామాత్యుని 'భోజరాజీయం', జక్కన 'విక్రమార్క చరిత్ర' వెన్నెల కంటి అన్నయ్య 'షోడశ కుమార చరిత్ర' గోపరాజు ద్వాత్రింశత్సాల సింహాసన ద్వాత్రింశిక కదిరీ పతి 'శుక సప్తతి' నారాయణ కవి 'హంస లిశతి' తురగా వెంకం రాజు 'మర్యాద రామ చరిత్ర'ల్లో ప్రాచీనాంధ్ర దేశంలో విశేష ప్రాచుర్యం వహించిన కథలు కన్పిస్తున్నాయి. ఈ కథా గ్రంథాలే కాక పేదరాశి పెద్దమ్మ కథలు, కాశీ మజిలీల కథలు, పిట్టకథలు లాంటివి కూడా చాలా వున్నాయి.

**15.6.5 కథానిక - ఆధునిక సాహిత్యం:** ఆధునిక కాలంలో 1850 ప్రాంతం నుంచి కథా సాహిత్యం ప్రారంభమైంది. పరవస్తు చిన్నయసూరి, కందుకూరి వీరేశలింగం, రఘుపతి వేంకట రత్నం నాయుడు, వేదం వేంకటరాయ శాస్త్రి ప్రభృతులు సంస్కృత సాహిత్యం నుంచి ఎన్నో కథల్ని అనువదించి అనుకరించారు. వేదం వారు భోజ కాళిదాసు కథలు, బేతాళ పంచ వింశతి, కథా సరిత్సాగరం అనే కథల సంపుటాల్ని ప్రచురించారు. ఇవి సంస్కృతం నుంచి అనువదించబడ్డాయి.

సంపూర్ణ ఆధునిక కథానిక లక్షణాలు కలిగిన రచన 1910 నుంచే ప్రారంభమైందని చెప్పవచ్చు. తెలుగు సాహిత్యంలో కథానికకు శ్రీకారం చుట్టిన వారు గురజాడ అప్పారావు గారు. గురజాడ వారి తొలి కథ పేరు 'దిద్దుబాటు'. 'ఆంధ్ర భారతి' అనే పత్రికలో 1910 ఫిబ్రవరిలో మొదటిసారి అచ్చు అయింది. వీరు ప్రారంభంలో ఈ కథను గ్రాంధికంలో రాసి తర్వాత వ్యావహారికంలోకి మార్చారు. తెలుగు కథానిక ప్రక్రియలో, విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ అప్పారావు గారే ఆద్యులు, ఆరాధ్యులని చెప్పక తప్పదు.

## 15.7 కథానిక - నిర్వచనాలు:

ఎ) అగ్ని పురాణం బి) పాశ్చాత్యులు సి) ప్రాచ్యులు

**ఎ) అగ్ని పురాణ కర్త:** ప్రాచీన సంస్కృత వాఙ్మయంలో కథానికలుండేవని చెప్పడానికి లక్ష్య భూతమైన ఆధారాలు కన్పించలేదు. కానీ, అగ్ని పురాణం లోనూ, ధ్వన్యా లోకం లోనూ, కథానికను ఒక గద్య కావ్య ప్రబేధంగా పేర్కొన్నారు. అగ్ని పురాణంలో "...............

"ఆఖ్యాయికా కథా, ఖండిక, పరికధా తథా
కథానికేతి యన్యంతే గద్య కావ్యం చ పంచధా" (337 - 12)

కథానికను ఒక ప్రత్యేక సాహిత్య ప్రక్రియగా గుర్తించి, ప్రపంచంలో మొట్ట మొదటిసారిగా లక్షణ నిర్దేశం చేసిన ప్రతిష్ట 'అగ్ని పురాణానికి' దక్కుతుంది. అందులో ఆధునిక కథానికా ప్రక్రియను గూర్చి ఇలా నిర్వచించారు.

"భయానకం సుఖాపరం గర్భొచ కరుణోరసః
అద్భుతో౨ం తేస్లుక ప్రార్థానో దాత్తి సాకధానిక"

ఆదిలో భయానకం, మధ్యలో కరుణం, అంతంలో అద్భుతం అనే మూడు రసాలుంటూ క్లుప్తంగా, అనుదాత్తంగా చేసిన రచన కథానిక అవుతుందన్నాడు.

**15.7.1 పాశ్చాత్యులు - నిర్వచనం:** కథానిక ప్రక్రియలు ఆంగ్ల ప్రభావంతో తెలుగులోకి ప్రవేశించినవి. అందువల్ల పాశ్చాత్య విమర్శకులు కథానికను ఎలా నిర్వచించారో పరిశీలన చేద్దాం.

1. "A Short Story is a prose narrative, requiring from half an hour to one or two hours in its persual"
   - Edgar Allen Poe"

   "ఒకే సంఘటనాన్ని వాస్తవమైనదైనా అభూత కల్పనతో కూడుకొన్నదైనా చిత్రిస్తూ ఒకేసారి కూర్చుని చదువగలిగే సాహిత్య ప్రక్రియ చిన్నకథ" - ఎడ్గార్ ఎలెన్ పో
2. "ఆద్యంతాలు లేనిదే అసలైన కథానిక " - చెకోవ్
3. కథంటే కథన రూపంలో చెప్పబడే చిన్న నాటిక - హెన్రీ థామస్
4. "ప్లాటులే సర్వసం" - ఓ హెన్రీ
5. కథానికకు సంపూర్ణమైన నిర్వచనమివ్వడం కష్టం. అందుకే కథను నిర్వచించటంలోని ఇబ్బందుల్ని గూర్చి సోమర్ సెట్‌మామ్ ఇలా అన్నారు " రచయితను తనకు నచ్చిన లక్షణాల్ని మాత్రమే యిరికించి చిన్న కథలను నిర్వచిస్తున్నాడు. అంతేకాని

ఏ విధంగా రాసినా పాఠకుల్ని ఆకర్షిస్తే ఆవిధానం మంచిదని గుర్తించాలి" - సోమర్ సెట్ మామ్

6. " A short story clears with a single character or a single event on a single emotion"

- Brande Matthews

**15.7.2 ప్రాచ్యులు:** కొందరు సుప్రసిద్ధులు "కథానిక" అంటే ఏమిటో తమ తమ అభిప్రాయాల్ని వెలిబుచ్చారు. ఇలా అభిప్రాయాన్ని ఇచ్చిన వారిలో పాలగుమ్మి పద్మరాజు, బుచ్చిబాబు, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, బొడ్డు బాపిరాజు, ఆరుద్ర, బొడ్డుపాటి కుటుంబరాయ శర్మ, మధురాంతకం రాజారాం, తూలికా భూషణ్, గొర్రిపాటి వెంకట సుబ్బయ్య, పోరంకి దక్షిణమూర్తి, ఆవుకు అంకిరెడ్డి, కళ్యాణ సుందరీ జగన్నాథ్, హితశ్రీ, తాళ్ళూరు నాగేశ్వరరావు, ఎ.ఎస్. రామారావు, కేతు విశ్వనాథ రెడ్డి ముఖ్యులు.

1. "చిన్న కథకి ప్రధాన లక్షణం కేంద్రీకరణం. కథలో చిన్న విషయం ఆ కేంద్రాన్ని సూచిస్తూ వుండాలి. కథానికకు కేంద్రంగా ఒక స్పష్టమైన సంఘటన, ఒక విచిత్రమైన వ్యక్తి, ఒక మనః స్థితి, రెండు స్వభావాల తారతమ్యం వల్ల వచ్చే నాటకీయత ఇలా ఏదో ఒకటి వుండాలి. కథానిక ఒక మెరుపు వంటిది. దానిలో వేగం ప్రధానం. వైచిత్రి కథానికకు ప్రాణం. కథానికకు ప్లాట్ అనేది అవసరమని నా అభిప్రాయం. శిల్పం మీద దృష్టిని కేంద్రీకరించి మరీ వ్రాయాలి. లేకపోతే కళ్ళెం లేని గుర్రంలా అది తిరిగి తిరిగి దిక్కులేని ప్రదేశాన్ని చేరుకుంటుంది. - పాలగుమ్మి పద్మరాజు
2. కథానిక అంటే మళ్ళీ మళ్ళీ చదివించే వచన ఖండ కావ్యం. వెనుక నుంచి సముద్రం హోరు వినిపిస్తూ చూడ్డానికి మాత్రం కెరటంలా కన్పించేది. బుచ్చిబాబు (శివరాజు వెంకట సుబ్బారావు)
3. కథలంటే పైపైని వున్నాయను కున్నావేమో, అవి కల్పించడానికి చాల గొప్ప ప్రతిభ వుండాలి. వాటిని తెలుసుకోవడానికి ఎంతో పరిజ్ఞానం వుండాలి. అవి చెప్పడానికి ఎంతో నేర్పు వుండాలి. అవి వినడానికి ఎంతో రుచి వుండాలి. అవి బోధ పరచుకోవడానికి ఎంతో సూక్ష్మ బుద్ధి వుండాలి.కథలు కళ్ళకు వెలుగిస్తాయి. బుద్ధికి పదును పెడతాయి. మనస్సుకి ఉత్సాహము, ఉల్లాసము కలిగిస్తాయి. - శ్రీ పాద సుబ్రహ్మణ్య శాస్త్రి
4. "కథకి గొప్పతనం పట్టాలంటే కథ చిత్రించే జీవితం భూమి నుంచి లేవాలి" - చలం
5. "కథను ఏ రూపంలో వ్రాసినా కథ ద్వారా పాఠకులకు ఒక పరిష్కారాన్ని, ఒక కొత్త దృష్టినీ కల్గించడం ముఖ్యం" - గోపీ చంద్
6. "కథ అనేది మన జీవితంలో జీవిత రహస్యంతో, జీవిత వైచిత్రితో కొంత పరిచయం కలుగ చెయ్యాలి. కథ చెప్పే విధానమే కథకి అందాన్ని, బలాన్ని ఇస్తుంది." - దేవర కొండ బాల గంగాధర్ తిలక్
7. " సహజం అన్పించే అసహజం కథ " - మల్లాది రామకృష్ణ శాస్త్రి
8. " ఉపక్రమణంలో ఒక ఉత్కంఠా<br>నిర్వహణలో ఒక ఔత్సుక్యం<br>ఉపసంహారంలో ఒక విచిత్ర చంక్రమణం<br>కథకి కావలసిన అలంకారాలు" - బొడ్డు బాపిరాజు
9. " కథ అనేది మొదట్లో కుతూహలాన్ని చివర ఆలోచనల్ని కలిగించాలి. మధ్యలో రక్తి కట్టిస్తూ చెప్పుకుపోవాలి" - ఆరుద్ర
10. " ఒక రకమైన ఎత్తుగడ ఒకానొక నడక తీరు, ఒక రీతి గల ముగింపు, కొన్ని పాత్రలు, పాత్ర పోషణా విధానం, వస్తు విన్యాస వైశిష్ట్యం, ఏదేని ఒక జీవిత సత్య ప్రతిపాదనం అన్నింటిని మించి వస్త్వైక్యం అనే కొన్ని లక్షణాలు కలిగి వినోద విజ్ఞాన వికాసాది సాధనమైనది కథానిక". - బొడ్డపాటి కుటుంబరాయ శర్మ
11. " సహజత్వం ఉత్కంఠ అనే రెండు చక్రాల మీదే కథ సాగాలి". -మధురాంతకం రాజారాం
12. " చిన్నకథ ఒక సంఘటన కావచ్చు, ఒక వ్యక్తి మనస్తత్వ పరిణామం కావచ్చు, ఒక సుదీర్ఘమైన ఇతి వృత్తమే కావచ్చు. చిన్న కథలో కేవలం ఒకే ప్రత్యేకత ఉంది. సాధ్యమైనంత తక్కువ మంది వ్యక్తులతో తక్కువ సంఘటనలతో అది కథ కావాలి.

అంతేకాక అది స్వయం సంపూర్ణం కావాలి. అంటే కథకు ఆధారంగా తీసుకున్న సంఘటనలతో, వ్యక్తులతో చెప్పదలచుకున్న దానిని సంపూర్ణంగా చెప్పగలిగి ఉండాలి." - తూలికాభూషణ్

13. " కథకు ఎత్తుగడ బాగా వుండాలి. గమనము వేగముగా వుండాలి. Clima అద్భుతంగాఉండాలి." - గొర్రెపాటి వెంకట సుబ్బయ్య

14. " ఏకాంశ వ్యగ్రమై స్వయం సమగ్రమైన కథాత్మక వచన ప్రక్రియ కథానిక." - పోరంకి దక్షిణామూర్తి

15. "కథానిక జీవిత ప్రవాహంలోనిఒక 'అల' వంటిది. అది క్షణికమయినా దానికుండే శక్తి సామర్థ్యాలు విలువైనవి. హఠాత్తుగా ప్రారంభమై హఠాత్తుగా అంతమౌతుంది. ఆద్యంతాలు ప్రతిభావంతంగా వుంటాయి. కథానిక తన ఉద్దేశాన్ని తుది క్షణంవరకూ అణచి పెట్టుకొని వుంటుంది. తన ఉద్దేశాన్ని చెప్పి పఠితను ఒక విశేష ప్రభావానికి గురి చేస్తుంది." - అవుకు అంకిరెడ్డి

16. " ఒకే సంఘటన చుట్టూ కథ అల్లుకుపోయి భావంలో భిన్నత్వం కాకుండా ఒక ఐక్యతతో ఉండే రచన 'చిన్నకథ' ". - కళ్యాణసుందరీ జగన్నాథ్

17. " సాధారణముగా అతి విస్తృత క్షేత్రము కలిగి ఒకానొక సత్యమునకో యదార్థమునకో సంబంధించిన ఉత్కంఠ సంవేదనముతో కూడి, స్వయం సంపూర్ణమై దాని లోని విభిన్నతత్వములను ఏకోన్ముఖములుగా చూపు ఇతి వృత్తాత్మక గద్య కవితా శిల్ప ఖండమును 'కథానిక' అని నిర్వచింప వచ్చును. - బొడ్డుపాటి కుటుంబరాయ శర్మ

18. " ఒక అవస్థనుగాని, ఒక అనుభవాన్ని గానీ, ఒక వైచిత్ర్యాన్ని గాని ఒక మనస్తత్వాన్ని గానీ చిత్రించేది కథ ". - హితశ్రీ

19. " సాధారణముగా ఒకే సంఘటనను గానీ, అంత కంటే ఎక్కువ సంఘటనలతో ఒకే ప్రయోజనాన్ని, ఒకే ఆదర్శాన్ని దృష్టిలో పెట్టుకొని చిత్రించడాన్ని చిన్న కథ అని కానీ, కథానిక అని కానీ అంటారు." - తాళ్ళూరి నాగేశ్వరరావు

20. " పాఠకుని కాలాన్ని వృథా చేయకుండా, అతి తక్కువ కాలంలో విజ్ఞానంతో పాటు వినోదాన్ని కలిగిస్తూ, ప్రకృతి రహస్యాలను, మానవుల విచిత్ర, చిత్ర ప్రవృత్తులను, ప్రమాణాల పరిణామాలను సూటిగా చెబుతూ ఆశ్చర్యాన్ని కలిగించగలిగేదే కథానిక". - ఏ.యస్. రామారావు

21. " కథ వ్రాయాలని ఆర్తికి ఎలా వ్రాయాలి, ఎందుకుకోసం వ్రాయాలి అనే ఆలోచన వుంటే ఆసక్తి కలిగించే మంచి కథ రాయడం సాధ్యపడుతుంది." - కేతు విశ్వనాథ రెడ్డి

## 15.8 కథానిక - లక్షణాలు:

బ్రాండర్ మాథ్యూస్ "కథానిక"ను గూర్చి సమగ్రంగా నిర్దేశించి లక్షణ నిర్దేశం చేశాడు. అతని మాటలో "కథానిక" లక్షణాలు ఇవి. మౌలికత, ఏకత, క్లుప్తత, శైలీరమ్యత, క్రియాశీలత, రూపం, వస్తువు, వీలుంటే కల్పన.

పాశ్చాత్యులు ప్రాచ్యులు వెలిబుచ్చిన కథానిక నిర్వచనాన్ని నిశితంగా పరిశీలిస్తే కథానిక లక్షణాల్ని నిర్ధారించవచ్చు. ముఖ్యంగా అగ్ని పురాణ కర్త, ఎడ్గార్ ఎలెన్‌పో, బ్రాండర్ మాథ్యుస్ మొదలైన వారి నిర్వచనాల్ని తులనాత్మకంగా పరిశీలిస్తే కథానిక లక్షణాలు తెలుస్తాయి.

| **అగ్నిపురాణ కర్త** | **ఎడ్గార్ ఎలెన్ పో** | **బ్రాండర్ మాథ్యుస్** |
|---|---|---|
| 1. క్లుప్తత | 1. క్లుప్తత | 1. మౌలికత |
| 2. అనుదాత్తత | 2. ఏకైక ప్రభావాన్వితి | 2. ఏకత |
| 3. కథాదిలో భయానక రసం | | 3. క్లుప్తత |
| 4. కథా గర్భంలో కరుణ రసం | | 4. శైలీ రమ్యత |
| 5. కథాంతంలో అద్భుత రసం | | 5. క్రియాశీలత |
| | | 6. రూపం |

7. వస్తువు
8. వీలుంటే కల్పన

మొత్తం మీద కథానిక లక్షణాలు ఇవి.

ఎ. సంక్షిప్తత బి. ఏకాంశవ్యగ్రత సి. నిర్భరత డి. స్వయం సమగ్రత ఇ. ప్రతిపాద్య ప్రవణత ఎఫ్. సంవాద చాతుర్యం 1. వస్తువు 2. పాత్రలు 3. సంవాదాలు 4. వాతావరణం 5. భాష , శైలి 6. ఉద్దేశం.

పైన పేర్కొన్న కథా లక్షణాలన్నీ సర్వ సంపూర్ణంగా కలిగి సంక్షిప్తంగా, సమగ్రంగా నడవ సాగే రచనా ప్రక్రియ కథానిక.

**15.8.1 సంక్షిప్తత :** సంక్షిప్తంగా వుండటం కథానిక ప్రధాన లక్షణం. వస్తువులోనూ, సంఘటనల్లోనూ, పాత్రల్లోనూ, సంవాదాల్లోనూ విస్తృతి లేకుండా సాధ్యమైనంత తక్కువలో కథను తీర్చిదిద్దాలి. కథ కూడా అనవసరమైన విషయాల జోలికి పోకుండా చాలా సంగ్రహంగా కథను నడిపించాలి. ప్రతి ఒక్క విషయం ప్రయోజనాత్మకంగా వుండే విధంగా రచయిత జాగ్రత్త పడాలి. నవలలాగా కథానిక విశాలమైంది కాదు. నవల్లోలాగా రచయిత తీరికగా, విస్తారంగా చెప్పడానికి వీల్లేదు. కథానిక రచయితకు చాల సంయమన శక్తి తప్పనిసరిగా అవసరం. అందుకే విమర్శకులు నవల రాయడం సులువు. కథానిక రాయడం కష్టమన్నారు. కథానిక రాయడానికి కథకుడు చాల కష్టపడాలి.

**15.8.2 ఏకాంశవ్యగ్రత :** దీనినే వస్త్వైక్యం అని అంటారు. మొత్తం కథ అంతకు ఒకే ప్రధానాంశం లక్ష్యంగా వుండాలి. ప్రారంభంలో కథకుడు ఏ విషయం మీద ప్రధానంగా దృష్టిపెడతాడో అదే విషయాన్ని ముగింపుకు తీసుకొని వెళ్ళాలి. అక్కడక్కడ ఇతర విషయాలు వచ్చేటపుడు ప్రధాన విషయాలు మరుగున పడిపోకుండా కథకుడు చూసుకోవాలి. కథకుడు ఏకాంశానికి ప్రాధాన్యం ఇవ్వాలి. కథకుడు కథను ఏ విధంగా వ్రాసినా, రచయిత తన లక్ష్యం మీద మాత్రమే దృష్టి ఉంచి కథను నడిపించాలి. లేకపోతే ఆ కథ మంచి కథ అవదు.

**15.8.3 నిర్భరత :** కథానిక చదివేటప్పుడు రెప్పపాటు కానీ, రాయునప్పుడు మన మనస్సుకు ఏమరుపాటు కాని రాయనీయని లక్షణం నిర్భరత అవుతుంది. కథానిక చెప్పేటప్పుడు మనస్సులో మరో అంశానికి చోటు ఇవ్వకుండా నిర్భరత కలిగి ఉండాలి. మనస్సు అటూ ఇటూపోతే కథ కూడా స్థిరంగా వుండదు. ముఖ్యంగా పాఠకునికి విసుగు కలుగుతుంది. అంచేత కథాంశం మీద కథకుడు నిలబడాలి. అప్పుడే ఆ కథ మంచి కథ అవుతుంది. అప్పుడే కథకుడు మంచి కథకుడు అవుతాడు.

**15.8.4 స్వయం సమగ్రత :** కథలోని వస్తువు దానికదే సమగ్రంగా వుండాలి. అవసరమైందేదో కొరవడినట్లు కానీ, అనవసరమైంది చోటు చేసికొన్నట్లు గానీ సహృదయ పాఠకునికి అనిపించకూడదు. ఇక్కడ కథకుడు చాల జాగ్రత్త వహించాలి. అప్పుడే ఆ కథను సహృదయ పాఠకుడు చదువుతాడు.

**15.8.5 ప్రతిపాద్య ప్రవణత :** ప్రతిపాదించ దలచుకొన్న అంశాన్ని దృష్టిలో పెట్టుకొని దాని వికాసానికి అనుగుణంగా రచన సాగించాలి.

**15.8.6 సంవాద చాతుర్యం :** సంభాషణ రూపంలో సాగే వాక్యాలు ఒకానొక ప్రధానాంశాన్ని ఆవిష్కరించేటట్లుగా వుండాలి. ప్రతీ సంభాషణ కథకు ప్రయోజనం కలిగించే విధంగా వుండాలి. కథకుడు తన బహుముఖ ప్రజ్ఞా పాండిత్యంతో సంవాదాల్ని నైపుణ్యంతో నడిపించాలి. అసలు కథకుని సత్తా అంతా ఇక్కడే బయలు పడుతుంది. కథానికలో కథంతా సంభాషణల ద్వారా జరగదు. అవసరమైనప్పుడే కథకుడు సంభాషణల్ని ప్రవేశపెడతాడు. కథలో సంభాషణలు క్లుప్తంగా, నిత్యజీవిత వ్యవహారానికి దగ్గరగా వుండాలి. ఇందులో భాష సరళంగా సుందరంగా వుండాలి. కథకుడు భాష శైలి విషయంలో కూడా జాగ్రత్త వహించాలి. కష్టమైన పదాలతో, అర్థం కాని వాక్యాలతో కథ వుండకూడదు. ముఖ్యంగా కథలో ప్రజా జీవనం ప్రతిబింబించాలి.

పైన చెప్పిన లక్షణాలన్నీ దృష్టిలో పెట్టుకొని కథకుడు కథానికను రాయాలి. ఇందులో ఏ ఒక్క దానిని ఉపేక్షించినా కథ

రక్తికట్టదు. కథకుడు ఈ లక్షణాల్ని దృష్టిలో పెట్టుకొని కథ రాస్తే ఆకథ మంచి కథ అవుతుంది. ఆ కథకుడు మంచి కథకుడు అవుతాడు.

## 15.9 కథానిక - ఆవిర్భావ వికాసాలు:

తెలుగు కథ గురజాడ వారి "దిద్దుబాటు"తో ప్రారంభమైంది. 1910లో అప్పారావు గారు "దిద్దుబాటు" కథను "ఆంధ్రభారతి"లో ప్రచురించారు. మొదటగా ఈ కథను గ్రాంథిక భాషలో వ్రాశారు. తర్వాత వ్యవహారిక భాషలోకి దాన్ని మార్చారు. ఈ కథలో కథానిక లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. తెలుగు కథా సాహిత్యంలో 'దిద్దుబాటు' కథే మొదటిది. ఇందులోని కథ సమాజ జీవితానికి ప్రతిబింబం. వేశ్యా వ్యామోహంలో పడిన ఒక గోపాలరావునకు అతని భార్య కమలిని మెత్తగా చాలా చక్కగా బుద్ధి చెప్పుతుంది. తన భర్త పక్కదారిలో పడి చెడిపోయినపుడు అతనిని సన్మార్గం వైపు నడిపించే మంచి భార్య కథ ఇది. అంచేతనే అప్పారావు గారు ఈ కథకు 'దిద్దుబాటు' అనే పేరు పెట్టారు. సాన పట్టిన వజ్రం గురజాడ "దిద్దుబాటు". తెలుగులో మొట్టమొదటి కథ రాయడమేకాక, కథకు పేరు పెట్టటంలో కూడా అప్పారావు గారు కృతకృత్యులైనారు. రావు గారు పెద్ద మసీదు, మీపేరేమిటి?, మెటిల్డా, సంస్కర్త హృదయం అనే కథల్ని రాసి తెలుగు కథా రచయితలకు మార్గదర్శి అయ్యారు.

ప్రారంభంలో తెలుగు పత్రికల్లో కథలు ప్రచురింపబడ్డాయి. ఆంధ్రభారతి, త్రిలింగ, సువర్ణ రేఖ మొదలైన పత్రికలు కొన్ని కథల్ని ముద్రించాయి. "సువర్ణరేఖ" పత్రికలో పానుగంటి లక్ష్మీనరసింహారావు కథలు ప్రచురించబడ్డాయి. ఈ కథలే 1913లోనూ, 1915లోనూకథా సంపుటాలుగా వెలువడ్డాయి. దొంగ టెలిగ్రాం, విచిత్ర సమావేశం లాంటి మంచి కథలు పానుగంటి వారు రాశారు. చిలకమర్తి లక్ష్మీ నరసింహంగారు రాజస్థాన్ కథావళి అనే పేరుతో కథలు వ్రాశారు. మాడపాటి హనుమంతరావు గారు 1915లో కథాసంపుటి ప్రచురించారు. ఇందులో రుద్రమదేవి, హృదయ శల్యం అనే కథలు చోటు చేసుకున్నాయి. "సాహితి" అనే పత్రికలో అనేక కథలు ప్రచురింపబడ్డాయి. తల్లా వజ్ఝల శివ శంకర శాస్త్రి మరాఠి కథలు, మదరాసు కథలు, నీలకంఠం కథలు మద్రించారు.

చింతాదీక్షితులు కథకుడుగా సిద్ధహస్తుడు. కిష్కింధలో కోతి, దాసరిపాట, చెంచు రాణి, ముద్దు, శంపాలత, మొదటి బహుమానం, గోదావరి నవ్వింది, శ్యామల, శరబాల, లీలా సుందరి, గోపీ మోహిని మొదలైనవి వీరి ఉత్తమ కథలు. బాహ్య ప్రకృతిని, బాల్య చేష్టలనూ, ప్రణయంలో భాధల్ని, విరక్తిని చింతా దీక్షితులు బాగా వర్ణించారు.

తెలుగుదనం పుట్టిపడేలా కథలు వ్రాసిన మంచి కథకుడు శ్రీ పాద సుబ్రమణ్యా శాస్త్రి. వీరి కథలకు ఒక ప్రత్యేకత ఉంది. వీరు బ్రాహ్మణ కుటుంబాల్లో వితంతువుల వివిధ వ్యధల్ని. హరిజన సమస్యల్ని, నిరుద్యోగ సమస్యల్ని చాలా చక్కగా వివరించారు. వీరికి ఆంధ్రాభిమానం ఎక్కువ. సంస్కార దృష్టి అపారంగా ఉంది. వీరు మొదటగా 'పూలదండ' అనే కథా సంపుటిని ప్రచురించారు. వీరి కథలు ఆంధ్రప్రతిక, ప్రచారాంధ్ర లాంటి పత్రికల్లో ముద్రించబడ్డాయి. వడ్లగింజలు, గులాబీ, అత్తమ్మ, తాపీమేస్త్రీ, రామదీక్షితులు, ఇల్లు పట్టిన వెధవాడపడుచు బి.ఏ , కలుపు మొక్కలు, కీలెరిగిన వాత, అరికాళ్ల కింద మంటలు మొదలైనవి మరచిపోలేని మంచి కథలు. ఆయన వ్రాసిన ప్రతి కథా ఆణి ముత్యమే.

శ్రీ పాద సుబ్రమణ్యా శాస్త్రి కథానికలలో పాత్రల వైవిధ్యం ఎక్కువ. సాంప్రదాయక కుటుంబ జీవితంలోని రకరకాల వ్యక్తులే శాస్త్రి గారి కథా పాత్రలు. వారు సృష్టించిన పాత్రలలో సనాతనాచార పరులై సంస్కార భావాలను వ్యతిరేకించే తండ్రులూ ఉన్నారు, సంఘ సంస్కారానికి నడుం కట్టిన తండ్రులూ, ప్రోత్సహించిన తల్లులు ఉన్నారు. కుమార్తెలు, కుమారులు, ఆడపడుచులు, అత్తగార్లు, అల్లుళ్ళూ, కోడళ్ళూ, మామగార్లూ, మరుదులూ, మరదళ్ళూ, తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ, అమ్మమ్మలు, నాయనమ్మలు రకరకాల వారున్నారు. శాస్త్రి గారి కథా పాత్రలన్నీ సజీవ పాత్రలే.

ఆంధ్రలోకానికి ఆధునిక కాళిదాసుగా పరిచితులైన కవి కొండల వెంకటరావు గారు కథా చక్రవర్తిగా సుప్రసిద్ధులు. తోలుబొమ్మలు, మట్టెల రవళి, కల-కళ్లు, ముగ్గుల రథం, సమనోహ్లాదిని లాంటి కథా సంపుటాలు వెలువరించారు. ఆయన రాసిన కథల్లో 'కంఠధ్వని'

మంచి కథ, పామర జీవనంలోని తీరు తెన్నులు నిశితంగా పరిశీలించి చక్కని వ్యవహారిక భాషలో ఆయనకథలు వ్రాశారు. ఆయన వ్రాసిన 'జమిందారు' కథ మారుతున్న సమాజాన్ని ప్రతిబింబించే చక్కని కథ.

నోరి నరసింహశాస్త్రి గారు భార్యా, భర్తల సరాగాల్ని, ప్రణయాన్ని, ప్రణయ కలహాన్ని వర్ణించడంలో ఆరి తేరినదిట్ట. వీరు వ్రాసిన శ్యామ సుందరుడు, గులాబి పువ్వు, గాన భాగం, భవిష్యత్తు మంచి కథానికం. నోరి నరసింహ శాస్త్రి గారు దాంపత్య జీవనంలోని మధురానుభూతుల్ని కథలుగా తీర్చిదిద్దారు.

చలం గారి భాష తెలుగు వచనానికి కొత్త ఒరవడిని చేకూర్చింది. గుడిపాటి వెంకటాచలం గారి కలం కేకలూరింది. చలం గారి కథలు సమాజాన్ని ఉగ్రూతలూగించాయి. తెలుగు కథా సాహిత్యంలో చలం గారికి ప్రత్యేక స్థానముంది. చలం భాష, శైలి శక్తివంతమైయింది. వీరి " ఓ పువ్వు పూసింది'' చెప్పుకోదగ్గ కథ. పాపం, కన్నీటి కాలువ, ఆత్మార్పణ, ఆరాత్రి స్టేషనుపంపు, అదృష్టం, కళ్యాణి అట్లపిండి, ఆమె పెదవులు, ఆ రాత్రి నాయుడు పిల్ల, నేను మా ఆవిడ మిగిలాం, బోగం మేళాం, మాదిగమ్మాయి, రసపుత్రులు, లంచం, హరిజన సమస్య మొదలైన కథలు వ్రాశారు.

చలం గారు కథాశిల్ప ప్రారంభకుడు, కథకుడిగా మొదటివాడు కాకపోయినా కథా శిల్పిగా మొదటివాడు. అంతకు ముందున్న కథకులెవ్వరు కథకు బలమైన శిల్పావసరాన్ని గుర్తించలేదు. సాధారణ కథ చెప్పుకుపోయారు. చలం పాత్రలు ఆవేశ పరంగా వుంటాయి. పాత్రల కంటే కథలు ప్రాధాన్యం అయినా మరపురాని పాత్రలు లేకపోలేదు. చలం కథలు, పాత్రలు, సమస్యలు అభూత కల్పనలు కావు. నిత్య సమాజంలో స్త్రీ ఎదుర్కొనే అనేకమైన సమస్యలకు రూపకల్పనలు. అందం, ధనం, అధికారం ఎరగా చూపించిన పురుషులు, వ్యవస్థ నెదిరించి తమ సర్వస్వం త్యాగం చేసిన ధీరులు, పై మెరుగులకు అస్థిరత్వంతో కూడిన అలోచనలకు అత్మార్పణ చేసి వంచితలైన స్త్రీలు, తన్ను మనసా కోరిన వ్యక్తి కొరకు తమ సర్వసం ధారపోసి, మురికిలో, దారిద్ర్యంలో కూడా ఏకాగ్రతతో అతణ్ణి సేవించిన సేవాశీలురైన స్త్రీలు, సంఘాన్ని, న్యాయాన్ని, వ్యవస్థను ఎదిరించిన ధీరులు, సంఘానికి, న్యాయానికి, వ్యవస్థకు బలియై తలవంచిన బలహీనులు చలం కథలోని పాత్రలు.

మొక్కపాటి నరసింహ శాస్త్రి గారి రచన ముద్దుగా వుంటుంది. వీరు చిత్తరువు, శిల్ప ద్వయం లక్ష్మీ మొదలైన కథల్ని వ్రాశారు. ప్రతిబింబాలు, విన్నవి-కన్నవి అనేవి మొక్కపాటి నరసింహ శాస్త్రి గారి కథా సంపుటాలు.

వేలూరి శివరామశాస్త్రి గారు ఉద్దండ పండితుడు. వీరికి అనేక భాషల్లో పట్టు వుంది. కథా షట్కం, కథాసప్తకం అనే పేర్లతో వీరి కథా సంపుటాలు వెలువడ్డాయి. పండితులు కథ రాస్తే ఎలా వుంటుందో వేలూరి శివరామశాస్త్రి గారి కథలు చదివితే తెలుస్తుంది. వివిధ శాస్త్ర విజ్ఞానం, విశేష ప్రౌఢి వీరి కథల్లో కన్పిస్తాయి. ప్రతి కథానికా భావ పూర్ణమై పాత్ర పోషణతో భాసిస్తూ వుంటుంది. వీరు రాసిన "కృతి'' ఆదిమ మానవ యుగానికి చెందిన కథలు. "పద్మాక్షి'' వైదిక యుగ వాతావరణానికి సంబంధించిన, "తన్మయత''బౌద్ధ యుగ వాతావరణాన్ని చిత్రించిన కథ "ఓరియనా'' మహ్మదీయ యుగం నాటి రాజకీయ జీవితానికి అద్దం పట్టింది. 'నికల్ హైదరాబాద్' రజాకార్ల ఉద్యమానికి, అరాచకం జమీందారి బిల్లుకు, "నమశ్శివాయ'' దేవాదాయ చట్టానికి సంబంధించిన కథలు. పిత్తల్ కా దర్వాజా, చంద్రికలు, డిప్రెషన్, చెంబు, ఒకటే చీర వీరి కథల్లో ముఖ్యమైనవి. కథకు పేరు పెట్టటంలో, కథా ప్రారంభ, ముగింపుల్లో, సన్నివేశ కల్పనల్లో, పాత్రచిత్రణలో భాషలో శైలిలో వీరు ప్రదర్శించిన నైపుణ్యం శిల్పచాతుర్యం ఎన్నటికి మరచిపోలేం.

మహిళా రచయితుల్లో చెప్పుకోదగ్గ వారిలో కాంచవల్లి కనకాంబ, కనుపర్తి వరలక్ష్మమ్మ గారు ముఖ్యులు. కనకాంబగారు 'రాధ' అనే మంచి కథను రాశారు. "చక్కని కథలు'' అనే కథా సంపుటిని కూడా వెలువరించారు. వరలక్ష్మమ్మ గారు రెండే కోర్కెలు, పెన్షన్ పుచ్చుకున్న నాటి రాత్రి, ప్రణయ లేఖలు అనే కథలు వ్రాశారు. కట్టమంచి రామలింగారెడ్డి గారన్నట్టు వరలక్ష్మమ్మ గారి రచనలో "కటుత్వం లేని పటుత్వం, గర్వంలేని గాంభీర్యం, ఆడంబరంలేని ఆదర్శం'' ద్యోతకమవుతాయి. నీ ఋణం తీర్చుకొన్నా, ఏమి సంబంధం, మాక్లీదుర్గంలో కుక్క, జీవుడి ఇష్టం లాంటి కథలు వ్రాశారు. విశ్వనాథ సత్యనారాయణ చిన్నకథలు అనే పేరుతో ఒక సంపుటిని ప్రచురించారు.

అడవి బాపిరాజు అనేక మంచి కథల్ని వ్రాసి ప్రజా హృదయాల్ని దోచుకున్నారు. వీణ, ద్వేషం, సంధ్యా నృత్యం, వడగళ్లు, హిమాలయరశ్మి, తూలికా నృత్యం, నరుడు, శైల బాల, వసుబాలుడు, నంగమేశ్వరం, ఆశ్రుబంధువు, గాలి వాన, దీపావళి, నాగలి, నేల మెట్లు, లచ్చిమి, వాన, భోగీర లోయ లాంటి కథల్ని వ్రాశారు. కథా సాహిత్యంలో బాపిరాజు గారి పాత్రలకు ఒక విశిష్ట స్థానముంది. ఆయన పాత్రలు కళామూర్తులు, సర్వవిద్యా పరిపూర్ణులు, ప్రేమమూర్తులు, ప్రజ్ఞామూర్తులు. ఇంచుమించు రాజు గారి పాత్రలన్నీ ఉదాత్తంగా హుందాగా, గంభీరంగా వుంటాయి. స్త్రీ పురుష పాత్రలు ప్రబంధ నాయకుల్లాగ కన్పిస్తాయి. జీవితాన్ని కళలకు అంకితం చేసిన కళాతపస్వి బాపిరాజు గారు. ఆయన వలె పాత్రలు కూడా కళా పిపాసువులు.

ముని మాణిక్యం నరసింహారావు గారు దాంపత్య జీవితాన్ని రమ్యంగా చిత్రించారు. మంచి హాస్యాన్ని పోషించారు. ఆనాడు ముని మాణిక్యం కథలంటే విరగబడి చదివేవారు. చలం స్వేచ్ఛకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తే, నరసింహారావు సంసారంలోని అందాన్ని ఎత్తి చూపారు. వీరు "కాంతం" అనే పాత్రను సృష్టించారు. వీరి వాణి నాజూకుగా ఉంటుంది. గృహకృత్యాలు, భార్య భర్తల కీచులాటలు, కపట భక్తుల నటనలు హాస్య పూర్వకంగా వర్ణిస్తారు. వీరి కాంతం కథలు, నేను మాకాంతం, కాంతం-కైఫియల్ అనే కథానికా సంపుటాలు వెలువడ్డాయి.

కథల్లో సరసం, వాక్యచమత్కృతిని ప్రవేశ పెట్టి కథల్ని వ్రాసిన వారు మల్లాది రామకృష్ణ శాస్త్రి. మల్లాది వారు రసికులు. అంచేత వీరి రచనల్లో చమత్కారం తొంగి చూస్తుంది. కథా కథనం కమనీయంగా వుంటుంది. వీరు "తాతగారు" అనే పాత్రను సృష్టించారు.

దృక్పథంలో, భాషలో, శైలిలో, వస్తువులో, ఒకటేమిటి అన్ని విషయాల్లోను తనకంటూ ప్రత్యేకతను సంతరించుకున్న మంచి కథకులు కొడవటి గంటి కుటుంబరావు. వీరి లేచిపోయిన మనిషి, చంద్రోదయం, విరాట్టు కొత్త జీవితం, ఆడజన్మ, మొండిగాడు, నిలువ నీరు మొదలైన అనేక కథల్ని వ్రాశారు. జన జీవితాన్ని తన కథల్లో ప్రతి ఫలించే విధంగా కథల్ని వ్రాశారు.

శిల్పంలోను, వస్తువులోనూ, కథా కథనంలో అందె వేసిన చేయి గోపిచంద్. ధర్మవడ్డీ, భార్యల్లోనే వుంది, ధర్మాసుపత్రి, కొడుకులు, భార్యాభర్తలు, దేశం ఏమయ్యేట్టు, తండ్రులు మొదలైన ఎన్నో కథల్ని త్రిపురనేని గోపీచంద్ గారు వ్రాశారు.

"గాలి వాన" కథతో తెలుగు కథను అంతర్జాతీయ స్థాయికి తెచ్చిన మహానుభావుడు పాలగుమ్మి పద్మరాజు. మొదట ఈ కథను వీరు ఆంగ్లంలో వ్రాశారు. తర్వాత తెలుగులో వ్రాశారు. వీరు వ్రాసిన "పడవ ప్రయాణం" కథ కూడా ప్రముఖుల మన్నల్ని, ప్రశంశల్ని అందుకుంది.

శ్రీశ్రీ, నార్ల వెంకటేశ్వరరావు, జి.వి. కృష్ణారావు మొదలైన వారు అనేక కథల్ని వ్రాశారు.

మాండలికాలతో కమ్మని కథలు అల్లిన వారు మాధవ పెద్ది గోఖలే. స్మరణ, బల్లికట్టు పాపయ్య, శివరాత్రి తిరునాళకు, మూగ జీవాలు, అభిమానం, పాలెంలో బొమ్మలాట మొదలైన కథల్ని వీరు వ్రాశారు.

కరుణ కుమార్ పేరుతో అనేక కథలు ప్రచురించబడ్డాయి. తెలుగు పలుకుబడికి సాహిత్యంలో ఒక స్థానం కల్పించిన కథకుల్లో కరుణ కుమార్ ప్రముఖులు. ఇతడు కథా కథన శిల్పంతో ఆరితేరినదిట్ట. వీరి కథల్లో కయ్యా-కాలువ, టార్చిలైటు, బిళ్ళల మొలతాడు, రిక్షావాలా మొదలైనవి ముఖ్యమైనవి.

ఇల్లిందుల సరస్వతి దేవి, కొమ్మూరి పద్మావతీ దేవి, ఎల్లా ప్రగడ సీతాకుమారి మొదలైన రచయితలు అనేక కథలు వ్రాశారు.

కలలో కార్చిన కన్నీరు, అడవి కాచిన వెన్నెల మొదలైన కథల్ని వ్రాశారు బుచ్చిబాబు. వీరి కథా కథన శిల్పంలో ఆరితేరిన వారు. బుచ్చిబాబు పై ఫ్రాయిడ్ వైజ్ఞానిక శాస్త్ర ప్రభావం బాగా కన్పిస్తుంది.

కథలు అనగానే మనకు గుర్తుకు వచ్చే మంచి కథకుడు రావిశాస్త్రి. వీరు ఆరుసారాకథలు మెరుపు మెరిసింది, తెల్లచీర, వేతన శర్మ జరీ అంచు మొదలైన కథల్ని వ్రాశారు. ఈ కథల్లో అనేక ప్రత్యేకతలు వున్నాయి. అందులో ఒకటి విశాఖ మాండలీకం. వీరి

భాషా శైలి సరళంగా, సుందరంగా వుంటుంది. తెలుగు సాహిత్యంలో లోకోత్తర విశేషాన్ని సాధించినవారు రాచకొండ విశ్వనాథ శాస్త్రిగారు. కథా సాహిత్యానికి ఈయన నిజంగా విశ్వనాథుడే. రాశిలోను, గుణంలోను ఈయన కావించిన సృష్టి పరిశీలించినప్పుడు విశ్వకథా సాహిత్యంలో ఏ ఒక్క రచయిత అయినా కథానికకు అన్ని గుణ విశేషాలు ఆపాదించాడా? అన్న ప్రశ్న కలుగుతుంది. కమిట్‌మెంట్ లేకుండా వ్రాసిన 'కార్నర్ సీటు' కథలో ఎంత మానవతా భావం వ్యక్తమౌతుందో, అది వున్న కథల్లో అంతగా మానవ శ్రేయస్సును అభిలషించారు. ఈ వ్యవస్థ మారి బాగుపడితే ఎంత బాగుండు అన్న భావాన్ని జరీ అంచు తెల్ల చీర కథ ద్వారా కలుగజేశారు. "పిపీలకంతో" విప్లవం బోధింపజేశారు.

"కాళీపట్నం రామారావు" గారు భయం, యజ్ఞం అనే మంచి కథల్ని వ్రాశారు. జీవన వేదన కథల్లో కనిపిస్తుంది. కాళీపట్నం రామారావు గారి రచనలో ఎంతో నిరాడంబరత, సంయమనం, నిజాయితీ, సాదాతనం వుంటాయి. కాని కథకు ఈయన సాధించిన ప్రభావ విశేషం ఎంత గొప్పదో మాటలతో చెప్పలేము. సముద్రంలో బడబాలనంలా, కట్టెలో నిప్పులా ఈ వ్యవస్థలోనే తిరుగుబాటు ఇమిడి వుంది. అద్వితీయత వీరు కథనంలో సాధించిన విశేషం. మన సామాజిక వ్యవస్థను వీరు దర్శించి, కథల్లో ఆవిష్కరించిన తీరు మానవ చరిత్రలో అక్టోబరు విప్లవమంత గొప్పది. రచనలో ప్రయత్న పూర్వకంగా వట్టి పోడిమి వీరి కథలలో గోచరమవుతుంది.

చాగంటి సోమయాజులు గారు అనేక మంచి కథల్ని రాశారు. వీరి కథల్లో ఉత్తరాంధ్ర యాస చాల స్పష్టంగా కన్పిస్తుంది.

"చాసో దర్శనా నైశిత్యం అపురూపమైందీ, జీవిత వైమర్శికాదృష్టి తీక్షణమైనదీను, రాసిన ప్రతి కథ దేనికదే ప్రత్యేకం. ఒక్కొక్క కథ ఒక్కొక్క రకం. ఒక్కో కథలో ఒక్కో జీవన సత్యం తొణికిసలాడుతుంది. దారిద్ర్యం, దోపిడి, అసమానత్వం, అన్యాయం, అక్రమం, అహంకారం, దురాచారం, సమాజగతమైన మౌఢ్యం" ఇవన్నీ కథలకి ముడి సరుకే.

తెలుగు కథానిక సాహిత్యాన్ని రాస్తున్న వారిలో స్త్రీలలో చెప్పుకోదగ్గ వాళ్లు చాల మంది వున్నారు. ఇల్లిందుల సరస్వతీదేవి, లత ప్రయోగశీలి కాగా, రంగనాయకమ్మది సామ్యవాద విప్లవధోరణి. కె.రామలక్ష్మి, వాసిరెడ్డి సీతాదేవి, ద్వివేదుల విశాలాక్షి మొదలైన వారు ప్రముఖ కథానిక రచయిత్రులు.

నేడు చాలా మంది కథకులు ఉద్యమాల రూపంలో కథలు రాస్తున్నారు. దళితవాదం, స్త్రీ వాదం అనే ఉద్యమాలకు సంబంధించి అనేక కథలు వస్తున్నాయి. ప్రస్తుతం తెలుగు కథ సంపూర్ణంగా, సాంఘికమై నిర్మాణ శిల్ప రహస్యాలని ఆవిష్కరిస్తూ వ్యక్తి దృష్టిని సమిష్టి ప్రయోజనాల వైపు మళ్ళించి విలువల పోరాటంలో రాటు దేలుతుందని చెప్పవచ్చు. ఈ విధంగా తెలుగు కథా రచయితలు తమ తమ కథలలో సమకాలీన సమాజ పరిస్థితులని ప్రతిబింబిస్తూ తెలుగు కథను ఉన్నత శిఖరాల వైపు తీసుకెళ్ళారు.

1910లో దిద్దుబాటుతో ప్రారంభమైన తెలుగు కథ 1940 నాటికి ప్రౌఢదశకు చేరుకొని 1952 వరకు అనూహ్యమైన మార్పులతో అంతర్జాతీయ కీర్తిని అందుకొని, 1965 వరకు తన కీర్తిని విశ్వ వ్యాప్తం చేసింది. 1965 తరువాత 1990 వరకు దాదాపు మూడు దశాబ్దాలు తెలుగు కథానిక పాత వైభవం వల్ల, కొంత వరకు కొత్త నాణ్యత వల్ల వర్థిలుతుంది.

పోలా ప్రెగడ సత్యనారాయణ మూర్తి తెలుగు కథా సాహిత్యాన్ని నాలుగు రకాలుగా విభజించారు.

1. 1910 - 1940 - తొలిదశ
2. 1940 - 1952 - మహోన్నత దశ
3. 1952 - 1965 - ఉజ్జ్వల దశ
4. 1965 - 1992 - మిశ్రదశ

## 15.10 కథానిక - భేదాలు :

తెలుగు సాహితీ లోకాన్ని నేడు కథ ఏలుతుందనడంలో అతిశయోక్తి లేదు. విశ్వనాథ, గురజాడ, శ్రీపాద, చలం, కొడవటిగంటి,

దీక్షితులు, తిలక్, పాలగుమ్మి, అడవి, బుచ్చిబాబు, గోపిచంద్, బలివాడ, చా.సో, వేలూరి, ముని మాణిక్యం, సుదర్శనం, ఇనాక్, రావిశాస్త్రి, వంగపండు మొదలైన కథానిక రచయితలు తమ కథలతో విశ్వ సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

తెలుగులో అనేక కథానికలు వచ్చాయి. వాటిని నిశితంగా పరిశీలిస్తే ఈ విధంగా చెప్పవచ్చు.

1. సాంఘిక కథలు
2. చారిత్రక కథలు
3. పౌరాణిక కథలు
4. రాజకీయ కథలు
5. కాల్పనిక కథలు
6. ఆర్థిక కథలు
7. జాన పద కథలు
8. మనో విశ్లేషణ కథలు
9. వైజ్ఞానిక కథలు
10. చైతన్య ప్రవంతి కథలు
11. కళారంగ కథలు
12. విమర్శ కథలు
13. అనువాద కథలు
14. సాహిత్య కథలు
15. జీవిత చరిత్ర కథలు
16. స్వీయ చరిత్ర కథలు
17. జాతీయ సమైక్య కథలు
18. అపరాధ పరిశోధన కథలు
19. విప్లవ కథలు
20. సంఘ సంస్కరణ కథలు
21. హేతువాద కథలు
22. అదిక్షేప కథలు
23. పునర్జన్మ కథలు
24. ఆస్తిత్వ కథలు
25. సామ్యవాద కథలు
26. దెయ్యాల కథలు
27. సారా కథలు
28. అత్తగారి కథలు
29. పోలీసు కథలు
30. ఆత్మ కథలు
31. దేశభక్తి కథలు
32. తాత్విక కథలు
33. ఆధ్యాత్మిక కథలు
34. స్త్రీ కథలు
35. స్త్రీ వాద కథలు
36. వరకట్న కథలు
37. దళిత కథలు
38. దళితవాద కథలు
39. హాస్య కథలు
40. శృంగార కథలు
41. కరుణ కథలు
42. నీతి కథలు
43. బాలల కథలు
44. ప్రేమ కథలు
45. వేట కథలు
46. రిక్షావాలా కథలు
47. కార్మిక కథలు
48. డైరి కథలు
49. నిరుద్యోగ కథలు
50. లేఖన కథలు
51. మణి కథలు
52. మినీ కథలు
53. పోరాట కథలు
54. వ్యంగ్య కథలు
55. కథలో కథ కథలు
56. కార్టూన్ కథలు
57. కులాంతర ప్రేమ కథలు
58. స్త్రీ, పురుష సంబంధ కథలు
59. ప్రకృతి భీభత్స కథలు
60. అధికార్ల సంబంధ కథలు
61. దుండగుల కథలు
62. సంస్కరణ కథలు
63. మాండలిక కథలు
64. వినోదాత్మక కథలు
65. వేశ్యా కథలు

మొదలైన రకరకాల భేదాలతో తెలుగులో అనేక కథానికలు వచ్చాయి. అంతే కాకుండా ఈ కథానిక సాహిత్యం ఈనాడు ఎంతగానో పరిణతి చెందింది.

## 15.11 సారాంశము:

నవల, కథానికలు ఒక ప్రత్యేకమయిన ప్రతిపత్తి గలిగిన వాఙ్మయ ప్రక్రియలు. ఇవి ఆంగ్ల సాహిత్య ప్రభావం వలన తెలుగులోకి ప్రవేశించాయి. ఇంగ్లీషులో నావెల్ అనే పదానికి సమానార్థమైన నవల 1872లో మొట్ట మొదటిసారి ప్రచురించబడింది. రచయిత నరహరి గోపాల క్రిష్ణమ చెట్టి గారు. నవల పేరు శ్రీ రంగ రాజ చరిత్ర. 1878లో వీరేశలింగం గారు రాజశేఖర చరిత్రను రచించారు. ఆ తరువాత నవల ఒక రచనా ప్రక్రియగా విశేష ఆదరాన్ని పొందింది. తెలుగు నవల చరిత్రను ప్రారంభ యుగం, అనువాద యుగం, వికాస యుగం, మనో వైజ్ఞానిక యుగం, సమకాలీన యుగమని ఐదు విధాలుగా వర్గీకరించారు. సాంఘిక, చారిత్రక, పౌరాణిక, రాజకీయాది పన్నెండు నవలా భేదాలను గుర్తించవచ్చు. కథానిక కూడా ఆధునిక సాహిత్య ప్రక్రియే. దీనిని చిన్న కథ అని కూడా పిలుస్తారు. సంక్షిప్తత, నిర్భరత, స్వయం సమగ్రత వంటి లక్షణాలు కథానికకు ఉంటాయి. తెలుగులో కథానికకు మూల పురుషుడు గురజాడ అప్పారావు గారు. వీరు 1910లో వ్రాసిన "దిద్దుబాటు" మొట్టమొదటి కథానిక.

## 15.12 మాదిరి ప్రశ్నలు:

1. నవలా లక్షణాలను సోదాహరణంగా వివరించండి.
2. తెలుగు నవల వికాసాన్ని, ఆవిర్భావాన్ని, నవలలోని భేదాలను వివరించండి.
3. కథానిక ఆవిర్భావ వికాసాలు, కథానికలోని భేదాలు వివరించండి.

## 15.13 ఆధార గ్రంథాలు:


వెలదలి నాగ భూషణ శర్మ - తెలుగు నవలా వికాసం
అక్కిరాజు రామాపతిరావు - తెలుగు నవల సామాజిక దృక్పథం
నిడుదవోలు వేంకటరావు - ఆంధ్రవచన వాఙ్మయం
కాకర్ల వేంకట రామ నరసింహం - సాహిత్య దర్శనము
బొడ్డపాటి వేంకట కుటుంబరావు - తెలుగు నవలా సాహిత్యం
పుల్లాబొట్ల వేంకటేశ్వర్లు - తెలుగు నవలా సాహిత్య వికాసం
పోరంకి దక్షిణామూర్తి - తెలుగు కథానిక స్వరూప స్వభావములు
అందాల తెలుగు కథ - కథా రచయితల సమ్మేళనం, ప్రత్యేక సంచిక
తెలుగు కథారచయితలు - సాహిత్య అకాడమి
మహతి - వ్యాస సంపుటి, యువ భారతి
ప్రాసంగిక వ్యాసావళి - గుజ్జర్లమూడి కృపాచారి, జ్యోతి స్వరూప రాణి.

పాఠం - 15.1

# వ్యాసం

## పాఠ్యాంశ నిర్మాణ క్రమం


15.1.1 ఉపోద్ఘాతం

15.1.2 వ్యాసం ఆవిర్భావం

15.1.3 వ్యాస లక్షణాలు

15.1.4 వ్యాసం ఆవిర్భావ వికాసాలు

15.1.5 వ్యాసం - భేదాలు

15.1.6 సారాంశం

15.1.7 మాదిరి ప్రశ్నలు

15.1.8 ఆధార గ్రంథాలు


## 15.1.1 ఉపోద్ఘాతం:

ఆధునికాంధ్ర సాహిత్యం ఎక్కువ భాగం ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్లే వచ్చింది. ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల అనేక నూతన ప్రక్రియలు వచ్చాయి. ఈ ప్రభావం ఆంధ్ర వాఙ్మయంలో వచన వాఙ్మయం మీద ఎక్కువగా వుంది. వచన వాఙ్మయ ప్రక్రియల్లో వ్యాసం ప్రధానమైనది. ఇది ఇతర సాహిత్యాల్లోలాగానే తెలుగు సాహిత్యంలో కూడా ఒక ప్రత్యేకమైన, ఒక సుస్థిరమయిన స్థానాన్ని సంపాదించుకుంది. తెలుగు సాహిత్యంలో వ్యాసం యొక్క తీరుతెన్నులు ఇంచుమించు ఆంగ్లంలో ఉన్నట్టే కన్పిస్తాయి.

వ్యాసం ఆంగ్లాంధ్ర సాహిత్యాల్లో వచనం పటిష్ఠంగా రూపొందగా ఏర్పడ్డ ప్రక్రియ. అందువలననే వ్యాసం ఉత్తమ వచన నేపథ్యం కలిగి వుంటుంది. బుద్ధి జన్య వచనం, హృదయ జన్య వచనం రెండూ కలిసినదే వ్యాసం.

ఆంగ్ల వ్యాసం ప్రక్రియాంతర్గత వైవిధ్యం, ఈ ఆంధ్ర వ్యాస పరిణామ భాగంగా స్పష్టమవుతుంది. వ్యాస లక్షణాలకు ఉన్నట్లుగా భావించబడుచున్న పూర్వం కొద్ది రచనలు మాట అలా వుంచితే ఆంగ్లంలో 400 ఏళ్ళ నుంచి, ఆంధ్ర సాహిత్యంలో నూట పదేళ్ళ నుంచి వెలువడుతున్న వీటి ప్రారంభం పరిణామం ఒకే రీతిగా వున్నట్లు మనం గమనించవచ్చు. సంఘ చైతన్యం, ధర్మబోధ, సంస్కరణ వాంఛ ఆంగ్లాంధ్ర ప్రారంభ వ్యాసాల్లో ప్రదర్శింపబడినా వాటి ఆత్మా ఆవిష్కరణా భిన్నమే. ఆంధ్ర సాహిత్యంలో ఉత్తమ వ్యాసాలు అనేక మంది వ్రాసిన వారు ఉన్నారు. ఈ వ్యాస ప్రక్రియ తెలుగులో ఎక్కువగానే వచ్చింది. పరవస్తు, సామినేని, కందుకూరి, గురజాడ, గిడుగు, పానుగంటి, మొక్కపాటి, కామరాజు, చిలుకూరి, ముట్నూరి, సురవరం, కట్టమంచి, రాళ్ళపల్లి, పింగళి, మల్లంపల్లి, భమిడిపాటి, ఖండవల్లి, చలం, తాపీ, శ్రీశ్రీ, చెళ్ళపిళ్ళ, నార్ల, తిరుమల, బుచ్చిబాబు, బాపిరాజు, కాటూరి, కాడవటిగంటి, కార్లపాటి, ఇనాక్ మొదలైన వారు అనేక వ్యాసాలు వ్రాసి తెలుగు వ్యాస ప్రక్రియకు వైవిధ్యాన్ని, వైచిత్ర్యాన్ని, వైశిష్ట్యాన్ని సంపాదించి పెట్టారు.

వ్యాస ప్రక్రియ తెలుగు సాహిత్యంలో మొదట్లో ఆ పేరుతో ప్రచారంలో లేదు. వ్యాస ప్రక్రియను ప్రథమాంధ్ర వ్యాసకర్త అయిన ముత్తు నర్శింహనాయుని గారు "ప్రమేయం" అని, పరవస్తు వెంకటరంగాచార్యులు గారు "సంగ్రాహం" అనీ, నోరి వారు "వచన కావ్యం" అనీ, వీరేశలింగం గారు "ఉపన్యాసం" అని తమ తమ వ్యాసాలకు పేర్లు పెట్టారు. ఈ వ్యాస ప్రక్రియ దినదినాభివృద్ధి చెందుతూ గురజాడ కాలం నాటికి ఇది వ్యాసంగా వ్యాప్తి లోనికి వచ్చింది.

## 15.1.2 వ్యాసం - ఆవిర్భావం:

వ్యాసం అనే పదం ఆంగ్లంలోని 'Essay' అనే మాటకు సమానార్థకంగా తెలుగులో వాడుతున్నారు. ప్రపంచంలో మొట్టమొదట వ్యాసాన్ని '1571'లో ఫ్రెంచి రచయిత అయిన "మౌంటెన్గ్" వ్రాశారు. తాను వ్రాసిన వచన రచనకు ఫ్రెంచి భాషలో 'ఎస్సె' అను పేరు పెట్టాడు. ఈ పదానికి 'ప్రయత్నము, పరిశీలన' అనే అర్థాలున్నాయి.

ఈ ఫ్రెంచి పదమే ఇంగ్లీషులో 'Essay'గా స్థిరపడింది. 1885లో బహుజనపల్లి సీతారామాచార్యులు గారి 'శబ్ద రత్నాకరము'లో వ్యాసాన్ని గురించి చెపుతూ "విరివిగా ఏదేని ఒక విషయాన్ని గూర్చి వ్రాయడం" అని అర్థం ఇచ్చాడు. సంస్కృతంలో వ్యాసం అంటే విస్తార, విగ్రహం అని అర్థాలున్నాయి. నిఘంటువులని బట్టి చూస్తే "ఏదైనా ఒక విషయాన్ని గూర్చి స్పష్టంగా, సమగ్రంగా విషయ విభజనంతో రాయడం" అని అర్థం. అంతే కాకుండా వ్యాసాన్ని గురించి "ఏదేని యొక చరిత్రాంశము" అని "ఆంధ్ర వాచస్పత్యం", "ఏవిషయంనైనా తెలుసుకొని దాని యందలి అంశములను విభజించి, వివరించి చెప్పుట వ్యాసమని చెప్పవచ్చును". అని "భాషా సమితి విజ్ఞాన సర్వసం" చెప్పిన అర్థాలు కూడా అసమగ్రంగా ఉన్నాయి.

వ్యాసం అంటే వివరించి చెప్పడం అని అర్థం. అంతేకాకుండా వ్యాసాన్ని విషయ ప్రధానమయిన వచన ప్రక్రియగా చెప్పవచ్చు. స్పష్టతకు తావిస్తూ, విషయాన్ని వివరిస్తూ రచించే వచన ప్రక్రియ అయిన వ్యాసంలో విశ్లేషణకు కూడా ప్రాధాన్యం ఉంటుంది.

## 15.1.3 వ్యాస లక్షణాలు:

వ్యాసాన్ని గురించి అనేక మంది వ్యాస కర్తలు, విమర్శకులు ఇచ్చిన నిర్వచనాలుఏ ఒక్కటీ వ్యాస పూర్తి ధర్మం ప్రదర్శించేవిగా లేవు. వచన ప్రక్రియల్లో వ్యాసానికి ప్రముఖమయిన స్థానం ఉంది. విషయ ప్రకటనతో ఇది అనువైనదే కాకుండా ఇందులో వైవిధ్యం వుంటుంది. వ్యాసం వచన ప్రక్రియ కావడం వల్ల రచయిత తాను చెప్పదలచుకున్న విషయాన్ని ఈ ప్రక్రియల్లో వ్యక్తపరచినట్లు ఇతర ప్రక్రియల్లో వ్యక్తపరచలేడు. ఎంత గంభీరమయిన అంశాన్నయినా తేలికగా దీని ద్వారా చెప్పవచ్చును. అంతే కాకుండా తేలికయిన విషయాన్ని గంభీరంగా చెప్పడమే కాకుండా మనకు కావలసిన విధంగా ఈ ప్రక్రియను మలచుకొనే గొప్పతనం ఇందులో వుంది.

రచయిత ఏ వ్యాసాన్ని వ్రాయాలన్నా కొన్ని నియమాలు, సిద్ధాంతాలు, సూత్రాలను దృష్టిలో పెట్టుకొని వ్రాయాలి. రచయిత వ్యాసాన్ని ఎలా ఆరంభిస్తాడో అదే విధంగా ముగింపు ఉండటమే కాకుండా ఆ వ్యాసంలో నేర్పుతో, నైపుణ్యంతో తమ ప్రతిభా పాండిత్యాల్ని చూపినప్పుడే ఆ వ్యాసం మంచి వ్యాసమై, వ్యాస కర్త కూడా మంచి వ్యాసకర్త అవుతాడు. వ్యాసంలో దీర్ఘ సమాసాలు, దీర్ఘ వాక్యాలు వుండకుండా చిన్న చిన్న వాక్యాలతో సరళమైన భాషతో వుంటేనే అది మంచి వ్యాసంగా చదువుకొనటానికి పనికి వస్తుంది.

వ్యాసానికి కొన్ని ప్రధానమయిన లక్షణాలు ఉన్నాయి.

1. వ్యాసము అతి దీర్ఘము కలదిగా వుండకూడదు. వ్యాసం సంగ్రహంగా వుండాలి.
2. వ్యాసంలో చెప్పదలచుకున్న విషయం సముచిత విభాగాలుగా వుండాలి. దానికి శీర్షికలు కూడా పెట్టాలి.
3. వ్యాసంలో చెప్పదలచిన విషయం స్పష్టంగా వుండాలి.
4. వ్యాసంలో విషయాన్ని వ్రాసేటప్పుడు తగినట్లుగా ప్రత్యేకమయిన ఆకర్షణీయమయిన పుటల్లోనే ఇమిడి వుండాలి.
5. వ్యాసం నియతమయిన పుటల్లోనే ఇమిడి వుండాలి.
6. ఇందులోని భాష సరళంగా, సుందరంగా, సూటిగా వుండాలి.

ఇవే కాకుండా వ్యాసం ఉత్తమ వ్యాసంగా ఉండటానికి మరికొన్ని లక్షణాలున్నాయి. అవి

| | |
|---|---|
| 1. వచనత్వం | 5. హాస్యత్వం |
| 2. అవిశాలత్వం | 6. సృజనత్వం |

3. విశృంఖలత్వం 7. అసంపూర్ణత్వం
4. మిత్రత్వం 8. వ్యక్తిత్వం

**1. వచనత్వం:** వ్యాసానికి వచనత్వం లక్షణం ఉండటాన్ని వ్యాసకర్తలు, విమర్శకులు అంగీకరించారు. వ్యాసం వచన రచనగా ఉండటం కూడా ఒక లక్షణంగా అన్పించే అవకాశం ఉంది. వ్యాస రచన పద్యము రూపంలో జరిగి వుండకపోతే, ఈ లక్షణ సాధనం అనవసర ప్రయత్నం. ఎస్సె ఆఫ్ ఆంగ్ల సాహిత్యంలో బేకన్ కంటే పూర్వం కింగ్ జేమ్స్ రచించిన " ఎప్రెంట్రస్ ఇన్ ది డివైన్ ఆర్ట్ ఆఫ్ పోయిజి" 18వ శతాబ్దంలోని "ఎస్సె ఆన్ క్రిటిసిజం", 19వ శతాబ్దంలోని "ఎస్సె ఆన్ మైండ్" మొదలైన పద్య వ్యాసాలు ఆంగ్లంలో వ్యాసమన్న పదం ఎస్సె వచనరచనగా కంటే ప్రాచీనం గానీ వర్తమానాంగ్ల సాహిత్యాల్లోనూ ఏ సాహిత్యంలోనైనా వ్యాసం వచన ప్రక్రియ కావటమే ప్రసిద్ధము. వ్యాసుడి జీవితాన్ని వస్తువుగా తీసుకొని ఆ ప్రసిద్ధంగా తెలుగులో కొత్తపల్లి సుందర రామయ్య గారు "వ్యాస వ్యాసము" అనే పద్య వ్యాస రచన చేశారు. అయితే వ్యాసం పద్య సృష్టి కాదు కాబట్టి అది స్వీకృతం కాదు.

**2. అవిశాలత్వం:** ఏ రచనా ప్రక్రియకైనా ఇతివృత్తమో, సన్నివేశమో లేక పాత్రో కారణంగా వుండి ఒక పరిమితి తప్పని సరిగా వుంటుంది. అదే విధంగా ఏ ప్రక్రియకు అయినా విస్తృతత్వము ప్రారంభంలోనే నిర్ణయింపబడుతుంది. వ్యాసం ఇక్కడి ముగిసిపోతుంది, పోవాలి, అనే నిర్బంధాలు ప్రక్రియాగతంగా లేదు. కేవలం రచయితకు వచ్చే కొత్త ఆలోచనల వల్ల ముగిసిపోయిన వ్యాసం మళ్ళీ అక్కడ్నుంచే ప్రారంభం కావచ్చు. వస్తు స్వభావంలోనే వ్యాసం విస్తృతంగా సాగే అవకాశం కలిగి వుంటుంది. వ్యాసంలో స్పష్టమయిన పరిమితి తెలిపే వీలు తక్కువగా వుంటుంది. వ్యాసం ఉద్గ్రంధంగా ఉండకుండా చిన్న పుస్తకంగా కూడా ఉండవచ్చు. కానీ సాధారణంగా ఒక వ్యాస సంపుటి ఒక ఉద్గ్రందంగా ఉండవచ్చు.

**3. విశృంఖలత్వం:** ఏ రచనా ప్రక్రియలో అయినా సాధారణంగా ఒక విషయం క్రమ పరిణామం పొందటం సహజం. వ్యాస విషయం పెంపుదల పొందేటప్పుడు ఒక పద్ధతిలో పెరిగినట్లుగానే ఒక పద్ధతిలో సాగినట్లు కానీ ఒక విధానమును అనుసరించినట్లు కానీ, ఒక క్రమత కలిగి ఉన్నట్లు కన్పించదు. ఇందులో వ్యాస రచయిత ఇష్టం వ్యాస విషయక్రమాన్ని నిర్ణయిస్తుంది. ఒక పద్ధతి లేకపోవటం, క్రమత లేకపోవటం మొదలైన వాటికి వ్యాస ధర్మంగా భావించవచ్చు. అయితే ఈ క్రమతారాహిత్యం అవిశాలత్వానికి లోబడే వుంటుంది.

**4. హాస్యత్వం:** నవ్వు వ్యాసంలో లేకపోతే దాని పఠనం పాఠకుడికి బరువు అవుతుంది. నవ్వు ఏ స్థాయిలో అయినా వ్యాసంలో వుండటం అవసరం. అందువల్ల హాస్యము, అపహాస్యము, పరిహాసము, నవ్వో, చిరునవ్వో వ్యాసంలో వుండాలి. ఆంధ్ర వ్యాస సారస్వతంలో సాక్షి, వదరుబోతు, వ్యాసాలు అధిక్షేపం వల్ల సంఘ పరిణామాన్ని ఆకాంక్షించారు.

**5. మిత్రత్వం:** సాంప్రదాయానుసారంగా, కావ్యం ప్రభు సమ్మితంగా, మిత్ర సమ్మితంగా, కాంతా సమ్మితంగా ఉండాలన్న విభజనలో వ్యాసాలకి మిత్ర సమ్మితమయిన లక్షణాన్ని ఉండాలని భావించవచ్చు. అంతే కాకుండా రచయిత పాఠకులతో వ్యాస గతంగా మాట్లాడటం వ్యాస ధర్మమైంది. ఈ తీరు కూడా మిత్రుడికి సహాయిస్తున్నట్లు, మిత్రుడే అభిప్రాయం కోరుతున్నట్లు, ఇద్దరికీ తెలిసిన సంగతులు చెప్పుకొంటున్నట్లు, ఆ పాఠక, రచయితలకే పరిమితమయిన ఆంతరంగిక సంబంధాలు తెరలు తొలగిస్తున్నట్లు ఉత్తమ వ్యాసం ఉంటుంది.

వ్యాస రచయిత ప్రత్యక్షంగా, పరోక్షంగా అయినా పాఠకుల మైత్రి పదర్శింపకపోయినా మైత్రి పూర్వకంగా అభిప్రాయాన్ని కలిగించినా ఈ లక్షణాన్ని పాఠించినట్లే అవుతుంది.

**6. సృజనత్వం:** వ్యాసం ప్రధానంగా సృజన ధర్మాధిక్యం వల్ల హృదయానికి సన్నిహితం అవుతుంది. వాఙ్మయాన్ని సృజన, విమర్శనం అని రెండుగా విభజించవచ్చు. సృజన ప్రక్రియలో రచయిత ఆత్మీయతతో, అతని వ్యక్తిత్వానికి అవకాశం ఎక్కువగా వుంటుంది. సృజన వ్యాసాల పుట్టుక ఇతర అవసరాల మీద ఎక్కువగా ఆధారపడకుండా రచయిత మీదే ఆధారపడి వుంటుంది. విమర్శనా వ్యాసాలయితే రచయిత యొక్క పాండిత్యం, కృషి, పరిశోధన మీద ఆధారపడి వుండవచ్చు. వ్యాస లక్షణాలున్నా సృజన

గుణం లేకపోతే ఆ వ్యాసం వ్యాసం కావచ్చు కానీ అధిక ప్రజాధారణ పొందలేకపోవచ్చు. వ్యక్తిత్వ ముద్ర, సృజన వ్యాసంగా, వ్యాసం రూపొందేందుకు దోహదం చేయవచ్చు. కానీ కేవలం వ్యక్తిత్వముద్ర ఉన్న వ్యాసాలన్నీ సృజన వ్యాసాలు కాలేవు.

**7. అసంపూర్ణత్వం:** వ్యాసం చిన్నదయినా పెద్దదయినా దానిలోని విషయం పరిపూర్ణంగా, సమగ్రంగా, కూలంకషంగా వుండదు. వ్యాసరచయిత తాము తీసుకున్న ఇతి వృత్తంలో వ్యాస విషయం ఒకటయితే వ్యాసేతర విషయాలు స్వీకరించి వ్యాసం వ్రాయవచ్చు. కానీ వ్యాస విషయం సంపూర్ణంగా వ్రాయటం కుదరదు. ఎందుకంటే తాను చెప్పదలచుకున్న విషయం సంపూర్ణంగా చెప్పాలని రచయిత అనుకోకపోవటమే. సాధారణంగా వ్యాసకర్త తన అనుభవంలోని విషయాలు హృదయభలంతో మరే ఇతర సాక్ష్యాలు, సహాయాలు అవసరం లేకుండా వ్యక్తీకరించబడ్డప్పుడు వెలువడే వ్యాసంలో వ్యాసం తప్పని సరి అవుతుంది. అంతేకాక వ్యాసంలో అసంపూర్ణత్వం ప్రధాన లక్షణం అందువల్లే వస్తువు సంపూర్ణమయితే అది వ్యాసం కాదు. ఒక విషయాన్ని గూర్చి వ్యాసకర్త ఎంత అనుభవశాలి అయినా ఉన్నఫళంగా సంపూర్ణంగా అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేడు. వ్యాసం ఎప్పుడూ విషయ దృష్టితో అసంపూర్ణంగానే వుంటుంది.

**8. వ్యక్తిత్వం:** ఏ రచనలో అయినా రచయిత వ్యక్తిగా కనిపించవచ్చు. లేకపోతే కనబడకపోవచ్చు. అంతే కాకుండా రచయిత రచనలో పరాశ్రమంగానో ఆత్మాశ్రయంగానో వుండవచ్చు. రచన ఆత్మాశ్రయంగా ఉన్నా, పరాశ్రయంగా ఉన్నా వాటి వెనక రచయిత తీసుకున్న మార్గాలనే, పరాశ్రయ రచనలోనూ రచయిత యొక్క వ్యక్తిత్వం వుంటుంది. వ్యాసం రచయిత ఆత్మాశ్రయ రచనా ధోరణిని ఆకాంక్షిస్తుంది. రచయిత యొక్క జీవిత స్థాయిని బట్టి వ్యాసం యొక్క స్థాయి మారుతూ వుంటుంది. కాబట్టి రచయిత మానసిక, ఆర్థిక స్థితులు వ్యాస లక్షణాలు నిర్ణయించేవిగా వుంటాయి.

వ్యాసంలో రచయిత ప్రత్యక్షంగా పాఠకులతో సంభాషించినట్లు వుండటం ఏ కారణం వల్లనయినా, ఏ రచయితకైనా ఇష్టం లేకపోవచ్చు. అపుడు రచయిత తన వ్యక్తిత్వ గోపన చేసుకొని, వ్యక్తిత్వంతో పాఠకులతో సంభాషించినట్లుగా వ్యాసంలో వ్యక్తిత్వం నిలుపుకోవటం అనే ధర్మాన్ని ఆంగ్ల వ్యాస రచయితలు కొంత మంది పాటించారు. వ్యాసం రచయిత వ్యక్తిత్వంతో స్పష్టంగా రూపొందినప్పుడే అది సృజన రూపం కూడా పొందుతుంది. అంతే కాకుండా రచయిత వ్యక్తిత్వం పెరుగుతున్న కొద్ది సృజన ధర్మం కూడా పెరుగుతుంది. అందువల్ల సృజన ధర్మం రచయిత వ్యక్తిత్వం రెండూ వ్యాసంలో పరస్పర దోహదకారులు.

రచయిత వ్యక్తిత్వం అధికమయిన కొద్దీ వ్యాసంలో సంపూర్ణత తగ్గిపోతుంది. వ్యక్తిత్వ ముద్ర లోపించే కొద్దీ వ్యాసంలో అసంపూర్ణత తగ్గిపోతుంది. వ్యాసంలో రచయిత వ్యక్తిత్వం రచనను అలవోకగా, స్వీకరణ యోగ్యంగా కోరదగినట్లుగా రూపొందటమే కాక రచనలో కాఠిన్యం తగ్గించి, వీలయితే హాస్యానికి కూడా చాటిస్తుంది.

రచయిత వ్యక్తిత్వం, వ్యాస లక్షణాలన్నింటికీ సంబంధించి వుంది. దాని నుంచే ఇతర లక్షణాలు ఆవిర్భవించాయని భావించవచ్చు. ఒక రచన వ్యాసమా, తదితరమా అని నిర్ణయించటానికి ప్రధాన లక్షణం రచయిత వ్యకిత్త్వం.

## 15.1.4 వ్యాసం - ఆవిర్భావ వికాసాలు:

ఆంగ్ల సాహిత్య ప్రభావంతో వచ్చిన ఇతర ప్రక్రియల్లాగనే తెలుగులోకి వ్యాసం కూడా వచ్చింది. ఆంగ్లంలో వ్యాస ప్రక్రియ 1597లో ప్రారంభమయితే తెలుగులో 1860లో ఈ ప్రక్రియ ప్రారంభమయ్యింది. తెలుగులో మొట్టమొదటి వ్యాసాన్ని సామినేని ముద్దు నర్శింహనాయుని గారు వ్రాశారు. తన వ్యాసంని "హితవాది" పత్రికలో ప్రచురించారు. సామినేని గారి వ్యాసాల్ని 1862లో ఆయన కుమారుడైన రంగప్రసాద్ నాయుని గారు 'హితసూచిని' పేర ముద్రించగా అనేక మంది ప్రముఖుల ప్రశంశల్ని, మన్ననల్ని అందుకున్నాయి. సామినేని తన రచనలకు వ్యాసం అని కాక "ప్రమేయం" అని పేరు పెట్టారు. ప్రమేయం అంటే తెలుసుకోదగింది, కొలవదగినది అనే అర్థాలున్నాయి. సామినేని గారు "ఒక విషయాన్ని పరిమితంగా తెలుసుకోవటం, తక్కువగా రాయడం అనే అర్థాల్లో తన వ్యాసానికి "ప్రమేయం" అని పేరు పెట్టారు.

సామినేని తర్వాత పరవస్తు వెంకట రంగాచార్యులు తను వ్రాసిన వ్యాసాలకు 'సంగ్రహం' అను పేరు పెట్టారు. సంస్కృత భాషలో శాస్త్ర విషయాన్ని సంగ్రహించి చెప్పటాన్ని 'సంగ్రహం' అని అంటారు. ఈ అర్థంలోనే వెంకట రంగాచార్యులు తన వ్యాసానికి సంగ్రహం అని పేరు పెట్టి వుండవచ్చు. ఈ వ్యాసాలన్నీ గ్రాంధిక భాషలో వున్నాయి.

రంగాచార్యులు గారు ప్రాచీన భారతీయ సాహిత్య, సంస్కృత నాగరికత, మతానికి సంబంధించిన అనేక విషయాలను ప్రజలకు అర్థమయిన భాషలో తన వ్యాసం వ్రాశారు.

తెలుగులో మూడవ వ్యాసకర్తగా పేరు పొందిన వారు జియ్యరు సూరి. ఈయన వ్యాసాలు ఎక్కువగా స్త్రీలకు సంబంధించినవే. స్త్రీలకు, విద్య, ఆవశ్యకం, స్త్రీ దనం, స్త్రీ ఆరోగ్యం మొదలగు విషయాలన్నీ వ్యాసాలు వ్రాశారు. ఈయన 1875లో 'స్త్రీ కళాకల్లోలని' అనే వ్యాస సంపుటిని ప్రచురించగా తర్వాత స్త్రీ విద్యామణి అనే పేరుతో 69 వ్యాసాల్ని ప్రచురించారు. ఈయన వ్రాసిన ప్రతీ వ్యాసం రెండు మూడు పుటల్లోనే ఉన్నాయి.

వీరి తర్వాత చెప్పుకోదగ్గ వ్యాసకర్త కందుకూరి వీరేశలింగం గారు. ఈయన 1874లో పత్రికారంగంలో ప్రవేశించి 'వివేక వర్ధిని' అనే పత్రికను స్థాపించారు. వీరు తన పత్రికల్లోనూ ఇతర పత్రికల్లోనూ అనేక వ్యాసాలు వ్రాశారు. ఈయన తాను వ్రాసిన వ్యాసాల్ని ఉపన్యాసం అనే పేరుతో పిలిచారు. అంతే కాకుండా ఈ వ్యాసాలు గ్రాంధిక భాషలో ఉన్నాయి. పంతులు గారు తన సంస్కరణోద్యమానికి ఈ వ్యాస ప్రక్రియను ఒక ఆయుధంగా ఉపయోగించుకున్నారు. ఉపన్యాసం అనే పదం తరువాత ఎక్కువ కాలం వ్యవహారంలో లేదు. 1900 నుంచి వ్యాసం అనే పేరు వాడుకలోనికి వచ్చింది. 1901లో పి.ఏ. ప్రణతార్తి హరిశాన తన సంపుటికి ' వ్యాస మంజరి' అను పేరు పెట్టారు.

తర్వాత గురజాడ మొదలైన కవులు రచయితలు తమ తమ రచనలకు వ్యాసాలని పేరు పెట్టారు. కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి, దాసు శ్రీరాములు, రాయసం వేంకట శివుడు, ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ మొదలైన వారు అనేక విషయాల పై వ్యాసాలు వ్రాయగా తర్వాత కామరాజు లక్ష్మణ రావు గారు, గిడుగు రామూర్తి గారు భాష పై అనేక వ్యాసాలు వ్రాయటం వల్ల సంఘ సంస్కరణకు భాషా సంస్కరణకు ఇంకా అనేక ఉద్యమాలకు ఈ వ్యాసాలు అవసరమయ్యాయి. అంతేకాక ఈ వ్యాసం ద్వారా రచయితలు తమ తమ అభిప్రాయాల్ని ప్రజలకి వివరించడమే కాక వితంతు పునర్వివాహం, స్త్రీ విద్య అవసరం, బాల్య వివాహాలు, రజస్వల తరువాత వివాహాలు, పురుషుల వ్యసనాల పట్ల అనేక వ్యాసాలు వచ్చాయి.

ఆంధ్రదేశంలో వ్యవహారిక భాషోద్యమానికి ఆద్యులైన గిడుగు రామ్మూర్తి పంతులు గారు వ్యవహారిక భాష యొక్క ఆవశ్యకతను తెలియజెప్పారు. వీరి కాలంలోనే వ్యవహారిక భాష, గ్రాంధిక భాష పై వాదోపవాదాలు పత్రికల్లో వ్యాసాల రూపంలో వచ్చాయి.

1835లో తెలుగు పత్రికా రంగం ప్రారంభమైనా వ్యాసాల్ని పత్రికల్లో ప్రచురించటం మాత్రం 1864 నుంచే ప్రారంభమయ్యింది. ఈ వ్యాసాలు అనేక రీతుల్లో వచ్చాయి. గ్రంథ సమీక్షలు, రాజకీయ, ఆర్థిక, మత, సాహిత్య, భాషా, కళ మొదలైన రంగాల పైనే కాక అనేక విషయాల పై ఈ వ్యాసాలొచ్చాయి.

తెలుగులో అనేక మంది కవులు, రచయితలు, వ్యాసాలను వ్రాయడం ద్వారా వ్యాస ప్రక్రియ అభివృద్ధికి కృషి చేశారు. గురజాడ, పానుగంటి, మొక్కపాటి లక్ష్మీనరసింహారావు, ముట్నూరి కృష్ణారావు, నేలటూరి వెంకట రమణయ్య, మారేమండ రామారావు, మల్లంపల్లి సోమశేఖర శర్మ, సురవరం ప్రతాప రెడ్డి, కట్టమంచి రామలింగా రెడ్డి, రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, చలం, శ్రీశ్రీ, ఖండవల్లి లక్ష్మీరంజనం, నార్ల వెంకటేశ్వరరావు మొదలైన వారెందరో ఈ వ్యాస ప్రక్రియను అభివృద్ధి గాంచారు. అందుకే నేడు ఈ వ్యాస ప్రక్రియ బహుళ ప్రజాదరణ ప్రక్రియగా వెలుగొందుతుంది.

## 15.1.5 వ్యాసం - భేదాలు:

వ్యాసంలో తీసుకున్న విషయాన్ని వివరించిన విషయాన్ని బట్టి ఈ వ్యాసాల్ని ఈ క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

1. సాహిత్య వ్యాసాలు
2. భాషా వ్యాసాలు
3. చారిత్రక వ్యాసాలు
4. సాంఘిక వ్యాసాలు
5. ఆర్థిక వ్యాసాలు
6. రాజకీయ వ్యాసాలు
7. శాస్త్రీయ వ్యాసాలు
8. కళ వ్యాసాలు
9. పరిశోధన వ్యాసాలు
10. జీవిత చరిత్ర వ్యాసాలు
11. సమీక్ష వ్యాసాలు
12. సంపాదకీయ వ్యాసాలు
13. అదిక్షేప వ్యాసాలు
14. ఉపోద్ఘాతాలు

**1. సాహిత్య వ్యాసాలు:** తెలుగులో సాహిత్యపరమయిన వ్యాసాలు అనేకం వచ్చాయి. పాశ్చాత్య దృష్టితో విమర్శ సాగించిన వారిలో కట్టమంచి వారు ప్రథములు. ఈయన వ్రాసిన "కవిత్వతత్త్వ విచారము" ఉత్తమ విమర్శ గ్రంథంగా వెలుగొందటమే కాక ఈ పద్ధతులనే తర్వాత విమర్శకులు అనుసరించటం వల్ల ఈ గ్రంథం ఆధునిక విమర్శకులకు మార్గదర్శకం అయ్యింది. సాహిత్య వ్యాసాలను అనేక మంది కవులు, రచయితలు, వ్రాశారు. వారిలో విశ్వనాథ సత్యనారాయణ, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, వేదం వెంకటరాయ శాస్త్రి, వెంగళి లక్ష్మీ కాంతం, కె.వి. రమణా రెడ్డి, సుదర్శనం, వేటూరి ప్రభాకర శాస్త్రి, కె.వి.ఆర్. నరసింహం, ఎస్.వి. జోగారావు, కొలకలూరి ఇనాక్, కార్లపాటి శ్రీరామమూర్తి, జి.వి. సుబ్రమణ్యం మొదలైన వారు ఈ సాహిత్య వ్యాసాన్ని వ్రాసి సాహిత్య వ్యాసాల అభివృద్ధికి కృషి చేశారు.

**2. భాషా వ్యాసాలు:** భాష పై కూడా అనేక మంది కవులు, రచయితలు భాషా వ్యాసాల ద్వారా భాషాభివృద్ధికి కృషి చేశారు. గురజాడ, కామ్రాజు, గిడుగు, వేటూరి ప్రభాకర శాస్త్రి, చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి, కోదాడ రామక్రిష్ణయ్య, పంచాగ్నుల ఆదినారాయణ మొదలైన ప్రముఖులే కాకుండా గంటిజోగి సోమయాజులు, పి.యస్. సుబ్రమణ్యం, చేకూరి రామారావు, బద్రిరాజు కృష్ణమూర్తి, చిలుకూరి నారాయణరావు, తూమాటి దోణప్ప మొదలైన వారెందరో భాషా వ్యాసాలు వ్రాశారు.

**3. శాస్త్రీయ వ్యాసాలు:** శాస్త్రీయ దృష్టితో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని, శాస్త్రీయ విషయాల్ని తీసుకొని వాటి మీద వ్యాసాలు వ్రాసిన వారిలో కాళీపట్నం కొండయ్య గారు ప్రముఖమయిన వారు. వీరే కాకుండా ఖగోళ శాస్త్రానికి సంబంధించి శాస్త్రీయ వ్యాసాలను గోబ్బూరి వెంకట రమణ రాఘవరావు గారు వ్రాశారు. అంతే కాకుండా అందులో భారత కథనమంతా నక్షత్రాలతో అన్వయించి తమ వ్యాసాల్లో చూపించారు. ఆధునికంగా చూస్తే నండూరి రామ్మోహనరావు గారు 'నరావతారం', విశ్వరూపం అనే గ్రంథాల్ని వ్రాయగా శ్రీపాద గోపాల కృష్ణమూర్తి "విజ్ఞాన దీతతులు", ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతంను వ్రాశారు. అలాగే వేమరాజు భానుమూర్తి సైన్సు కథను, డా॥ గాలిబాల సుందరరావు "మనము - మన దేశ స్థితి" అనే దానిలో వైద్య, శారీరక విజ్ఞానానికి సంబంధించిన విషయాలను ఆచంట లక్ష్మీపతి గారు ఆయుర్వేదానికి సంబంధించిన వ్యాసాలనూ, జమ్మికొనేటిరావు గారు జంతుశాస్త్రము, జన్యు శాస్త్రము మొదలైన శాస్త్రీయ వ్యాసాలు వ్రాశారు.

**4. పరిశోధన వ్యాసాలు:** అనేక మంది ఈ పరిశోధనా వ్యాసాలను ఎక్కువ గానే వ్రాశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న వివిధ యూనివర్శిటీలైన ఆంధ్ర, వేంకటేశ్వర, నాగార్జున, సెంట్రల్ యూనివర్శిటీ, తెలుగు యూనివర్శిటీ, ఉస్మానియ, కాకతీయ మొదలైన విశ్వ విద్యాలయాల్లో అనేక పరిశోధన వ్యాసాలు వ్రాయబడ్డాయి. యం.ఫిల్., పి.హెచ్.డి., డి.లిట్. మొదలైన వాటికి సంబంధించి పరిశోధనా వ్యాసాలు మన రాష్ట్రం లోనే కాక బెంగుళూర్, మద్రాస్, బెనారస్, మదురై, ఒరిస్సా మొదలైన యూనివర్శిటీల్లో అనేక పరిశోధనా వ్యాసాలు వ్రాయబడ్డాయి. తెలుగులో మొట్ట మొదటి పి.హెచ్.డి. ఆంధ్ర భాషా చరిత్రమును వ్రాసిన ఆచార్య చిలుకూరి నారాయణ రావు గారికి వచ్చింది. అలాగే తెలుగులో మొట్ట మొదటి డి.లిట్. "ఈశ్వరార్చన కళాశీలుడు" అనే గ్రంథాన్ని వ్రాసిన ఆచార్య కొర్లపాటి శ్రీరామూర్తి గారికి వచ్చింది. ఈ విధంగా భాషా సాహిత్యాల్లో వందల కొలది యం.ఫిల్., పి.హెచ్.డి., పట్టాలు రాగా కొన్ని ప్రామాణిక గ్రంథాలుగా నిలదొక్కుకున్నాయి.

**5. కళా వ్యాసాలు :** వివిధ కళలకు సంబందించిన అనేక వ్యాసాలు తెలుగులో వచ్చాయి. దామెర్ల రామారావు, తలిసెట్టి రామారావు,

అడవి బాపిరాజు, పైడి రాజా మొదలైన వారు కళా సంబంధమయిన అనేక వ్యాసాలను వ్రాశారు. మరి కొంత మంది చిత్ర కళకు సంబంధించిన వ్యాసాలు కూడా వ్రాశారు.

**6. చారిత్రక వ్యాసాలు:** పరిశోధనల వల్ల బయటపడిన చారిత్రక సత్యాల్ని వివిధ శాసనాల వల్ల తెలిసిన విషయాల్ని అంతే కాకుండా మరుగునపడిన అనేక చారిత్రక సంబంధమయిన విషయాల పైన చాలా మంది వ్యాసాలు వ్రాశారు. ఈ వ్యాసాలు ఆంధ్ర చరిత్రకు సంబంధించే కాక భారతదేశ చరిత్రకు సంబంధించినవి కూడా వచ్చాయి. ఇలాంటి వ్యాసాలు మామిడిపూడి, మల్లంపల్లి సోమశేఖర శర్మ, మారేమండ మొదలైన వాళ్ళు వ్రాశారు. ఇటువంటి వ్యాసాల వల్ల జాతి జాగృతి చెందటమేకాక ప్రజల జాత్యాభిమానం పెరుగుతుంది. కేవలం చారిత్రక విషయాల్ని మాత్రమే తీసుకొని వ్రాసిన వారిలో కామరాజు, చిలుకూరి పాపయ్య శాస్త్రి, సురవరం ప్రతాపరెడ్డి, వేటూరి వెంకట రమణయ్య, కార్లపాటి శ్రీరామ మూర్తి, భావరాజు వేంకట కృష్ణారావు మొదలైన ప్రముఖులు చారిత్రక వ్యాసాల్ని వ్రాశారు. ప్రారంభంలో ఈ వ్యాసాలన్నీ రాజమండ్రిలో ముద్రించబడ్డాయి.

**7. సాంఘిక వ్యాసాలు:** చారిత్రక వ్యాసాల్నే కాక సాంఘిక వ్యాసాలు కూడా అనేక మంది వ్రాశారు. వారిలో పానుగంటి లక్ష్మీనరసింహం గారు ప్రముఖమయిన వారు. తెలుగులో వీరు వ్రాసినంత భావ గంభీరమయిన వ్యాసాలు మరెవరూ వ్రాయలేదు. ఎడిసన్ అనే ఆంగ్ల పండితుడు తను స్థాపించిన "స్పెక్టేటరు" అనే పత్రికలో ఆ నాడు సాంఘికంగా దురాచారాల్ని ఖండించటాన్ని ఆదర్శవంతంగా గ్రహించి పానుగంటి వారు "సాక్షి" వ్యాసాలు వ్రాశారు. ఈ వ్యాసాలు పాఠకుల్లో చెరగని ముద్ర వేశాయి. ముఖ్యంగా ఈ సాంఘిక వ్యాసాల్లో మత, నైతిక, తాత్త్విక మొదలైన విషయాలు చోటు చేసుకున్నాయి.

**8. రాజకీయ వ్యాసాలు:** సమాజంలో నేడు అనేక మార్పులు వస్తూ వుండటం వల్ల సమాజంలో ఏమి జరుగుతుంది అనే విషయాన్ని ప్రజాస్వామ్యంలో ఉన్న ప్రజలకు తెలుసుకునే హక్కుండటం వల్ల చాలా మంది ఆ నాటి రాజకీయ పరిస్థితుల్ని బాగా అర్థం చేసుకుని రాజకీయ వ్యాసాల్ని వ్రాశారు. ఈ వ్యాసాల్లో ప్రభుత్వ పాలనా విధానాన్ని, ప్రభుత్వంలోని అవినీతిని గూర్చి, రాజకీయ నాయకులను గూర్చి, వారి యొక్క అక్రమార్జనల గురించి విమర్శిస్తూ అనేక వ్యాసాలు పత్రికల్లో వస్తున్నాయి. ఈ వ్యాసాలు కూడా ఒక శీర్షిక కింద దారావాహికంగా కాని లేక విడివిడిగా కాని వస్తున్నాయి. అంతే కాక ఈ యుగం పత్రికల యుగం అవ్వటం వలన ఈ పత్రికల్లో రాజకీయ వ్యాసాలు చాలా మంది వ్రాశారు. కొమర్రాజు, డా॥ జయ ప్రకాష్ నారాయణ, మామిడిపూడి వెంకట రంగయ్య, యలమంచిలి శివాజి మొదలైన వారు అనేక వ్యాసాలను వ్రాశారు.

**9. ఆర్థిక వ్యాసాలు:** ఆర్థికపరమయిన విషయాల్ని గురించి కూడా అనేక మంది వ్యాసాలు వ్రాశారు. ఈ ఆర్థిక వ్యాసాలు వ్రాయటం కూడా సాంఘిక వ్యాసాలు వ్రాయడం అంత తేలికైన పని కాదు. కట్టమంచి రామ లింగా రెడ్డి గారు "అర్థశాస్త్రం" ఆర్థిక విషయాల పై వచ్చిన వ్యాసాల్లో ముఖ్యమైనది. అర్థశాస్త్రం, ఖాది మొదలైన విషయాల మీద కొచ్చర్ల కోట సత్యనారాయణ, కామండూరి శఠగోపాచార్యులు మొదలైన వారు ఆర్థిక వ్యాసాలు వ్రాశారు. ఇటువంటి ఆర్థిక వ్యాసాలు భారతదేశంలోనే కాక ఆంధ్రదేశంలో కూడా చాలా వచ్చాయి.

**10. జీవిత చరిత్ర వ్యాసాలు:** గాంధీ, అంబేద్కర్, నెహ్రూ లాంటి జాతీయ నాయకులు గురించే కాక, ప్రముఖమయిన చారిత్రక వ్యక్తుల గురించి ప్రసిద్ధులైన కవుల యొక్క జీవిత చరిత్రల గురించి వ్రాసే వ్యాసాలన్నీ జీవిత చరిత్ర వ్యాసాలు అంటారు. కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మీనరసింహం, అచ్చమాంబ మొదలైన వారు జీవిత చరిత్ర వ్యాసాలు వ్రాశారు.

**11. సమీక్షా వ్యాసాలు:** ఈ సమీక్షా వ్యాసాలు తెలుగులో పత్రికలు ఎప్పుడు ప్రారంభమయ్యాయో అప్పటి నుండే ఇవి కూడా ప్రారంభమయ్యాయి. దిన పత్రికలు, వార, పక్ష, మాస, త్రై మాస పత్రికల్లో వివిధ పుస్తకాల్ని గురించి సమీక్షిస్తూ వ్రాసే వ్యాసాన్ని సమీక్షా వ్యాసాలందురు. సాధారణంగా ఈ వ్యాసాలను విమర్శకుడో లేక సంపాదకుడో వ్రాస్తారు. పుస్తకాన్ని సమీక్షించి వ్యాసం వ్రాయడం వల్ల ఇటువంటి వ్యాసాలు కష్టంతో కూడుకొని వుంటాయి. అంతే కాకుండా ఈ సమీక్షలు నిష్పక్షపాతంగా వుండాలి.

ఇలాంటి వ్యాసాలు వ్రాసిన వారిలో కేతు విశ్వనాద రెడ్డి, బూదరాజు రాధాకృష్ణ, పోరంకి దక్షిణామూర్తి మొదలైన వాళ్ళను ప్రముఖులుగా చెప్పవచ్చు.

**12. సంపాదకీయ వ్యాసాలు:** ఈ సంపాదకీయ వ్యాసాలు తెలుగులో వివిధ పత్రికల్లో కన్పిస్తాయి. దిన, వార, పక్ష, మాస, త్రై మాసిక పత్రికల్లో ఇటువంటి సంపాదకీయ వ్యాసాలు వస్తున్నాయి. సంపాదకీయ వ్యాసం వ్రాసిన వారిలో కందుకూరి, వువ్వాడ వేంకట్రావు, గాడిచర్ల, గిడుగు, ముట్నూరి కృష్ణారావు, సురవరం ప్రతాప రెడ్డి, లాఫే ధర్మారావు, నార్ల వేంకటేశ్వరరావు, నండూరి రామ్మోహనరావు, గోరాశాస్త్రి వీరే కాక అనేక మంది ప్రముఖులు వివిధ పత్రికల్లో సంపాదకీయ వ్యాసాలు వ్రాశారు. వీరు తమ సంపాదకీయ వ్యాసాలను నూతన పంథాలో పత్రికా రంగంలో వ్రాశారు.

**13. ఉపోద్ఘాతాలు:** ఉపోద్ఘాతాలు వ్రాయటంలో చిలుకూరి నారాయణ రావు గారు ప్రసిద్దులు. పుస్తక ప్రపంచంలో ఉపోద్ఘాతాలు, పీఠికలు, ముందు మాట మొదలైన పేర్లతో ఇవి వుంటాయి. ఇటువంటి వాటిని చలం, విశ్వనాథ, శ్రీశ్రీ, నార్ల దివాకర్ల వెంకటావధాని, బోయి భీమన్న, ఇనాక్, సంజీవదేవ్ మొదలైన వారు ఉపోద్ఘాతాలు వ్రాశారు.

**14. అధిక్షేప వ్యాసాలు:** సమాజంలో ఉన్న లోపాల్ని ఎత్తి చూపుతూ అవహేళనం చేస్తూ రాయడం ఈ వ్యాసాల్లో ప్రధానమయిన విషయం ఈ వ్యాసాల్లో ముఖ్యంగా వ్యంగ్యం, హాస్యం, చోటుచేసుకుంటాయి. ఈ వ్యాసాల్లో ముఖ్యంగా రచయిత హాస్యాన్ని జోడిస్తూ చురకలు వేస్తాడు. ఈ అధిక్షేప వ్యాసాలు వ్రాసిన వారిలో పానుగంటి, మునిమాణిక్యం, మొక్కపాటి, భమిడిపాటి, కొడవటి గంటి కుటుంబరావు మొదలైన వారిని ప్రముఖంగా చెప్పవచ్చు.

ఈ విధంగా పైన చెప్పిన వ్యాసాలే కాకుండా విశ్లేషణాత్మక వ్యాసాలు, ఉపదేశాత్మక వ్యాసాలు, కథానాత్మక వ్యాసాలు, ఆలోచనాత్మక వ్యాసాలు, భావాత్మక వ్యాసాలు, సంభాషణాత్మక వ్యాసాలు మొదలైన అనేక వ్యాసాలు తెలుగు సాహిత్యంలో చోటు చేసుకున్నాయి.

## 15.1.6 సారాంశము:

ఆంగ్ల భాషా పరిచయం వలన ఆధునిక ఆంధ్రసాహిత్యంలోకి ప్రవేశించిన ప్రక్రియలో ప్రధానమయినది వ్యాసం. ఫ్రెంచి భాషలో నుండి, ఇంగ్లీషు భాషలోకి Essay అన్న పేరుతో ప్రవేశించినపదానికి సమానార్థకంగా తెలుగులో 'వ్యాసం' అన్న మాటను వాడుతున్నాము. వచనత్వం, అవిశాలత్వం, విశృంఖలత్వం, హాస్యత్వం, మిత్రత్వం మొదలయినఅనేక లక్షణాలు దీనికి ఉంటాయి. ఈ ప్రక్రియ 1860లో తెలుగు భాషలో ప్రారంభమయింది, మొట్ట మొదటి తెలుగు వ్యాసాన్ని రాసిన ఘనత సామినేని ముద్దు నర్సింహ నాయనిగారికి దక్కుతుంది. 14 భేదాలతో వ్యాసం ఈనాడు అత్యంత ఆదరణీయ రచనా ప్రక్రియగా అభివృద్ధి చెందింది.

## 15.1.7 మాదిరి ప్రశ్నలు:

1. వ్యాసం యొక్క లక్షణాలను వివరించండి.
2. వ్యాసం యొక్క ఆవిర్భావ వికాసాలను చర్చించండి.

## 15.1.8 ఆధార గ్రంథాలు:


తెలుగులో వ్యాస పరిణామం - చిలకలూరి ఇనాక్

తెలుగులో సాహిత్య విమర్శ - ఎస్. వి. రామారావు

తెలుగు సాహిత్యం పై ఇంగ్లీషు ప్రభావం - కొత్తపల్లి వీరభద్ర రావు

ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం - కొలకలూరి ఇనాక్

# పాఠం - 16 జీవిత చరిత్రలు – స్వీయ చరిత్రలు

## పాఠ్యాంశ నిర్మాణ క్రమం


**16.1 జీవితచరిత్ర లక్షణాలు**

**16.2 జీవితచరిత్రలు - వర్గీకరణ**

**16.3 ప్రముఖ జీవితచరిత్రలు**

**16.4 స్వీయచరిత్ర - నిర్వచనం**

**16.5 స్వీయచరిత్ర - లక్షణాలు**

**16.6 స్వీయచరిత్ర - స్వరూప స్వభావాలు**

**16.7 స్వీయచరిత్ర - ఆవిర్భావ వికాసాలు**

**16.8 సారాంశము**

**16.9 మాదిరి ప్రశ్నలు**

**16.10 ఆధార గ్రంథాలు**


## జీవిత చరిత్ర

ఒక మహా పురుషుని జీవిత మహత్త్వా లోకం చేత కలిగిన అబ్బురపాటు ప్రేరణ కాగా ఆమహత్త్వా విశిష్టతను లోకులకు తెలుపుటకై వ్రాయబడిన కథయే జీవిత చరిత్ర (ఆటోబయోగ్రఫీ) ఆధునిక వచన సాహిత్య ప్రక్రియగా వెలసిన మరొక ప్రసిద్ధి చెందిన ప్రక్రియ ఈ జీవిత చరిత్ర. ఇది పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో ఏర్పడింది. జీవిత చరిత్రని స్వీయ చరిత్ర అని కూడా అంటారు. ఇంకా దీనికి ఆత్మకథ, ఆత్మ చరిత్ర, అనుభవాలు, జ్ఞాపకాలు, గత స్మృతులు అనే పేర్లు కూడా ఉన్నాయి. జీవిత చరిత్ర అంటే తన జీవిత గాధను తానే స్వయంగా తెలుపడం ఆత్మ చరిత్రను వ్రాసుకోవడం అంటే కత్తి మీద సాము వంటిదే. అందుకే డాక్టర్ జాన్సన్ (Boswell's Life of Johnson) అనే దానిలో ఈ జీవిత చరిత్ర గూర్చి చెప్పాడు.

## 16.1 జీవిత చరిత్ర లక్షణాలు:

చరిత్రకు కావ్యానికి భేదం ఉంది. జరిగినది జరిగినట్లు గాను, కాలక్రమానుగుణంగా చెప్పేదే చరిత్ర. చరిత్ర లోకంలో జరిగిన సత్య విషయాలను మాత్రమే చెప్తుంది. చరిత్రకారుని యొక్క సొంత విషయాలను చెప్పుకోవడానికి చరిత్రలో ఎలాంటి అవకాశం ఉండదు. అలాంటి అవకాశాన్ని చెప్పుకోవడానికి జీవిత చరిత్ర ఉపయోగపడుతుంది. జీవిత చరిత్ర వ్యక్తుల్ని వారు చేసిన కార్యాలను తెలియజేస్తుంది. జీవిత చరిత్ర పరాశ్రయమైంది. స్వీయ చరిత్ర ఆత్మాశ్రయమైంది. చరిత్రలో కర్త యొక్క ఆత్మీయత వ్యక్తం కాదు. జీవిత చరిత్రలో కథ పురుషుని ఆత్మీయత వ్యక్తం అవుతుంది. పర చరిత్రయైనను ఆత్మ చరిత్రయైనను పేరును మాత్రమే అది చరిత్రగాని గుణము చేతఅభ్యష విషయమే. చరిత్ర అను పదమునకు ఏ కారణము చేతనో దేశచరిత్ర అనుఅర్థము రూఢమైంది. ఒక ప్రదేశము యొక్క గాని జాతి యొక్క గాని చరిత్ర ఎంత సమర్థుడైన చరిత్రకారుడు వ్రాసిన దాని ఆత్మను సమగ్రంగా వ్యక్తం చేయలేడు. అతడు ఆ రాజ్యముల యొక్క వికాస దశలు, వైఫల్య దశలు వివరించుట యందే ఆసక్తి చూపును. ఇక జీవిత చరిత్ర ఏ వ్యక్తి యొక్క చరిత్రను చెప్పుటకు ఉద్దేశించునో అతని యొక్క ఆత్మను వ్యక్తం చేయుటకు ప్రయత్నించును. ఆ వ్యక్తి యొక్క జీవితం నందు ఏ ఘట్టములు, అతని యొక్క గొప్పతనమును నిరూపించుటకు ఉపయోగపడునో ఆ ఘట్టములు కాలక్రమానుసారంగా

సంఘటింపబడి వినడానికి ఇష్టమైన కథారూపమున వ్రాయబడునప్పుడే జీవిత చరిత్ర అనిపించుకొని వ్యాఖ్యనమై వాఙ్మయపోటీకి ఎక్కును. కథాపురుషుని ఆత్మీయతను వ్యక్తం చేయునట్టియు, కథానకౌశలము లేనట్టి జీవిత చరిత్రలు సాహిత్యమనిపించుకోవు. బహుకాల, బహుపురుష వృత్తాంతములు గల పురాణములు కంటే ఏకనాయక శ్రయమైన ప్రబంధము ఎట్లా విన్నామో అట్లే దేశ చరిత్ర కంటే ఏ వ్యక్తి జీవిత చరిత్రయు భిన్నము. ఈ రెండు చరిత్రల భేద సాదృశ్యములు భంగి యంత్రముగా యుండును. పైన పేర్కొన్న ఏకనాయక శ్రయత్వంలో కథన కౌశలంతో పాటు రచన సౌందర్యము కూడ జీవిత చరిత్రకు ప్రపంచమున స్థానములు కల్పించెడి అర్హతలలో మరియొకటి యగును. కేవలం దేశ చరిత్రలలో కొన్నింటి సుందరమైన రచనలు యుండవచ్చు. గాని తక్కిన రెండు యుండవు.

అయినను దేశ చరిత్ర రచనలో రమణీయమైన శైలి యందు దృష్టిపెట్టిన చరిత్రకారులు చాలా మంది లేరు. విషయప్రధానమైనది రచనలకు రమణీయమైన శైలి అంతగా అవసరము కాదు. విషయ ప్రధానమైనదియు అట్టి శైలిని కూడా ఆపేక్షించి సాధించినప్పుడే జీవిత చరిత్ర సాహిత్యముగా చెప్పబడుతుంది. అసలు విషయం ఏదైనను ప్రక్రియ ఏదైననూ ఒక గ్రంథమును సాహిత్యముగా చెప్పబడేది రమణీయ శైలియే అనుట నిర్వివాదము. అటువంటి శైలి ఉన్నంత మాత్రమున జీవిత చరిత్రతో సహా యదార్థమైన కావ్య జాతి యందు చేరదు. కావ్యము సౌందర్యాపేక్షచే స్పష్టములైననూ అసంభావ్యము కాని కల్పనలను అంగీకరించును. చారిత్రక కావ్యములు వ్రాసిన కవులు సైతము అట్టి సుందర కల్పనలవలెనే శుద్ధ చారిత్రక విషయములను కావ్యములుగా చేయగలిగారు. కాని జీవిత చరిత్ర యందు ఎట్టి కల్పన లేసమును పనికి రాదు. ఈ అంశములో దేశ చరిత్రవలే జీవిత చరిత్రయు యదార్థకథనమే కావలయును.

ఇట్టి కల్పనా విశేషములచే అవకాశము లేని రచనగనుకనే దీనికి కావ్య శిల్ప గౌరవము దక్కలేదు. అయినను ఆ కథా పురుషుని జీవిత మహత్యమే ఆ చరిత్రకు సౌందర్యమును ఆపాదించుట వలన ఆ గ్రంథము పఠితులకు పూజ్యమగుచుండును. ఎవని జన్మము మానవ జాతికి అలంకార భూతమో, ఎవని వర్తనము లోక కళ్యాణ హేతువో, ఎవని ప్రవృత్తి మానవ నాగరికతాభివృద్ధికి కారణభూతమో, అట్టి అసాధారణ ఆకర్షణ గల వ్యక్తి యొక్క తీరుయే జీవిత చరిత్రకు వస్తువుగా ఉపకరించును. గాని లోకసామాన్యుల వర్తనము ఉపకరింపదు. ఆ వ్యక్తి సర్వ మానవ జాతికిని ఆప్తుడు కాకపోయినను తన జాతికి, సాంఘికము గానూ, రాజకీయంగానో, మరే విధంగానో మహోపకారమొనర్చి, ఉద్ధరించి, ఔన్నత్యము కలిగించిన స్వార్థరహిత జీవనుడైనపుడు అతని చరిత్ర స్వజితేయులకే గాక క్రమముగా కొంత కాలమునకైనను లోక పూజ్యమగును. అట్టి పూజ్యతకు పాత్రము కాని జీవిత చరిత్రల ఉత్తమ శ్రేణిలో పరిగణింపబడవు.

ఈ రచనలో దీక్షాపూర్వకంగా పాటింపవలసిన ప్రథమ నియమము సత్య కథనము. ఎంత మహనీయుడైనను సర్వ దోష రహితుడైన మానవుడుండడు. అందుచే సత్య కథనమున సత్య కథానాయకుని దోష నిరూపణము కూడా అవసరమైనచో దానిని వదిలి పెట్టరాదు. ప్రలోభములు, ప్రతికూల పరిస్థితులు ఎట్టి వానినైనను ఒక్కొక్కప్పుడు వశపరచుకొని కొన్ని అకార్యముకు ఉమ్ముఖుని చేయవచ్చును.ఆత్మవంతుడైన వ్యక్తి వాటితో పెనుగులాడి జయించును. లేదా కొంతవరకు పరాజితుడగును. ఓడిపోయినపుడు ఆ పరాజయమే అతనికి నూత్నమైన ఆత్మశక్తినిచ్చి శపథపూర్వకముగా సత్పథము నుండి తొలగని వానిగా జేయును. రచయిత అటువంటి సందర్భములలో వ్యక్తము చేయవలసిన కథా పురుషుని దోషములు, లోపములు లోపపరచు కంటే ప్రతిఘటించుటయే మేలు. లోకమునకు అదియే మంచి ఉపదేశమగును.

మానవ జీవితము ప్రకాశము, అప్రకాశము (Public, Private) అని రెండు విధములు. వీటినే నేడు బహిరంగ జీవితము, ఆంతరంగిక జీవితము అని యనుచున్నారు. స్వీయ చరిత్ర వ్రాసికొను వ్యక్తి తన జీవితమును యథాతథముగా లోకమునకు ప్రదర్శింపవలయుననెడి కుతూహలము కలవాడగుచో, ఆ రెండు రకములైన జీవిత భాగములను చిత్రించుట మేలు. అట్టి తలంపు లేనిచో ఆంతరంగిక జీవితమును స్పృశింపబడుట ఆంతరంగిక జీవితములో ఉన్నచో, అవి ఎంత గోప్యములైనను ప్రకటింపబడవలసినవే గాని దాచవలసినవి కావు. పరచరిత్ర వ్రాయువానికి కథా పురుషుని గృహస్థితకు సంబంధించిన గోప్య విషయములు లభించుట చాలా కష్టము. వాటిని

సంపాదించుటకై అతడు పడేడిపాటు నిజముగా సత్యదేవతారాధనమే యగును. మహోదారమైన బహిరంగ జీవితము గల ఒక మానవునకు ఇంట అనుకూలవతి గాని భార్యయు, విధేయతలేని సంతానమును, సహకారము లేని సోదరులను ఉన్నారనుకొందాము. ఈ ప్రతికూల పరిస్థితులు అతని బహిరంగ చరిత్రలో ఎప్పుడేని ఎక్కడేని ముక్కోపముగా, అసహనముగా, నిర్దాక్షిణ్యముగా వ్యక్తముకావచ్చును. స్వార్థరహిత లోకోపకారమొనర్చు ఆ వ్యక్తికి ఇట్టి స్వభావ లోపములుండుటకు గల కారణములను చరిత్రకారుడు పరిశోధించి తెలిసికొని తెల్పినపుడు ప్రజలకు ఆ పురుషుని యందు ఆదరభావము ఎక్కువగును. అలా కానిచో దురాభిప్రాయమే కలుగును. కొన్ని జీవిత చరత్రలు కథానాయకుని యొక్క జీవితానంతటిని కాక అతని జీవితములో ఎటువంటి కార్యసిద్ధి లోకానికి ఆదర్శప్రాయముగా కన్పిస్తుందో వాటినే చిత్రిస్తాయి. అలాంటి వాటి యందు ప్రస్తావన పూర్వకంగా కథానాయకుని పూర్వచరిత్రను కొంత సంగ్రహంగా చెప్పాలి.

జీవిత చరిత్రలు వ్రాసే చరిత్రకారుడు నిజానికే ప్రాధాన్యత ఇస్తాడు. అంతేగాని తనకు పూజ్య భావం లేని చరిత్రను రాయడానికి ఎవ్వడు తలపెట్టడు. అంతేకాక తన స్వశక్తి యందు విశ్వాసము లేనివాడెవ్వడు కూడా తన చరిత్రను వ్రాసుకోడు. జీవిత చరిత్రలలో సాహిత్యానికి సాహిత్య చరిత్రకు నీయతోపకారములగనవి కవుల యొక్క చరిత్రలు. రాజమంత్రులకు, రాజనీతి విశారదులకు, సేనాధిపతులకు, సంఘసేవ పరతంతులకు, ఆచార్య పురుషులకు మొదలైన వారికి ఎటువంటి ఘనత ఉంటుందో కవులకు కూడా అలాంటిదే ఉంటుంది. కవులు చేసిన సాహిత్య సృష్టి ద్వారా వారి యొక్క జీవిత చరిత్రలు విశ్వ వ్యాప్తంగా ఆమోదించబడతాయి.

ఇతరులలాగే కవులు మాత్రం స్వీయ చరిత్రలు రాసుకునేవారు తక్కువ. అలాంటి వారు కొంత మంది మాత్రం వారి చరిత్రలను వ్రాసే అధికారం కలిగి వుంటారు. అలాంటి వారు కావ్య విమర్శకులై వుండి తమ రచనలకు విషయభూతులైన కవుల యొక్క రచనలను పఠించి అందలి గొప్పతనాన్ని గుర్తించి ఆమోదించేవారు కావాలి ఆ విమర్శ, ఆ కావ్యము కవి యొక్క జీవితముతో పోల్చి వివరించినప్పుడే కవి జీవిత చరిత్ర అవుతుంది. దీనినే చారిత్రక విమర్శ, అంటారు. ఈ జీవితచరిత్రలో అతని పుట్టుక, వృత్తి మొదలయిన జీవిత విషయాల కంటే అతని యొక్క కవితా ప్రవృత్తి దానికి దోహదం చేసిన పరిస్థితులకు ఎక్కువ ప్రాధాన్యం వుంటుంది. అంతే కాకుండా ఒక్కసారి పెద్దగా గోచరింపని సాధారణ విషయాలు కూడా కావ్య విమర్శకు తోడ్పడేవిగా ఉంటాయి.

మన దేశంలో కవుల గురించి గాని, అతని కాలం గురించి, వంశం గురించి, పుట్టుక గురించి తెలిపే సాధనాలు పెద్దగా లేవు. కావ్య రసాస్వదనకు ఈ జీవిత విశేషాలు సాధనాలు కాకపోయినా చారిత్రక విమర్శ చేయటానికి మాత్రం వీటి యొక్క ఆవశ్యకత వుంటుంది. అందువల్ల కవుల యొక్క చరిత్రలలో విశేషములు కావ్య విమర్శకు నీయతోపకారకములు మాత్రమే కాగలవు.

## 16.2 జీవిత చరిత్రలు - వర్గీకరణ:

తెలుగులో వచ్చిన దాదాపు నూరు జీవిత చరిత్రలని ఈ క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

1. **సాహిత్య పరమైనవి:** కందుకూరి, చిలకమర్తి, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి , శ్రీశ్రీ దువ్వూరి రామిరెడ్డి మొదలైన వారు రచించినవి.
2. **రాజకీయ పరమైనవి:** కొండా వెంకటప్పయ్య, టంగుటూరి ప్రకాశం, రావి నారాయణ రెడ్డి మొదలైన వారు రచించిన వాటిని పేర్కొనవచ్చు.
3. **సాంఘిక ప్రాధాన్యం కలవి:** దర్శి చెంచయ్య, మందుముల నరసింగరావు, మామిడిపూడి వెంకట రంగయ్య మొదలైన వారు రచించినవి.
4. **ఆధ్యాత్మికమైనవి:** ఇందులో స్వామి జ్ఞానానంద, ఎక్కిరాల కృష్ణమాచార్యులు మొదలైన వారు రచించిన వాటిని చెప్పవచ్చును.
5. **పద్యాత్మకమైనవి:** కొక్కండ వెంకటరత్నం, జాషువా తుమ్మల, మండపాక పార్వతీశ్వర శాస్త్రి మొదలైన వారు రచించినారు.
6. **నటీ నటులు రచించినవి:** అక్కినేని నాగేశ్వరరావు, స్థానం నరసింహారావు మొదలైన వారు రచించిన వాటిని పేర్కొవచ్చు.

## 16.3 ప్రముఖ జీవిత చరిత్రలు:

ఈ విధంగా జీవిత చరిత్రలు వ్రాసిన వారిలో కందుకూరి వీరేశలింగం గారిని ప్రారంభకులుగా చెప్పవచ్చు. వీరు మొదటిసారిగా ఆంధ్రకవుల చరిత్రను రెండు సంపుటాలుగా రచించారు. తరువాత చాగంటి శేషయ్య గారు ఆంద్రకవి తరంగణి అనే పేరుతో కవులు యొక్క చరిత్రను వ్రాసారు. మరి కొంత మంది కూడా శతక కవుల గురించి వ్రాశారు.

రాజకీయ నాయకులు దేశ క్షేమం కోసం పాటుపడినవారు అనేక మంది వున్నారు. జాతీయ అంతర్జాతీయంగా కీర్తిని గడించిన నెహ్రు, గాంధీ మొదలైన వారి జీవిత చరిత్రలు ప్రజలకు ఆదర్శము. తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు 'ఆత్మకథ' అనే పేరుతో ఒక గ్రంథాన్ని వ్రాశారు. 1921లో మునుకొండ సత్యనారాయణ గారు గాంధీ జీవిత చరిత్రను, 1919లో బొడ్డపాటి శేషగిరి రావు, 1921లో ఆత్మకూరి గోవిందాచార్యులు మొదలైన వారు గాంధీ జీవిత చరిత్రని వ్రాశారు. అంతేకాకుండా 1920-40 మధ్యకాలంలో గాంధీ జీవిత చరిత్రలు ఆంధ్రప్రదేశ్‌లో అనేకం వచ్చాయి.

1894లో వీరేశలింగం గారి జీవిత చరిత్రను తోలేటి వేంకట సుబ్బారావు గారు రాశారు. కందుకూరి వీరేశలింగం గారు విక్టోరియా మహారాణి చరిత్రను రాశారు. తర్వాత శ్రీ రాజారామ్మోహన రాయ్‌ల చరిత్రను, జీసస్ చరిత్రను వ్రాశారు.

1927లో జవంగుల నాగభూషణ దాసు శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వాముల వారి సంపూర్ణ జీవిత చరిత్రను రాశారు. 1944లో అవ్వారి సుబ్రహ్మణ్య శాస్త్రి గారి జీవిత చరిత్రను అవ్వారి వాసుదేవ శాస్త్రి గారు రాశారు. 1948లో నేతాజీ జీవిత చరిత్రను ఉండేల మాల కొండా రెడ్డి గారు రాశారు. గడియారం వేంకట శేష శాస్త్రి గారు రాశారు. 1963లో క్రీస్తు చరిత్రను జాషువా గారు రాశారు.

విదేశీయుల జీవిత చరిత్రలు ఆంధ్ర భాషలోనికి అనువదించబడ్డాయి. 1957లో కారల్‌మార్క్స్ జీవిత చరిత్రను పరుచూరి అనువదించారు.

కత్తి పద్మారావు, ఎండ్లూరి చిన్నయ్య, బి. విజయ భారతి, బి.ఆర్. కుసుమ, బోయ జంగయ్య మొదలైన వారెందరో డా॥ అంబేద్కర్ జీవిత చరిత్ర రాశారు.

ఇతర జీవిత చరిత్రల కంటే కవులు జీవిత చరిత్రలు కావ్యోదాహరణములతో నిండి యుండును. కావున వాటి పఠనము చంపూ కావ్య పఠనము వలె రసానందము నిచ్చుచుండును. ఇతర జీవిత చరిత్రలకు ఆ శోభ రాదు. వాఙ్మయ చరిత్రకు వాఙ్మయ విమర్శకు కవుల జీవిత చరిత్రలు ప్రథమ సాధనములని నిరాక్షేపముగా చెప్పవచ్చును.

జీవిత చరిత్రలో యాత్ర చరిత్రను పొందు పరచి వెలువరించిన వ్యక్తి చరిత్రలు కూడా తెలుగులో లేకపోలేదు. ఈ రకం జీవిత చరిత్రలలో స్వీయాత్మక రచన పర జీవిత చరిత్ర ప్రక్రియలు రెండు కలిసి వుంటాయి.

## స్వీయ చరిత్రలు:

తెలుగులో స్వీయ చరిత్రకు సమనార్థకమైన ఇంగ్లీషు వాడుక పదం 'Autobiography' ఇది సమస్త పదం ఇందులో 'Auto + Biography' అనే రెండు పదాలు ఉన్నాయి.

'AUTO' [Auto - Self : Gr] అనే పదానికి Self one's own, be one self, independently combining form of - అనే అర్థాలున్నాయి.

ఇక Biography (bio = graphia, Gr) అనే పదానికి 'A written account, or history of the life of an individual written by others' అనే నిర్వచనం వుంది. ఇది తెలుగులో జీవిత చరిత్ర, (ఇతరులు రాసిన వ్యక్తి చరిత్ర)కు సమానం స్వీయ చరిత్ర వల్ల జీవిత

చరిత్రకు "ఇతరులు వ్రాసిన వ్యక్తి చరిత్ర" అనే పరిమితార్థం ఏర్పడింది. స్వీయ చరిత్రలకన్నా జీవిత చరిత్రలే ముందొచ్చాయి. అందువల్ల కూడా జీవిత చరిత్ర అనే మాటకు పరిమితార్థం ఏర్పడింది.

## 16.4 స్వీయ చరిత్ర - నిర్వచనం:

Autobiography కి ఈ క్రింది నిర్వచనాలు కనిపిస్తున్నాయి.

"A written account or history of the life of an individual written by one self" "The story of a person's life written by himself"

"The account of individual human life written by the subject himself. In the broadest sence any self-written accounts of one's life and times may be thought of as autobiographical, but autobiography at a literary genre stands apart from certain related forms - notably the personal essay, the diary. The travel Journal and the auto biographical novel" స్వీయ చరిత్రలో వ్యక్తి తన జీవిత విషయాలే గాక తన సమకాలీన జీవన పరిస్థితులను ఇతర వ్యక్తులకు సంబంధించిన విశేషాలను కూడా పొందుపరుస్తాడు. కాబట్టి వీటిని సమాజ చరిత్ర రూపొందించడానికి పనికి వచ్చే అక్షరాలుగా గుర్తించవచ్చు. ఇది చారిత్రక విభాగానికి చెందింది.

దీనిలో విస్తరించబడే వస్తువు ఏక వ్యక్తి జీవితం. దీనిలో చరిత్రకారుని సత్యదృష్టి సాహిత్యకారుని కళా దృష్టి కనబడుతుంది. కాబట్టి స్వీయ చరిత్రలను సంఘజీవి అయిన ఒక వ్యక్తి జీవిత విశేషాలను తెలిపే చారిత్రక రచన అయివుండవచ్చు.

## 16.5 స్వీయ చరిత్ర లక్షణాలు:

స్వీయ చరిత్ర లక్షణాలను ఈ క్రింది విధముగా చెప్పవచ్చు.

1. ఒక వ్యక్తి జీవితములోని సంఘటనలను తనకు తానే చెప్పుకోవాలి
2. రచయిత ఎప్పటికప్పుడు తన జీవితంలోని సంఘటనలను డైరీలో వ్రాసుకొని తరువాత స్వీయ చరిత్రను వ్రాసుకోవడం ఒక పద్ధతి. ఈ పద్ధతిలో వీరేశ లింగం గారు తాను వ్రాసుకున్న డైరీలోని చాలా విషయాలు స్వీయ చరిత్రలో చోటు చేసుకున్నాయి.
   స్వీయ చరిత్ర రచయిత స్మృతి పదం నుండి రూపుదిద్దు కోవడం వల్ల తన జీవితంలోని ముఖ్య ఘట్టాలను రచయిత నెమరు వేసుకుంటూ వ్రాయడం రెండవ పద్ధతి ఇటువంటి పద్ధతిలోనే చిలకమర్తి లక్ష్మీ నరసింహంగారు తన స్వీయ చరిత్రను వ్రాసుకొన్నారు.
3. స్వీయ చరిత్రకారుడు ఉద్దేశ పూర్వకంగా గాని, తనకే తెలియకుండా గాని కొన్ని విషయాలను వదిలి వేయవచ్చు లేక కొన్నింటిని మార్చవచ్చు.
4. స్వీయ చరిత్ర, రచయిత స్వయంగా వ్రాసుకొనే జీవిత చరిత్ర, కనుక అతని మరణము గురించి ఇందులో ఉండదు. చాలా మంది రచయితలు తమ స్వీయ చరిత్రలను చరమదశలోనే వ్రాసుకోగా కొంత మంది యవ్వనములోను, మధ్య వయస్సులోను ఆరంభించి ఆపి వేయటం కూడా జరిగింది. కొందరు స్వీయ చరిత్రలను మాత్రం వారి రణము తరువాత వారి యొక్క బంధువులు, అనుయాయులతో పూరించడం కన్పిస్తుంది.
5. స్వీయ చరిత్రలో వ్యక్తి స్వకీయ అనుభవాలు సామాజిక వ్యవస్థ లోనివి కావటం వల్ల సమాజాన్ని గురించి తెలుసుకోవటానికి స్వీయ చరిత్రలు ఉపయోగపడతాయి.
6. వ్యక్తి జీవితంలోని వైయుక్తిక సంఘటనలు మాత్రం స్వీయ చరిత్రలో ఉంటే అది చారిత్రక లక్షణాన్ని కోల్పోతుంది. అందువల్ల స్వీయ చరిత్రకారుడు తన వైయుక్తిక అనుభవాలను సామాజిక సంఘటనలతో అన్వయించుకొని స్వీయ చరిత్రలను వ్రాయాలి. అయితే వైయుక్తిక జీవితాల వివరాలకే ప్రాధాన్యమిస్తూ వ్రాసిన కొన్ని స్వీయ చరిత్రలు కూడా లేకపోలేదు.

7. స్వీయ చరిత్ర ప్రధానంగా రచయిత బాహ్య జీవితాన్ని గురించే కాక అతని ఆంతరంగిక జీవిత విషయాల్ని తెలుపుతుంది. రచయిత బాల్యం, ప్రేమ వ్యవహారాలు, కుటుంబ సమస్యలు, అలవాట్లు, మానసిక సంఘర్షణలు లాంటివి కొన్ని బాహ్య ప్రపంచానికి తెలియవు కాబట్టి స్వీయ చరిత్రలో ఈ ఆంతరంగిక విషయాలు రచయిత యొక్క వ్యక్తిత్వాన్ని తెలుపుతాయి.
8. స్వీయ చరిత్రలో కల్పనలకు తావు లేదు. కల్పనాత్మకం కాని వచన సాహిత్య ప్రక్రియల్లో స్వీయ చరిత్ర ఒకటి. వ్యక్తి తన గత జీవితంలోని చిరస్మృతులను నిర్మత్వంతో విశ్లేషించి చరమదశలో స్వీయ చరిత్రను వ్రాసుకుంటాడు. సాధారణంగా వ్యక్తి తన జీవితంలో అత్యున్నత దశలోనే ఇలా వ్రాసుకోవటం జరుగుతుంది.
9. స్వీయ చరిత్రల్లో చంధస్సు వుండటం వల్ల ప్రయోజనంవుండదు. అందువల్ల ఈ రచనకు వచనమే సరియైనది. అందువల్ల స్వీయ చరత్రలు ఎక్కువగా వచనంలోనే వుంటాయి.
10. సమగ్రమయిన స్వీయ చరిత్ర ప్రణాళికా బద్ధంగా వుంటుంది. వ్యక్తి క్రమబద్ధమైన జీవిత పురోభివృద్ధిని, వివిధ దశలను తెలుపుతుంది. అతని బాల్యం, విద్యాభ్యాసం, యవ్వనం, ఉద్యోగం, వివాహం, దాంపత్యం, వ్యాపకాలు, వృద్దాప్యం వంటి వివిధ దశలు లోని ఘట్టాలు వర్ణించబడతాయి.

## 16.6 స్వీయ చరిత్ర - స్వరూప స్వభావాలు:

**1. స్వరూపం:** స్వీయ చరిత్రలన్నీ ప్రధానంగా స్వీయ చరిత్రకారుడి జీవితంలోని వివిధ దశలను క్రమబద్ధంగా చర్చించేవిగా వుండవు. కొన్ని స్వీయచరిత్రకు తక్కువ ప్రాధాన్యమిస్తూ వ్రాస్తే, స్వీయ జీవితంలోని దశలను విస్మరించి, ఆలోచనలు, స్మృతులు, జ్ఞాపకాలకు పరిమితమయినవి మరి కొన్ని ఉన్నాయి.

స్వరూపాన్ని బట్టి స్వీయ చరిత్రలను రెండు రకాలుగా విభజించవచ్చు.

1. స్వీయాత్మక రచనలు (Informal Autobiographics)
2. స్వీయ చరిత్రలు (Formal Autobiographics)

**1. స్వీయాత్మక రచనలు:** ప్రచురణకు ఉద్దేశించకుండా ఒక వ్యక్తి తన జీవితంలో తనకు తానుగా వ్రాసుకున్న రచనలన్నీ ఈ స్వీయాత్మక రచనల క్రిందకే వస్తాయి.

అనుభవాలు, జ్ఞాపకాలు (memoires), వైయుక్తిక స్మృతులు (Reminiscences), దినచర్యలు (Diaries), యాత్రాచరిత్రలు (Travelogue), లేఖలు (Letters), ఆలోచనా స్రవంతి (Musings), అనుభవసారం (Confesions) మొదలైనవన్నీ ఈ స్వీయాత్మక రచనల పరిధిలోనికే వస్తాయి.

**2. స్వీయ చరిత్రలు**

ఇందులో వ్యక్తి తన అనుభవాలను తన వ్యక్తిత్వం నుండి విడదీయకుండా చెప్పడం స్వీయ చరిత్రలో ప్రత్యేకమయిన లక్షణం.

స్వీయ చరిత్రల్లో స్వీయాత్మక రచనల ప్రభావంతో గానీ లేక అటువంటి ప్రయత్నంతో గానీ రచయిత తనజీవిత విశేషాలను తానే స్వయంగా ఒక క్రమ పద్ధతిలో చెప్పటం స్వీయ చరిత్రలో కన్పించే అంశం.

**స్వీయ చరిత్ర స్వభావం:** స్వీయ చరిత్రలను వస్తు గతంగా, నిర్మాణగతంగా పరిశీలించిన తరువాతే వాటి యొక్క అంతర, బాహ్య స్వభావాలను మనం గుర్తించవచ్చు.

**1. అంతర్ స్వభావం:** నాలుగైదు వందల సంవత్సరాలుగా అమెరికా, ఇంగ్లాండు, ఇతర యూరప్ దేశాల్లో వచ్చిన స్వీయ చరిత్రల్ని పరిశీలించి నాలుగు రకాలుగా విభజించారు.

1. విషయాత్మకం 2. ఆధ్యాత్మికం 3. మేధావికం 4. కల్పనాత్మకం

మొదలైన స్వీయ చరిత్రల యొక్క అంతర స్వభావాన్ని తెలుపుతాయి.

**1. విషయాత్మకం:** ఇందులో స్వీయ చరిత్రకారుడి జీవిత సంఘటనలకు అధిక ప్రాధాన్యం వుంటుంది. అందువల్లే అతని వ్యక్తిగత కుటుంబ విషయాలు, సామాజిక విషయాలు సంఘటనాత్మకంగా ఒక క్రమ పద్ధతిలో వివరించటం జరుగుతుంది. ఇలాంటి వాటికి తెలుగులో వచ్చిన వీరేసలింగం గారి "స్వీయ చరిత్రము" ఉదాహరణగా చెప్పవచ్చు.

**2. ఆధ్యాత్మికం:** స్వీయ చరిత్రకారుడు తమ జీవితంలోని వివిధ సంఘటనలను ఆధ్యాత్మిక దృష్టితో చూడటం ఇందులో కన్పిస్తుంది. అంతేకాక రచయిత మత పరంగా నడిపిన ఆధ్యాత్మిక విషయాలు సాంస్కృతికోద్యమాలు వివిధ రకాలయినవి చోటు చేసుకుంటాయి. ఇలాంటి వాటికి ఉదాహరణగా St. Augustine వ్రాసిన 'Confesions' చెప్పవచ్చు.

**3. మేథావికం:** సమాజంలో ఉన్న పరిస్థితులను హేతుబద్ధంగా ఆలోచించి సోపపత్తికంగా నిరూపించటం ఇందులో జరుగుతుంది. అంతే కాకుండా సమాజ శ్రేయస్సు కోసం తనకు తాను నిస్వార్థంగా అర్పించుకున్న స్వీయ చరిత్రకారుడి కృషి ఇందులో కన్పిస్తుంది. దీనికి దర్శి చెంచయ్య "నేను-నా దేశం" - ను పేర్కొనవచ్చు.

**1. కల్పనాత్మకం:** మళ్ళీ ఈ కల్పనాత్మకాన్ని రెండు రకాలుగా విభజించవచ్చు.

ఎ. కల్పనాత్మక స్వీయ చరిత్ర (Fictionalized Auto biography) బి. స్వీయ చరిత్రాత్మక నవల (Auto biographical fiction)

**ఎ. కల్పనాత్మక స్వీయ చరిత్ర:** స్వీయ చరిత్రలు వ్రాస్తున్నప్పుడు వాస్తవ సంఘటనలకు కొద్దిగా కల్పనలు కూడా జోడించి రాయడం అందులో జరుగుతుంది. దీనికి ఉదాహరణగా చలం వ్రాసిన "చలం", నామిని సుబ్రమణ్యం నాయుడు వ్రాసిన 'పచ్చ నాకు సాక్షిగా' మొ॥ వాటిని పేర్కొనవచ్చు.

**బి. స్వీయ చరిత్రాత్మక నవల:** దీనిలో వాస్తవ జీవితంలోని అనుభవాలను నవలా రూపంలో చెప్పడం కన్పిస్తుంది. కాడవటి గంటి కుటుంబరావు గారి 'చదువు' నవల ఇందుల పేర్కొనదగినది. విశ్వనాధ వారు వ్రాసిన "వేయి పడగలు" నవలలో తన గురించేకాక తన మిత్రులు గురించిన వివరాలు ఉన్నాయి.

**2. బాహిర స్వభావం:** జీవిత చరిత్రలో స్వీయ చరిత్రకారుడి జీవిత దశలు వంటి బాహిర స్వరూపాన్ని బట్టి స్వీయ చరిత్రలను నాలుగు వర్గాలుగా విభజించవచ్చు.

1. సమగ్రం 2. సంపూర్ణం 3. అసమగ్రం 4. అసంపూర్ణం

**1. సమగ్ర స్వీయ చరిత్ర:** ఇందులో స్వీయ చరిత్రకారుడు తమ జీవితములోని అన్ని దశలను క్రమ పద్ధతిలో చెప్తే అది సమగ్ర జీవిత చరిత్ర అవుతుంది.

**2. సంపూర్ణ స్వీయ చరిత్ర:** స్వీయ చరిత్రకారుడు తన జీవితములోని వివిధ దశలను, సంఘటనలను చివరి వరకు పేర్కొంటేనే అది సంపూర్ణ స్వీయ చరిత్ర అవుతుంది.

**3. అసమగ్ర స్వీయ చరిత్ర:** ఇందులో రచయిత తన జీవితంలోని ముఖ్యమైన దశలలో కొన్నింటిని మాత్రమే చెప్పుతాడు. అలా చెప్పిన దానిని అసమగ్ర స్వీయ చరిత్ర అంటారు.

**4. అసంపూర్ణ స్వీయ చరిత్ర:** రచయిత తన జీవితములోని విషయాలను ఒక క్రమ పద్ధతిలో చిత్రించిన, తరువాత జీవితములోని కొన్ని ముఖ్య విషయాలు అనివార్య కారణాల వల్ల చేర్చకపోతే అది అసంపూర్ణ స్వీయ చరత్ర అవుతుంది. భాగాలుగా విభజించి వ్రాసే స్వీయ చరిత్రలలో చివరి భాగాలు ఏ కారణము చేతయిన వ్రాయకపోతే అది అసంపూర్ణ స్వీయ చరిత్ర అవుతుంది.

## 16.7 స్వీయ చరిత్ర - ఆవిర్భావ వికాసాలు:

జీవిత చరిత్ర, స్వీయ చరిత్రలు రెండు ప్రక్రియలు ఒకే జాతికి చెందిన రచనలు. ఇవి రెండు వ్యక్తి చరిత్రలు. స్వీయ చరిత్ర రచన కన్నా ముందే జీవిత చరిత్ర రచన వచ్చింది. ఆ తరవాత కాలములో రెండు కలసి పరిణితి చెందాయి.

పాశ్చాత్య దేశాలలో క్రీస్తు పూర్వం 5వ శతాబ్దంలో జీవిత చరిత్ర రచన ప్రారంభమయినట్లు తెలుస్తుంది 'Ion of Chios' అనే రచయిత తన సమకాలీకుల జీవిత వివరాలను వ్రాయడంతో మొదలైన జీవిత చరిత్ర తరువాత వెయ్యి సం॥ (5B.C - 5 A.D) సంప్రదాయములోనే సాగింది. ఈ కాలంలోని మొదటి ఐదు సంవత్సరాలు జీవిత చరిత్ర రచన బాగా జరిగిన ఆ కాలంలో వచ్చిన రచనలన్నీ కేవలం స్మృతి రచనలుగా మిగిలిపోయాయి.

పాశ్చాత్య దేశాలలో 15, 16 శతాబ్దాలలో వచ్చిన సాంస్కృతికతో, పునరుజ్జీవనం, పారిశ్రామిక విప్లవాల ఫలితంగా సాహిత్యములో అనేక మార్పులు వచ్చాయి. ఇందులో జీవిత చరిత్ర రచన కూడా వర్ధిల్లింది. అంతే కాకుండా ఈ కాలములో స్వీయ చరిత్రలు కూడా ఎక్కువ గానే వచ్చాయి. తరువాత 17, 18 శతాబ్దంలో జీవిత చరిత్రలకు ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. నవల వచ్చిన తరువాత జీవిత చరిత్ర కూడా దాన్ని కొంత వరకు అనుసరించడంతో నవల శిల్పం జీవిత చరిత్రలోనికి వచ్చింది. అందువల్ల జీవిత చరిత్ర లేక స్వీయ చరిత్ర కళాత్మకంగా రూపొందడానికి అవకాశం ఏర్పడింది. పద్నాలుగవ శతాబ్దం వరకు స్వీయ చరిత్ర రచనలన్నీస్మృతుల రూపంలో వచ్చాయని చెప్పవచ్చు.

స్వీయ చరిత్ర ప్రక్రియకు18వ శతాబ్దంలో 'Auto biography' అనే పేరు స్థిరపడగా ఆ తరువాత అమెరికా దేశీయుడు మొదటలో "Education" అని, ఆంగ్లేయ స్త్రీ "My apprentice ship" అని, ఐర్లాండు దేశీయుడు "Summingup" అని తమ స్వీయ చరిత్రలకు పేర్లు పెట్టుకున్నారు. పాశ్చాత్య దేశాలలో చాలాకాలం "మెమోయిర్", 'రెమిని సెన్సెస్', 'జర్నల్' అనే పేర్లతో పిలవబడుతు ఈ ప్రక్రియ క్రమంగా వికసించింది. 1797లో మొట్టమొదటి సారిగా "The monthly review" అనే పత్రికలో "Auto biography" అనే పేరు వాడబడింది. అప్పటి నుండి ఇప్పటి వరకు ఈ ప్రక్రియకు ఈ పేరే స్థిరపడింది.

తెలుగులో ఈ ప్రక్రియకు "స్వీయ చరిత్ర" అనే పేరును మొదట వాడింది గురజాడ శ్రీ రామమూర్తి గారు. ఈయన తెలుగులో 1893లో తొలిసారిగా "కవి జీవితములు" వ్రాశాడు. ఆ తరువాత వీరేశలింగం గారు "ఆంధ్రకవుల చరిత్ర" వ్రాశాడు. గురజాడ శ్రీరామమూర్తి గారు వాడిన 'స్వీయ చరిత్ర' అనే పదాన్ని బాగా ప్రచారంలోకి తెచ్చిన వారు వీరేశలింగం గారు. వీరేశలింగం 'స్వీయ చరిత్ర' అనే మాటకు బహుళ ప్రచారం వచ్చింది.

తెలుగులో తొలి స్వీయ చరిత్ర నిర్ణయం పై అనేక వివాదాలు ఉన్నాయి. తెలుగులో అనేక ఆధునిక సాహిత్య ప్రక్రియలకు ఆద్యుడని నేనే అని చెప్పుకున్న వీరేశలింగం గారు తన స్వీయ చరిత్ర అవతారికలో "తెలుగు భాషలో స్వీయ చరిత్రమును వ్రాయబూనుట కిదియే ప్రథమ ప్రయత్నమని" చెప్పుకున్నాడు. అయితే వీరేశ లింగం గారి కన్న ముందే తెలుగు వాడైన వెన్నల కంటి సుబ్బారావు ఇంగ్లీషులో తన స్వీయ చరిత్రను (The life of vennelacunty soob row) వ్రాసుకోగా అది 1873లో అచ్చు అయ్యింది. కాబట్టి తెలుగు వారు వ్రాసుకున్న మొదటి స్వీయ చరిత్ర వెన్నెల కంటి సుబ్బారావుదే కాని ఈయన స్వీయ చరిత్రను తెలుగులో వ్రాయలేదు. వీరేశలింగం కంటే ముందే ఆదిభట్ల నారాయణ దాసు స్వీయ చరిత్ర వ్రాసుకున్నాడని ఆయన జీవిత చరిత్రకారుడు చెప్పాడు. అయితే నారాయణ దాసు గారు అందులో తన 30 ఏండ్ల జీవితం వరకు మాత్రమే చెప్పడం వల్ల ఇది అసంపూర్ణ స్వీయ చరిత్ర అవుతుంది. వీరేశలింగం గారి కంటే ముందే చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి గారు జాతక చర్య అనే పేరుతో ఆత్మకథను వ్రాసుకున్నట్లు కాటూరి వెంకటేశ్వరరావు మాటల వల్ల తెలుస్తుంది. అయితే ఈ గ్రంథం ఉత్తర భాగం పూరించబడింది. ఇది కూడా వీరేశలింగం గారి స్వీయ చరిత్ర తరువాతనే అచ్చయ్యింది. కానీ ఇది పద్యాల్లో వ్రాయబడింది.

చెళ్ళపిళ్ళ వారి కన్నా ముందే మండపాక పార్వతీశ్వర శాస్త్రి, కొక్కొండ వెంకటరత్నం పంతులు గార్లు వాళ్ళ యొక్క స్వీయ

చరిత్రల్ని పద్యాల్లో వ్రాసుకున్నారు. ఆ దృష్టితో చూస్తే మండపాక పార్వతీశ్వర శాస్త్రి 'ఆత్మపర్యాయ సపర్యాచర్యా' 1894 మొదట స్వీయ చరిత్ర అనుకోవాలి. కానీ ఇవన్నీ పద్యాల్లో వ్రాసుకున్న స్వీయ చరిత్రలు.

వీరేశలింగం గారు 1885 నాటికే "రాజ మహేంద్ర వర స్త్రీ పునర్వివాహ చరిత్ర" అనే స్వీయాత్మక రచనను వ్రాసి చెన్నపట్టణం శ్రోతలకు విన్పించటం, 1888లో అతని ప్రాణ స్నేహితుడైన భసవరాజు గవర్రాజు చనిపోవటంతో అతని చరిత్రలు వ్రాయటం ఈ రెండు రచనలూ కూడా స్వీయ చరిత్రలో ప్రధాన ఘట్టాలే. దీని వల్ల పంతులుగారు 1885 నాటికే తన జీవిత చరిత్రను వ్రాసేందుకు పూనుకున్నట్లు తెలుస్తుంది. స్వీయ చరిత్ర లక్షణాల దృష్ట్యా వీరేశలింగం స్వీయ చరిత్ర ఆది భట్ల నారాయణ దాసు స్వీయ చరిత్ర కన్నా మొదటిది అని చెప్పవచ్చు.

వీరేశలింగం గారి కన్నా పెద్దవాడు, సంఘ సంస్కరణ విషయాల్లో ఆయనకు తోడుగా ఉన్న పళ్ళె చెంచల రావు కూడా స్వీయ చరిత్ర వ్రాసుకున్నట్లు తెలుస్తున్నా అది లభ్యం కాలేదు. వీరి స్వీయ చరిత్రను ఇంగ్లీషులో వ్రాసుకొని వుండవచ్చు. అందువల్ల వీరి స్వీయ చరిత్ర లభ్యమై అది తెలుగులో వ్రాసుకున్నాడని నిర్ధారణ అయ్యే వరకు వీరేశలింగం గారి స్వీయ చరిత్రే మొదటి స్వీయ చరిత్రగా నిర్ణయించవచ్చు.

స్వీయ చరిత్రలో వైయుక్తిక విషయాలే కాక సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సంబంధమయిన పలు విషయాలు కన్పిస్తాయి. ఇవి అన్నీ చరిత్రకు సంబందించిన విషయాలే కాబట్టి స్వీయ చరిత్ర చారిత్రక రచనా విభాగానికి చెందిన ప్రక్రియగా చెప్పవచ్చు.

స్వీయ చరిత్రను వ్రాసి మెప్పించటం చాలా కష్టం. ఎందుకంటే రచయిత తన జీవితం లోని సంఘటనలను ఉన్నది ఉన్నట్టుగా చెప్పాలి.

## 16.8 సారాంశము:

ఆధునిక వచన సాహిత్యం ప్రక్రియగా వెలసినమరొక ప్రసిద్ధి చెందిన ప్రక్రియ ఈ జీవిత - స్వీయ చరిత్రలు. ప్రధానంగా ఇదిపాశ్చాత్య సాహిత్య ప్రభావముతో ఏర్పడింది.ఒకరిజీవిత గాదను మరొకరు గ్రంధస్తం చేస్తే అది జీవిత చరిత్ర. ఎవరి జీవితగాధను వారే గ్రంధస్తం చేస్తే అది స్వీయ చరిత్ర. జీవిత చరిత్రలను సాహిత్యపరమైన, రాజకీయపరమైన, సాంఘిక ప్రాధాన్యం కల, ఆధ్యాత్మికమైన, పర్యాత్మకమైనవిగా వర్గీకరించవచ్చును. తెలుగులో ఈ ప్రక్రియకు "స్వీయ చరిత్ర" అనే పేరునువాడినఘనత గురజాడ శ్రీరామ మూర్తి గారికి దక్కుతుంది. జీవిత, స్వీయ జీవిత చరిత్రలు సమకాలీన సాంఘిక పరిస్థితులను, సంఘటనలను తెల్సుకొనటానికి ఎంతో ఉపకరిస్తాయి.

## 16.9 మాదిరి ప్రశ్నలు:

1. జీవిత చరిత్ర లక్షణాలను వివరించి, వర్గీకరణ పద్ధతిని తెల్పండి.
2. స్వీయ చరిత్ర నిర్వచనం, లక్షణాలను తెలియచేయండి.
3. స్వీయ చరిత్ర యొక్క స్వరూప, స్వభావాలను, ఆవిర్భావ వికాసాలను వివరించండి.

## 16.10 ఆధార గ్రంథాలు:

గురజాడ శ్రీరామమూర్తి - కవి జీవితము
కందుకూరి వీరేశ లింగం - ఆంధ్రకవుల చరిత్ర